# సుమతి

అంతర్జాల సమగ్ర కుటుంబ మాసపత్రిక


01-07-2024 సంపుటి -2 రధయాత్ర (జూలై ) సంచిక-5 రూ.25/-







ఎడిటర్
**శ్రీమతి ఎ. శ్రీవిద్య**






అసోసియేట్ ఎడిటర్
**శ్రీమతి కె. వీణ**

# సుమతి

## (సమగ్ర సకుటుంబ మాసపత్రిక)

**తెలుగు సాహితీ జగత్తులో**
**అనతి కాలంలోనే ధ్రువతారగా సుమతి ని నిలిపినందుకు**
**ధన్యవాదాలు తెలుపుతూ**

- ఎడిటోరియల్ బోర్డ్

## సుమతిలో ప్రకటనలు ఇవ్వండి

అనతి కాలంలోనే అశేష పాఠకలోకానికి చేరువైన

సుమతి సకుటంబ మాసపత్రికలో ప్రకటనలు ఇవ్వండి

కవర్ పేజి కలర్ :రూ.5000/-

కవర్ పేజి బ్లాక్ అండ్ వైట్ :రూ. 3000/-

లోపలి పేజీల్లో కలర్ :రూ2000 /-

లోపలి పేజీల్లో బ్లాక్ అండ్ వైట్ :రూ.1000 /-

ఆరోగ్యకరమైన సాహిత్యాన్ని కుటుంబం మొత్తానికి అందించాలని తెలుగు భాషకు

మరింత ఉన్నత స్థానాన్ని కల్పించాలని మీ ముందుకు ప్రతి నెల ఒకటవ తారికునే వస్తుంది.

ఇప్పుడు సుమతి పత్రికను ఆన్లైన్లో కూడా చదవ వచ్చు

https://sumathimasapathrika.com



# సుమతి పరివారం


## సుమతి
మాసపత్రిక

సంపుటి :2 సంచిక:5

జూలై 2024

సంపాదకురాలు
అవుతు శ్రీవిద్య

సహ సంపాదకురాలు
కె .వీణ

ముఖచిత్రం

గ్రాఫిక్స్
జ్ఞానిక

చందా వివరాలు

సంవత్సర చందా రూ 250

ఐదేళ్ళ చందా రూ 1200

ప్రకటనలు , చందాలకు మరియు

రచనలు ,అభిప్రాయాలు

పంపవలసిన చిరునామా

SUMATHI.POTILU@GMAIL.COM

ప్రచురణ
సుమతి పబ్లికేషన్స్
(RC NO.:538/2006)

హౌస్ నం :26 -46 -79

వేణుగోపాల నగర్ ,గుంటూరు

ఆంధ్రప్రదేశ్


# సంపాదకీయం

ప్రతి వ్యక్తి ఆలోచనల్లో "సానుకూల దృక్పథం (Positive Attitude)"..అనేది జీవితంలో ఎంతో ప్రభావాన్ని చూపిస్తుంది. ఇలాంటి దృక్పథం కలిగిన వాళ్ళు ఎల్లప్పుడూ సంతోషంగాను, సంతృప్తికరంగాను, ప్రశాంతంగానూ..ఉంటారు. వారు వర్తమానంలో జీవిస్తారు కాబట్టి వారికి నిరాశ నిస్పృహలు అనేవి దరిచేరవు. సానుకూల దృక్పథం కలిగి ఉండడం వల్ల మనం సమాజంలో చక్కటి వ్యక్తులుగా గుర్తింపబడడంతోపాటు.. ప్రతి పనిలో విజయాలను సాధిస్తాం.ఉన్నదాన్ని ఉన్నట్లే ఆమోదించడం..మార్పును (అది సానుకూలమైనదయినా.. ప్రతికూలమైనదయినా) ఆహ్వానించడం..దానికి తగ్గట్టు మన ఆలోచనల్ని క్రమబద్ధం చేసుకోవడం అనేది ఈ సానుకూల దృక్పథంలో ముఖ్యమైనవి. కాబట్టి ఈ చిన్న జీవితంలో మనం ఇలాంటి సానుకూల దృక్పథాలతో పాటుగా..నిర్మాణాత్మకమైన ఆలోచనలను కలిగి ఉంటూ..ఒక సమభావంతో ముందుకెళితే మనం మన జీవనయానంలో ఎన్నో గౌరవ మర్యాదలను.. ఆనందాలను..చక్కని అనుభూతులను..ఎన్నెన్నో విజయాలను పొందుతాం..సరేనా.

సుమతి

## సుమతి – సుభాషితాలు

తన విధిని తాను నిర్వహిస్తూ ఇతరుల పనుల్లో జోక్యం చేసుకోకపోవడమే ధర్మం

## లోపలి పేజీలలో....

# ఈ నెల సాహితి సుమాలు...

## 36 ఫీచర్స్ అందరి కోసం


5 ముఖచిత్ర కథ
7 ఈ నెల కవిత
8 నడుస్తున్న చరిత్ర
11 అంతర్నేత్రం
13 ఈ శీర్షిక మీదే
22 మేర భారత్ మహాన్
27 సరదాకి
65 జీవన చిత్రాలు
70 వైరల్
71 నాలుగో కోతి
74 సెటైర్
77 కార్టూన్స్ పేజి
78 యాత్ర
81 విహారి
84 అంపశయ్య
105 నమ్మకాలూ –నిజాలు
107 కరెంట్ అఫైర్స్
110 వైరల్
111 ఫోటోగ్రఫి పాఠాలు
115 యువతా తెలుసుకో
117 భేతాళ భారతం
119 మన కథానాయకులు
122 కార్టూన్స్ పేజి
123 వార్తల్లో వ్యక్తి
141 వినాల్సిన పాట
134 చదవాల్సిన పుస్తకం
137 చూడాల్సిన సినిమా
143 క్రాస్ రోడ్స్ కబుర్లు
178 సాహితి సుమాలు
179 మన పురాణాలు
182 సప్తపది
196 స్ఫూర్తి
197 ధర్మసందేహాలు
199 సృజన
200 పిల్లలు పిడుగులు
201 రాశి ఫలాలు


## 9 సీరియల్స్


14 పంచవటి( కామెడి సీరియల్ )
41 మమతల తరంగాలు (ఫ్యామిలీ సీరియల్ )
43 నా మొగుడు నాకే సొంతం
51 రెప్పచాటు స్వప్నం (ఫ్యామిలీ సీరియల్ )
58 రాణ ప్రతాప్ (చరిత్రాత్మక సీరియల్ )
67 గర్భ శ్లోకం (క్రైం సీరియల్)
125 డెత్ మెసేజ్ (క్రైం సీరియల్ )
147 పరుగులు తీసే నీ వయసునకు (సీరియల్)
185 పన్నీటి జల్లు (సీరియల్ )


## 10 కథలు


18 అందరి ఇల్లు
23 మారని లోకం
28 ఎవరు నాన్న ఆవిడ
86 జీవన బాధ్రాణి పశ్యతి
92 కుర్చీ
98 దత్త స్వీకారం
156 సారి ఆగమ
166 అదేదో సామెత చెప్పినట్లు
170 తన్కసాలవారి కడగండ్లు
190 నాన్నానన్నెందుకు చదివించావు


## 6 కవితలు


17 మురికి మనిషి
64 నీ జాడకై ..
73 తెలుసుకో ఓనవయుగ ఋషి
83 ఓ నాన్న వీలు నామా
165 అచ్చర పోరు
187 మార్పు అనివార్యం

# జగన్నాథ రథయాత్ర



ఆషాఢమాసం వస్తోందనగానే అందరికీ జగన్నాథుని రథయాత్రే గుర్తుకువస్తుంది. ఆషాఢమాసంలోని రెండోరోజు ఈ పండుగ చేస్తారు. కానీ ఈ రథయాత్రకి సంబంధించిన వింతలు చాలామందికి తెలియవు. ఈ ప్రపంచంలోనే అతి పురాతనమైన రథయాత్ర పూరీ జగన్నాథుని రథయాత్ర. ఇది ఎన్ని వేల సంవత్సరాలకు ముందు మొదలైందో కూడా తెలియదు. అందుకే బ్రహ్మపురాణం, పద్మపురాణం, స్కందపురాణంలాంటి పురాణాలలో సైతం ఈ రథయాత్ర గురించి కనిపిస్తుంది. ప్రపంచంలో ఏ గుడిలో అయినా ఉత్సవ విగ్రహాలను మాత్రమే ఊరేగింపుకి వాడతారు. కానీ పూరీలో అలాకాదు! సాక్షాత్తు గర్భగుడిలో ఉండే దేవుళ్లే గుడి బయటకు వస్తారు. ఆ సమయంలో వాళ్లని ఏ మతం వాళ్లయినా చూడవచ్చు.

పురాణాల ప్రకారం, వృద్ధ వడ్రంగి రూపంలో ఉన్న ఇంద్రద్యుమ్నుడు విగ్రహాన్ని నిర్మించే పనిని విశ్వకర్మకు అప్పగించాడు. అప్పుడు విశ్వకర్మ రాజు ముందు మూసి ఉన్న గదిలో విగ్రహాలు నిర్మించమని షరతు విధించాడు. ఈ విగ్రహాలను తయారు చేసే వరకు, గదిలోకి ఎవరూ ప్రవేశించలేరు.

రాజుతో సహా. ఎవరైనా గదిలోకి వస్తే, అతను విగ్రహం తయారీని వదిలివేస్తాడు. రాజు ఈ షరతుకు అంగీకరించాడు మరియు విశ్వకర్మ విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యాడు. ప్రతిరోజూ రాజు ఇంద్రద్యుమ్నుడు తలుపు వెలుపల నిలబడి శబ్దం వింటూ ఉంటాడు. లోపల విగ్రహాల పని జరుగుతోందో లేదో నిర్ధారిస్తుంటాడు. ఒకరోజు లోపలి నుండి శబ్దం రాలేదు, అప్పుడు రాజు వడ్రంగి పనిని విడిచిపెట్టాడని గ్రహించాడు. ఇది చూడడానికి, అతను గది తలుపు తెరిచాడు మరియు షరతు ప్రకారం, అదే సమయంలో విశ్వకర్మ స్వర్గానికి బయలుదేరాడు. అలా జగన్నాథుడు, బలభద్రుడు మరియు సుభద్రా దేవి విగ్రహాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. నేటికీ దేవుడు అదే రూపంలో ఉన్నాడు.

శ్రీ కృష్ణుడు తన శరీరాన్ని విడిచిపెట్టి వైకుంఠ ధామానికి వెళ్ళినప్పుడు, అతని శరీరాన్ని పాండవులు పూరీలో దహనం చేశారని నమ్ముతారు. శ్రీ కృష్ణ భగవానుడి శరీరం మొత్తం పంచభూతాలలో కరిగిపోయింది. కానీ అతని హృదయం సజీవంగానే ఉంది. అప్పటి నుండి నేటి వరకు అతని హృదయం జగన్నాథుని విగ్రహంలోనే భద్రంగా ఉంచబడింది. నేటికీ శ్రీకృష్ణుని హృదయం జగన్నాథుని విగ్రహంలో కొట్టుకుంటుందని నమ్ముతారు.

ఈ జగన్నాథుని రథయాత్ర కోసం ప్రతిసారి కొత్త రథాలను తయారుచేస్తారు. వీటి తయారీని అక్షయతృతీయ రోజున మొదలుపెడతారు. జగన్నాథుడి కోసం చేసే రథాన్ని గరుడధ్వజం అనీ బలభద్రుని కోసం తయారుచేసే రథాన్ని తాళధ్వజం అనీ సుభద్ర కోసం తయారుచేసే రథాన్ని దేవదాలన అనీ పిలుస్తారు.

ఈ రథాలని తయారుచేసేందుకు కొన్ని లెక్కలు ఉంటాయి. ఏ రథం ఎన్ని అడుగులు ఉండాలి. దానికి ఎన్ని చక్రాలు ఉండాలి. ఆ చక్రాలు ఎంత ఎత్తు ఉండాలిలాంటి లెక్కల్ని తూచాతప్పకుండా పాటించాలి. రథాన్ని తయారుచేసేందుకు ఎన్ని చెక్కముక్కలు వాడాలో కూడా లెక్క ఉంటుంది.

ఈ లోకంలో ఎంతోమంది రాజులు ఉండవచ్చు. కానీ పూరీకి నాయకుడు మాత్రం జగన్నాథుడే. అందుకు గుర్తుగా పూరీ రాజు, జగన్నాథుని రథయాత్ర మొదలయ్యే ముందు ఆ రథం ముందర బంగారు చీపురతో ఊడుస్తాడు.

– మామూలు రథయాత్రలు ఊరంతా తిరిగి చివరికి గుడికే చేరుకుంటాయి. కానీ జగన్నాథ రథయాత్ర అలా కాదు. జగన్నాథుడికి గుండిచా అనే పిన్నిగారు ఉన్నారు. ఆవిడ ఉండే గుడి పూరీ ఆలయానికి ఓ రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. జగన్నాథుడు ఓ తొమ్మిదిరోజుల పాటు ఆ ఆలయంలో ఉంటాడు. తిరిగి ఆషాఢమాసంలోని పదోరోజున పూరీ గుడికి చేరుకుంటాడు. మన దగ్గర రాములవారి కళ్యాణం రోజు తప్పకుండా వర్షం పడుతుందనే నమ్మకం ఉంది. అలాగే జగన్నాథ రథయాత్రలో కూడా ప్రతిసారీ వర్షం పడటం ఓ విశేషం.

జగన్నాథుడికి తన గుడిని వదిలి వెళ్లడం ఇష్టం ఉండదేమో! అందుకే ఎవరు ఎంత ప్రయత్నించినా కూడా రథం కదలదు. కొన్ని గంటలపాటు కొన్ని వేలమంది కలిసి లాగితే కానీ రథం కదలడం మొదలవ్వదు.

జగన్నాథుడు గుండిచా ఆలయం నుంచి తిరిగివచ్చే యాత్రని 'బహుద యాత్ర' అంటారు. ఆ యాత్రలో భాగంగా రథాలన్నీ 'మౌసీ మా' అనే గుడి దగ్గర ఆగి అక్కడ తమకి ఇష్టమైన ఓ ప్రసాదాన్ని స్వీకరించి బయల్దేరతాయి.

జగన్నాథుడు తన గుడికి తిరిగి వచ్చిన తర్వాత 'సునా బేషా' అనే ఉత్సవం జరుగుతుంది. అంటే దేవుడి విగ్రహాలను బంగారు ఆభరణాలతో ముంచెత్తుతురన్నమాట! దీనికోసం దాదాపు 208 కిలోల బరువున్న నగలను ఉపయోగిస్తారు.

★★★

# వృక్షము వీలునామా


అయ్యలసోమయాజుల



ఏ కాకి ఊసేసిన గింజనో
ఇలా అడవి లో ఏకాకి గా మిగిలిపోయాను
ఎన్ని ఋతువులు కుదిపేశాయో
ఎన్ని తుఫానులు పలకరించాయో
సరి సమానంగా అన్నింటినీ కౌగలించుకున్నా!
చిట్ట చివరికి నేను ఎదురుచూడని
ఒక చివరి వేసవి రానే వచ్చింది
ఆశలన్నీ శిశిరపు ఆకుల్లా రాలిపోయాయి.
ఎండుటాకులు మట్టి లో కలిసిపోయినా
తెలియనంత నిశ్శబ్దం కమ్ముకుంది
వసంతం కోసం వేచిచూసే సమయం మిగల్లేదు!
ఏ గొడ్డ లో నన్ను నిట్టనిలువునా చీరేయ్యడానికి
అడవి లో వెదుక్కుంటూ తిరుగాడుతోంది!
దూర దేశాల ఊసులు చెప్పే పిట్టలు
తప్పించుకు తిరుగుతున్నాయి!
గాలి కూడా వాలడం లేదు
కార్చిచ్చుగా రగులుదామని కాపేసి కూర్చుంది!
స్థంభించిపోయిన శూన్యం దిగులుగా చూస్తోంది
ముగింపు కన్నా భరించలేనిది విషాదపు నిరీక్షణ
ఆత్మాహుతి చేసుకుందామంటే
చెట్టుకు చావడం. తెలీదు
ఏ చిట్టచివరి కట్టెగానో రగిలి
వెలుగును పంచాలి!
ఒక్క కడుపు అయినా నింపాలి!!

## నీట్ పరీక్ష పై నీలి నీడలు



22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు నేడు అగమ్య గోచరంగా తయారయ్యింది. దీనికి కారణం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాల్సిన' నీట్' పరీక్ష నిర్వహణపై అనేక నీలి నీడలు కమ్ముకున్నాయి . కొన్ని లక్షల మంది వ్రాసే పరీక్షను ఎంతో జాగ్రత్తతో , నిబద్ధతతో ఎటువంటి అవకతవకలు లేకుండా నిర్వహించాలి . కాని పరీక్ష నిర్వహణలో అనేక లోపాలు కనపడుతున్నాయి. ఏ చిన్న తప్పు జరిగినా వేల మంది భవిష్యత్తు తారుమారౌతుంది. ప్రశ్నాపత్రం లీకు అవ్వటం, కొన్ని కేంద్రాల్లో పరీక్ష ఆలస్యంగా మొదలవ్వటం, కొన్ని కేంద్రాలలో అంతర్జాలంలో అంతరాయం ఏర్పడి పరీక్షకు అంతరాయం " ఏర్పడటం, కొంతమందిని ఒకె కేంద్రంలో కేటాయించటం వంటి అనేక ఆరోపణలు నీటి పరీక్ష పై వెల్లువెత్తాయి.

# నడుస్తున్న చరిత్ర

నీట్ పరీక్ష రాసిన వాళ్ళలో 67 మందికి 720 వర్కులు సాధించారు. వీరు ఒక్కొక్కరు 49.7127 పెర్సెంటైల్ పొందారు . వీరిలో ఆరుగురు ఒకే కేంద్రంలో పరిక్ష రాసారు. సమయ భావం వల్ల 1560 మందికి గ్రేస్ మార్కు లిచ్చారు. ఈ గ్రేస్ మార్కులు ఏ పద్ధతి ప్రకారం ఇచ్చారో వివరంగా చెప్పక పోవటంతో పెద్ద ఎత్తున విమర్శలు చెలరేగాయి, చివరకు సుప్రీం కోర్టులో ఈ గ్రేస్ మార్కెలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించింది ఎన్. టి.ఎ.




నీట్ అక్రమాలకు సంబంధించి పోలీసుల విచారణలో ఇప్పటి వరకు 14 మందిని అరెస్టు చేస్తే, ప్రాథమిక విచారణలో వీరు 30 లక్షలు పెట్టి ప్రస్నా పత్రం కొనుగోలు చేసామని చెపుతున్నారు .బిహార్ పబ్లిక్ సర్వీస్ టీచర్ రిక్రూట్మెంట్ పరీక్షలో ప్రశ్న పత్రాలు లీకు చేసినవాళ్ళే ఈ పరీక్షలో కూడా ప్రశ్న పత్రాలను అమ్మినట్లు కనుగొన్నారు. ఇంత జరిగిన నీట్ అధికారులు ప్రస్నా పత్రం లీకవ్వలేదని వాదించటం శోచనీయం .

ఎన్డీఏ ప్రభుత్వంలో కేంద్ర మానవ వనరుల మంత్రిగా పని చేసిన మురళి మనోహర్ జోషి ఈ పరీక్ష ప్రారంభించటానికి మూల కారకుడు. 2010లో భారతీయ వైద్య మండలి 'నీట్ ' పరీక్షను ప్రకటనను విడుదల చేసింది.

కాని 2010 లో మళ్లీ ఈ పరీక్ష నిర్వహణ సరికాదని నాయస్థానం అడ్డుకుంది. ఈ నిర్ణయంపై అనేక విమర్శలు వెల్లువెత్తాయి. వైద్యవిద్య ప్రమాణాలను ఈ నిర్ణయం దిగ జారుస్తోందని అనేక మంది అభిప్రాయపడ్డారు. దాని ఫలితంగా 1956, భారతీయ వైద్య మండలి చట్టంలో మార్పులు చేసి, సెక్షను 10 D ద్వారా 'నీటి' పరీక్ష నిర్వహించటానికి వైద్య మండలికి సర్వ హక్కులు కల్పించారు. తత్ఫలితంగా 20 16 నుండి పరీక్షను నిర్వహిస్తూ వస్తున్నారు. 2016 లో ఈ మార్పును వ్యతిరేకిస్తూ వేసిన కేసును కొట్టి వేయటమే కాక, రాష్ట్ర ప్రభుత్వాలు నీట్ కు ప్రత్యామ్నాయంగా తాము పరీక్షలు నిర్వహిస్తామంటే కుదరదు అన్నది న్యాయస్థానం . 2020లో మైనారిటి సంస్థల గోడు కూడా వినకుండా కోర్టు నీట్ నిర్వహణను గట్టిగా సమర్ధించింది నిజానికి నీట్ 'పరీక్ష నిర్వహణ వల్ల లాభాలు వున్నాయి. నష్టాలు వున్నాయి. అప్పటి దాకా రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు విశ్వవిద్యాలయాలు తమ సొంత ప్రవేశ పరీక్షల ద్వారా విద్యార్థులకు వైద్య విద్యల్లో ప్రవేశాలు కల్పిస్తూ వచ్చాయి. వీటి మీద కూడా అనేక ఆరోపణలున్నాయి. పైపెచ్చుఅనేక పరీక్షలు రాయలేక విదార్థులు తీవ్ర మానసిక వత్తిడీ ఆత్మహత్యలకు కూడా పాల్పడిన అనేక సందర్భాలు ఉన్నాయి . దేశ వ్యాప్తంగా ఒకే పరీక్ష వల్ల ఈ వత్తిడి తగ్గింది. కాని



పొరపాటున ఈ పరీక్ష రాయలేక పోతే విద్యార్థి ఒక విద్యా సంవత్సరం నష్ట పోవలిసిందే. అదే విధంగా విద్యార్థికి ఇష్టమైన కాలేజిల లో ప్రవేశం పొందలేక పోవచ్చు రెండు మూడు పరీక్షలుంటే, తనికిష్టమైన కాలేజిలో చేరే అవకాశం వుంటుంది.

అసలు ఇటువంటి దేశ వ్యాప్త ఏక పరీక్షలపై విస్తృత స్థాయిలో మేధోమధనం జరగాలి. ఒకే ఒక్క పరీక్ష ద్వారా విద్యార్థి యోగ్యుడా కాదా అనేది నిర్ణయించటం సరైనదేనా? వందల కోట్ల జనాభా వున్న భారత దేశం లాంటి దేశంలో ఇంతకన్నా మార్గం లేదని వాదించే వారున్నారు. కోర్టులు, ప్రభుత్వాలు పైతం అర్హతకలవారిని ఎంపిక చెయ్యటానికి 'నీట్' పరీక్ష ఉత్తమ పద్ధతి అని అనుకుంటున్నాయి. ఒకరి యోగ్యతా ప్రమాణాలు నిర్ణయించే టప్పుడు. వారు ఎటు వంటి పోటిని ఎదుర్కొన్నారు,వారికీ ఎటువంటి అవకాశాలు లభించాయి అనేది కూడా పరిగణలోకి తీసుకోవాలి. ఇవి పరిగణలోకి తీసుకోనప్పుడ అటువంటి పరీక్ష యోగ్యతను నిర్ణయించ లేదు. కేవలం బట్టి పట్టీ విధానం ద్వారా యోగ్యతను నిర్ణయించే పరీక్షల వల్ల ఎటువంటి ప్రయోజనం వుండదు. నిజమైన తెలివితేటలు, సృజనాత్మకత, ఉహాత్మకత, ఉత్సుకత, ప్రేరణ వంటి వాటిని ఇవి లెక్క కట్ట లేవు.

నీట్ పరీక్ష నిర్వహణ వల్ల గ్రామీనా ప్రాంత విద్యార్థులు బాగా నష్ట పోతున్నారు. ఇంగ్లీషు మీడియంలో చదివిన విద్యారులదే నీట లో పైచేయి. వీరి శాతం 85.12 %నుండి 95.01 శాతానికి పెరగగా, ప్రభుత్వ పాఠశాలలో చదివే వారి సంఖ్య 1.2 శాతం నుండి 0.6% నికి పడి పోయింది. పేద, దిగువ మధ్యతరగతి వర్గాలవారు. 47.42 %నుండి 41.05% నికి పడిపోగా, గ్రామీణ ప్రాంత విద్యార్థులు 61.4 %నుండి 50.8 % పడి పోయారు. ఒకే దేశం ఒకే పరీక్ష నినాదం తో ముడిపడి జరిగే ఈ నీట పరీక్షకు కాచింగ్ ఇచ్చె సంస్థలు కూడా పెద్ద పెద్ద నగరాలకె పరిమితం కావటంతో, గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ఇవి అందుబాటులో లేకుండా పోయాయి. అదే విధంగా కేంద్రీయ విద్యా సంస్థల సిలబస్సుకు రాష్ట్ర విద్యా సంస్థల సిలబస్సుకు ఎంతో వెత్యాసం వుండటం వల్ల ఒకే ప్రవేశ పరీక్ష విధానం సరైనది కాదాని విద్యా వేత్తలు వాదిస్తున్నారు. ఇన్ని లోపాల మధ్య ఒకే పరీక్ష ద్వారా యోగ్యతను నిర్ణయించకుం సరైనదేనో? భిన్న వర్గాలు, బహుళ సమజాలున్న మన దేశానికి ఇటువంటి పరీక్ష న్యాయం చేయంచేయ కలదా యోగయత పేరుతో రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను తోసి పారేయలేము .మరొక్క సారి ఈ పరీక్షపై విస్తృత స్థాయిలో చర్చించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

★★★★



# అంతర్నేత్రం



## అవరోధాలను అధిగామించండి

ఏ మనిషి అయినా అతని ప్రత్యేకత జీవితంలో అతడు ఎదుర్కొన్న పరిస్థితులలో లేదు. ఎదురైన విపత్తులలో ఎంత ఉన్నతంగా నడుచు కున్నాడనే దానిమీద అతని ఔన్నత్యం ఉన్నది. ఎవరినీ నిందించకుండా, అన్ని సందర్భాలలోను ఉదాత్తతతో, హుందాగా నడుచుకున్నవాడే అసలైన ధైర్యవంతుడు. ఎన్నో రకాలుగా జీవిత పరిస్థితులును చక్కదిద్దుకుంటూ ఉన్నా కూడా బాహ్య పరిస్థితులు ఎప్పుడో ఒకప్పుడు విషమించే ఆస్కారంఉంది. మీరు అన్నీ సక్రమంగా నిర్వహించుకోవచ్చు. కానీ ఒకవేళ తుఫాను లాంటి సమస్య వస్తేమాత్రం, అది మీ ఇంటిని, మీ సమస్తాన్ని తుడిచిపె ట్టేస్తుంది. నాకేమి జరగదులే అని అనుకోవడం మూర్ఖంగా బతకడమే అవుతుంది. ఒకవేళ అదే జరిగినా కూడా నేను దానిని ధైర్యంగా ఎదుర్కొంటాను అని అనుకోవడమే వివేకమైన జీవనమార్గం.

మీ దగ్గర

ఎంత ఉంది, మీరు ఏం చేశారు, ఏం జరిగింది, ఏం జరగలేదు, ఇవన్నీ ప్రశ్నలు కావు. ఏదైనా జరగనీ మిమ్మల్ని మీరు ఎలా నిలుపుకుంటున్నారు, అదే అసలు విషయం.

మీ జీవితం ఒక సుందర పరిమళ పుష్పంలాగా వికసించాలంటే దానికి సానుకూలమైన అంతర్గత పరిస్థితిని కల్పించుకోవాలి. అటువంటి స్థిరమైన అంతర్గత వాతావరణాన్ని మీరు ఎల్లప్పుడూ సృష్టించుకోవాలి.ప్రతి పరిస్థితిలోను మనల్ని మనం మనోజ్ఞంగా నిలబెట్టుకోగలిగినప్పుడు, అద్భుతమైన అనుభూతి కలుగుతుంది. అసలు మన జీవితాన్ని మనమేసంక్లిష్టంగా తయారు చేసుకుంటున్నాం. ప్రతి విషయానికి ఆందోళన చెందడం ఒక అలవాటుగా మారిపోయింది. అందుకే జీవితంలో ఆనందం ఉండటం లేదు. జీవితం ఒక బస్సు ప్రయాణం లాంటిది, కిటికీలోనుంచి చూస్తే బయటి విషయాలే కనిపిస్తుంటాయి. కానీ మీ ప్రయాణం ఎక్కడికి,ఎంత దూరం ప్రయాణించాలి అనే విషయాన్ని గమనిస్తూ ఉండాలి.

అంతేగాని బయట విషయాలు, లేదా బస్సులో మీచుట్టూ వున్నవాళ్ళు,వాళ్ళ ఉబుసుకుపోని మాటలపట్ల ఆసక్తి పెంచుకుంటే మీ గమ్యాన్ని మర్చిపోతారు. ఒకసారి ఒక కప్పల గుంపొకటి ఒక పందెం పెట్టుకున్నాయి. అదేమిటంటే ఒక పొడవాటి చెట్టు చివరి వరకు

అసలు మన జీవితాన్ని మనమేసంక్లిష్టంగా తయారు చేసుకుంటున్నాం. ప్రతి విషయానికి ఆందోళన చెందడం ఒక అలవాటుగా మారిపోయింది. అందుకే జీవితంలో ఆనందం ఉండటం లేదు.

పాకుకుంటూ వెళ్ళాలి. కొన్ని కప్పలు పందానికి సిద్ధపడ్డాయి. మిగిలినవి నిరాశతో 'ఆ చాలా కష్టం", "సమయం వృథా", "మనవల్లకాదు", "ఆ అక్కడదాకా వెళితే ఏమొస్తుందంటా" అంటూ ఎవరికి తోచిన వ్యాఖ్యలు వాళ్ళు చేస్తున్నారు. ఇక ఆట మొదలయ్యింది. కొన్ని ఎక్కేందుకు ప్రయత్నిస్తున్నాయి. కొన్ని జారి పడుతున్నాయి. ఏ ప్రయత్నమూ చేయని కప్పలకు ఇది ఒక వినోదంగా మారింది. ఒకటి రెండు కప్పలు మాత్రం చెట్టు సగానికి పైగా చేరుకున్నాయి. కాని వాటిని పూర్తిగా ప్రయత్నం చేయనిస్తేగా, విమర్శలతో వాటిని నిరాశకు గురిచేస్తున్నారు. చివరకు ఒకే ఒక కప్పమాత్రం నిశ్చల బుద్ధితో చెట్టు చివరకు ఎగబాకి విజయగర్వంతో చేతులూపింది. అది కిందకి దిగి వచ్చిన తరువాత, అందరూ చుట్టూచేరి దాని విజయరహస్యం చెప్పమన్నారు. కాని అది మౌనంగా అక్కడినుండి నిష్క్రమించింది. దాంతో దానికి తలపొగరని, కళ్ళు నెత్తిమీదకెక్కాయని తలాఒక మాటఅని అక్కడి నుంచి వెళ్ళిపోయారు.

కాని నిజానికి అది చెవిటి కప్ప. దానికి తనచుట్టూ వున్నవాళ్ళు ఎన్ని విమర్శలు చేసినా వినపడలేదు. కాబట్టే తన దృష్టినంతా చెట్టు ఎక్కడంపై నిలిపి విజయం సాధించింది. మనచుట్టూ అవరోధాలు కల్పించేవాళ్ళు, నిరుత్సాహపరిచేవాళ్ళు, అగాధాలు సృష్టించేవాళ్ళు, అనవసరపు వ్యాఖ్యలు చేసేవాళ్ళు కోకొల్లలుగా వుంటారు. వారి మాటలు వినిపించుకోకుండా స్థిరచిత్తంతో ముందుకెళ్ళ గలగాలి. ప్రతి ఒక్కరి మాటలు పట్టించుకుంటూ వుంటే ఆందోళన అధికమౌతుంది. ఏమి జరిగినా, ఎవరేమనుకున్నా మనం లక్ష్యం వైపే ప్రయాణించాలి.

★★★

ఈ శీర్షిక మీదే

# కొంటె ప్రశ్న –చిలిపి జవాబు

కిందటి నెల ప్రశ్న
కుక్క కాటుకి చెప్పు దెబ్బ ..మరి వెన్ను పోటుకి..?రాజకీయం అబ్బా
116/–రూ.బహుమతి పొందిన జవాబు:
ఈ .అలేఖ్య

ఈ నెల ప్రశ్న
తడిగుడ్డలతో గొంతులు తెగకోస్తారు. మరి పొడి గుడ్డలతో ..?
జవాబులు జూలై 25 లోపు పంపండి
sumathi.potilu@gmail.com

సాధారణ ప్రచురణకు ఎన్నికైన జవాబులు

కుక్క కాటుకి చెప్పు దెబ్బ ..మరి వెన్ను పోటుకి..?
“ పదవి దెబ్బ “
.శింగరాజు శ్రీనివాసరావు, ఒంగోలు

కుక్క కాటుకు చెప్పు దెబ్బ. మరి వెన్నుపోటుకు.?
కాలం కసి తీర్చును ఆ ఎదురు దెబ్బ.
కె. అమృత జ్యోత్స్న

కుక్క కాటుకి చెప్పు దెబ్బ
వెన్ను పోటు కి పదవి దెబ్బ

మూలా వీరేస్వరరావు

కుక్క కాటు కు చెప్పు దెబ్బ!
మరి వెన్నుపోటుకి “అధికారం అందాలమెక్కించే” దెబ్బ!
కొత్తపల్లి ఉదయబాబు సికింద్రాబాద్

కామెడి సీరియల్

# పంచవటి

## ఓ పదిళ్ళ లోగిలి



అలేఖ్య

"బెల్లం చుట్టూ చీమలు చేరినట్టు, డబ్బు, అధికారం ఎక్కడుంటే అక్కడ మనుషులు పోగవుతారు. లేని బంధాలు, బంధుత్వాలు కలుపుకుంటూ దగ్గర కావాలిని చూస్తారు'

'హరీష్ తో మాట కలపాలని, అతని దృష్టిలో పడాలని అక్కడున్న వాళ్ళందరూ ప్రయత్నిస్తుంటే, హరీష్ మాత్రం పద్మనాభాన్ని పరిచయం చేసుకోవటానికే ప్రాధాన్యత నిస్తూ అతని తో మాట కలిపాడు.

పద్మనాభం హరిష్ ని తన భార్యకు పరిచయం చేస్తూ,

# కామెడి సీరియల్

**జరిగిన కథ**
ఉమా ,శంకరం భార్య భర్తలు. ఉమా ఉళ్ళోని పోలీస్ స్టేషన్ లో ఎస్ ఐ గా పనిచేస్తూ ఉంటె , శంకరం చెట్టు కింద ప్లీడరు గా పేరుపడి వాదించటానికి కేసులు లేక ఇంటిదగ్గరే ఉంది ఇంటిపనులు చుసు కుంటూ ఉంటాడు . వర్లుగారి స్నేహితుడు తాతారావు వంటపని ఇంటిపని చేస్తూ భార్య చాటు భర్తగా గడుపుతుంటాడు . కాలనీ చుట్టూ అపార్ట్మెంట్లు రావటం తో నీటి ఎద్దడి రావటంతో మినిస్టేర్ని కలవల్నుకుంటారు వర్లు గారు . మునిసిపల్ కమిషనర్ ణి కలిసిన ఫలితం ఉండదు .హెడ్ కానిస్టేబులు రంగనాథం శంకరం దగ్గరకు చిన్న చిన్న కేసులు తీసుకువస్తుంటాడు .తాతారావు కొడుకు పద్మనాభం అందరిని పార్టీకి పిలుస్తాడు.
**ఇక చదవండి**

“సార్, కల్పతరు ఇన్ఫ్రా ఎమ్.డి, దేశం లోనే పెద్ద పేరు మోసిన బిల్డరు. సార్ మన ఇంటికి రావటం మన అదృష్టం” అని గొప్పగా పొగుడుతూ చెప్పాడు .

హరిణి హరీష్'కి వినమ్రంగా నమస్కారం చేసింది.

హరీష్ తన కోటు జేబులో నుండి, ఒక చిన్న ప్యాకెట్ తీసి, హరిణికి అందిస్తూ, “ది సీజ్ ఫర్ వాల్యుబుల్ పర్సన్స్ లైక్ యూ ‘అంటూ ఓ నవ్వునవ్వాడు

హరిణి కూడా ఆ నవ్వుకు , మరో చిరునవ్వుతో బదులి వ్వక తప్పలేదు.

పద్మ నాభానికి ఆ పరిణామం కాస్త ఇబ్బందిగా అనిపించినా తప్పక పోవటంతో, ‘హరిణి, వచ్చిన వారికి భోజనాల ఏర్పాటు చూడు” అంటూ అక్కడ నుంచి హరిణిని తప్పించాడు.

జరుగుతున్నదంతా చూస్తున్న శంకరం. పద్మనాభానికి సైగ చేశాడు తన అవసరం ఏదనా వుందా అని.

అవసరం లేదన్నట్టు పద్మ నాభం తలాడించాడు.

అది గమనించిన హరీష్, ఇంక అక్కడ వుండి ఏం ఉపయోగం లేదని ,”ఒకే, దెన్ ఐ విల్ మూవ్.. ‘ అంటూ వడి వడిగా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

అక్కడ వున్న చాలా మంది అతన్ని అనుసరించారు.

శంకరం చిన్నగా నడుచుకుంటూ పద్మనాభం దగ్గరకు వెళ్ళి,“ఇతను. అంటూ ప్రశ్నర్ధకం మొఖం పెట్టాడు

“ఇతనా రా, హరీష్… దేశంలోనే ఒన్ఆఫ్ ది టాప్ బిల్డర్ ”
“ అంత బడా బిల్డర్ కి నీ లాంటి చిన్న క్లర్కుతో పనేంటి రా?”
“ ఏమో రా, నాకు తెలియదు… బహుశా ఏదన్నా ప్రాజక్టు ఫైల్ నాటేబిల్ మీదకు రాబోతుందేమా”
“ ఏది ఏమైనా జాగ్రత్త, ఈ బిజినెస్ పీపుల్ వాళ్ళకు అవసరం లేందే ఏపని చెయ్యరు. బహుశా అందుకనే నీకు ముందస్తు వల విసురుతున్నాడు

” ఒకే . ఐ విల్ టేక్ కేర్… “ అంటూ అక్కడి నుంచి.కదిలాడు పద్మనాభం, మిగిలిన గెస్టులను పలక రించ టానికి
★★★

“సార్, మీకోసమే చూస్తున్నా…” బండి దిగుతున్న శంకరం దగ్గరకి వస్తూ అన్నాడు హెడెకానిస్టేబుల్ రంగనాధం

బండిని చెట్టు పక్కన పార్కు చేస్తూ, ఆ చిల్లర కేసులు వద్దనుకున్నాము కదా హెడ్డు గారు” సున్నితంగా తనకిష్టం లేదన్నట్టు చెప్పాడు.

అబ్బే. ఒకసారి మీరు వద్దన్న తరువాత మళ్లీ ఎందుకు తెస్తానండి.. “

‘మరైతే ఎందుకొచ్చారు…. అనుమానంగ రంగనాధం వంక చూశాడు శంకరం.

రంగనాథం పక్కనే, ఒక బక్కపలచని ఆకారం నిలబడి వుంది. వయసు యాభై పైనే

# గిలిగింతలు పెట్టే హాస్య వల్లరి కడుపుబ్బా నవ్వించే కామెడి సీరియల్

వుంటాయి . సెరిసిన గడ్డం, చిరుగులు పడ్డ బట్టలు, చూస్తూవుంటే ఎవరికైనా ఇట్టే అర్ధ మౌతుంది ఎవరోఆర్ధికంగా చితికి పోయిన మనిషని

"సార్, ఈయన రాజారావుగారు, మన స్టేషన్ పక్కనే వున్న పోస్టాఫీసులో గుమస్తాగా చేసి రిటైర్ అయ్యారు.. ఇదంతా తనకేందుకు చెపుతున్నారు అన్నట్టు కాస్త విసుగ్గా మొఖం పెట్టి, "ఇంతకీ విషయం ఏమిటండి .. " అన్నాడు శంకరం,త్వరగా తేల్చమన్నట్లు

" ఈ యన ఇంటిని కొంత మంది ఆక్రమించుకుని, బయటకు వెళ్ళగొట్టారు సార్ " శంకరం ఆలోచనల్ని , గ్రహించిన రంగనాథం ఒక్క ముక్కలో చెప్పుకొచ్చాడు.

"అయితే పోలీసుల దగ్గర కెళ్ళాలి కాని, నాదగ్గర కెందుకు వచ్చారు' అనుమానంగా అడిగాడు శంకరం'

" వెళ్లారు సార్ట్ సివిల్కేసు కాబట్టి కల్పించు కోనన్నారు, అందుకనే మీ దగ్గరకు .. "అంటూ. చెప్పుకొచ్చాడు రంగనాథం.

'ఆస్థి తగాదాలైతే సివిల్కేసు, కాని ఇంటి మీద పడి ఇంట్లో వాళ్ళని బెదిరించి వెళ్ళాగొడితే క్రిమినల్ కేసు అవుతుంది.. ' వివరంగా చెప్పాడు శంకరం

" ఏమో, సార్ ఆ సెక్షన్లు మాకేం తెలుసు .మా సి .ఐ గారు తీసుకోవద్దన్నారు. అందుకు మేడమ్ గారు మీదగ్గరకు పంపించారు

ఉమ పేరు వినగానే, "ఔనా మేడమ్ గారూ పంపించారా, సరే రండి... వివరాలు చెప్పండి అంటు వాళ్ళ వివరాలు రాసుకోసాగాడు శంకరం : కేసు ఫైల్ చెయ్యటానికి

★★★

రాజా రావుగారి తేసు తీసుకోమని నువ్వే ఒపించావట " వంట పని మొత్తం పూర్తి చేసుకుని గదిలోకి అడుగుపెట్టిన ఉమను చూస్తూ అడిగాడు శంకరం

" అవును నేనే పంపానండి పాపం ఆయన బాధ చూడలేక.. ' శంకరం పక్కనే కూర్చుంటూ అంది

" అది క్రిమినల్ కేసే మీరే టేకప్ చేస్తే సరిపోతుంది. మళ్లీ కోర్టు దాకా ఎందుకు.."

"తెలుసండి , కాని సి. ఇ గారు పడ నివ్వలేదు. బహాశా వాళ్ళు ముందుగానే సి.ఐ తో మాట్లాడుకున్నట్టున్నారు. మీకు తెలుసుకదా మా సి. ఇ పెద్ద లంచావతారం అని'

"అదే అనుకున్నాలే .... పోనే మన పరిధిలో వాళ్లకు నాయం చెయ్యలేమా?

"నువ్వేమన్నా, ఆ రౌడీలకు వార్నింగ్ లాంటిది..'

"ఇవ్వచ్చుకాని, సి. ఐ . కి తెలియకుండా వుండదు. వాడి వెనకాల ఎవరున్నారో తెలియదు మరి.. పోని ఒక పని చేద్దాం .. "

"ఏంటది .."

శంకరం చెవిలో ఎదో గుసగుస లాడింది.

'అంతా బాగానే వుంది కాని, మనమిద్దరం సరిపోతామా? –\

పోనే పద్మనాభం వాళ్ళను కూడా కలుపు కుందాము .."

' అడిగి చూస్తాను... కాకపోతే బయటకొస్తే వాడు ఇబ్బంది పడతాడేమో "

''సరే అయితే మనమిద్దరమే ప్రయత్నించి చూద్దాం, మీకేమన్నా భయమా?.." నవ్వుతూ అంది ఉష

"భయమా, మా ఇంటా వంట లేదు. అయినా నా వెనకాల సత్యభామలా కొండంత అండగా నువ్వుంటే ఇంక భయమెందుకు '

'సరే అయితే, రేపు కావలసిన వన్నీ

కొనుక్కోస్తాను. రేపురాత్రి మన ఆపరేషన్ మొదలు పెడుతున్నాము

"ఒకే బాస్.. " అంటూ ఉషను తన కౌగిలోకి తీసుకున్నాడు శంకరం

(ఇంకా ఉంది )

# మురికి మనిషి

ఈదర శ్రీనివాస రెడ్డి

మనిషి గురించి కాగితం పై రాసిన ప్రతిసారి
మట్టి పరిమళలో శ్రమ పూల సౌరభాలో
మానవత్వపు సువాసనలో పరిమింళిచేవి

రెప రేపలాడుతూ కొత్త వాసనలు వెదజల్లే కాగితాలన్నీ
ఇప్పుడెందుకో కమురు కంపు కొడుతుఉన్నాయి
నెత్తుటి మరకలు అంటాయో నాటు సారా ఒలికిందో మరి

ఒగరు వాసనల మధ్య కొన్ని కాగితాలు
ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి కులం కంపుతోనో
మతం మురికితోనో ఉప్పిరికి పోయాయి మరి

చిరుగులు పట్టి చెదలు బట్టిన పుస్తకం లా
మురికి బట్టి పోయింది మనిషి మస్తకం
ఎన్ని అత్తర్లు అద్దినా అదే కుళ్ళు వాసన

కొన్నిసార్లు రాస్తుంటే కాగితం కన్నీరు పెడుతూ అడుగుతోంది
మనిషికంటిన మలినాలను మామీద రుద్దు తావెందుకని
చివరకు చెత్తబుట్టలో మమ్మల్ని పారేస్తావెందుకని

ఈ నెల కథ

మొదటి బహుమతి పొందిన కథ

# .. అందరి ఇల్లు .

డా.ఎం .సుగుణారావు

డాక్టర్ కామేశ్వరి ఆ తెలంగాణా ప్రాంతంలో క్రొత్తగా ఏర్పడిన ఆ గ్రామీణ జిల్లాలో, జిల్లా వైద్య ఆరోగ్యాధికారిగా చేరింది. ఆ ఉద్యోగంలో చేరి అప్పటికి వారం రోజులు కావస్తోంది. చేరిన రెండోరోజే ఒక దినపత్రికలో ఒక వార్త వచ్చింది.

'గర్భసంచిల గుట్టలు తయారవుతున్నాయ్. ఈ మారుమూల గ్రామల్లోని తాండాలలో నలభై శాతం మంది స్త్రీలకు గర్భసంచి లేదు. వాటిని ఎందుకు తీయించేసుకుంటున్నారో తెలీదు! ఇలా గర్భసంచిని తీయించేసుకుంటున్న వాళ్ళల్లో కొంతమందికి పిల్లలు లేకపోవడం, అలాగే వారి వయసు చాలా చిన్నది కావడం, దాంతోపాటు ఒకరో ఇద్దరో పిల్లలుండడం. ఏ ఇతరత్రా ఆరోగ్య సమస్యలు లేనప్పుడు ఇలా గర్భసంచులు తీయించేసుకోవడం దారుణం కదా! దీనిపై వైద్య ఆరోగ్య అధికారులు ఏవిధంగా స్పందిస్తారో?'

ఇది ఆ దినపత్రికలోని వార్త. ఆ వార్త వచ్చిన కొన్ని గంటల్లోపే కామేశ్వరికి ఆరోగ్యశాఖా మంత్రినుంచి ఫోన్ వచ్చింది. వారు స్వయంగా మాట్లాడారు.

"అమ్మా ఆ వార్త బాధ కలిగించింది. దీనిమీద మీరు పనిచేయండి. సమగ్రంగా పరిశీలించి మీ రిపోర్ట్‌ను పంపడంతోపాటు, దీనికోసం ఒక కార్యాచరణ రూపొందించండి." ఆరోగ్య శాఖామంత్రిగారు చాలా గౌరవంగా మాట్లాడారు.

అప్పట్నుంచీ కామేశ్వరి అదే పనిమీద ఉంది. ఆ ప్రాంతం మహారాష్ట్ర బోర్డరులో ఉంది. అక్కడ రెండు షుగర్ ఫ్యాక్టరీలున్నాయి. ఆ ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లోని మహిళలు ఇంటి యజమానితో పాటు తామూ చెరుకుపంట కోసే పనికి వెళతారు. రోజులు పన్నెండు గంటల పనుంటుంది. మూడు టన్నుల చెరుకుపంట కోయాలి. దానికి ఫ్యాక్టరీ వారు లక్ష రూపాయల వరకూ ఇస్తారు. అయితే భార్యాభర్తలు రోజూ పనిచేయాలి. ఈ క్రమంలో ప్రతి నెలా భార్యలకు నెలసరి వచ్చే సమయంలో మూడు రోజులూ పనికి వెళ్ళకపోతే ఆ మేరకు తమకొచ్చే దాంట్లోంచి మినహాయిస్తారు. అందుకనే ఆ డబ్బులు పోగొట్టుకోవడం ఇష్టం లేక ఆడవారు నెలసరి రాకుండా తమ గర్భసంచిని తీయించేసుకుంటున్నారు. అలా గర్భసంచి తీయించేసుకోవడానికి ఆపరేషన్ కోసం అప్పులు కూడా చేస్తున్నారు. ఇదీ ఒక కారణం!

కామేశ్వరి ఆ చుట్టుప్రక్కల ప్రాంతాలంతా సర్వే చేయడంతో ఆ విషయం తెలిసింది. అందుకని ఆ గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్ళి అవగాహన కలిగించే కార్యక్రమం మొదలుపెట్టింది. వైద్య కేంద్రాల్లో పనిచేసే హెల్త్ వర్కర్లతోపాటూ తనూ వెళ్ళింది. అయితే ఆ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు నెలసరి సమస్య గురించి మాట్లాడడానికే సిగ్గుపడుతున్నారు.

దాంతోపాటు ఆడపిల్లలు నెలసరి సమయంలో స్కూలుకు వెళ్ళడం మానేస్తున్నారు. ఇవన్నీ ఆలోచించి కామేశ్వరి ఆరోజు ఆ ప్రాంతంలోని ఒక పంచాయితీ బిల్డింగ్‌లో మీటింగ్ ఏర్పాటు చేసింది.

ఇప్పుడు జరగబోయే మీటింగ్‌లో ఏం మాట్లాడాలనే ఆలోచనలో ఉంది కామేశ్వరి. అయితే ఆరోజు ఉదయం ఇంట్లో జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది కామేశ్వరికి. తనకో కూతురు, కొడుకు ఉన్నారు. కూతురుకు పద్దెనిమిదేళ్ళు, కొడుక్కి పదహారేళ్ళు. తన పిల్లల సంభాషణ ఆమెను మరింత ఆలోచనలోకి నెట్టేసింది. జరిగిన సంఘటనను మరోసారి గుర్తు తెచ్చుకొంది ఆమె.

★★

కామేశ్వరి లాప్‌టాప్‌లో పనిచేసుకుంటోంది. అత్యవసరమైన ఒక రిపోర్ట్ తయారుచేయాలి. అంతలో ప్రక్క గదిలోంచి కొడుకు, కూతురు మాట్లాడుకుంటున్న మాటలు వినిపించాయి.

"ఒరేయ్ తమ్ముడు... కడుపులో బాగా నొప్పి వస్తోంది. పీరియడ్స్ వచ్చాయి, ఒక ప్యాడ్ తీసుకురా" అంది కూతురు.

"నేను వెళ్ళను. మెడికల్ షాపుకెళ్ళి దాన్ని కొంటుంటే చుట్టుప్రక్కల వాళ్ళు నన్ను అదోలా చూస్తున్నారు" చెప్పాడు కొడుకు.

"అదేంటిరా అలా అంటావు. శానిటరీ ప్యాడ్ కొనడం నేరమా, ఘోరమా? అది ప్రకృతి అవసరం ప్రతి స్త్రీకి." అంది కూతురు.

"సరే వెళతాను" అని అయిష్టంగానే కొడుకు వెళ్ళాడు.

పావుగంట తర్వాత న్యూస్ పేపర్‌లో చుట్టిన ప్యాడ్స్ ప్యాకెట్ తీసుకొచ్చాడు. అతను దూరంగా ఉండి, ఆ ప్యాడ్ వంక చిరాగ్గా చూస్తూ అందించాడు.

"ఏంటిరా నన్ను అన్ టచ్‌బుల్‌లా చూస్తున్నావు?" అంది కూతురు.
"అది ఇన్‌ప్యూర్ బ్లెడ్ కదా" అన్నాడు కొడుకు.

"వెధవ... ఎవరు చెప్పారు?" అంది కూతురు కోపంగా.

"మా ఫ్రెండ్స్ చెప్పుకుంటుంటే విన్నాను."

తను సీరియస్‌గా పనిచేసుకుంటున్నా కొడుకు, కూతురు మాటలు తన చెవిన పడ్డాయి. కొడుక్కి క్లాస్ తీసుకుందామనుకుంది. కాని టైం లేక ఆ పని చేయలేకపోయింది. అయితే తన కొడుకు లాంటి

మగపిల్లలు, ఆడపిల్లల నెలసరి సమస్యల గురించి తెలుసుకోవాలని, ఇప్పుడు జరగబోయే మీటింగ్‌కి, ఆడపిల్లలు, మహిళలతో పాటు మగవాళ్ళను కూడా పిలిచింది. ఆ మీటింగ్‌కు తన కూతురు, కొడుకును కూడా తీసుకొచ్చింది. కొడుకు రానని మొరాయించినా బలవంతంగా లాక్కొచ్చింది.

ఆలోచిస్తున్న కామేశ్వరి "అమ్మా మీటింగ్ మొదలుపెడదాం. హాలు నిండిపోయింది" అన్నాడు ఆమె దగ్గరకు వచ్చిన ఆ ఊరి ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్.

కామేశ్వరి తన సీటులోంచి కదిలి, ఆ పంచాయితీ బిల్డింగ్ బయట వేసిన షామియానా కింద ఉన్న వేదిక వద్దకు నడిచింది. దాదాపు రెండు వందల మందికి పైగా మహిళలు, వారితోపాటు కొంతమంది మగవాళ్ళూ కనిపించడంతో ఆమెకు సంతోషం కలిగింది. ఉపోద్ఘాతం లేకుండా తను చెప్పాల్సింది మొదలుపెట్టాలి అనుకుంటూ కామేశ్వరి మైక్ అందుకుంది.

"నేటి మన సమాజం పరమాణు యుగంలో ఉంది. ఆడవాళ్ళు రోదసిపై వ్యోమగాముల మాదిరిగా ప్రయాణం చేస్తున్న ఈ దశలోనూ నెలసరి సమస్యలు గురించి మాట్లాడడంపై నిషేధం ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. దీన్ని ఛేదించాలి. ఇప్పటికీ పల్లెల్లో స్త్రీలు నెలసరి వచ్చినప్పుడు పాత వస్త్రాలనే వాడుతున్నారు. అయితే డిస్పోజబుల్, శానిటరీ నేప్‌కిన్‌లు వాడడం కూడా సురక్షితం కాదు."
ఆ మాటలకు ఆ మీటింగ్‌లోని ఒక మహిళ లేచి నిలబడి "ఏంటమ్మా అలా భయపెడుతున్నారు. ఒకసారి వాడి పడేసే నేప్‌కిన్‌లు కూడా ప్రమాదమేనా?" అంది.

దానికి కామేశ్వరి చెప్పడం ప్రారంభించింది.

"ఒక డిస్పోజబుల్ శానిటరీ నేప్‌కిన్ నాలుగు ప్లాస్టిక్ సంచులతో సమానం. అది భూమిలో కలవడానికి ఎంత సమయం పడుతుందో తెలుసా మీకు?" అంది ఆ మహిళ వంక చూసి.

ఎవరూ సమాధానం చెప్పకపోవడంతో, కామేశ్వరి చెప్పడం మొదలెట్టింది.
"డిస్పోజబుల్ శానిటరీ నేప్‌కిన్ భూమిలో కలవడానికి ఐదు వందల సంవత్సరాలు పడుతుంది. ఒక మహిళ జీవితకాలంలో పది నుంచి పదిహేనువేల ప్యాడ్స్ అవసరమౌతాయి. అంటే దాదాపు ఏభైవేల ప్లాస్టిక్ బ్యాగులతో అవి సమానం. ఈ ప్యాడ్‌ల తయారీలో ప్లాస్టిక్, సెల్యులో ఫైబర్, సింతటిక్ వంటి రసాయనాలు వాడతారు. వీటివల్ల పునరుత్పత్తి అవయవాలకు ఇన్‌ఫెక్షన్ వస్తుంది."

ఆ మాటలకు ఇంకో మహిళ లేచి, "మరి ఏం వాడాలమ్మా?" అంది.

"ఈ మధ్య రీ యూజబుల్ ప్యాడ్‌లు తయారు చేస్తున్నారు. ఇవి ఆరోగ్యానికి హాని చేయవు, అలాగే పర్యావరణానికి పనికొచ్చేవి. ఇవి కాటన్ బట్టతోటి, అరటిచెట్టు నుంచి తీసే పీచుతోటి తయారు చేస్తున్నారు. వీటిని ఉపయోగించుకుని, శుభ్రం చేసుకుని మరలా ఉపయోగించుకోవచ్చు. వీటి గురించి మీకు అవగాహన కావాలి."
చెప్పడం ఆపి, ఆ మీటింగ్‌కు వచ్చిన ఆడవాళ్ళు గుసగుసగా మాట్లాడుకోవడం గమనించింది.

"ఏంటి మీలో మీరు మాట్లాడుకుంటున్నారు?" అంది.
"నెలసరి సమయంలో మా ఇళ్ళల్లో ఇంకా మూడు రోజులు ఇంటి బయట వేరే గదిలో ఉంచడం ఇంకా జరుగుతోంది. మా పిల్లల్ని కూడా దగ్గరకు రానివ్వటం లేదు."

ఆమె చెప్పడం పూర్తి కాకుండానే, ఆ మీటింగ్‌కు వచ్చిన ఇంకో పెద్దావిడ కేకలు వేయడం మొదలెట్టింది.
"ఆగండి... ఆగండి... నేను చెప్పేది వినండి. ప్రకృతి సిద్ధమైన ఈ క్రియను అంటు, ముట్టు అనడం చాలా దారుణం. ఇప్పటికీ పట్టణాల్లో కూడా చాలామంది చదువుకున్న ఆడవాళ్ళు నెలసరి సమయంలో ఆవకాయ జాడీ కూడా ముట్టుకోరు. ఇంట్లో మగవాళ్ళు వేరే వండుకోవడం కూడా నాకు తెలుసు."

కామేశ్వరి ఆ మాటలు చెప్పగానే, ఒక కుర్రోడు లేచి నిలబడి "మీరు చెప్పేది కరెక్ట్ కాదు.

నెలసరి సమయంలో ఆడవాళ్ళను దూరంగానే ఉంచాలి. ఆ సమయంలో వారిది అపరిశుభ్రమైన రక్తం కదా!'' అన్నాడు.

ఆ మాటలకు విస్మయానికి లోనయ్యింది కామేశ్వరి. కొడుకు తన కూతురితో చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. వెంటనే కోపం వచ్చింది. అయినా దాన్ని కంట్రోల్ చేసుకుని చెప్పడం మొదలెట్టింది. ''ప్రకృతి సహజమైన ఈ నెలసరిని అంటు, ముట్టు, మైలు అనకూడదు. మిగతా రోజుల్లో ఎలా ఉంటారో ఋతుస్రావ సమయంలోనూ తమ పనులు అలాగే చేసుకోవాలి.'' చెప్పడం ఆపి, ఆ మీటింగ్‌కు వచ్చిన తన కూతురు, కొడుకు వంక చూసి చెప్పడం మొదలెట్టింది.

''నా కొడుకు ఉదయం నెలసరి సమయంలో వచ్చే రక్తాన్ని ఇన్‌ప్యూర్ బ్లడ్ అన్నాడు. ఇక్కడ నేనొక విషయం స్పష్టం చేయదల్చుకున్నాను. అది మీకందరికీ తెలిసిన విషయమే. బేబీ కడుపులో ఉన్నప్పుడు తొమ్మిది నెలలు మదర్‌కు పిరియడ్స్ రావు. మీరనుకుంటున్న ఆ ఇన్‌ప్యూర్ బ్లడ్... అంటే అపరిశుభ్ర రక్తం ఆ తొమ్మిది నెలలూ ఎక్కడకు పోతుంది?'' ఆ మాటలకు ఆ సభంతా మౌనం వహించింది. కొడుకు తలొంచుకున్నాడు. మళ్ళీ చెప్పడం కొనసాగించింది.

''బిడ్డను తల్లి గర్భంలో మోసే ఆ తొమ్మిది నెలలూ ఆ అపరిశుభ్ర రక్తం ఎక్కడికీ పోదు. కొంతమంది అనుకుంటున్న ఆ ఇన్‌ప్యూర్ బ్లడ్ నుంచే రక్త మాంసాల శిశువుగా ప్రతి మనిషి ఈ భూమి మీదకొస్తాడు. నిజంగా అది అపరిశుభ్ర రక్తమైతే, ప్రపంచంలోని అందరం అపరిశుద్ధులమే. మీరు, నేను, ఈ మీటింగ్‌కు వచ్చిన వారంతా.''
ఆ మాటలు ఆమె చెప్పగానే అందరూ లేచి తప్పట్లు కొట్టారు.

ఆమె ఒక్క చెప్పడం ఆపి, అందరివంక చూసి, ''మహిళలు తమ దేహం మీద స్వేచ్ఛను కోల్పోకూడదు. తాత్కాలికమైన నెలసరి ఇబ్బందులకు భయపడి రాబోయే తరాల పుట్టుకను వద్దనుకోవడం చాలా విషాదం. నెలసరి విషయాల్ని స్త్రీలందరూ పంచుకోవాలి. ఆ విషయంలో కుటుంబంలోని మగవారూ సహకరించాలి. విశ్వంలోని ప్రతి మనిషికి గర్భసంచి ఆలయం లాంటిది. ఎందుకంటే గర్భసంచి మన 'అందరి ఇల్లు'. అలాంటి మన అందరి ఇల్లుని కాపాడుకోవాలి.'' ఆ మాటలు చెప్పగానే మరోసారి ఆ ఆవరణ చప్పట్లతో మారుమ్రోగింది.

★★★★

## ఇది మన దేశం లోనే సాధ్యమౌతుంది

పిల్లల చదువుకు పెట్టిన ఖర్చుకంటే,
వాళ్ళ పెళ్లిళ్లకు పెట్టిన ఖర్చే ఎక్కువ

భగవద్గీత గొప్పదా ,బైబుల్ గొప్పదా అని కొట్టుకు చాచ్చేవాళ్ళలో ఒక్కడు కుడా అవి చదవడు

ఫోన్లు పగలకుండా స్క్రీన్ గార్డు వాడతారు
తలలు పగలకుండా హెల్మెట్ వాడరు

కాళ్ళకు వేసుకునే చెప్పులు ఎసి షోరూం లో అమ్ముతారు ,అన్నం లో తినే కూరగాయలు మురుగు కాలువ పక్కన అమ్ముతారు

ఆడ పిల్లలను పరిచయం లేని వ్యక్తులతో మాట్లాడ కూడదంటారు ,కాని వాళ్లకు పరిచయం లేని వ్యక్తులతో పెళ్లి చేస్తారు

తాము ఆరాధించే దేవుళ్ళకు , హీరోలకు ఐద్దరు ముగ్గురు భార్యలున్నా ఒప్పుకుంటారు కాని , తమ భర్త మాత్రం ఎకపత్ని వ్రతుడై ఉండాలనుకుంటారు

మీరు కుడా మీ అనుభవంలోకి వచ్చిన ఇటువంటి వాస్తవాలను రాసి పంపండి ,ఉత్తమమైన వాటిని ప్రచురిస్తాము
e-mail :sumathi.potilu@gmail.com

ఈ నెల
కథ

## మారని లోకం .

మొదటి బహుమతి పొందిన కథ

కృష్ణమాచార్యులు

ముకుందానికి నిద్ర పట్టడం లేదు. సమాజం మారింది. శారీరక బలం రాజ్యమేలిన ఆటవిక సమాజం నుండి మేధస్సు ప్రధానమైన జ్ఞాన సమాజం వేపు మనం అడుగులు వేస్తున్నామని రచయితలు, వక్తలు ఓహో ఊదర గొడుతున్నారు. కానీ గుండమ్మ సినిమాలో పాట ధృవీకరించినట్లు, " మనసు మారలేదు. ఆతని కాంక్ష తీరలేదు". సత్యానికి, ధర్మానికి ఎప్పుడూ అగచాట్లే. పాండవులు వనవాసమే గాదు, అజ్ఞాత వాసం కూడా చేయవలసివచ్చింది. ఆ నాడైనా, ఈ నాడైనా నిజమైన ప్రతిభకు గుర్తింపు, కేవలం మాటలకే పరిమితమవుతోంది. అదే ముకుందం మనసుని తొలిచివేస్తూ, నిద్రపట్టకుండా చేస్తున్న శిలాక్షరం లాంటి చేదు వాస్తవం. ముకుందం ఒక విశ్వవిద్యాలయంలో ప్రొఫెసరు. గత యిరవయ్యేళ్ళుగా, అతను అవిశ్రాంతంగా పని చేస్తున్నాడు. మంచి వ్యక్తిగా, ఉత్తమ వుపాధ్యాయుడిగా, ప్రశంసలందుకున్నాడు. పరిశోధకుడిగా ఎందరో స్కాలర్లకు వెలుగు చూపాడు. అంతర్జాతీయ పత్రికలలో పరిశోధక వ్యాసాలు ప్రచురించాడు.

ఎన్నో సెమినార్లు, వర్కుషాపులు నిర్వహించాడు. అతనికి రాష్ట్ర ప్రభుత్వమిచ్చే బెస్ట్ టీచర్ బహుమతి, వస్తుందని అందరూ ఆశించారు. కానీ అందరిని ఆశ్చర్య పరుస్తూ, ఆ యేడాది బెస్ట్ టీచర్ అవార్డ్, అతని డిపార్టుమెంటులోనే, రాజకీయాలలో చురుకుగా వుండే, ఒక జూనియరుకు వచ్చింది.. ధర్మాన్ని, ముకుందాన్ని అభిమానించేవారు, " ఎవరికి రాజకీయ నాయకుల ఆశీస్సులుంటాయో వారికే బిరుదులు, అందలాలు. నాయకుల చుట్టూ ప్రదక్షిణాలు చేసి దక్షిణలు సమర్పించిన వాడికి ఉత్తమ వుపాధ్యాయుడిగా గుర్తింపు" అని విసుక్కున్నారు.

ముకుందానికి అధికారుల పంచన భజన పరుడిలా వుండడం గిట్టదు. అలాగని అసమర్థులు అందలాలెక్కుతుంటే చూసీ తట్టుకోగల మానసిక స్థైర్యమూ లేదు. అందుకే ఈ రోజు అతడు తీవ్ర అశాంతికి గురయ్యాడు.

@@@

నిద్ర పట్టక అవస్థ పడుతున్న భర్తను చూచి, అతని భార్య పూర్ణ ప్రేమగా" ఏమిటి విషయం" అని . ఆరా తీసింది. ముకుందం మనసులో బాధను వెళ్ళ గ్రక్కాడు. అంతా విని, ఆమె," మీరు సున్నితంగా వుండడం మానుకోవాలి. మా మేనేజరుకి మహిళలంటే గిట్టదు. నాకు ప్రమోషన్ ఇవ్వకుండా, అసమర్థులైన మగాళ్ళకి పై పదవులిచ్చాడు. ఎప్పుడైనా బాధ పడ్డానా? ఎంత చదివినా, ఎంత ఎదిగినా, మానవుడి మనస్తత్వం చీకట్లోనే వుండిపోతోంది. ఋషులు మూడు వాక్యాలు మనకు ప్రబోధించారు. అసతోమా సద్గమయ, తమసోమా జ్యోతిర్గమయ, మృత్యోర్మా అమృతంగమయ. సత్యానికి, వెలుగుకు దూరమై చచ్చే వాళ్ళని చావనివ్వండి. జరిగేదంతా మన మంచికే అనుకోవాలి" అని నిట్టూర్చింది.

" అదీ నిజమే. నీ సహనం చూస్తుంటే నాకు అసూయ పుడుతోంది. మా అమ్మ వచ్చింది కదా. ఈ సారైన కాస్త ప్రశాంతంగా వుంటోందా?"

"చీకటిలో వున్న వాళ్ళలో ఆవిడొకరు. మనవడంటే గొప్ప. మగ సింహం అంటుంది. వాడికి గడ్డ పెరుగు వడ్డిస్తుంది. మనవరాలికి నీళ్ళ మజ్జిగ పోస్తుంది. రేపు అత్తవారింట్లో ఏం పెట్టినా నోరెత్తకూడదు. వంట వార్పుతో పాటు సేవలు చేయడం నేర్చుకో అని దాన్ని వేపుకు తింటోంది. ఆవిడను యేమన్నాఅంటే మీరు బాధ పడతారని, మన అమ్మాయి నోరు నొక్కుకుని వుంటోంది. మీ కూతుర్నికాస్త గారాం చెయ్యండి. లేకుంటే అది కూడా చీకట్లోకి వెళ్ళిపోతుంది."

భార్య మాటలు ముకుందానికి ఆశ్చర్యం కలిగించాయి. ఎంత పరిణతి సాధించింది అని అనుకున్నాడు.

" అలాగే. నువ్వు నిశ్చింతగా నిద్రపో. రేపు సాయంత్రం శాంతితో మాట్లాడుతాను"" అని భార్య భుజం మీద ప్రేమగా తట్టాడు.

@@@

ఉదయమే భార్య చదువుతున్నఅన్నపూర్ణ స్తోత్రంలోని " జ్ఞాన వైరాగ్య సిద్ధర్థ్యం, భిక్షాం దేహి చ పార్వతీ." అన్న చరణం విన్న ముకుందంలో వైరాగ్య చింతన మొదలైంది.

"నా చపలత్వం కాకపోతే అవార్డ్ రాలేదని ఎందుకు బాధపడ్డాను. జ్ఞాన వైరాగ్యాలు, నిష్కామ కర్మ, స్థిత ప్రజ్ఞత, యిలా ఎన్నో జీవన సూత్రాలు, మహర్షులు మనకి ప్రసాదించారు. అదంతా ఎందుకు? పోతన, లౌకిక భోగాలకన్న, భారతీ మాత కృప మిన్న అని చాటి చెప్పలేదా?" అలా చెలరేగిన ఆలోచనలు . ముకుందానికి వుత్తేజాన్నిచ్చాయి. అతను వుత్సాహంగా యూనివర్సిటీకి వెళ్ళాడు.

ఎకనామిక్స్ డిపార్టుమెంట్ దగ్గర స్టూడెంట్స్ గుంపులుగా చేరి," మాకు న్యాయం కావాలి. ప్రొఫెసర్ల పక్షపాత వైఖరి మారాలి"అని నినాదాలు చేస్తున్నారు. అది గమనించిన ముకుందం, విషయమేమిటని ఒక విద్యార్థిని వాకబు చేసాడు.

"ఈ డిపార్టుమెంటులో కుల పిచ్చి యెక్కువ. ఒక కులానికే బంగారు పతకాలు, రిసెర్చ్ సీట్లు,

వుద్యోగాలు. అందుకే ఈ సమ్మె" అని చెప్పాడు.
"కలికాలం" అనుకుంటూ ముకుందం తన డిపార్టుమెంటుకు వెళ్ళిపోయాడు.

పన్నెండు గంటలకు క్లాసులు ముగిసిన తర్వాత, తన సహోద్యోగి భుజంగంతో కలిసి కాంటీనుకు వెళ్ళాడు. కాఫీ త్రాగుతూ భుజంగం," ముకుందం! ఎకనామిక్స్ కథ నీకు పూర్తిగా తెలియదు కదా. అదొక దేశ ద్రోహం కేసు" అన్నాడు.

ముకుందం గత యిరవైయేండ్లుగా ఆ యూనివర్సిటీలోనే పనిచేస్తున్నా, అతనికి ఎన్నో విషయాలు తెలియవు. అందుకే భుజంగం అలా అడిగాడు. అతను అనుకున్నట్లే ముకుందం, "కొంత తెలుసు. నువ్వు చెప్పు" అన్నాడు.

"ఎకనామిక్స్ డిపార్టుమెంట్ ప్రారంభించి యాభై సంవత్సరాలైంది. మొదటి శాఖాధిపతి గా వున్న రాంగోపాల్ పుణ్యమా అని అది ఒక అగ్ర కులానికి అంకితమై పోయింది. ఆయనకి రెండేళ్ల క్రితం, ఆయన శిష్యులు గొప్పగా సన్మానం చేసారు. ఆయనను ఇంటినుంచి యూనివర్సిటీకి నాలుగు గుర్రాల రథంలో తీసుకొచ్చారు. యూనివర్సిటీ గేటు దగ్గర ఆ గుర్రాలను తొలగించి, ఆడిటోరియం వరకు, ఆయన శిష్యులు రథాన్ని లాగారు.ఈ ఘన సన్మానం ఎందుకో తెలుసా? ఆయన కులానికి చేసిన సేవకి గుర్తింపుగా".

"వినడానికి చాలా ఎబ్బెట్టుగా వుంది" అన్నాడు ముకుందం

"సుబ్బారావు ఆ కుల సేవ చేసిన విధానం తెలిస్తే, ఆశ్చర్య పోతావు. తన కులంలో చురుకైన వాళ్ళకి, పిలిచి అడ్మిషన్ యిచ్చేవాడు. వాళ్ళకి ఫస్ట్ క్లాస్ డిగ్రీ, రిసెర్చ్ సీటు , ఆ తర్వాత లెక్చరర్ వుద్యోగం యిచ్చేవాడు. ఇలా కొన్ని సంవత్సరాలు గడిచాక, కులం కోసం అతడు చేస్తున్న కుట్ర కొందరికి అర్థమైంది. వారు ఉద్యమించారు.

"గోల్డ్ మెడల్స్, రిసెర్చ్ సీట్లు, వుద్యోగాలు ఆ కులానికే యెలా పోతున్నాయి?" అని ప్రశ్నించే కరపత్రాలను పంచారు. నిరాహార దీక్షలు చేసారు. అది కూడా అతనికే మేలు చేసింది. మంత్రులు, ఆఫీసర్లుగా వున్న ఆ కులపోళ్ళు అంతా ఒక్కటై అతన్ని కాపాడారు. అతనికి మంచి గుర్తింపు వచ్చింది. ఇంతలో శాఖాధిపతుల రొటేషన్ పద్ధతి వచ్చింది. అయితేనేం, ఆయన తర్వాత శాఖాధిపతులైన వారంతా, అతని కులం వారే కావడంతో అతని ఆధిపత్యం అలాగే కొనసాగింది."

భుజంగం సిగరెట్ వెలిగించుకునేందుకు చెప్పడం ఆపాడు. ఆసక్తితో వింటున్న ముకుందం
"అంత కులపిచ్చా?" అన్నాడు
"ఇంతవరకు జరిగినది నేరమైతే, యిప్పుడు నేను చెప్పేది ఘోరమే. మెల్లగా అతనిపై వ్యతిరేకత పెరిగి, వైస్ చాన్సెలర్ అతన్ని దూరం పెట్టే వరకు వెళ్ళింది.

అప్పుడతను వెండివెన్నెల పార్టీ అనేవ్యూహం అమలుచేసాడు. కార్తీక పూర్ణమి నాడు, ప్రముఖులకి విందు భోజనాలు తన ఇంటి తోటలో ఏర్పాటు చేసాడు. ఆ విందుకు వైస్ చాన్సలరుని ప్రత్యేకంగా ఆహ్వానించాడు. మీరూహించని రీతిలో మీకు సత్కారం చేస్తానని చెప్పాడు.

ఆ నాటి రాత్రి, మేడ మీద గదిలో, డిస్కో కాంతుల్లో, వెండి రేకులతొ అరకొర ఆచ్ఛాదనతో మెరిసిపోతున్న అప్సరసను చూపి, "అదిగో. వెండి మీదే, వెన్నెల మీదే" అని ఆయనను వదిలి వెళ్ళిపోయాడు. ఆ రాత్రి ఆయన నిద్రపోలేదు. ఆ తర్వాత సుబ్బారావుకు వ్యతిరేకంగా యెవరేం చెప్పినా వినలేదు. ముకుందానికి బుర్ర తిరిగిపోయింది. రాజకీయాలలో ఇలాంటివి జరగవచ్చు. పవిత్రమైన ఒక విశ్వ విద్యాలయములో ఇంతటి నీచమా? విలువల మహావృక్షం...వేళ్ళకు చెదపట్టింది. ఆకులు రాలి, కొమ్మలు విరిగి, కాండం డొల్లయై, యేదో ఒక నాడు మట్టిలో కలిసిపోతుంది.

@@@

ముకుందం యిల్లు చేరేటప్పటికి అతని తల్లి మనవరాలితో కాలికి నూనె మర్దన చేయించు కుంటూ, కుమారి శతకంలోని నీతులు బోధిస్తోంది. శాంతి మారు మట్లాడకుండా ఆమె చెప్పినది వింటోంది. అది చూసి అతని మనసు చివుక్కుమంది.

" శాంతీ! కాస్త కాఫీ తెచ్చిపెట్టమ్మా!" అని అంటూ తన గదిలోకి వెళ్ళాడు. పది నిమిషాల తర్వాత శాంతి కాఫీ కప్పుతో వచ్చింది. కాఫీ తీసుకుంటూ," ఆడుకోవడానికి పోలేదా అమ్మా?" అని అడిగాడు.

" లేదు నాన్నా! నాయనమ్మ కోప్పడుతుంది. పెద్దమనిషి కాకముందే ఆటలు. ఇంక ఇంటి పనులు నేర్చుకో అని పోరు పెడుతుంటే, వెళ్ళడం మానేసా."
" తమ్ముడేడి?"

"క్రికెట్ ఆడడానికి గ్రౌండ్ కి వెళ్ళాడు. ఏమైనా పనుందా నాన్నా?" ఆప్యాయంగా శాంతి అడుగుతుంటే అతడి మనసు ఆర్ద్రమైంది.

"పనేమీ లేదు. నువ్వు తయారై రా. మనిద్దరం క్లబ్ కి వెడదాం. అక్కడ నువ్వు టేబుల్ టెన్నిస్ ఆడుకుందువుగాని"
శాంతి ముఖం ఆనందంతో వెలిగిపోయింది. "ఇప్పుడే వస్తాను." అంటూ ఆమె వెళ్ళబోతుంటే," నాయమ్మకు చెప్పకు. రహస్యం!" అని నోటి మీద వేలేసుకుని చెప్పాడు. శాంతి కిలకిల నవ్వుతూ పరుగు తీసింది.

@@@

కాసేపు చెస్ ఆడి, విశ్రాంతిగా కూర్చున్న ముకుందం దగ్గరకు అతని స్నేహితుడు మూర్తి వచ్చాడు. "శాంతి చాలా బాగా అడుతోంది. నువ్వు శ్రద్ధ తీసుకుంటే పోటీలలో గెలిచే సత్తా వుంది. ఉద్యోగం మీద శ్రద్ధ తగ్గించి, నీ కూతుర్ని చూసుకో " అని సలహా యిచ్చాడు.

" అలాగేరా! నీ సలహా తప్పకుండా పాటిస్తాను" అని అంటూ ముకుందం మూర్తి చేయి పట్టుకుని మృదువుగా నొక్కాడు. ముకుందం సమాధానానికి మూర్తి మురిసిపోయాడు. ఉత్సాహంగా యిలా చెప్పాడు.

" మా ఆఫీసులో చాకిరీ నాది. క్రెడిట్, టీం లీడరుది. ఈ పద్ధతి నచ్చక, నా దృష్టి ఇంటి మీదా పెట్టా. నా భార్యకి సహాయం చేయడం, పిల్లల్ని చదివించడం చేస్తున్నా. ఇప్పుడు నా ప్రేమకు ఒక ప్రయోజనం, ఒక ఫలితం కనబడుతోంది. మనసుకెంతో ఆనందంగా వుంటోంది" .

"పని, సంసారం మధ్య సమతుల్యత వుంటే జీవితం స్వర్గమవుతుంది. ఆ దిశగా నువ్వు చేస్తున్న ప్రయోగం అభినందనీయం " అని మూర్తిని మనసారా అభినందించాడు ముకుందం.

@@@

రాత్రి పది గంటలవేళ, పనులు ముగించుకుని పడకగది చేరింది పూర్ణ. ముకుందం ఆమెను చూసి ఆనందంతో " నా పూర్ణ ఈ రోజు పూర్ణ చంద్రునిలా మెరిసిపోతొంది. నేనేం పుణ్యం చేసుకున్నానో" అన్నాడు.

" మీకు తెలియదా? శాంతి సంతోషంతో నన్ను కౌగలించుకుని, "ఐ లవ్ మై డాడ్ అండ్ మై మామ్" అంది. ఆ కౌగిలి నేను మీకివ్వాలి కదా!" అంటూ ఆమె చిలిపి నవ్వుతో, దగ్గరికి వస్తూంటే, ముకుందం గుండె జల్లుమంది. ఆమె ముగ్ధ మోహన రూపాన్ని చూస్తూ, ఆమె అనురాగానికి పులకిస్తూ, అతనిలా అనుకున్నాడు.

"భారత్ వెలిగిపోతోంది అంటారు కొందరు. అచ్చే దిన్ వచ్చాయంటారు మరికొందరు. కాని యేమీ మారలేదు, మారదు కూడా. కాస్త రూపాంతరం చెందుతుంది. అంతే, అసమానతలు, కులమత వివక్షలు ప్రదర్శితం కాని, శ్రమ ఫలితం దోపిడీ లేని సమాజాలు, వ్యవస్థలు వుండవు. వాటిని సహిస్తూ, బ్రతికే శక్తి కావాలంటే, మధురమైన సంసారం వుండాలి. ఇది మారని సత్యం. నా అదృష్టం నా పూర్ణ. నా జీవన చుక్కాని. ధర్మపథ సంచారిణి, తిమిర సంహారిణి, అమృత వర్షిణి."

ఏమిటో ఆలోచనలంటూ, చెంతచేరిన యిల్లాలిని, ముకుందం తన ప్రేమ వ్యక్తమయ్యేలా గాఢంగా కౌగలించుకున్నాడు.

సమాప్తం

# న్యూటన్ కనుగొనని సూత్రాలు

సూత్రం –1:మనం నిలబడ్డ క్యూ చాల పెద్దదిగా ఉందని వేరే క్యూ లోకి వెళితే ,మనం వదిలి వచ్చింది వేగంగా ముందుకు

సూత్రం –2:చపాతీల పిండిపిసుకుతూ చేతులనిండా పిండి అంటుకున్నప్పుడే ముక్కు మీద దురద పెడుతుంది

సూత్రం –3: స్నానం చేస్తున్నపుడు వంటి నిండా సబ్బు రుద్దుకుని ఉన్నప్పుడే టెలిఫోన్ రింగవుతుంది

సూత్రం –4:పరీక్షలు దగ్గరకు వచ్చే దాక, మనం ఎక్కడ పెట్టిన పుస్తకం అక్కడే ఉంటుంది లేదా దుమ్ము కొట్టుకుని ఉంటుంది

సూత్రం –5 :మనం ఏదన్న వస్తువు ఎక్కువ ధరకు కొన్న వెంటనే అది వేరొకచోట తక్కువ ధరకు దొరుకుతుంది

సూత్రం –6:ఆఫీసుకు హాఫ్ డే సెలవ పెట్టి వెళదామని బయలుదేరగానే మన పైనున్న బాస్ పని ఉందని పిలుస్తాడు

మీరు కుడా మీ అనుభవంలోకి వచ్చిన ఇటువంటి సూత్రాలను రాసి పంపండి ,ఉత్తమమైన వాటిని ప్రచురిస్తాము
e–mail :sumathi.potilu@gmail.com

ఈ నెల కథ

## ఎవరు? నాన్నా..!ఆవిడ

రెండవ బహుమతి పొందిన కథ

పి .వసంత

"ఎవరూ...! అదీ" అన్నం తిని నీళ్ళు పుక్కిలించడానికి బయటకు వచ్చిన చారీ, బయట!
ఎవరో? గేట్ దగ్గర చీకట్లో తచ్చట్లాడుతుంటే చూసి కేక పెట్టాడు.

వచ్చిన వాళ్ల దగ్గర నుండి సమాధానం లేకపోతే, ఈసారి ఇంకాస్త గట్టిగా ""ఎవరంటే... పలకరేం"

ఒక స్త్రీ దాదాపు యాభై యేళ్లు పై మాటే పైన ముసుగు, మూతికి మాస్క్ ఉన్నాయి. కాటన్, జరీ చీరలో ఉన్న ఆమెను "ఎవరమ్మా? మీరు..! ఎవరు? కావాలి లోపలికి రండి " అన్న చారితో కళ్ల నీళ్ళు తుడుచుకుంటూ లోపలికి వచ్చి "నేను,..! శారద " అనేలోపు...

"శారద...అది నా భార్య పేరు చనిపోయిందిగా?
ఇంకో శారద అయితే ఈ వీధిలోనే ఆ మూడో ఇంట్లో ఉంటారు... వెళ్లండి."

మాస్క్ తీసి "ఏమండీ నేను శారదను గుర్తు పట్ట లేదా?" అంది. అపుడు శారదను గుర్తు పట్టిన చారి, 'అవును..! శారదే! ఏంటి? ఇలా...అయింది చిక్కి శల్యం లాగా ఉంది.

బొద్దుగా, తెల్లటి రంగులో ఉండే శారదేనా! నా ఎదురుగా ఇపుడు ఉంది..!'

శత్రువైయినా, ఇంట్లోకి పిలిచి మంచినీళ్లు ఇవ్వటం ఆచారం. "ఇంట్లోకి రా.!" అని వరండాలో కూర్చోమని కుర్చీ చూపించి, లైట్ వేసి లోపలికి వెళ్ళాడు.

'అమ్మయ్య! నామీద కోపం లేదు' అనుకుంటూ... కుర్చీలో కూర్చుంది. అప్పటి లాగానే ఉంది ఇల్లు ఏమి? మారలేదు. అదే పెద్ద సింహద్వారం, పైన దేముడి ఫోటోలు ఇంకొంచం లోపల కి చూసిన శారదకు హాల్ గుమ్మం పై అత్త,మామ ఫోటోలకి దండలు.
ఆ ఇద్దరూ! పోయారన్నమాట!? అపుడు నన్ను ఎంత? వేపుకు తిన్నారు. ఆ పక్కన ఉన్నది ఎవరు? అని కళ్ళ జోడు సరి చేసుకుని చూసింది శారద. నేనే! నా ఫోటో కి దండ. అలాగే! ఆశ్చర్యపోతూ ఆఫోటోను చూస్తుంటే చారి వచ్చి మంచి నీళ్ళు ఇచ్చాడు.

కళ్ల నీళ్ళు తుడుచుకుంటూ "ఎలా ఉన్నారు?"అని అడిగింది శారద చారిని."ఇదిగో ఇలా ఉన్నా...!అన్నాడు చారి.

" పిల్లలు ఎలా ఉన్నారు? అంది శారద. అమ్మాయికి పెళ్లి అయింది. అత్తవారింట్లో ఉంది. అబ్బాయికి కూడా పెళ్లి అయింది. కోడలు కడుపుతో ఉంది, పురిటికి పుట్టింటికి! వెళ్ళింది. అబ్బాయి పట్నం వెళ్ళాడు లాస్ట్ బస్ కి వస్తాడు..."

"నా ఫోటోకి దండ వేశారు. కర్మకాండలు బాగా చేశారా లేదా, నాకు? ఒక మనిషి బతికుండగానే.. తన ఫోటోకి దండ వేసి ఉండటాన్ని, చూసుకోవటం బహుశా! నా ఒక్కదానికేనేమో? ఇంత అదృష్టం. ఈ జన్మకి ఇది చాలు. ఇక ఇపుడు ప్రాణం పోయినా... పర్లేదు."

"ఎవరు? చేసిన కర్మ వాళ్లు అనుభవించాల్సిందే. పిల్లకు ఐదో యేట,పిల్లాడికి మూడో ఏటన వెళ్లిపోయిన దానివి! ఇపుడే కదా! రావటం. నా మంచితనాన్ని అలుసుగా తీసుకున్నావు. పిల్లలు, అమ్మ, ఎక్కడా...? అంటే చెప్పలేక! ఎన్ని రోజులు? మనసులో కుమిలిపోయానో నీకేమి తెలుసు.!?

మేము ఆడంబరాలకు పోయేవాళ్ళం కాదు. ఉన్న దాంట్లో తృప్తిగా తిని బ్రతికే వాళ్ళం. నీకు మా అంతస్తు, మేము, నచ్చకా! నీకు ఉద్యోగం వెతుక్కున్నావు. వెళ్తున్నా! నా అవసరం ఉంటే... మీరే...! వస్తారని తలుస్తానని ఉత్తరం రాసి పెట్టి వెళ్ళావుగా..!?

కనీసం! పిల్లలు, కూడా గుర్తుకు రాలేదా, ఇన్నాళ్లు! నీకు. లోకం చారి పెళ్ళాం లేచిపోయిందని కోడై కూసింది. ఆ అవమానాన్ని తట్టుకోలేక...! పట్నంలో ఉద్యోగానికి వెళ్ళింది. మేము పిల్లలు పట్నం వెళ్దామనుకునే లోపు ఆక్సిడెంట్, అయి... పోయిందనీ..! కట్టుకథలు చెప్పి నమ్మించాలని, చూసినా... వాళ్ళు...! నా వైపు చూసే చూపులో నిజం చెప్పన్నట్లు ఏదో భావం కనపడేది. అపుడు తలకాయ ఎక్కడ,పెట్టుకోవాలో తెలియక, నాలో... నేనే..! కుమిలి పోయాను. అపుడు, అమ్మానాన్న, లేకపోతే వీళ్ళను పెంచగలిగె వాడినా.?"

"మిమ్ములను..! పిల్లలను, నాకు ఉద్యోగం వచ్చిన చోటికి తీసుకెళ్దామనుకుంటే..! మీరు రామన్నారుగా!?" అంది శారద.

"అవును! పెద్ద వాళ్ళైన, అమ్మ నాన్నని వదిలి నేను ఎలా రాగలను.? నీ దగ్గరికి.

"మీకు, మీ అమ్మనాన్న తర్వాతే నేనని..! తెలుసుకుని ఉద్యోగం చూసుకుని వెళ్ళిపోయాను.పిల్లలను పెంచలేక మీరు వెంటనే, నా దగ్గరకు వస్తారనుకున్నా? రాలేదు. నేను మీరు....! రాలేదన్న కోపంతో అలాగే! దూరంగా ఉండిపోయాను."

"ఎలా? వస్తాను నీతో నేను. ఇక్కడ గుడి అర్చకత్వం, ఒకటీ..! నాన్న అమ్మ, పెద్దవాళ్ళయ్యారు. నీకు సిటీలో ఉండటం కావాలి. నీ ఫ్రెండ్స్ తో నిన్ను పోల్చుకుని ఈ పల్లెటూరులో ఉండలేక పట్నంలో హాయిగా.. ఉండవచ్చని వెళ్ళావు. నేను భాధ్యతలు తప్పించుకుని రాలేను,నీలాగా..! అమ్మానాన్న ఉండబట్టి! పిల్లలను, పెంచగలిగాను.
నన్ను మళ్ళీ! పెళ్లి చేసుకోమని

అమ్మ వత్తిడి చేసింది నేను ఈ జన్మకు ఒక్క పెళ్లి చాలన్నాను. ఇపుడైనా గేట్ బయట నిన్ను సరిగా,చూస్తే... ఆటునుండి అటే పంపేవాడ్ని,ఇంట్లోకి రానివ్వకుండా. వచ్చిన తర్వాత గుర్తు పట్టా. అయినా...ఇదివరకున్న ఆవేశం ఇపుడు ఉండదు కదా...! అందుకే నిన్ను ఇంత సేపు క్షమించా..!

నువ్వు చేసిన తప్పు వల్ల ఎంతమందిమి! బాధపడ్డామో! నీకు తెలియాలి కదా...! నీవు ఎంత? తప్పు చేశావో...! ఇప్పటికైనా తెల్సుకుంటే, కొంతైనా నీ పాపం పోతుంది? నేను తప్పు చేయలేదనుకుంటే... మటుకు, ఈ పాపం జన్మ...జన్మలకు నిన్ను వెంటాడుతుంది.

"నేను కాదు, మీరు చేశారు తప్పు? పట్నం వచ్చి నన్ను తిట్టి లేదా తన్ని వెనక్కి తీసుకురావాలి. తర్వాత నేను పిల్లల కోసం వద్దామనుకునే లోపు ఈ ఊరి వాళ్ళు..! కనపడి నువ్వు చనిపోయావని మీ ఆయన నీకు కర్మకాండలు, చేశారని చెబితే ఇంక నా మొహం ఎవరికి చూపించలేక ఎవరికి అందనంత, దూరం ట్రాన్స్ఫర్ చేయించుకుని వెళ్లాను. నా జీవితం ఎలాగూ పాడైపోయింది. మీరన్నా..! సుఖంగా ఉండాలని.

సర్లే,అయిందేదో! అయింది కళ్ల నీళ్ళు తుడుచుకుంటూ... పిల్లల గురించి చెప్పండి. వాణీ ఎలా ఉంది?"కూతురు గురించి అడిగింది.

"బావుంది! మా అక్క కొడుకు చేసుకున్నాడు పెళ్ళి.
వాళ్లకి ఒక అమ్మాయి ,అబ్బాయి. అబ్బాయి రాము అర్చకత్వంతో పాటు జిరాక్స్ సెంటర్ పెట్టాడు. చదువు లేని పేదింటమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. కోడలు మంచి పిల్ల. రాము పట్నం వెళ్లాడు వచ్చే టైం అయ్యింది. వాడు వచ్చిన ఆ బస్ కి నువ్వు వెళ్ళిపో...!అదే లాస్ట్ బస్" అన్నాడు చారి.

"నాకు ఆరోగ్యం బావుండటం లేదు ఈ చివరి దశలో మీ దగ్గర, ఉందామనుకుంటున్నాను. నా తప్పు! ఒప్పుకుంటున్నాను! నన్ను క్షమించి, మీ పాదాల దగ్గర చోటు ఇవ్వండి.

"లేదు..! శారదా..! నువ్వు చాలా లేట్ చేశావు. నువ్వు ఎక్కాల్సిన బండి జీవితకాలం లేటు. పిల్లల దృష్టి లో నువ్వు చనిపోయావు. దాదాపు నిన్ను అందరం! మర్చిపోయాం. ఇపుడు నువ్వు ఇంట్లో ఉంటే.. నేను..! పిల్లలకు లోకువవుతాను. అపుడు మమ్ములని వదిలేసి వెళ్లిన ఈవిడను..! ఇంట్లోకి ఎందుకు రానిచ్చావంటే...పిల్లలకు, ఏమి జబాబివ్వగలను? దయచేసి! రాము, వచ్చేలోపు వెళ్ళిపో...!"అని శారదకు దణ్ణం, పెట్టాడు చారి.

గేట్ తీసిన చప్పుడుకు చారి, శారదలు అటు చూస్తే రాము వచ్చాడు ఇంటిలోకి. "రాము బస్ ఆపమని... కేకేసి చెప్పు డ్రైవర్ కి."

తిప్పుకుని పైనుండి వస్తాడు లే..! నాన్న...! అంటూ మాస్కు వేసుకొని ఉన్న శారదను చూసి "ఈవిడా..? అనీ" చారి వైపు చూసిన రాముతో "ముందు బస్ ఎక్కించి రా! ఆమెను..! బస్ పోతుందన్నాడు" చారి.

శారద కళ్ల నీళ్ళు తుడుచుకుంటూ.. రామునీ..! తదేకంగా, చూస్తూ రాము వెనక బస్ కోసం నడిచింది. శారదను బస్ ఎక్కించి వచ్చాడు రాము .

"ఎవరు? నాన్న..! ఆవిడ నన్ను అలా! చూస్తూనే ఉంది. నన్ను దగ్గరకి తీసుకుని బుగ్గలు నిమిరి "నువ్వు బాగుండాలి...! నాన్న...!" అని కళ్ల నీళ్ళు తుడుచుకుంటూ బస్ ఎక్కింది."

"చిన్నప్పుడు మిమ్మలను కొన్నాళ్ళు! పెంచిందిలే. అందుకే ఇపుడు చూసి పోదామని వచ్చింది.

"అదేంటి ! నాన్న! ఉండమనకపోయారా ఈ రాత్రి. పొద్దునే లేచి వెళ్ళేవారుగా..? పెద్దావిడ పాపం.

"కొంత మందిని దూరంగా ఉంచటమే, ఉత్తమం రా!"

'నాన్నకి ఈ మధ్య వేదాంతం ఎక్కువైంది. ప్రతి మాటలో ఒక జీవిత సత్యం ఉంటుంది. గుడిలో పురాణాలు చెప్పి... చెప్పి ఇలా మాట్లాడుతున్నారు' మనసులో గొణుక్కుని లోపలికి నడిచాడు, రాము.{సమాప్తం )

సీరియల్



# మమతల తరంగాలు



పాండ్రంకిసుబ్రమణి

. ఆరోజు సోమవారం.పావని తలంటుపోసుకుని లక్ష్మీదేవి మంగళకర –“నమస్తే అస్తు మహామాయే శ్రీ పీఠే సురపూజితే,శంఖ చక్ర గదా హస్తే మహాలక్ష్మి నమో అస్తుతే“శ్లోకం తో దైవప్రార్ధన ముగించి ఓ కంట పేపరు చూస్తూనే మరొక వేపు కాఫీ కప్పునుండి కాఫీ సేవిస్తూనే కూర్చున్న సూర్యవివేక్ వద్దకు వచ్చి నిల్చుంది.నిల్చుని అంది–మీతో కొంచెం మాట్లా డాలి“ అంటూ అతడి చేతిలోని దినపత్రికను చేతిలోకి తీసుకుంది. అతడు తలెత్తి ఆశ్చర్యంగా చూసి,”కూర్చోమరి“అంటూ కూర్చో మన్నట్టు దిండుతో కప్పబడ్డ స్టూలుని ముందుకు తోస్తూ కాఫీ తాగడం పూర్తిచేసాడు.కూర్చుంటూనే చెప్పనారంభించింది–“మీ పెద్దబ్బాయి గురించి చెప్పాలి.వాడి వాలకం ఈ మధ్య కొంచెం మారినట్లనిపిస్తుంది.కొంచెమేమిటి–బాగానే మారినట్లుంది.వాడి పైన మీ చూపు పడాల్సిన సమయం ఆసన్నమైంది”

# ఫ్యామిలీ సీరియల్

**జరిగిన కథ**
శారద ,పూర్ణ చందర్ దంపతులు. శారదకు నాలుగు కాన్పుల్లో కుడా ఆడపిల్లలే పుట్టటం తో అత్త బద్రమ్మ సూటిపోటి మాటలతో ఇబ్బంది పెడుతూ ఉంటుంది . శారద తల్లి చంద్రావతి మనుమరాళ్ళను చూడటానికి వస్తే ఆమెను కూడా నానా రకాల మాటలతో ఇబ్బంది పెడుతుంది . శారద సహనం కలది కాబట్టి ఏ గొడవలు లేకుండా కాపురం నెట్టుకొస్తోంది .చాల రోజుల తరువాత శారద అన్నయ్య ఫోన్ చెయ్యటం తో శారద ఆనందానికి అవధులేకుండా పోతాయి .పూర్ణ చందర్ ఫాక్టరీలో స్ట్రైక్ చేయించాడని ఉద్యోగంలో నుండి తీసివేస్తారు .శారద అన్న వివేక్ ,శారద ఇద్దరు కూతుళ్ళను తన దగ్గర చదివించటానికి తీసుకువేళతాడు .వివేక్ స్నేహితుడు గణేష్ అతని భార్య చనిపోవటం తో అతని కూతురు ప్రశాంతిని ఇంటికి తీసుకువస్తాడు
**ఇక చదవండి**

"అవన్నీ వయసు తెచ్చే నిశ్శబ్ద నిగూఢ ప్రకంపనలు.నిజానికి వాడిలో మార్పేమీ లేదంటేనే నేను తటపటాయిస్తాను.సరే——కానివ్వు——" ఆమె గొంతు సవరించుకుంది–"ఇక చెప్పాలంటే చిన్నోడిలో కంటికి గుచ్చుకునేంత మార్పులేదు.వాడు కూడా ఇంటర్ లోకి వెళ్ళాడుగా!త్వరలో వాడు కూడా డిగ్రీ కాలేజీలో చేరబోతున్నాడుగా––వేళకు శుభ్రంగా భోంచేస్తాడు.వేళకి పుస్తకాలు ముందేసుకుని కూర్చుంటాడు.ఇక ముగ్గుర మ్మాయిల గురించి చెప్పాలంటే ముగ్గురూ చదువులో మాణిపూసలు. రాఘవేంద్రరావు అలా లేదండీ!డిగ్రీ యెలాగో ఒకలా పూర్తి చేస్తాడనుకోండి.పీరియోడికల్ గ్రేడేషన్ లెవల్స్ అంత బాగా ఉండటం లేదండీ——రేపు ఉద్యోగ రంగంలో–ముఖ్యంగా ప్రైవేట్ రంగంలోకి ప్రవేశించేటప్పుడు దెబ్బతింటాడేమోననిపిస్తూంది. అది అంత సీరయస్ వ్యవహారం కాదనుకున్నా వాడి వాలకమే సరిగ్గాలేదండి.దీపాలు పెట్టేవేళ అందరూ పూజాగదిలో జపతపాలు చేస్తుంటే,వాడు మాత్రం అదేమీ తనకు సంబంధం లేనట్లు రోడ్లు కొలుస్తుంటాడండి కాలేజీ సెలవు దినం వస్తే చాలు అయిపు లేకుండా పోతున్నాడు. అప్పుడప్పుడు భోజనాల టైముకి కూడా అందటం లేదు.వాడికి మీరు మీ బైకుని సర్వీసింగు చేసి కొత్త రంగు పూయించి యిచ్చి ఉండకపోతే బాగున్నేమో!ఆ బైక్ వల్లనే వాడికి పనికిరాని ఫ్రెండ్స్ యెక్కువయిపోయినట్టున్నారు" భార్య చెప్పింది సావధానంగా విని సూర్యవివేక్ నిదానంగా స్పందించాడు– "పాడయిపోవాలనుకున్నవాడు ద్విచక్ర వెహికల్ లేకపోయినా చెడిపోతాడు.ఇక నీకు విచిత్రంగా కనిపించే మార్పుల గురించి చెప్పాలి.స్టేజీ దాటినప్పుడల్లా టాక్సీ మీటర్ మారిపోతున్నట్టు వయసులో కూడా దశ మారుతున్నప్పుడల్లా బయొలాజికల్ గడియార ప్రభావం వల్ల శారీరకంగా మానసికంగా మార్పులు వచ్చేతీరుతాయి.కాస్తంత వెనక్కి వెళ్ళి చూడు——ఇద్దరబ్బాయిల కంఠ స్వరాలూ యెలా మారిపోయాయో––ఇప్పుడు యెదుగుదలకు సంకేతంగా వాళ్ళ గొంతులు బొంగురుగా బిగువగా వినిపించడం లేదూ! వాళ్ళ ఆలోచనల్లో కూడా అటు వంటిమార్పే రావచ్చు.ఇంటి వాతావరణంలోనూ చదువుల్లోనూ పునాది రాళ్ళు కాస్తంత కుదురుగా బలంగా ఉంటే సైకత మేఘాల్లోకి రేణువుల్లా కొట్టుకుపోరు.ఇక ఆఖరు అంశం–అందరూ ఒకేలా ఉండరు. ఒకరికొకరి మధ్య అక్కడక్కడ పోలికలుంటే ఉండవచ్చు గాక——గుణాత్మకంగా ఒకేలా ఉండరు.ఈ ప్రమాణం అభిరుచికీ సగటు సామర్థ్య స్థాయిలకూ యెక్కువ వర్తిస్తుంది,ఇక అసలు విషయానికి వస్తున్నాను. రాఘవేంద్రరావు విషయంలో నువ్వలా బెంబేలు పడటానికి యేదో

కారణం ఉండి ఉంటుంది.అదేమిటో చెప్తావా!"

పావని వెంటనే బదులివ్వలేదు.కాసేపు యెడబాటు యిచ్చి సన్నగా నిట్టూర్చి కొనసాగించింది–"వాడిలో ఈ మధ్య దూకుడు బాగా కనిపిస్తూంది. విత్ రీజన్ ఆర్ విదౌట్ రీజన్—— మునుపెప్పుడూ లేని వేగిరపాటు ప్రస్ఫుటంగా కనిపిస్తూంది.మాట తీరులో నిదానం కొరవడుతూంది" అప్పుడు సూర్యవివేక్ ఆపమన్నట్టు చేయెత్తి చూపించాడు–"నీ కన్నకొడుకు గురించి నీకంటే ఇంకెవరికి తెలుసుంటుంది?కాని నువ్వు చెప్తున్నవన్నీ చాలావరకు ఊహల్లాగే అపోహల్లాగే అగుపిస్తున్నాయి.

ఇటీవల కాలంలో గ్రేడేషన్ స్థాయి తగ్గడం చురుకుతనం తగ్గి అలసత్వం కనిపించడం——ఇవన్నీ వయసుతో బాటు వచ్చే మార్పుల ప్రభావం.వాడు యిటీవల దారితప్పుతున్నాడనడానికి యే ఆధారమూ లేదు కదా!"

దానికామె లపీమని బదులిచ్చింది–ఉందంటూ––.సూర్యవివేక్ భార్య వేపు విస్మయాత్మంగా చూసాడు."నేనింతవరకూ యెందుకు చెప్పలేదంటే——మీరీ మధ్య అఫీషియల్ వ్యవహారాలలో తలమునకలై ఉన్నారు. అందుకని శివపూజలో యెలుగు ప్రవేశించి నట్టు మీకంతరాయం కలిగించకూడదని యెడంగా ఉన్నాను.ఇప్పుడు చెప్తున్నాను వినండి.నాకు మొన్న పోలీసు స్టేషన్ నుండి ఫోను వచ్చింది మనిద్దర్నీ రమ్మనమని. నేను మాత్రమే వెళ్ళాను.మీ గురించి తెలుసు కాబట్టి యస్సై గారు హెడ్డుగారూ నిదానంగానే మాట్లాడారు.ఎత్తీ యెత్తిన వెంటనే యస్సైగారు ఇలా అన్నారు–'మీ పెద్దబ్బాయి రాఘువేంద్రరావు ప్రాణాలతో చెలగాట మాడే ఆటలాడుతున్నాడు'అదేమిటో చెప్పమని నొక్కి అడిగితే వివరించాడా యన.

హైద్రాబాదులోనూ నగరం చుట్టూనూ ఫ్లై ఓవర్ వంతెనలున్నాయి. అక్కడక్కడ వంపులు తిరిగే హైవేలు కూడా ఉన్నాయి. సాయంత్రాలప్పుడు,ముఖ్యంగా సెలవు దినాలలో అవన్నీ నిర్జనంగా తయారవుతుంటాయి. అప్పుడు కుర్రాళ్ళు ముఖ్యంగా పరపతి గల కుటుంబాలకు చెందిన కుర్రాళ్లు బైక్ రేసుల్లో పాల్గొంటున్నారు.

రేసులంటే ఊరకే కాదు. పందేలకు–డబ్బుపెట్టి పందేల గెలుపు కోసం బైకులు వేగంగా నడుపుతున్నారు. ఉదాహరణకి,సనత్ నగర్ నుండి బాలానగరుకి వేగంగా వెళ్ళి మళ్ళీ తిరిగి రావడానికి పదిహేను నిమిషాలలో ముగించాలి.ఎవడైతే ఆ పదిహేను నిమిషాలు దాటక ముందు ఆ పోకనూ రాకనూ ముగిస్తారో వాళ్ళు గెలిచినట్టన్నమాట.ఈ ర్యాష్ పరుగులో పాల్గొన్న వాళ్ళలో కొందరు కాలు పోగొట్టుకు న్నారు. ఇంకొందరు చేతులు పోగొట్టుకున్నారు. ఇంకా కొందరు ప్రాణాలు కూడా కోల్పోయారు. మరి కొందరేమో ఇంకా ఆస్పిటల్ లోనే ఉన్నారు. ఇవన్నీ ప్రాణాంతక చెలగాటాలు. వీటిని అరికట్టడానికి పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేయనారంభించారు. మాకు సూర్యవివేక్ గారి గురించి తెలుసు కాబట్టి,ఇది మొదటి సారి కాబట్టి మేం ఓరల్ వార్నింగుతో కేసుని రిజష్టర్ చేయకుండా విడిచి పెట్టేస్తున్నాం–అని నన్ను సాగనంపారు."

అతడు తలూపుతూ యేదో అనబోయే లోపల అక్కడకి రాఘువేంద్రరావు రానే వచ్చాడు–వస్తూనే తండ్రిని ఉద్దేశించి అన్నాడు–"నాన్నా! నిన్న మిమ్మల్ని అడక్కుండానే మీ షర్టు జేబు నుండి నాలుగు వందలు తీసుకున్నాను. సారీ నాన్నా!" వివేక్ నవ్వి అన్నాడు–"దానికేముందోయ్!మీ బాబు జేబునుండే కదా తీసుకున్నావు.ఇంతకీ యెందుకుతీసుకున్నావు?అంత అర్జంటు పనా!"

"ఔను నాన్నా!పార్టీ యిచ్చే వంతు నాది.నేను గాని మిస్ చేస్తే ఫ్రెండ్సు చిన్నబుచ్చుకుంటారని——"
"ఇంతకీ యెటువంటి పార్టీ చేసుకున్నారో మీ నాన్నకు చెప్పాలి కదరా!"

"టీ సమోజాల పార్టీ——"
రాఘవ్ జవాబు విన్నతోడనే వివేక్ స్పందించాడు–"ఇటీజ్ ఓకే!ఇంకొకసారి అటువంటి

అర్జంట్ వ్యవహా రం యెదురయినప్పుడు నువ్వు తిన్నగా మీ అమ్మవద్దకు వెళ్ళి డబ్బులు తీసుకో——నన్నడిగితే కారణం కూడా చెప్పనవసరం లేదు. పెద్దవాడివయావుగా!ఇకపోతే, మొన్న నీకెదురైన పోలీసు కేసు గురించి ప్రస్తావిస్తాను.పోలీసు కేసు గురించి సాధారణంగా తీసుకోకు.అంటుకుంటే వదలని జలగ వంటిదది.గవర్నమెంటు ఉద్యోగాలకు గవర్నమెంటు సంబంధిత సంస్థల్లోని ఉద్యోగాలకూ పోలీసు ఇంక్వయిరీ తప్పని సరి. ఇది గుర్తుంచుకో--ఇప్పుడు నువ్వు మీ అమ్మకు చెప్పిన పాయింటుకి వస్తున్నాను.నువ్వు బైక్ రేసింగులో పాల్గొనలేదన్నావట. తెలిసిన ఫ్రెండ్సెవరో పిలిస్తే నువ్వు వాళ్ళకు ఉత్సాహ పరిచేందుకు వెళ్ళానన్నావు.నీ సమాధానం కుదరదు,ముఖ్యంగా పోలీసు అధికారుల ముందు--ముంతతో తాటి చెట్టు వద్దకు వచ్చి పాల కోసం వచ్చానన్నట్లుంది.నీ మాట నేనూ మీ అమ్మా బామ్మా మీ తమ్ముడు సాయికృష్ణా నమ్మవచ్చు.అందరూ నమ్మరు.ఇక ఆఖరి విషయం-ధర్మ సూత్రం యేమి చెప్తుందో పునశ్చరణ చేసుకుందాం. మనిషి మంచి వాడిగా ఉంటే మాత్రం చాలదు. గిరిగీసుకున్నట్టు మంచి వాళ్ళ మధ్య ఉండాలి. మంచి వాడిలా భవ్యంగా దివ్యంగా ఉంటే చాలదు. సాధ్యమైనంత మేర చెడు వ్యసన కారులకి దూరంగా ఉండాలి. అప్పుడే మనిషి స్వచ్ఛమైన జీవితాన్ని పొందగలడు.దీనికేమంటావోయ్? "

"ఐ ప్రామిస్ డాడ్——నేను మరొకసారి అటువంటి చోటుకి వెళ్ళను. ఇకపై అటువంటి వాళ్లకు దూరంగా ఉంటాను"

"గుడ్!ఇప్పుడు నీ చదువు వద్దకు వస్తున్నాను.కొన్నాళ్ళుగా నీ మంత్లీ క్వార్టర్లీ గ్రేడిషన్లు బాగాలేవంటుంది.మీ అమ్మ—— కారణం యేమిటి?ఏ కాగ్రతతో చదవటం లేదా!లేక చదడం ఆపేయాలనుకుంటున్నావా!"అ ప్రశ్నకు రాఘవ్ స్టన్నయిపోయినట్టు చూసాడు.రవంత సేపు మాటలు కరువైనట్టు మౌనంగా చూసి బదులిచ్చాడు రాఘవ్- "అటువంటిదేమీ లేదు నాన్నా! వీలు న్నంత మేర కష్టపడి చదువుతూనే ఉన్నాను.సబ్జక్టుకి సంబంధించిన ఇతర పుస్తకాల కోసం గ్రంథాలయానికి కూడా వెళ్ళి వస్తున్నాను. డౌట్స్ ఉంటే లెక్చరర్లనూ అప్పుడప్పుడు ప్రొఫెసర్లను కూడా సంప్రదిస్తున్నాను నాన్నా!మరెందుకో అంతకు మించి నా స్టడీస్ ముందుకు సాగడం లేదు నాన్నా!"

"నాకు అందిన భోగట్టా ప్రకారం డిగ్రీ లాస్ట్ ఇయర్ లో ఉన్నవారి కోసం కంపెనీలు కొన్ని క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తు న్నాయటగా!నువ్వు హాజరు కావడంలేదా?" రాఘవ్ బదులివ్వకుండా నిశ్శబ్దంగా ఉండిపోయాడు."ఏదైనా చెప్పాలి గాని——ఊరకుండిపోతే యెలాగోయ్!" ఇక జవాబివ్వడం తప్పదని తేల్చుకున్న రాఘవ్ స్పందించాడు-"తోటి బ్యాచ్ మేట్సుతో కలసి హాజరయాను. కాని యెంపిక కాలేదు" నిజాయితీతో కూడుకున్నపెద్ద కొడుకు సమాధానాలు సూర్యవివేక్ కి నచ్చాయి. దాపరికం లేకుండా బదులివ్వాలంటే పునాది రాయి వంటి గుణాంశం-చిత్త శుద్ధికావాలి,"మరి నీకు ఫుట్ బాల్ గేములో మంచి ప్రావీణ్యం ఉందన్న ఇమేజ్ ఉంది కదా!ఆ ట్రాక్ లోకి వెళ్ళి ప్రయత్నిస్తావా?"

"సాకర్ ఆటగాడిగా నేనంత లేవల్ కి చేరుకోలేదు నాన్నా!డిస్ట్రిక్టు లెవల్ టీములో చోటు సంపాదించడానికి ప్రయత్నిసున్నా ను.ఆ లేవల్ కి చేరిన తరవాత ఫుట్ బాల్ క్లబ్బుల్ని నడుపుతూన్న కంపెనీలకు వెళ్ళి కుదురైన ప్లేస్మెంటుకి ప్రయత్నిస్తాను నాన్నా!"అంత వరకూ తటస్థంగా నిల్చుని వింటూన్న పావని కలుగచేసుకుంది-"స్పోర్ట్స్ గేముల్ని ప్రోత్సహించే అటువంటి కంపెనీలు ఇక్కడంతగా లేవనుకుంటానురా రాఘవేంద్రా!అటుంటి ఫుట్ బాల్ క్లబ్బులు ముంబాయిలోనో గోవాలోనో-ఢిల్లీలోనో అస్సామ్ లోనో ఉన్నాయనుకుంటానురా రాఘవా!అంత దూరం వెళ్ళి అల్లల్లాడే బదులు ఇక్కడే స్టేట్ గవర్నమెంటు ఉద్యోగమో లేక సెంట్రల్ గవర్నమెంటు ఉద్యోగమే ప్రయత్నించ వచ్చుకదరా!"

"అలాగే——అన్ని అవెన్యూలూ ప్రయత్నిస్తానమ్మా!ఇంకొన్నాళ్ళలో డిగ్రీ యెలాగు చేతికి వస్తుంది కదమ్మా——అప్పుడు అన్ని వేపులకీ దరఖాస్తులు వేస్తాను.అవన్నీ నాన్నకూ నీకూ చెప్పే చేస్తానమ్మా!"





అంటూ రాఘవేంద్ర అక్కణ్ణించి కదలబోయాడు. అప్పుడామె కొడుకుని ఆపింది."నీకు నీవు చాలానే చేస్తున్నావంటున్నావు గా!నేనిప్పుడు చెప్తున్నది చేయి. సూర్యుడు నమ స్కార ప్రియుడు. శివుడు అభిషేక ప్రియుడు. ప్రతిరోజు సూర్యనమస్కారం చేయి.సూర్యారాధన చేసే ముందు సూర్యుడి తల్లి గాయత్రీదేవిని ప్రార్ధించు.అప్పుడు ప్రపంచానికే కాంతినిచ్చే సూర్వభగవానుడు నీకూ నీ భవిష్యత్తుకీ వెలుగునిస్తాడు. తప్పనిసరి గా శివారాధన చేయి. అదెలా చేయాలో పూజా గదిలో ఉంచిన పుస్తకం తీసి  చదువు. అది బోధ పడకపోతే మీ బామ్మ చెప్పినట్టు చేయి.నలుగురు పూజాగదిలో ఉన్నప్పుడు నువ్వు మాత్రం విడిగా మెసలకు."  అలాగే అన్నట్టు తలూపుతూ వెళ్ళిపోతూన్న కొడుకుని చూస్తూ పావని భర్తతో అంది–"వాడు మన ముందు అంతా విప్పలేదండి"అంటే——అన్నట్టు భార్య ముఖంలోకి చూసాడు సూర్యవివేక్."వాడి బ్యాచ్ మేట్సు కొందరు మంచి గ్రేడేషన్సుతో బాటు క్యాంపస్ ఇంటర్వ్యూ ద్వారా సెలెక్టు కూడా అయిపోయారు. ఇక––డిగ్రీ పత్రం అందుకున్న వెంటనే వాళ్ళు ఉద్యోగాల్లో ఫ్యాట్ సాలరీస్ తో చేరిపోతారు.రాఘవ్ గురించి తలచుకుంటే గుండె గుబులుగా ఉందండి.వాడితో కలసి చదువుకున్న వాళ్ళందరూ ముందుకు దూసుకుపోతుంటే——" అప్పుడు సూర్యవివేక్ అడ్డు వచ్చాడు."నువ్వు అనవసరంగా పీడకలల్ని కంటున్నట్లు ఊహించుకుంటున్నావు. ఒక్కక్కరికి ఒక్కొక్క విధమైన టెంపర్మెంటల్ మూడ్స్ ఉంటాయి.ఒకరు మందగమనంతో సాగినప్పుడు ఇంకొకరు వాయువేగంతో పుంజుకుంటారు.కొంతకాలం పోనివ్వు. వాడికి కూడా తనను తను నిలద్రొక్కుకోవడానికి తగినంత వ్యవధి కావాలి కదా!ఆఖరి విషయం—— జీవితం కోమల కుసుమం–అది వికసించడానికి మార్కులూ గ్రేడేషన్లు మాత్రమే చాలదు. సౌశీల్యత కూడా ముఖ్యం.ఇది ఉన్నవాడిని యెవరూ ఆపలేరు. ఐనా మనం యిప్పుడిప్పుడే కదా సూర్యభగవానుడి గురించీ——ఆయన తల్లి గాయత్రీ దేవి గురించీ విడమర్చి చెప్పాము——చూద్దాం రాఘవ్ యెంత వరకు పాటిస్తాడో—— చిన్న చిన్నవాటికి కలత చెందకు.వయసుతో బాటు మీసాలు మాత్రమే పెరగడం కాదు,బుధ్ధులూ ఆభిరుచులు కూడా మారుతుంటాయి.ఇది సహజ ప్రకృతి పరిణామం. మూమెంట్స్ మరీ క్లోజ్ గా గమనిస్తే ఈ తరం వాళ్ళకు నచ్చకపోవచ్చు. ఇది కూడా గుర్తు పెట్టుకో– –"పావని సావధానంగా తలూపుతూ అక్కణ్ణించి కదలి వెళ్లిపోయింది.

భరద్వాజ్ అన్నప్రకారం కామేశ్ ని తీసుకెళ్లడానికి వచ్చాడు.తండ్రి మె సేజ్ అందుకున్న కామేశ్ అప్పటికే సిద్ధంగా డ్రెస్స ప్పయి ఉన్నాడు.ఇంటి ముంగిట కారు హరన్ విన్న వెంటనే తల్లి వద్దకు వెళ్ళి కబురందించాడు– "నేను నాన్నగారితో మైనింగ్ కంపెనీకి వెళ్ళి అక్కణ్ణించి తిన్నగా నీ దగ్గరకు వచ్చేస్తానమ్మా!మామయ్య గాని ఫోను చేస్తే చెప్పు.కాస్తంత ఆలస్యం అటూ యిటుగా అవచ్చని. మన బ్యాంకు ఆఫీసుకి రావడం మాత్రం ఖాయం–బాయ్!"అంటూ క్రిందకు దిగి వెళ్ళి–గుడ్ మోర్నింగ్ డాడ్!" అంటూ భరద్యాజ్ ప్రక్కన వెళ్ళి కూర్చున్నాడు.కొడుకుని తేరిపార చూస్తూ తేటగా నవ్వుతూ కామేశ్ మెడ చుట్టూ చేతిని పోనిచ్చి అన్నాడు–"మొన్న సారీ యెందుకు చెప్తున్నానని అడిగావు కదా!దానికి కారణం యిప్పుడు చెప్తాను.నువ్వు మీ బామ్మను చూడకుండానే దూరమయావు.మీ బామ్మేమో నిన్ను చూడకుండానే ఈ లోకం విడిచి వెళ్ళిపోయింది.చెప్పలేని గుండె బరువుతో వెళ్ళిపోయింది.మరొక వైచిత్రి యేమంటే–––మీ బామ్మ మీ అమ్మను యిష్టపడుతుంది. మీ అమ్మేమో మీ బామ్మను అభిమానిస్తుంది.చాలా అన్యోన్యంగా ఉండేవారు.ఐనా ఒకరినుండి ఒకరు దూరమయిపోయారు,నిశ్సబ్దంగా రెండు ద్వీపాలు వేరు వేరుగా స్థలాంతర గమనం చేసినట్టు.ఇది చిత్రాతి చిత్రమైన విధి విన్యాసం కదూ!"అంటూ కారు స్టార్ట్ చేసాడు భరద్వాజ్.స్పందించకుండా యెటో చూస్తూ ఉండిపోయాడు కామేశ్.బామ్మ యెంతటి ఉదాత్త హృదయురాలు!అమ్మ చూపించిన తొందరపాటుకి మరొకరైతే చీవాట్లతో బాటు శాపనార్థాలు

కూడా పెట్టి యింటిని కకావికలం చేసుండేవారు.కాని,దానికి మారుగా అమ్మకు చెందాల్సిన నగల పెట్టెను తన కోడుకు ద్వారా అందేలా యేర్పాటు చేసింది.ఇంతటి ఉదాత్త గుణాంశం యెవరికుంటుంది? నిర్మల హృదయ మందిరం గలవారికేగా——

కొద్ది సేపట్లో కారు మైనింగ్ కంపెనీ గేటు ముందు నిల్చుంది.ఎక్కడో మాటా మంతీ మాట్లాడుకుంటూన్న సెక్యూరిటీ గార్డులు వేగంగా వచ్చి గేటు తలుపు తీసి అటెన్షన్ లో నిల్చున్నారు.కారు దిగి తలపైకెత్తి చూసాడు కామేశ్. పెద్ద అక్షరాలతో తెలుగులోనూ ఆంగ్లంలోనూ బోల్డ్ గా వ్రాసుంది–మాతృమూర్తి.అతడికి అర్థమైంది అది స్వర్గస్థురాలైన బామ్మగారి స్మృత్యర్థం పెట్టిన పేరని.ఆమెగారి అసలు పేరు–పూసమ్మ,ఇంతవరకూ కామేశ్ ఆమెను యెక్కడా యెప్పుడూ చూసుండలేదు. ఇకపైన ఆమెగారి చిత్రపటాన్ని మాత్రమే చూడగలడేమో!అంతలో కంపెనీ సీనియర్ ఆఫీసర్లు యెదురొచ్చి పుష్పగుచ్ఛాలను తండ్రీ కొడుకులిద్దరికీ అందిచ్చి–"వెల్ కమ్ సార్!" అంటూ స్వాగతం పలికారు.కామేశ్ వాళ్ళతో చేతులు కలపలేదు.అందరికీ చేతులెత్తి నమస్కరించాడు.కొడుకు దేహభాష భరద్వాజ్ కి నచ్చింది. అక్కడ స్వాగతం పలికేందుకు ప్రాంగణం ముంగిట నిల్చున్న మాతృమూర్తి కంపెనీ మేనేజర్లూ డిప్యుటీ మేనేజర్లందరూ కామేశ్ కి వయసులో పెద్దవాళ్ళే-- ఏమీ లేని వాళ్ళు యేమీ కాని వాళ్ళు వినమ్రంగా తల వంచి నమస్కరించడం వేరు.అదే సమయాన వెనుకా ముందూ ఆర్థిక వనరులు పుష్కలంగా ఉండి, మంది మార్గలం గుంపుగా ఉండి కూడా అదేమీలేని అనామకుడులా వినయంగా భవ్యంగా వంగి పెద్దవాళ్ళ వయసుకి వందనం చేయడం అన్నది వేరు.అతడి కళ్ళముందు పార్వతి రూపం మెరిసింది. కొడుకుని పార్వతి సభ్యతా సంస్కారాలతోనే పెంచి పెద్ద చేసిందన్న మాట--అతడు మీసాల మాటున నవ్వుకున్నాడు.కనీసం ఆమెలోని అహంకార పూరిత డాంబికాన్ని వాళ్ళ అన్నయ్యలోని అతి విశ్వాసాన్ని కొడుక్కి వంటబట్టకుండా చూసుకుంది. అంతవరకు నయమే.--

మరొక పదినిమిషాలలో అందరూ భరద్వాజ్ చేంబర్ చేరుకున్నారు. కాసేపు చర్చల్లో పాల్గున్న తరవాత గెట్ టూ గేదర్ లా–టీలు స్నేక్స్ తీసుకుని–"మళ్ళీ కలుసుకుందాం.ఇకపైన మళ్ళీ మళ్ళీ కలుసుకుంటూనే ఉందాం!ఇటీజ్ ప్లజర్ టుబి విత్ యూ--"అంటూ సీనియర్ ఆఫీసర్లు చెదరిపోయి వాళ్ళ వాళ్ళ కార్య స్థలాలకు వెళ్ళిపోయారు. వాళ్ళలా చేంబర్ ని ఖాళీ చేసి వెడలిపోయిన తరవాత కామేశ్ ని ఉద్దేశించి భరద్వాజ్ చెప్పనారంభించాడు–"ఇప్పుడు నిన్ను పరామర్శించి వెళ్ళిన వాళ్ళందరూ సర్వీసులో సీనియర్లు మాత్రమే కాదు,అనుభవమూ విషయ పరిజ్ఞానం మెండుగా ఉన్నవాళ్ళు.ముఖ్యంగా–భావనారాయణ,విశ్వనాథం రంగనాయక్–వీళ్ళ నుండి యెక్కువ ఫార్మాలిటీస్–అంటే యెక్కువ లాంఛన ప్రాయమైన మర్యాదల్ని యెదురు చూడకు.అలాగని వాళ్ళు అలక్ష్యంగా ఉంటారని కాదు. వాళ్ల హద్దులు వాళ్ళకు తెలుసు. కాని వాళ్ళలో కొందరు కంపెనీకి పునాది రాళ్ళవంటి వారన్నది మనం మరచిపోకూడదు. అలాగ్గాని విస్మరించడానికి పూనుకున్నామంటే– 'వి–డూ యిట్, యెట్ అవర్ ఓన్ రిస్క్ అన్నమాట' వ్యాపార రంగంలో సంస్థకు గుడ్ విల్ యెంత అవసరమో అంకితభావం గల సీనియర్ స్టాఫ్ ల సద్భావం కూడా కంపెనీకి అంతే ముఖ్యం. ఇదిగో!ఇప్పటికి ఈ పత్రాలన్నిటినీ యింటికి తీసుకు వెళ్ళి చదువు ప్రిలిమనరీ నాలెడ్జ్ కోసం—— మీపిన్ని మంగళ ఇక్కడ యెలాగూ బోర్డు మెంబరుగా ఉండనే ఉందిగా!నీకు చేదోడుగా మోరల్ సపోర్టుగా ఉంటుందిలే!ఇక నేను ఇక్కడేగా ఉండాలి,అటూ యిటూ బిజినెస్ మీట్సుకి వెళ్తూ–గవర్నమెంట్ అధికారుల్ని కలుసుకుంటూ--అక్కడ నువ్వు మీ మామయ్యతో సౌజన్య బ్యాంకు వ్యవహారాలను చూసుకుంటూనే ఇక్కడకు తరచుగా వస్తూండు.నాతో బాటు బిజినెస్ మీట్సులో పార్టిసిపేట్ చేస్తుండు.అప్పటికప్పుడు మారుతూన్న బిజినెస్ రూల్సుని ఖనిజ వ్యాపార రంగంలోని యెగుడు దిగుళ్ళను ఫాలో చేస్తుండు" అలాగే నాన్నగారూ–అంటూ తన ముందుంచిన ఫైల్సుని చేతిలోకి తీసుకుంటూ లేచాడు కామేశ్. భరద్వాజ్ చటుక్కున కళ్ళెత్తి



చూసాడు–యెక్కడికన్నట్టు“అమ్మకు చెప్పివచ్చాను ఇక్కణ్ణించి తిన్నగా అక్కడకి వస్తానని——”

“ఇప్పటికిప్పుడు వెళ్ళనవసరం లేదు.ఇప్పుడు తిన్నగా నాతోబాటు యింటికి వస్తున్నావు.నీకోసం అనురాధ మీ చిన్న మ్మా యెదురు చూస్తుంటారు.భోజనం చేసి వెళుదువుగాని——కావాలంటే మీ అమ్మకు ఓ మాట చెప్పు” కామేశ్ అలాగే అన్న ట్టు తలూపి తల్లికి ఫోను చేసి చెప్పి,తనకిచ్చిన పేపర్లన్నిటినీ బ్రీఫ్ కేసులోకి చొప్పించాడు.తన ఇద్దరు పర్సనల్ అసిస్టెంటులనూ పిలిచి యేవో ఫైల్సు గురించి ఆదేశాలు జారీచేసి లేచి నిల్చున్నాడు భరద్వాజ్. కామేశ్ అతణ్ణి అనుసరించాడు.

మరి కాసేపటికి కారు పోర్టికోలో ఆగిన చప్పుడు వినిపించి అనురాధ పరుగున వచ్చి కారు తలుపు తీసి నిల్చుంది.

“ హాయ్!మై బ్యూటిఫుల్ లవ్లీ సిస్టర్!నా కోసం చాలా సేపట్నించి యెదురు చూస్తున్నావా? “

“ కాకపోతే——నువ్వు మొదటిసారి కదా మా యింటికి వస్తున్నావు!నేను మాత్రమేనా–అటు చూడు మీ చిన్నమ్మ కూడా కళ్ళంతా విప్పార్చి యెదురు చూస్తూంది”

“మొదట నీ వాక్యాన్ని సరిదిద్దుకో!లేకపోతే నాన్నగారే ఓ చురక అంటించి మరీ ఆ పని చేస్తారు.ఇక పైన మా యిల్లూ మీ యిల్లూ అనకూడదు.నాన్న గారు యెక్కడుంటే అది నా యిల్లవుతుంది.ఇదే సూత్రం నీకు కూడా వర్తిస్తుంది” అని నవ్వుతూ తిరిగి చూసేటప్పటికి భరద్వాజ్ చేతులు చేర్చి తప్పట్లు కొట్టాడు.“సెహ భాస్ పుత్రా!తిరుగు లేని వ్యాఖ్యానం చేసావు.ఇక లోపలకు వెళదామా?”అప్పుడు అనురాధ పరుగున వచ్చి “కొంచెం ఆగు సోదరా!” అంటూ గుమ్మం వద్ద పనిగత్తె అందించిన హారతి పళ్ళెం అందుకుని అన్నయ్యకు చూపించింది.అతడు చిలిపిగా నవ్వుతూ అనురాధ నెత్తిపైన చిన్నపాటి మొట్టికాయ పెట్టి పర్సునుండి నోట్లు తీసి పళ్ళెంలో ఉంచాడు.థేంక్యూ అంటూ తీసుకుని అక్కణ్ణించి దలబోయింది.

“ఆగు!మరొకటి ఉంది. వినకుండానే వెళ్ళిపోతావా!” చెప్పమన్నట్టు గిర్రున వెనక్కి తిరిగి చూసింది.“ఇకపైన మనం కలిసి పని చేయాలి– ఒకరికొకరు దన్నుగా నిలుస్తూ!”

“ నాకు తెలుసులేరా!అదే మా మాతృమూర్తి–సారీ– మన మాతృమూర్తి మైనింగ్ కంపెనీలోనేగా––“అని నాలిక కరచు కుంటూ సరిదిద్దుకుంది– “కామేశ్ నవ్వుతూ అన్నాడు–

“ఔను.నీకు కంపెనీ కాన్ఫిడెన్షియల్ ఫైల్సు అప్పగించమని నాన్నగారికి సిఫార్సు చేయబోతున్నాను.ఎనీ అబ్జక్షన్?“

“ నాకెందుకు అబ్జక్షన్?నాన్నతో బాటు నువ్వూ ఉన్నావుగా!ఆపైన బోర్డు మెంబరుగా అమ్మకూడా అడపాదడపా వస్తూనే ఉంటుందిగా

––” కామేశ్ యిక మాటలు కలపకుండా లోపలకు నడచి మంగళ ముందు మౌనంగా చేతులు జోడించి నిల్చు న్నాడు. మంగళ కూడా అతణ్ణి తదేకంగా చూస్తూ నిల్చుంది.కామేశ్ మంచి పొడగరి.మెరిసే కళ్ళు–కళైన ముఖం.దృఢమైన దవళ్ళు–యెత్తైన భుజ స్కందాలతో శారీరాకృతిలో గాంభీర్యత ఉట్టి పడుతూంది. అతడిలో భరద్వాజ్ ముఖ ఛాయలు తీర్చి దిద్దినట్టు ప్రస్ఫుటిత మవుతున్నాయి. అదే రీతిన అతడు కూడా చినతల్లిని నిదానంగా చూసాడు.ఇంట్లో యెక్కడో అనురాధను చూసి అమ్మ అన్నట్టు చిన్నమ్మ సౌందర్యవతే––ప్రశాంత వదనం.మృదువైన ప్రసన్నమైన నవ్వు.కట్టూ బొట్టులో సద్భావం కలిగించే రూపం. ముఖ్యంగా యెదుటి వారిలో విశ్వాసం పుట్టించే ముఖ భావం.మరి——లోలోన యెలా ఉంటుందో! స్త్రీ అంత రంగం వాల్తేరు కొండలంత అగాధం కదూ! ఏది యెలా ఉంటేనేమి? నాన్నగారు చుక్కాని పట్టున్నంత వరకూ నావకు యెటువంటి ఢోకా ఉండదు.అప్పుడు ఇద్దరి ఆలోచనలకూ అంత రాయం కలిగిస్తూ భరద్వాజ్ వాళ్ల మధ్యకు వచ్చి నిల్చున్నాడు– “అదేంవిటి

మంగళా !అబ్బాయి చాలా రోజులకు వచ్చాడు. చేతులు జెడించి నిల్చున్నాడు.కొడుకుని ఆశీర్వదించవా!"భర్త మాటతో ఆమె ఉలికి పాటుకి లోనవుతూ తేరుకుంది.కామేశ్ చెంపల్ని నిమిరి నుదట కుడిచేతినుంచి దీవించింది.తనలో అతడి తల్లి పోలికల్ని వెతుకుతున్నాడని ఆమె గ్రహించింది. ఆలోచనల నుండి తేరుకుంటూ అందామె. "టైమయిపోతూంది.లోపలకు వచ్చి చేతులు కడుక్కో--వంట యెలా ఉందో చూసి చెప్పు—"అంటూ అతడి చేతిని అంది పుచ్చుకుని డైనింగ్ హాలువేపు నడిపించింది. చినతల్లి చూపించే ఆత్మీయతలో యెంతటి లోతు ఉందో!అసలు ఉందో లేదో యెవరు చెప్పొచ్చారు?అతడు చిన్నగ నవ్వుతూ "నాన్నగారూ!మీరూ రండి" అంటూ వాష్ బేసిన్ వద్దకు వెళ్ళి సబ్బుతో చేతులు కడుక్కుని అనురాధ అందించిన పొడి టవల్ తీసుకుని తుడుచుకుని బల్లముందు కూర్చున్నాడు.భరద్వాజ్ కూడా చేతులు కడుక్కుని కొడుకు ప్రక్క సీట్లోకి వచ్చి కూర్చున్నాడు.ఇద్దరికీ మంగళే వడ్డించింది.అనురాధ కావలసినవన్నీ సమకూర్చింది. అప్పుడు కామేశ్ పిలిచాడు–"రండి చిన్నమ్మా! మాతో కలసి తిందువు గాని". ఆమె నవ్వి తల అడ్డంగా ఆడించింది–

"పర్వాలేదబ్బాయ్.నేను మీ చెల్లితో కలసి తింటాలే—" ఆ మాటలు విన్న కామేశ్ కి తల్లి రూపం కళ్ళ ముందు మెదిలింది. ఆమె కూడా ఇలాగే అందరితో కూర్చుని తినదు.అందరూ తినడం పూర్తి చేసి లేచిన తరవాతనే కంచం ముందు కూర్చుంటుంది. వంటగత్తె వచ్చి–"మీరు కూర్చోండమ్మా! నేను వడ్డిస్తాను"అని చెప్పిన తరవాత కూడా అమ్మ వచ్చి కూర్చోదు. ఇదెక్కడి ఆనవాయితో అతడికి బోధపడదు.ఇంతకీ తల్లి మామూలు యింటి గృహిణి కాదు. మామయ్య అధ్వర్యాన రాటుదేలిన బిజినెస్ ఉమన్.టఫ్ నగర బిజినెస్ ఉమెన్. ఎంతైనా కలసి తినడంలో ఉన్న ఆనందం వేరు కదా!బహుశ: ఈ ప్రాతకాలపు పద్ధతిపైన దివంగత బామ్మ పూసమ్మగారి ముద్ర బలంగానే ఉందేమో!

మరి కాసేపటికి భోజనాలు ముగించి తండ్రీ కొడుకులు లేచిన తరవాత మంగళ కామేశ్ ని ఉద్దేశించి అడిగింది–"భోజనం యేలాగుందబ్బాయి!నీ కోసం మీ చెల్లి నన్ను దగ్గరకు రానివ్వకుండా స్వయంగా వంటచేసింది" ఆ మాట విని అతడు తల తిప్పి చూసాడు.పూలకుండీ వద్ద నిల్చుని నవ్వుతూంది అనురాధ."చూసావా!నేనిచ్చిన ప్రామిస్ నిలబెట్టుకున్నాను" అని చెప్తున్నట్లుంది ఆమె ముఖార విందం.అతడేమీ అనలేదు. దగ్గరకు వెళ్ళి అనురాధ నెత్తిపైన చేయి వేసి,కళ్ళల్లోకి మృదువుగా చూసి "ఇక నేను బయల్దే రుతాను నాన్నా!" అని బూట్స్ తొడుక్కోవడానికి బూట్సు స్టాండు వద్దకు నడిచాడు. అప్పుడు భరద్వాజ్ దగ్గరకు వచ్చి కారుకీ అందించాడు."మరి మీరెలా వస్తారు నాన్నా? "కామేశ్ ఆశ్చర్యంగా అడిగాడు.

"మరొక కారు ఉందిగా!దానిని డ్రైవర్ నడుపుతాడు.ఇంకేమైనా కావాలోయ్?" కామేశ్ ఔనన్నట్టు తలూపాడు." ఉఁ చెప్పు యేం కావాలి ?"తల్లీ కూతుళ్ళిద్దరూ ఆతృతగా చూస్తున్నారు అతడేమి అడగబోతున్నాడోనని. "నాకు బామ్మ ఫొటో కావాలి నాన్నా!" భరద్వాజ్ కొన్ని క్షణాలపాటు కొడుకుని తదేకంగా చూసి,నిశ్శబ్దంగా లోపలకు వెళ్ళి తల్లి ఫోటో తీసుకువచ్చి యిచ్చాడు. కామేశ్ దానిని అందుకుని కాసేపు తేరిపార చూస్తూ బామ్మ రూపాన్ని కళ్ళనిండా నింపుకుంటూ పోర్టికో వేపు నడిచాడు.

★★★

"కష్టే ఫలీ!" అన్న తరతరాల నాటి ధర్మసూత్రం ప్రధ్విలో ఊరకే పుట్టలేదుగా!ప్రజ్ఞకు శ్రమ తోడైతే బంగారానికి వెలిగారం తోడై నట్టు ఫలితం తానంతట అది వచ్చి తీరుతుందిగా!ప్రీతి మామయ్య మార్గదర్శకంతో అత్తయ్య సహాయ సహకారాలతో మైత్రీవ నంలో ఉన్న కోచింగ్ సెంటర్ లో ఇంటెన్సివ్ కోచింగ్ తీసుకుని సెంట్రల్ సర్వీసు పరీక్షల్లో ఫ్లయింగ్ కలర్స్ తో ఉత్తీర్ణురాలై ఢిల్లీలో ఇంటర్వ్యూకి హాజరయి వచ్చిన పిదప,రెవిన్యూ డిపార్టుమెంటుకి చెందిన ఇనకమ్ టాక్సు ఆఫీసులో ఇన్కమ్ టాక్సు ఆఫీసరు గా చేరింది.చాలామంది

విషయంలో దురదృష్టం ఒకసారి యెదురొస్తే అది దూరపు చుట్టంలా చేరువయి పోయి పెనవేసుకుపోయి అదే పనిగా వెంటాడుతూనే ఉంటుంది.తెరచాటు అదృష్య శక్తిలా రాచి రంపాన పెడుతూనే ఉంటుంది. మరి——అదే సమయంలో అదే సూత్రాన్ని రివర్సులోకి తీసుకుంటే అదృష్టం కూడా అదే వేగంతో,హృదయ వేగంతో పాగా వేసినట్టు వెన్నంటి వస్తూనే ఉంటుంది.నెత్తిని తాకిన దేవతా స్త్రీ హస్తంలా దీవిస్తూనే ఉంటుంది. దీనినే సకల సకారాత్మక సమతౌల్యత అనవచ్చేమో! ప్రీతికి అడ్మినిస్ట్రేటివ్ ట్రైనింగు కాలేజీలో ఆరు నెలల పాటు ప్రాక్టికల్ ట్రైనింగు యిచ్చి హైద్రాబాదు కార్యాలయంలోనే పోస్టింగ్ ఇచ్చారు.ఒక విధంగా అది ఆమెకు డబుల్ జాక్ పాటే-- మరైతే——ఆ సంతోషంలో విషాద గీతిక వినిపించినట్టు ఆమె కలలో కూడా యెదురు చూడనిది జాంబవాన్ రూపంలో యెదురైంది. గెజిటెడ్ ఆఫీసరుగా జీతం తీసుకుని అత్తయ్యా మామయ్య కాళ్ళకూ నమస్కరించి జీతం కవరుని అందివ్వబోవడానికి చేయి చాచినప్పుడు వాళ్ళందుకోలేదు.ఇద్దరూ మేనగోడలిని ఆశీర్వదించి యెదుట కూర్చుండబెట్టుకుని ముక్తకంఠంతో అన్నారు-"నువ్వొచ్చిన మిషన్ పూర్తయిందమ్మా!రేపు ఉదయమే నిన్ను మీ అమ్మానాన్నల వద్ద దింపుతున్నాం.మీ చెల్లి మాత్రం ఇక్కడే ఉండి గ్రాడ్యేషన్ పూర్తి చేస్తుంది.ప్రశాంతి సహాయంతో సామాను గట్రా సర్దుకో——రేపు వెళ్ళి మీ డిపార్టుమెంటులో నమోదు చేసి ఉన్న యింటి విలాసం ఫోను నెంబర్లు కూడా మార్చుకో—— "వాళ్ళిద్దరూ ఆ మాట ముక్తసరిగా చెప్పి విస్తుపోయి నిల్చున్న ప్రీతి ముఖంలోకి మళ్ళీ చూడకుండా లోపలకు వెళ్ళిపోయారు.అదంతా వింటూ దూరాన నిల్చున్న మాన్విత నివ్వెరపోతూ నిల్చున్న అక్కయ్య వద్దకు వచ్చి కుడి భుజం పైన చేతినుంచి అనునయంగా అంది-"మామయ్య నిర్ణయంలో న్యాయం ఉందక్కా! ఇద్దరూ వచ్చి నిన్నుద్దేశించి మిషన్ పూర్తయిందన్నారే——అది కరెక్టయిన పదం.నేను కూడా గ్రాడ్యేషన్ పూర్తయిన తరవాత ఇంటికి వచ్చేస్తాను. నీకు తోడుగా ఉంటాను. నువ్వు ఫీలవకు——" అంటూ లోపలకు వెళ్ళి మంచినీళ్లు తెచ్చిచ్చింది.ఎంత ఆపుకోవాలని ప్రయత్నిస్తున్నా ప్రీతి కళ్ళనుండి కన్నీటి చుక్కలు ఆగడం లేదు. తను అత్తామామయ్యలకు దూరం కాబోతుందా! ప్రీతి తనను తను నమ్మలేకుండా పోతూంది. స్టడీ నుండి బైటకు వచ్చిన ప్రశాంతి యెదంగా నిల్చుని బిత్తరపోయి చూస్తుందే గాని అక్కణ్ణించి కదలి రాలేదు. ఏవో చీకటి రేఖల్లాంటి గజి బిజి ఆలోచనలు ఆమెను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నట్లున్నాయి.

అనుకున్న ప్రకారం మరునాడు ఉదయం ప్రీతి తన సామానంతటినీ కారులో పెట్టి బావల వద్దా,ప్రశాంతి వద్దా చెల్లి వద్దా సెలవు తీసుకుని కారులో కూర్చుంది. ఊరు చేరి,పెద్ద మేనగోడలిని చెల్లికి అప్పగించిన తరవాత సూర్యవివేక్ యెక్కువ సేపు అక్కడ ఉండలేదు.ప్రీతికి దూరమవడం అతడికి కూడా గుండె బరువుగానే ఉంది.మరి——యేది యెప్పుడు యెలా జరగాలో అలా జరిగే తీరాలిగా!ఈలోక సూక్తికి తిరుగెక్కడుంది?బావగారి వద్దా భద్రమ్మ వద్దా క్షేమ సమాచారం అడిగి తెలుసుకుని మాన్విత గురించి ఓ మాట చెప్పి ప్రీతి చేసిచ్చిన కాఫీ తాగి-"నేనూ మీ అత్తయ్యా అప్పడప్పుడు వస్తుంటాంలే! నువ్వు కూడా శని ఆదివారాలలో తీరిక చేసుకుని వస్తుండు"అని గుండెలకు హత్తుకుని మాటా పలుకూ లేకుండా చూస్తూ నిల్చున్న శారద నెత్తిపైన వాత్సల్యపూరితంగా చేతినుంచి భార్యతో కారు వేపు సాగిపోయాడు వివేక్.

వాళ్ళలా వెళ్ళి పోయిన తరవాత శారద ఇలా వేగంగా వచ్చి కూతుర్ని నిలదీసింది-"వాళ్ళు దిగబెట్టెస్తామంటే తిన్నగా వచ్చేయడమే!కొన్నాళ్ళుండి మాన్విత గ్రాడ్యేషన్ పూర్తయిన తరవాత యింటికి వెళ్తానని చెప్పొచ్చుగా!" "అబ్బే——నేనుగా బయల్దేరి వస్తాననలేదే!మొదటి జీతం డబ్బుల కవరు యిచ్చి ఆశీర్వదించమన్నాను,దానితో వాళ్ళకేమని పించిందో మరి—— అత్తయ్యా మామయ్యలిద్దరూ తిన్నగా నన్ను తీసుకు వచ్చి దిగబెట్టేసారు. మొదటి జీతంతో ఇంట్లో వాళ్ళందరకూ మంచి రెస్టారెంటులో డిన్నర్ ఇప్పించి ఇద్దరికీ గుడ్డలు కొనివ్వాలనుకున్నాను.అదీ వీల్లేకుండా పోయిందే అమ్మా!"

శారద మౌనంగా ఉండిపోయింది. మొదటి చూపుగా ఆలయ క్షేత్ర పాలకుడిని కొలవకుండా యెక్కడో చెట్టూ పుట్టాలేని బీడు మైదానంలోకి చొరబడినట్లుంది పరిస్థితి.మొన్నమొన్నటి వరకూ ఇద్దరమ్మాయిలకూ ఇద్దరు బావలున్నారనుకునేది. మరిప్పుడు——పరిస్థితి వేరుగా మారేటట్లుందిగా––పెట్టుకున్న వరసను బట్టి చూస్తే ప్రశాంతికి కూడా అబ్బాయిలిద్దరూ బావలేగా!ఇకపోతే——కాస్తంత ముందుకెళ్ళి ఆలోచిస్తే అన్నయ్య వదినల చర్యలో సహేతుకత గోచరిస్తూనే ఉంది.ప్రీతి ఉద్యోగంలో చేరి ఆఫీసరు స్థాయి జీతం అందుకున్న తరవాత కూడా అక్కడే ఉంటే,యింట్లో తీరుబడిగా కూర్చున్న తన బంగారు అత్తగారు తప్పకుండా ప్రతికూల వ్యాఖ్యానాలు చేసి తీరుతుంది.ఏదో ఒక సమయం చూసి,"ఊరకేనే మీ అన్నయ్య అమ్మాయిలిద్దర్నీ యింటికి తీసుకెళ్ళి చదివించాడూ!"అన్న ఆ ఒక్క వాక్యంతో అంతటినీ చింపి చాకలి రేవుకి పంపిస్తుంది.అంత వరకూ అర్థం పర్థంలేని అవాకులూ చెవాకులూ విసురుతూనే ఉంటుంది. అభిమానధనుడూ సున్నిత హృదయుడూ ఐన అన్నయ్య యిటువంటి పర్యావసానాన్ని ముందే ఊహించి ఉంటాడు. ముందు జాగ్రత్తగా వదినతో చర్చించి ప్రీతిని కాలయాపనకు అవకాశం లేకుండా దిగబట్టేసుంటాడు. మెరుపులో వెలుగే కాదు——పిడుగూ ఉండవచ్చన్నట్టు–– పరిస్థితిని ఇలానే కొనసాగనిస్తే ఒక్క అమ్మాయి కూడా ఆ యింటి కోడలు పిల్లగా వెళ్ళలేదేమో!వీటి గురించి పూర్ణచందర్ ఆలోచిస్తున్నాడా!కచ్చితంగా ఆలోచించడు.కూతుళ్ళ గురించి తలపోసేంత తీరికేదీ అతడికి.శ్రామిక పోరాటాలు–సస్పెన్షన్ విధింపుల మధ్యే కాలం గడిపో తుంది.ఇక రేపటి యింటి అవసరాల గురించి కుటుంబపరిస్థితుల గురించీ తర్కించే సమయమేదీ ఆయనకు——

అదే రోజు మునిమాపు వేళ ప్రీతిని దిగబెట్టి ఇల్లు చేరుకున్న దంపతులిద్దరికీ ఊహించలేని చేదు అనుభవం యెదురైంది. భార్యాభర్తలిద్దరూ గడప దాటి లోపలకు వచ్చీ రావడంతోనే మాన్విత వచ్చి చెప్పింది–"ప్రొద్దుటినుంచి ప్రశాంతి యెంత పిలిచినా గదినుండి బైటకు రావడంలేదు అత్తయ్యా!" పావని అయోమెయానికి లోనవుతూ అడిగింది–"లోపలేం చేస్తుందది? ఫైనలియర్ కదా——పట్టు సడల నీయకుండా స్టడీ చేస్తుందేమో!" మాన్విత తలఅడ్డంగా ఆడించింది–అది కారణం కాదన్నట్టు. మరి–అని–– పావని ప్రశ్నార్థ కంగా కళ్ళెత్తి చూసింది. "ఎందుకో యేడుస్తున్నట్లుంది.సాయి కూడా కారణం తెలుసుకోవడానికి పలుసార్లు ప్రయత్నించాడు. కాని నోరు విప్పడం లేదు"అప్పుడు సాయికృష్ణ తండ్రిని సమీపించి అన్నాడు–"అంతే కాదు నాన్నా!ఏమీ తినలేదు.పచ్చి నీళ్ళు కూడా ముట్టలేదు" ఆ మాటతో వివేక్ కుదుపుకి లోనయాడు. చనిపోయిన తల్లిదండ్రుల మరణానికి అసలు కారణం ఎవరిద్వారానో తెలుసుకుందా! తల విదిలిస్తూ వేగంగా నడచి వెళ్ళి ప్రశాంతి గదిలోకి ప్రవేశించాడు–"ఏమయిందమ్మా!కాలేజీలో గాని రోడ్డుపైన గాని యెవరైనా యేమైనా అన్నారా?మేం లేకపోతేనేం,జరిగిందేదో నీ బావలకో అవ్వకో చెప్పవచ్చు కదా!" సూర్యవివేక్ పలికిన ఆ ఒక్క మాటతో కరిగిన మబ్బులా ద్రవించుకుపోతూ ప్రశాంతి రివ్వున లేచి వచ్చి,వివేక్ ని గట్టిగా కౌగలించుకుంది."అదేమీ కాదు మామయ్యా!"అని కన్నీరు కార్చసాగింది.ఈసారి పావని ఉగ్గబట్ట లేక పోయింది–"ఏమీ కానప్పుడు,యేమీ లేనప్పుడు ఇలా కన్నీరు మున్నీరుగా యేడ్వడం దేనికే?మమ్మల్ని మరింత బెంబేలు పడిపోనివ్వకుండా జరిగిందేదో చెప్పు!రోడ్ డెవిల్సు గాని నీకు అడ్డువచ్చి సతాయిస్తున్నారా!"ఆ మాటతో ప్రశాంతి దు:ఖాన్ని ఆపుకుంటూ వివేక్ వేపు దీనంగా చూసి యెట్టకేలకు పెదవి విప్పింది– "గ్రాడ్యేషన్ పూర్తయిన తరవాత నన్ను కూడా బయటకు వెళ్ళిపొమ్మంటావా మామయ్యా!" ఆ మాట విన్నంతనే భార్యాభర్తలిద్దరూ ఉలికిపాటుకి లోనయారు."అలాగని యెవరన్నారు?" ముక్త కంఠంతో అడిగారిద్దరూ––"మరి ప్రీతిని పంపించేసారుగా!"సూర్యవివేక్ కి బదులివ్వడానికి కొన్ని క్షణాలు

పట్టాయి–"పెద్దపిల్లవయావు. చదువుకున్నదానివి.ఇలా చిన్న పిల్లలా చిన్నచిన్న విషయాలకు బెంబేలు పడిపోతే యెలా!ప్రీతి విషయం వేరు.నీ విషయం వేరు.ప్రీతి వాళ్ళ అమ్మానాన్నల వద్దకు వెళ్ళింది. మరి నువ్వెక్కడికి వెళతావు?అదే నువ్వు మగపిల్లాడివయుంటే–– మీ నాన్న దగ్గరి బంధువులూ దూరపు బంధువులూ గూడుకట్టుకుని యీపాటికి రెక్కలు కట్టుకుని వాలి ఉందురు.ఇప్పుడు విను––ఇక చివరి వరకూ నువ్వు మాయింటి బిడ్డవే—— ఇది నా మాట కాదు.చనిపోయిన మీ నాన్న మాట– అర్థమైందా!" ప్రశాంతి తలాడిస్తూ పావని వద్దకు వెళ్ళి "సారీ అత్తయ్యా!" అని కౌగలించుకుంది. అప్పుడు పావని గట్టిగా నవ్వేస్తూ అంది–"ఇక దు:ఖ సాగరంలోనుంచి బైటకు తేలి, ముఖం బాగా కడుక్కుని తేటగా నవ్వుతూ వంటగదినుండి కంచాలు తెచ్చి మా కందరకూ వడ్డించు–నువ్వూతిను" ప్రశాంతి నవ్వు ముఖంతో తలాడిస్తూ కదలి– "సారీ మామయ్యా!చినబావా–– నీకు కూడాను——" అని లోపలకు నడిచింది.అప్పుడు తేటదనం తెచ్చుకున్న ముఖంతో వెళ్తూన్న ప్రశాంతిని ఆగమని దగ్గరకు వెళ్ళింది పావని."నిన్న మొన్నటి వరకూ ప్రీతి మనింటి వాకిట కూనిరాగాలు తీస్తూ ముగ్గులు వేసేది. ఇకపైన నువ్వూ మాన్వితా వంతుల వారీగా ముగ్గులు వేయాలి.తెలుగు వాకిళ్ళకు వైకుంఠ ద్వారాలు రంగవల్లికలే——ఈ విధంగా సర్వ సంపదలకూ అధిష్ఠాన దేవత అష్టలక్ష్మికి స్వాగతం పలికే సంప్రదాయం ఇదే——లెక్కకు చుక్కలు అందలేదనీ–అష్ట కోణాలు సమాంతర రేఖలు కుదరడం లేదని తప్పుకో వడానికి ప్రయత్నించకండి.తెలియకపోతే నన్ను గాని అవ్వగారిని అడిగి తెలుసుకోండి.సరేనా!"

"అలాగే అత్తయ్యా!నేనూ మాన్వితా కలసే కళ్ళాపు చల్లి ముగ్గులు పెట్టాం.ఈజిట్ ఓకేనా అత్తయ్యా!"పావని నవ్వుతూ తలూ పింది,సూర్యవివే క్ భార్యవేపు ఆత్మీయంగా చూసాడు.మబ్బు కమ్మిన ఆకాశంలా మారిన యింటిని చిటికెలో యెంత చక్కగా మార్చింది పావని!కార్యేషు దాసి కరణేషు మంత్రి కదూ!

ఆరోజు సోమవారం.ఉదయం పదిన్నర కావస్తూంది.ఇంటి ముందు పడవంతటి కారు ఆగడం చూసి,చదువుతూన్న పుస్తకాన్ని మూసి మాన్విత లోపలకు వెళ్ళి అత్తయ్యకూ మామయ్యకూ కబురందించింది.ఇంత ప్రొద్దుటే తనను చూడటానికి యెవరు వచ్చుంటారు– చెప్మా అనుకుంటూ పంచె సర్దుకుంటూ భార్యతో బాటు వసారాలోకి వచ్చాడు సూర్య వివేక్, కారులో నుంచి ముగ్గురు దిగారు.మిత్రుడు భరద్వాజ్– కొడుకు కామేశ్–కూతురు అనురాధ నవ్వుతూ దిగి యింటి గడప వేపు నడచు కుంటూ వచ్చారు.కామేశ్,అనురాధ యిద్దరూ వివేక్ దంపతులిద్దరికీ నమస్కరించారు.అప్పుడు భరద్వాజ్ పావనిని ఉద్దేశించి అన్నాడు– "నువ్వీ యిద్దర్నీ చూసుండవు.నా యేకైక పుత్ర రత్నం కామేశ్–నా యేకైక కుమార్తె అనురాధ" అని పరిచయం చేసి వాళ్ళను అవతల నిల్చున్న సాయికృష్ణ వద్దకు తీసుకు వచ్చి భుజం పైన చేయి వేసి,"వివేక్ చిన్నకొడుకు,సౌమ్యుడు–వినమ్రు డు. చదువు లో దిట్ట" అంటూ పరిచయం చేస్తూ యింట్లోపలకు వచ్చాడు. అనురాధ–"హాయ్!"అంటూ పలకరింపుగా నవ్వి సాయికృష్ణకు దగ్గరగా వచ్చి కాలేజీ వివరాలు తదితర విషయాలూ అడిగి తెలుసుకోనారంభించింది. తన గురించి కూడా తానుగా చెప్పనారంభించింది.ఆ తరవాత తనను పెరడు తోటలోకి తీసుకెళ్ళమని అడిగింది.సాయికృష్ణ అలాగే అంటూ ఆమెతో మాటలు కలుపుతూ తీసుకెళ్ళాడు.పరులింటికి మొదటిసారి వచ్చానన్న ధ్యాస మరచి కలివిడితనం చూపిస్తూన్న అనురాధ వైఖరికి–– చూపిస్తూన్న చనువుకి ప్రశాంతి ముఖం మారింది. అది గమనించిన పావని ప్రశాంతికి స్వాంతన కలిగేలా అంది–"వాళ్ళ నాన్నా మీ మామయ్యా చిరకాల స్నేహితులు.మీ మామయ్య తోలుతూన్న కారుని ఆస్ట్రేలియా వెళ్ళేటప్పుడు భరద్వాజ్ గారే చౌకగా యిచ్చి వెళ్ళారు. అనురాధ వాళ్ళ నాన్నతో ఒకటి రెండు సార్లు ఫోరెన్ వెళ్ళివచ్చింది. అందువల్లనే ఆ పిల్లలో అంతటి సందడీ సవ్వడీ– –.కాస్తంత దేషింగ్ టైప్––" ప్రశాంతి నవ్వు ముఖంతో తలూపి

అటు యధాలాపంగా చూసింది. మాన్వితతో కామేశ్ అనర్గళంగా మాట్లా డుతూ నిల్చున్నాడు,చేతిలోని కాఫీకప్పుని కదలనివ్వకుండా ఉంచుకుని.మొత్తానికి అన్నా చెల్లెలిద్దరూ డేషింగ్ టైపే-- --ఎంతైనా డైనమిక్ బిజినెస్ కుటుంబానికి చెందిన వారు కదా!

మాటా మంతీ ఐన తరవాత కాఫీలు పుచ్చుకుని సెలవు తీసుకుని మరలిపోతున్నప్పుడు కామేశ్ మాన్వితను కన్నార్ప కుండా చూడటం ప్రశాంతి గమనించి అదోలా ముఖం పెట్టుకుంది.ఎంతటి డేషింగ్ టైపయితే మాత్రం--వయసులో ఉన్న కుర్రాడు వయసులో ఉన్న అమ్మాయిని చూస్తున్నప్పుడు;అంత బాహాటంగానా అంత ఉద్వేగపూరితంగానా మనసులోని యిష్టాలను వ్యక్తం చేస్తాడు! ఇదంతా ఒన్ సైడ్ న పుట్టుకొచ్చిన కెమిస్ట్రీ కాదూ!అలా ఆలోచిస్తూ నిల్చున్న ప్రశాంతి జబ్బ పైన చేయివేసి పావని మరొకసారి నవ్వుతూ అంది-"ఇప్పటి తరం వాళ్ళు దేనినీ దాచుకోరు-అందులో ముఖ్యంగా భావోద్వేగాలను అస్సలు దాచుకోలేరు. మరీ ఆశ్చర్యపడకు. మిమ్మల్ని మీరు అదుపులో ఉంచుకోవాలి,హద్దుదాటకుండా చూసుకోవాలి——అరిటాకు పైన పడ్డ ముల్లూ సామెత మరచిపోకుండా——ఓకే!"ప్రశాంతి నవ్వేసింది,తలూపుతూ--


(ఇంకా ఉంది )

## వచ్చే వారం నుంచే మరో సరి కొత్త సీరియల్

**ప్రముఖ రచయత**
**గన్నవరపు నరసింహ మూర్తి**
**గారి కలం నుండి**



## సీరియల్






బొందల నాగేశ్వర రావు

"అమ్మా...సంధ్యా...నీకో పార్శిల్ వచ్చిందమ్మా!"అంటూ ఇటు తిరిగి చూశాడు చిదంబరం. అక్కడ చక్రవర్తి నిలబడి వున్నాడు.
" నువ్వుకూడా ఇక్కడే వున్నావా అల్లుడూ" తడబడుతతూ వచ్చాయామాటలు చిదంబరం నోటివెంట.
"ఆఁ...ఆఁ...వున్నానులే!ఒరేయ్ బుజ్జీ ఏమిటా పార్శిల్ ?ఇటివ్వు. నేను చూడాలి" అడిగాడు చక్రవర్తి.
" ఊఁహూ...నేనివ్వను.ఇది మా సందెక్కకొచ్చిన పార్శిల్!అక్కకే ఇస్తాను"అన్నాడు బుజ్జిబాబు.
"ఇలాతేరా అంటుంటే..."పార్శిల్ను లాక్కోబోయాడు చక్రవర్తి.
"హుఁ...నేనియ్యనన్నానా!ఇది సందెక్కకే యివ్వాలి. సందెక్కాయ్...ఇదిగో నీకొచ్చిన పార్శిల్!బావగారు ఇమ్మంటున్నాడు.నేను ఇవ్వలేదు.నువ్వొచ్చి తీసుకో"అన్నాడు బుజ్జిబాబు.సంధ్య గబగబవచ్చింది.మరి కిచ్చన్లో ఏడ్చిందేమో ఆమె చెక్కిళ్ళపై కన్నీటి చారలున్నాయి.

**జరిగిన కథ**
చక్రవర్తి ,సంధ్య ప్రేమించి పెళ్లి చేసుకుంటారు .వాళ్ళ ఇద్దరకూ తరుణ్ చక్రవర్తి ఒక్కడే పిల్లాడు . పిల్లాడిని గారాబంగా పెంచు తూ ఉంటారు.చక్రవర్తికి భార్య సంధ్య అంటే వల్లమాలిన ప్రేమ .సంధ్యకు కుడా భర్త అంటే అంతే ప్రేమ .సంధ్య తల్లితండ్రులు చిన్నతనం లోనే మరణించటం వాళ్ళ బాబాయి దగ్గర పెరుగుతుంది .సంధ్య బాబాయి , తమ్ముడు బుజ్జి బాబు చూడటానికి సంధ్య ఇంటికి వస్తారు .చక్రవర్తి స్నేహితుడి భార్య చరితను ఇంటికి తీసుకువస్తాడు . సంధ్య అనుమనపడుతుంది .సంధ్య బాబాయి నేలరోకులుగా సంధ్య దగ్గరే ఉండటం వాళ్ళ ఇంట్లో గోదావడి వచ్చాడేమో అనుకుంటారు ఇద్దరు. చక్రవర్తి ఆఫీస్ పని మీద డిల్లి వెళతాడు .
**ఇక చదవండి**

జారుతున్నఆ కన్నీటిని పమిటతో తుడుచుకొంది సంధ్య. చిదంబరం ఆమె ముఖంలోకి చూశాడు.
“అదేంటల్లుడూ! మా అమ్మాయి ఏడుస్తున్నట్టుంది!ఏమైందామెకు?” చిదంబరం అడిగాడు.

“అది ఏడవటం కాదు మామగారూ!ఏదో తనకే అర్థంకాని బాధతో కళ్ళకు నీళ్ళు తెచ్చి పెట్టుకొంది.అంతే !”ఎగతాళిగా అన్నాడు.

ఆ మాటలు విన్న సంధ్యకు కోపం వచ్చింది.భర్తను ఏమీ చేయలేక తనలో తానే బాధపడుతూ కన్నీళ్ళను తుడుచుకొంది.
“మామయ్యగారూ, బాబాయ్ మీరు రండి భోంచేద్దురుగాని.రారా బుజ్జీ...”అంటూ వాళ్ళను తీసుకొని లోనికి వెళ్ళబోయింది.

“ఓకే...వెళ్ళండి.వెళ్ళిపోయి అందరూ తృప్తిగా బోంచేయండి.ఐ హేవ్ నో అబ్జక్షన్ . బట్ మామగారూ!బుజ్జిగాడి చేతిలో వున్న ఆపార్శిల్ ప్యాకెట్టును నాకిచ్చి వెళ్ళండి. అదేమిటో నాకు తెలియాలి”నిలదీశాడు చక్రవర్తి.
“ఆ పార్శిల్ మా అమ్మాయి పేరా వచ్చిందయ్యా!నీ కివ్వకూడదు.అది సభ్యత కాదు అల్లుడూ!”అని సర్ది చెప్పబోయాడు చిదంబరం.
“ఎందుకనీ...ఇదిగో ఆవిడ నా పెళ్ళాం. నేను దాని కష్ట సుఖాల్లో పాలుపంచు కొంటున్నాను .పైగా నాడైరీని ఆవిడ చూసి చదివినప్పుడు ఆవిడ పేరా వచ్చిన ఆ పార్శిల్లో ఏముందో నేను చూడ కూడదా?ఇవ్వండి”బుజ్జిబాబు తలమీదున్న పార్శిల్ లాక్కొన్నాడు చక్కవర్తి.అటూ ఇటూ రెండు వైపుల త్రిప్పి చూశాడు.కళ్ళను ఇంతవి చేసుకొని “వ్వాట్ ...ఫ్రమ్ రాజేష్ కుమార్, హైదరాబాద్, టూ సంధ్యారాణి,చెన్నై. వారేవా!ఎవడీ రాజేష్...నాన్నా... నాన్నా...!”పెద్దగా పిలిచాడు.
“ఏమిట్రా...ఎందుకలా అరుస్తున్నావ్ ?నేనిక్కడే వున్నానుగా”అన్నాడు దామోదరం
“పట్టుకున్నాను నాన్నా!దొంగను రెడ్ హేండెడ్ గా పట్టుకున్నాను. ఇదిగో... చూడండి” అన్నాడు చక్రవర్తి.

“ఎవర్రా...ఎవరా దొంగ!”అడిగాడు దామోదరం అర్థంకాక కళ్ళజోడును తేతికి తీసుకొని.
“ఈవిడే...ఈ చక్రవర్తికి పెళ్ళామూ,దామోదరం గారికి కోడలూ అయిన శ్రీమతి సంధ్యా రాణిగారు!ఇదిగో ఆ రాజేష్ గాడు ఈవిడకు రాసిన లేఖ”తండ్రిచేతికివ్వ బోయాడు.

“ఏం లేఖల్లుడూ...!”అర్థమెయ్యేలా చెప్పవయ్యా”చిదంబరం అడిగాడు చక్రవర్తి చేతిలో వున్న ఆ లేఖను చూస్తూ.

“ ప్రేమ లేఖ మామగారూ!అం ...ఇది మీ ముద్దుల కూతురికొచ్చిన ప్రేమలేఖ” చేతిలో వుంచుకొనే చెప్పాడు చక్రవర్తి.

“ప్రేమలేఖా”అలాగే నిశ్చేస్టుడైయ్యాడు చిదంబరం.
“ప్రేమ లేఖేమిట్రా చక్రవర్తీ!”అడిగాడు తండ్రి దామోదరం అయోమయంగా.

"ప్రేమలేఖంటే ఇంగ్లీషులో లవ్ లెటర్ .మీ ప్రియమైన కోడలికి ఆ రాజేష్ గాడు రాసింది.ఇదిగో"అంటూ చేతిలో వుంచుకొనే చూపాడు.

షాకైయ్యింది సంధ్య.తనకు ప్రేమలేఖేమిటి?ఎవరు రాసుంటారు! తట్టుకోలేక పోయిందామె.
"నాకు ప్రేమలేఖా...ఏమిటండీ మీరంటుంది...ఎవరా రాజేష్ !అతను నాకెందుకు ప్రేమలేఖ రాశాడు?"భర్తకు దగ్గరగా వెళ్ళింది సంధ్య.చక్రవర్తి ఆమెనుంచికాస్త జరిగి తండ్రికి దగ్గరగా వెళ్ళాడు. మళ్ళీ సంధ్య అక్కడినుంచి భర్త వద్దకు వెళ్ళబోయింది.

"ఏయ్ !అక్కడే ఆగు.నా వద్దకు రాకు"అని తండ్రి వేపుకు తిరిగి"నాన్నా!నీ కిప్పుడు అర్థమైందా... నా మనో వ్యధకు కారణ మేమిటోనని! ఇవే...ఆవిడ పేరా వచ్చిన ప్రేమ లేఖలు,పార్శిలు.వాటిని ఎంచక్కా హైదరాబాదునుంచి పంపించింది ఆ రాజేషేగాడేనని ఇప్పటికైనా తెలిసిందా!పోనీ నా జేబులోనుంచి తీసి చూపిన ఈ వుత్తరం నాడు నేను క్రియేట్ చేసిందనుకొందాం.మరి ఇప్పుడు మామయ్య బుజ్జిగాడు తెచ్చిన పార్శిల్,ఉత్తరానికి ఏమంటారు చెప్పండి నాన్నా?"ప్రశ్నించాడు చక్రవర్తి.

"ఏమిట్రా చక్రవర్తీ!ఆ పార్శిలేమిటి?వుత్తరమేమిటి?నాకంతా అయోమయంగా వుంది"అర్థంకాక అడిగాడు తండ్రి దామోదరం.
"రెండూ ఆ రాజేష్ గాడివేనని చెప్పానుగా నాన్నా!ఒకటి నెలక్రితం మీ కోడలికి వాడు రాసిన ఈ వుత్తరం. ఇవాళ ఈ పార్శిల్ తోపాటు వచ్చిన మరో వుత్తరం.ఇలా మనకు తెలియకుండా ఎన్నో..." అంటూ పార్శిల్ను విప్పాడు చక్రవర్తి.అందులో వున్న పట్టు చీరను చూసి అవాక్కె య్యాడు.
"చూశారా నాన్నా!ఇది పట్టుచీర.మీకోడలికి ఆ రాజేష్ గాడు ప్రేమతో పంపినది"
"పట్టు చీర చాలా బాగుందక్కాయ్!నువ్వు కట్టుకున్నావంటే ఈ చీరలోఅనుష్కలా వుంటావ్. అం"అన్నాడు బుజ్జిబాబు అమాయకంగా.

కోపం వచ్చింది సంధ్యకు
"ఛీ...నోర్ముయ్యరా వెధవా. ఏమండీ!నోరుందికదా అని మీ యిష్టం వచ్చినట్లు వాక్కండి.ఆ రాజేష్ ఎవడో నాకు తెలియదు.ఈ చీరకూ,వుత్తరా లకు నాకస్సలు సంబంధం లేదు. ఆవుత్తరాలను యిలా యివ్వండి.నేను చూడాలి అంది."ఏడుపు ముఖంతో సంధ్య.

"నో...నో..నో...ఇవ్వనే!ఇవే నాకాధారం.యస్ !నీనుంచి ఆ కోర్టుద్వారా విడాకులు తీసుకొని నేను విడి పోవాలంటే... ఇవి వుండాలి"అంటూ ఆ వుత్తరాలను అందరి కళ్ళకు చూపి మడిచి జేబులో పెట్టుకున్నాడు.

"ఆ వుత్తరాల్లో ఏముందల్లుడూ!?"అర్థం కానట్టు తల పీక్కొంటూ అడిగాడు చిదంబరం.
"ఏముందా...మాటలతో చెప్పుకోలేనంత రాజేష్ గాడి ప్రేమ వీటిల్లో వుంది.ఆహా! ప్రేమ లేఖలు రాయడంలో వాడికి వాడేసాటి. మొత్తానికి నేను అవుటాఫ్ స్టేషన్ లో వున్నప్పుడు మీ అందరి కళ్ళుకప్పిఈవిడ జరిపిన ప్రేమ కలాపాలు అద్భుతమని ఈవుత్తరాల ద్వారా తెలుస్తోంది.వీటిని చదవండి.చదివి నాకే యివ్వండి. ఇవ్వకపోతే నాపై ఒట్టే!"అంటూ జేబులో వున్నరెండు వుత్తరాలను తీసి తండ్రి చేతికిచ్చాడు చక్రవర్తి. దామోదరం కళ్ళజోడును పెట్టుకొని ఆ వుత్తరాలను చదివాడు. సంధ్య ముఖంలోకి చూశాడు.సంధ్య 'మామయ్య గారూ ' అంటూ దామోదరం దగ్గరకు వెళ్ళింది. ఆయన ఏమీ పట్టించుకోకుండా సంధ్యను అసహ్యించుకున్నట్టు చూస్తూ తన గదికి వెళ్ళిపోయాడు. అయోమయంలో పడ్డ సంధ్య"బాబాయ్ ...బుజ్జీ..."అంటూ బాధతో వాళ్ళను బ్రతిమాలుతున్నట్టు వాళ్ళ దగ్గరకు వెళ్ళింది. వాళ్ళూ కూడా సంధ్యతో మాట్లాడ కుండా వాళ్ళగదికి వెళ్ళిపోయారు. ఇక ఏడ్పును ఆపుకోలేకపోయింది సంధ్య. దుఃఖాన్ని దిగమ్రింగుకొంటూ "ఏమండీ...!"అంటూ భర్త వద్దకు నడిచింది.

"నో...నో...నో నన్నలా పిలవకు.సమయానికి ఆ రాజేష్ గాడు ఈ వుత్తరాలను రాసి నా కళ్ళుతెరిపించాడు. ఇక జాగ్రత్తపడతాను.మంచి లాయర్నొకర్ని మాట్లాడుకొని

శాశ్వతంగా విడాకుల ద్వారా నీతో విడి పోతాను. వస్తాను"అంటూ చక్రవర్తి కూడా తన గదిలోకి వెళ్ళిపోయాడు.

సంధ్య ఒక్కర్తే హాల్లో దిక్కుతోచని స్థితిలో నిలుచుండి పోయింది. బిక్కముఖం వేసు కొని అలా అందరి గదుల వేపు చూస్తు కుమిలి కుమిలి ఏడ్చింది.రెండు నిముషాల తరువాత దృఢంగా ఒక నిర్ణయానికొచ్చినట్టు కన్నీళ్ళు తుడుచుకొని పమిటను బొడ్లో దోపుకుంది.

"మామయ్యగారూ...బాబాయ్... ఏమిటి నాకీ శిక్ష?మీరెవరూ మాట్లాడ కుండా సమ్మె చేసినట్టు వెళ్ళి పోయారే!చెప్పండి ?నేనేం తప్పుచేశాను?భగవంతుడా ఎవడీ రాజేష్? ఏమిటా పార్శల్ ,వుత్తరం .నాకంతా అయోమయంగా వుందే! నాకతనితో అక్రమ సంబంధముందా?భగవంతుడా... అస్సలు వూహించలేక పోతు న్నాను. మరయితే...నేను నిర్దోషినని వీళ్ళందరినీ యెలా నమ్మించాలి!నిజంగా నేను నిర్దోషినే! నేను ఏ తప్పు చేయలేదు. నేనేంచెయ్యాలిప్పుడు? నాకేమిటి గత్యంతరం?"అంటూ కుమిలి కుమిలి ఏడ్వ సాగింది సంధ్య. సంధ్య ప్రవర్తనను,ఆమె కుమిలి కుమిలి ఏడుస్తూ వున్నది అందరూ వాళ్ళ వాళ్ళ గదుల్లోనుంచి దొంగ చాటుగా చూస్తున్నారు. ఎంతైనా చిదంబరం ఆమెకు బాబాయి కనుక కూతురు పడుతున్నబాధను భరించ లేక చమర్చిన తన కళ్ళను తుడుచు కున్నాడు.

సంధ్య గట్టిగా ఓ నిర్ణయానికొచ్చినట్టు 'అవును అదేనాకు శరణ్యం.నేనదే చెయ్యాలి. నేను ఈ లోకానికి దూరమవ్వాలి. వీళ్ళు నా పై మోపిన నిందలనుంచి తప్పుకొని ప్రతివ్రతనని ఋజువు చేసుకోవాలి. ఈ నింద నుంచి తప్పు కోవాలంటే నాకదే మార్గం'అని మనసులో అనుకొంది.

గబగబ పెరట్లోకి వెళ్ళింది.అక్కడ మూలున్న మోటరు గదిలోనికెళ్ళి ఓ చిన్న సీసాను తీసుకొని హాల్లోకి వచ్చింది.సీసా బిరడా తీసింది. సీసాలోని పురుగుల మందును నోట్లో పోసుకోబోయింది.అది గదిలోనుంచి గమనిస్తూ వున్న చక్రవర్తి పరిగెత్తు కొంటూ వచ్చి చేతిలో వున్నపురుగుల మందు సీసాను తన చేత్తో తట్టాడు. అయినా సంధ్య సీసాను విడిచి పెట్టలేదు. ఇకలాభం లేదనుకున్నాడు చక్రవర్తి. "నాన్నా...,మామయ్యా'అని పెద్దగా పిలిచాడు.అవతల గదుల్లో వున్న వాళ్ళు పరిగెత్తి నట్టు హాల్లోకి వచ్చారు.పిల్లాడు తరణ్ చక్రవర్తి తనకేమి జరుగుతుందో తెలియకపోయినా తల్లి ఏదో అఘాయిత్యానికి పూనుకొందని భావించి 'అమ్మా... అమ్మా'అంటూ వెళ్ళి ఆమె కాళ్ళను చుట్టేసుకున్నాడు. చిదంబరం బలవంతాన సీసా లాక్కోబోయాడు. విడిచిపెట్టలేదు సంధ్య.గట్టిగా పట్టుకొంది సీసాని. "నన్నాపకండి.నేను చావాలి. నాపై మోపిన ఈ అబంఢాన్ని భరించలేను.నేను చావాలి.నేను చావాలి"అని పెద్దగా ఏడ్వసాగింది. "ఎందుకమ్మా!ఏమిటీ పిచ్చి పని?"బాధ పడుతూ అడిగాడు చిదంబరం.

"చెప్పక్కాయ్ !బావ తాగొచ్చి నిన్ను తన్నాడా లేక ఇంకెవరైనా నిన్ను తిట్టారా?" బుజ్జిబాబు బ్రతిమాలినట్టు అడిగాడు. "నో...నేనెవరికీ సమాధానం చెప్పలేనురా బుజ్జీ!నేను చావాలంతే. అప్పుడే ఈ ఇంట్లో కొందరికి నెమ్మది"చేతులు విడిపించుకోవాలని గింజుకొంటుంది.చక్రవర్తికి కోపం శృతి మించింది.వెంటనే చెంపను చెళ్ళుమనిపించాడు.చేసేది లేక సంధ్య వెక్కి వెక్కిఏడ్వసాగింది. "ఏమిటే సంధ్యా నీ ఆగడం?"ప్రశ్నించాడు చక్రవర్తి. "ఏమైందిరా...నా కోడలికి చక్రవర్తీ!"ఆందోళనతో అడిగాడు దామోదరం.

"నా కూతురు పురుగుల మందు తాగి చావాలనుకొంది బావగారూ!"చిదంబరం దీనాతి దీనంగా అన్నాడా మాటల్ని. "ఆc..."షాక్కు గురైయ్యాడు దామోదరం.

"అవును నాన్నా!దీనికి పిచ్చి పట్టింది"చక్రవర్తి వొత్తి పలికాడు ఆ మాటల్ని.సంధ్య పెద్దగా "నో...నో....నో...పిచ్చి పట్టింది నాక్కాదు.మీకు.మీ అందరికి. కాకపోతే ఎవడో ఓ వెధవ రాసిన వుత్తరం,వాడు పంపిన పట్టు చీరను ఆధారాలుగా చేసుకొని నన్ను తప్పుడు దాన్ని చేస్తారా? మీరంతా నాతో మాట్లాడకుండా... నేను మీతో మాట్లాడ్డానికి సందర్భం కలుగజేయకుండా దోషిగా

పరిగణిస్తారా!ఇవన్నీ ఎందుకు? నన్ను కన్నకూతురికన్నా మిన్నగా చూసుకునే మామయ్యగారే నన్ను సందే హించారు. ఇక నేనెందుకు బ్రతకాలి? అందుకే చావాలన్న నిర్ణయాని కొచ్చాను. అవును... నేను చావాలి.నేను చావాలి"బోరుమని ఏడ్చింది సంధ్య.

"ఆగమ్మా తల్లీ!ఏడవకు.అసలు నువ్వెందుకు చావాలి?"చిదంబరం ప్రశ్నించాడు.

"అవునక్కాయ్!అలాంటి పనులు ఎవళ్ళు చేశారో వాళ్ళే చావాలి. కదూనాన్నా" బుజ్జి బాబు అన్నాడు. "మధ్యలో వీడొకడు.నువ్వూరుకోరా బుజ్జీ!అమ్మా సంధ్యా!కాస్త తమాయించుకొని శాంతించు. అల్లుడితో నేను మాట్లాడుతానుగా! మీ ఇద్దరి మధ్య వున్న ఈ అపోహ లకు, సందేహాలకు కారణం తెలుసుకొని ఆ చిక్కుముడులన్నిటిని చక్కగా విప్పే స్తాగా!" కూతురుని సముదాయించాడు చిదంబరం. అల్లుడు వేపు తిరిగి సూటిగా అతని ముఖంలోకి చూశాడు.

"అల్లుడుగారూ!మీకు పెళ్ళయి ఎన్నేళ్ళయ్యిందయ్యా?" ప్రశ్నించాడు. "ఎనిమిదేళ్ళు"

"మరి ఎనిమిదేళ్ళు ఏలాంటి అరమరికలు లేకుండా చక్కగా, సాఫీగా సంసారాన్ని సాగించారు. అవునా?"ప్రశ్నించాడు చిదంబరం, "అవును"సమాధానం చెప్పాడు చక్రవర్తి.

"మరిన్నేళ్ళు నా కూతురితో సంసారం సాగించిన తమరు ఇవాళ ఆమెను సందేహిస్తూ తప్పుగా మాట్లాడుతున్నారే... అది మీకు న్యాయమా చెప్పండి?"

భర్త చక్రవర్తికి సరైన ప్రశ్నను సంధించి ఇరకాటంలో పెట్టాడు బాబాయి అని మన సులో అనుకొంది సంధ్య. అలాంటి ప్రశ్నలతోనే చక్రవర్తికి బుద్ధి రావాలనుకొంది.

"అడగండి బాబాయ్ !బాగా అడగండి.ఈయనగారు తన పాత డైరీలో రాసిన వారి యొక్క ప్రియస్వప్నతో యిప్పటి వరకూ సాగించిన, సాగిస్తున్న సంబంధం గూర్చి కూడా బాగా అడగండి"పాయింటును బాబాయికి అందించింది. "అదీ...అదీ... గారూ..."తటపటాయించాడు చక్రవర్తి.

"చూశారా చెప్పటానికి ఎలా తడబడుతున్నారో!వారు చెప్పలేరు బాబాయ్. బాగా నటిస్తారు"బాధపడుతూ అంది సంధ్య.

"అన్నట్టు ఏమిట్రా ఆ తడబాటు.ఏదైనా సరే సూటిగా వివరించరా చక్రవర్తీ!అసలు నీ ప్రవర్తనంతా నాకు అర్థం కావటం లేదురా"దామోదరం తన చేత్తో నొసటిని కొట్టుకున్నాడు.

"మీరు ఆవేశపడకండి బావగారూ!నేను చెపుతాను. మా అమ్మాయి మీ అబ్బాయితో ఎనిమిదేళ్ళనుంచి కాపురం చేస్తోంది.అవునా తల్లీ"చిదంబరం అన్నాడు.

"అవును బాబాయ్ !ఇలాంటి వారని తెలీక ఎంచక్కా కాపురం చేశాననీ" "కనుకనే కదమ్మా మాకో ముద్దుల మనవణ్ణి కూడా కని పెట్టావు.బాగానే వుంది. అయితే మీ ఎనిమిదేళ్ళ దాంపత్య జీవితంలో మీరిద్దరూ ఒకరినొకరు ఎంత వరకు అర్థం చేసుకొన్నారోనన్నదే మాకు తెలియని విషయం.ఇద్దరు కలసి చక్కగా సాగి స్తున్న మీ సంసారంలో వున్నట్టుండి చిచ్చు పెట్టుకొన్నారని నాకు ఇప్పుడు అర్థమైంది. అందుకు కారణమేమిటో ముందు నువ్వు చెప్పల్లుడూ!"అంటూ బంతిని అల్లుడి కోర్టులోకి నెట్టేసి అటూ ఇటూ చూశాడు చిదంబరం. "కరెక్టు బాబాయ్ !ఈ ప్రశ్నకు సమాధానం వారే చెప్పాలి.మీరు బాగా నిలదీశారు"

"మరి... వూరికే వదలి పెడతాననుకున్నావా?బాగా అడుగుతాను. చెప్పల్లుడూ! మీరిలా అవటానికి కారణమేమిటి?"తన ఎడమ చేతిలో కుడిచేత్తో గుద్దుకొంటూ గద్దించినట్టు అడిగాడు చిదంబరం.

"ఏంటి చెప్పేది బొక్క?కారణం నేను చెప్పాలా?మీరే చెప్పాలి.అవును. ఆ రాజేష్ గాడెవడో వాడికీ మీ ముద్దుల కూతురుకున్న సంబంధమేమిటో మీరు చెప్పాలి"

"మా పార్టులో ఏం మిస్టేకుందయ్యా మేము చెప్పుకోవటానికి.నువ్వే చెప్పాలి. కదమ్మా"కూతురి వంక చూసి అడిగాడు చిదంబరం.
"సరే....మీ మాట ప్రకారం నాలోనే ఏదో తప్పుందన్న మీ వూహ నిజమేనను కొందాం.మీ కూతురు గూర్చి సందేహపడ్డది కూడా తప్పేననుకొందాం. మరి ఈ ప్రశ్నల్నేరివర్సులో మిమ్మల్ని నేడిగితే మీ వద్ద జవాబువుందా? "చక్రవర్తి అడిగాడు.

చిదంబరానికి కోపం వచ్చింది. చక్రవర్తి ముఖంలోకి సూటిగా చూశాడు.

"ఏమిటయ్యా!ఏమడుగుతావు. అహా...మ్మల్నిఏమడుడుగుతావని. ఒకే అడుగు ఏదీ దాపరికం లేకుండా ఖచ్చితంగా జవాబులు చెపుతాం. అడగవయ్యా బాబూ! ఏమ్మా... అంతేగా?"కూతుర్ని అడిగాడు.
"కరక్టు బాబాయ్ !అడగమనండి. అన్ని ప్రశ్నలకు మనవద్ద లీగలుగా జవాబు లున్నాయ్ "సంధ్య చెప్పింది.

"అయితే అడుగుతాను మామగారూ కాసుకొండి!అదీ...అదే మీరు అంటున్న ఆ ఎనిమిదేళ్ళు నాతో కాపురం చేసిన ఈవిడ అంటే మీ కూతురు నన్నేమాత్రం అర్థం చేసుకుందానీ ...? "సాగదీసి అడిగాడు.

"అబ్బోఇది సరైన మడత పేచీనే!సందెక్కాయ్ !నువ్వు బావయ్య ప్రశ్నకు చిత్తైపోయావ్ " అన్నాడు బుజ్జిబాబు.
"నీ బొంద నువ్వూరుకోరా.. మడత పేచీలేదు...మడత కాజా లేదు.అక్కవద్ద మీ బావయ్య అణిగిపోవల్సిందే!నువ్వు చెప్పమ్మా!"చిదంబరం సంధ్యకు సపోర్టు చేస్తూ అన్నాడు.
ఆవేశంతో వూగిపోయింది సంధ్య. ఎగస్వాసతో "చెప్పనా మరి. వారి ప్రశ్ననకు సమాధానం నేను చెపుతాను బాబాయ్!వినండి.నా చేతికి వారి డైరీ దొరకనంత వరకూ వారు మంచివారే..."

"ఆc...బాగుంది! తరువాత... చెప్పమ్మా"అడిగాడు చిదంబరం.
చక్రవర్తి సంధ్యను చెప్పనీకుండా అడ్డు తగులుతూ "ఆ డైరీ దొరికిన తరువాత కూడా నేను మంచివాణ్ణే నమ్మాయ్!మీరనుకొంటున్నట్ టు తాగు బోతునో, తిరుగు బోతునో కాను.ఢిల్లీనుంచి వచ్చిన తరువాత నేను తాగి తందనాలు ఆడుతున్నా నని మీరు అనుకొంటున్నారు. తాగుడుకి నేనెప్పుడూ దూరం.ఆ సంగతి సంధ్యకు కూడా బాగా తెలుసు.ఖచ్చితంగా చెప్పాలంటే ఇంతవరకూ నా ద్వారా జరిగిందం తా కేవలం నటన మాత్రమే!వాళ్ళకు నా గూర్చి నువ్వే చెప్పుసంధ్యా!"అన్నాడు చక్రవర్తి.
"సారీ...మీతో నేను మాట్లాడ్డం లేదు.మీరెన్ని చెప్పినా నేను వినను కూడా! మీరు చెడు ప్రవర్తన కలిగిన వారని చెప్పుకోవటానికి నావద్ద బోలెడు సక్ష్యాధారాలు వున్నాయ్!ఇక తాగుతున్నారని చెప్పుకోవటానికి ఇంతకన్నాఋజువులుఅవసరం లేదు" కోపంగా అరిచినట్టు అంది సంధ్య.

"తప్పమ్మా!అలా అరిచి మాట్లాడకు.మీ భార్యభర్తల వ్యవహారాన్ని పూర్తిగా ఆచి తూచి గమనిస్తే అల్లుడు మంచివారేనన్నట్టు నా సిక్స్ సెన్సు చెపుతోంది.ఏదేమైనా ఇంతటి రాద్ధాంతానికి దారితీసిన చరిత్ర కలిగిన అల్లుడు..."ఏదో చెప్పబోయాడు చిదంబరం.
"బాబాయ్ !ఏమిటి మీరంటుంది?మెల్లగా ట్రాకు మారుతున్నారు.వారికి సపోర్టు చేస్తున్నారా?"అడిగింది సంధ్య,

"అబ్బే అదేం కాదమ్మా. అల్లుడిగారిని అడుగుతున్నాను. చెప్పండి అల్లుడూ! నర్మ గర్భంగా అంటున్నమీ మాటలను ప్రక్కన పెట్టి నా కూతురికి అసలు విషయాలను వివరంగా చెప్పవయ్యా!లేకపోతే నా కూతురు నిత్యం ఇలాగే ఏదో వూహించుకొని కుళ్ళి, కృషించి ఖచ్చితంగా ప్రాణాలపైకి తెచ్చుకొంటుంది.కనుక ఆ డైరీలో వున్న ఆ ప్రయస్వప్నకూ నీకూ వున్నసంబంధమేమిటో దయచేసి చెప్పు?" నిలదీశాడు.
"కరెక్టు.అదే...ఆ సంగతినే తేల్చమనండి బాబాయ్ !ఇప్పుడే తేల్చమనండి. వారికి ఆవిడకున్న సంబంధ మేమిటో మనందరి ముందు ఇప్పుడే తేల్చాలి వారు"సంధ్య భీష్మించుక్కూర్చొంది.

" సంబంధమా!ఏమీ

లేదు సంధ్యా!...అదీ...అదీ... ప్రియస్వప్నంటే నేనే సంధ్యా!" నవ్వుతూ అన్నాడు.

"ఆహా !భలే బుకాయిస్తున్నారే!మీరేం చెప్పినా మేము నమ్మాలా?"అడిగింది సంధ్య.

"నమ్మక తప్పదమ్మా.ప్రియస్వప్న అనేది నా పెన్ నేమ్ !నా కలం పేరండి మామగారూ!నేను రచయితనని మీకు తెలుసు.ప్రియస్వప్నఅన్న పేరుతో నేను స్కూలింగ్ చదువుతున్నరోజులనుంచి రచనలు చేస్తున్నాననీ తెలుసుకదా! అందుకని నేను చెప్పేది ఆశ్చర్యపోకుండా అందరూ సావదానంగా వినండి. సంధ్యా!ముఖ్యంగా నువ్వువినాలి. నేను కాలేజీ చదువుతున్న రోజుల్లో అందరి కుర్రాళ్ళలా నా వుహాజగత్తులో ఓ చక్కటి వూహా సుందరిని వూహించుకొని ఆ సుందరితోనే ప్రేమనుపడి ఆమెతో రకరకాల విన్యాసాలను చేస్తూ హరివిల్లు రంగుల కలలు కంటూ ఆ కలలను కథలు,కవితలుగా రాస్తుండే వాడిని. నా స్నేహితు లందరూ నేను ఎంచుకున్న 'ప్రియస్వప్న'అన్నకలం పేరు బాగుందని చెప్పటంతో ఆ ప్రియస్వప్నఅన్న కలం పేరునే నాకు ప్రేయసిగా మార్చుకొని,దానికి ప్రాణం పోసి కలల సుందరిగా భూమ్మీద నడయాడజేస్తూ, నా స్నేహితులను నమ్మిస్తూ వాళ్ళ దృష్టికి నేనో సినీ హీరోలా ఫీలవుతూ వచ్చాను. అయితే... నిజంగానే నా జీవితంలో ఎదురు చూడని పరిణామం చోటు చేసుకోంది. ఆ దేవుడు నన్ను నా సంధ్యతో ప్రేమలో పడేశాడు. కొన్నాళ్ళకు మా ప్రేమాయణా న్ని మా తల్లితండ్రులకు మేమే తెలుపగా వాళ్ళు సాంప్రదాయసిద్ధంగా మాట్లాడు కొని మా పెళ్ళి జరిపించి మమ్మల్ని ఒకింటి వాళ్ళను చేశారు.

ఇక నాకు పెళ్ళయిన తరువాత ఈ కలం పేరుతో పనేముందనుకొని నేను రాసు కున్న ఈ ప్రియస్వప్నడైరీలను,నాకు నేనే రాసుకున్నఆ ప్రేమ వుత్తరాలను అటకె క్కించేశాను.నిజానికి ఈ సంగతి నా పెళ్ళయినప్పుడే సంధ్యకు నేను విన్నవించు కొని వుంటే ఇంత కథ జరిగేది కాదు.నేనూ ఇదేమంత పెద్ద విషయం కాదనుకొని సంధ్యకు కూడా చెప్పలేదు. ఇవాళ ఆడైరీ,వుత్తరాలే ఇంతటి విపరీత పరిణామాలకు దారి తీసి నా కొంప ముంచుతాయనుకోలేదు.ఇది కేవలం కుర్రతనంలో కాలేజీలో చదువుకొంటున్నరోజుల్లో నా సరదా కోసం ఓ సినీ హీరోలా రాసుకున్నవే తప్ప మీరూహించుకున్నట్లు కాదు మామయ్యా.నన్ను నమ్మండి"అని వాళ్ళందరూ నమ్మాలని ఓ సుదీర్ఘమైన వుపన్యాసాన్నిఇచ్చాడు చక్రవర్తి.

అప్పటికీ నమ్మని చక్రవర్తి తండ్రి దామోదరం"పోనీ... మరా వుత్తరాలూ,పార్శిల్ ఎక్కన్నుంచొచ్చాయిరా!అసలు ఇన్ని సమస్యలు ఏర్పడ్డానికి కారణం అవేగా!?" కొడుకుని నిలదీశాడు దామోదరం. ప్రక్కనే నిలబడి వున్నచిదంబరం అటు తిరిగి తలగోక్కొంటూ మెల్లగా దామోదరం వేపుకు తిరిగాడు.

"అందుకు కారణం నేనే బావగారూ!భర్త మీద సందేహాలను బాగా బలపరచుకొన్న నా కూతురిలో వాటిని అంత సులువుగా తొలగించలేమనుకున్న నేను ముల్లును ముల్లు తోనే తీయాలన్న చందాన ఆమె సందేహపు తెరలను తొలగించటానికి ఈ చిన్ననాటకమాడాను.ఆ వుత్తరం,పార్శిల్ వగైరా వగైరాలన్నీఏర్పాటు చేసింది నేనే" కుండ బద్దలు కొట్టాడు చిదంబరం. "ఎంత పని చేశారండీ బావగారూ!అన్నెం పున్నెం ఎరుగని నా కోడల్ని చివరికి నేను కూడా సందేహించేలా చేశారు"బాధపడుతూ అన్నాడు దామోదరం.

కథ మొత్తం అర్థంచేసుకున్న దామోదరం ఇక వూరకుండలేక పోయాడు.సంధ్యకు దగ్గరగా వెళ్ళాడు.

"అమ్మా సంధ్యా..."అని నిండు మనసుతో పిలిచాడు దామోదరం. మామయ్య దామోదరం పిలుస్తూనే ఎమోషన్కు లోనయ్యింది సంధ్య.ఆమెలో దుఃఖంతో పాటు సంతోషం కూడా కట్టలు తెంచుకొంది.మామగారి దగ్గరకు వెళ్ళింది.

"మామయ్యగారూ!"అంటూ కన్నీళ్ళను తుడుచుకొంది.
"నన్ను క్షమించమ్మా!అందరిలా నేనూ నడుచుకున్నాను. ఒక్కనిముషం నీ స్థానంలో వుండి నేను ఆలోచించి వుంటే నిన్ను తప్పుగా వూహించుకునేవాణ్ణి కాదు"అన్నాడు దామోదరం.
"సారీ సంధ్యా!నేను నిష్కలంకుడనని,నిత్యం నా మనసులో నీకే చోటుందని,నేను ఎలాంటి తప్పూ చేయలేదని ఆ సంగతి నువ్వు తెలుసుకోవాలని,నిన్ను నమ్మించ టానికి గత్యంతరంలేక మామయ్య... అంటే మీ బాబాయి రచించిన ఈ నాటకంలో పాత్రధారుణ్ణి అయ్యాను. మేము ఈ నాటకం ఆడకపోతే ఈ జన్మలో నువ్వు నన్ను నమ్మే దానవు కావు. సంధ్యా!ఇప్పటికైనా నన్ను నమ్ముతావు కదూ!" చక్రవర్తి నోటి వెంట ప్రేమగా వచ్చాయా మాటలు.
అప్పటికే భర్తను అర్థంచేసుకొంది సంధ్య.వాళ్ళాయన బంగారమని,ఆయన మనసు వెన్నని,నిజంగా నిష్కలంకుడని మనసులో అనుకొందామె.
"సారీ అండీ!నాకేదో శని దాపురించి కొన్నాళ్ళు మిమ్మల్నిఅపార్థం చేసుకొన్నాను. అందువల్లనే ఆ కొన్నాళ్ళు నా కాపురం చీకటిలో కొట్టుమిట్టాడింది. ఇప్పుడు మిమ్మల్నిపూర్తిగా అర్థం చేసుకున్నానండి.ఇలా ఇంకెప్పుడూ జరగదండి.మీరూ నన్ను క్షమిస్తారు కదూ"అంటూ తలదించుకొని భర్త దాపుకు వచ్చింది సంధ్య.
ఆమెను దగ్గరకు తీసుకున్నాడు చక్రవర్తి.ఆమె చెక్కిళ్ళమీది వున్న కన్నీటి చారలను తుడిచాడు.
తన ప్రక్కనే వున్నకొడుకు తరణ్ చక్రవర్తిని దగ్గరికి తీసుకొని భర్తలోకి హొదిగి పోయింది సంధ్య.

"క్షమాపణలన్నవి భార్య భర్తల మధ్య వుండకూడదు సంధ్యా! నిజానికి ఏ స్త్రీ అయినా సరే నీ స్థానంలో వుంటే అలాగే అనుకొంటుంది" సంధ్యను మరీ దగ్గరకు తీసుకొని హత్తు కున్నాడు చక్రవర్తి వాళ్ళ ముద్దుల కొడుకుతో పాటు..చప్పట్లు కొట్టాడు చిదంబరం.

"నువ్వు కరక్టమ్మా!తన స్వంతం అనుకొన్న ఏ వస్తువైనా సరే పరాయి పంచన చేరిందంటే ఏ ఆడదీ ఒప్పుకోదు.అందునా కట్టుకున్న భర్తంటే ఇక చెప్పాల్సిన అవసరం లేదు"అన్నాడు చిదంబరం అంతవరకూ నడిచిన డ్రామాకు తెరవేస్తూ.

"అవును బాబాయ్ !వీరు నాభర్త. నాకే స్వంతం.నిత్యం నన్నే ప్రేమించాలి.మరో స్త్రీ మా వారిని కనీసం కన్నెత్తి చూసినా నేను ఓర్చుకోలేను.అస్సలు ఒప్పుకోను బాబాయ్! "అంటూ మనసులోని మాటను బయట పెట్టింది సంధ్య.
"భలే!సాటి స్త్రీ సైతం నిన్ను చూసి తెలుసుకొని భర్తను జాగ్రత్త పరచుకునేలా బాగా చెప్పావమ్మా. నిన్ను అభినందించక తప్పదు. మీ భార్యాభర్తలిద్దరూమీ బాబుతో వున్న తీరు నాకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది.ఇకపై మీ జీవితాల్లో సందేహా లకు, అపోహలకు చోటివ్వకుండా చక్కగా సంసారాన్ని సాగించుకోమ్మాసంధ్యా!" అంటూ ఆశీర్వదించాడు దామోదరం.

©©©

©©©

(అయిపోయింది)

వచ్చే వారం మరో సీరియల్ తో ...

సీరియల్



# రెప్పచాటు స్వప్నం

నామాని సుజనాదేవి

"వావ్! చంద్రా! మహేష్ చంద్రా! ఎన్నాళ్ళవుతుందిరా నిన్ను చూసి. నాకూ ఎక్కడో చూసినట్లు అనిపించింది కాని, ఆ స్కూల్ డేస్ ఎక్కడ? బాధ్యతల బరువులు మీదపడ్డ ఈ వయసెక్కడ? చాలా మారిపోయాం" అంటూ లేచి ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు డాక్టర్ వివేక్.

ఇద్దరూ అప్పటి స్కూల్ డేస్ లోకి వెళ్ళిపోయారు.

స్కూల్లో మెరికల్లాంటి విద్యార్థులు అయిన ఇద్దరి మధ్య ఎంత స్నేహం ఉండేదో, ప్రతీ విషయంలో అంత ఆరోగ్యకరమైన పోటీ ఉండేది. ప్రతీ ఆటలో, పాటలో, పద్యంలో, చదువులో ఎప్పటికీ ఈ ఇద్దరే మొదటి రెండు స్థానాల్లో వస్తూ ఉండేవారు. ఒకసారి ఇలాగే వేషధారణ పోటీలు జరిగినప్పుడు వివేకానందుని వేషం వివేక్, అల్లూరి సీతారామరాజు వేషం మహేష్ వేసారు. వేష ధారణలో అందరూ మొదటి స్థానం మహేష్ కే ఇచ్చారు. అయితే తర్వాత ఆ వేషం పై వ్యక్తపరచమన్న భావాల్లో మాత్రం మహేష్, "రూథర్ ఫర్డ్! నీకు దమ్ముంటే కాల్చు. నా ఒక్కో రక్తపు బొట్టు నుండి వేయి సీతారామరాజులు ఉదయిస్తారు.

జైహింద్ " అంటూ వెనక చేతులు కట్టేసినందుకు గుండు తగిలినట్లు కిందపడిపోతే , వివేక్ అనర్గలంగా వివేకానందుని స్పీచ్ వినిపించాడు.

దానితో మొదటి బహుమతి కాస్తా వివేక్ చెంతకు చేరింది. దాని విషయమై ఇద్దరూ ఎప్పటికీ గుర్తుచేసుకుని ఆ డైలాగ్స్ ని అప్పుడప్పుడు గుర్తు చేసుకుంటూ నవ్వుకునేవారు. అది వారికి ఒక మరపురాని అనుభవంగా మారిపోయింది. అలాగే పల్లెటూరు అయిన వారి ఊరిలో రెండు జట్లుగా చీలి క్రికెట్ ఆడేవారు. అందులో కూడా రెండు టీమ్స్ లో వీరే లీడర్స్ గా ఉండేవారు. అబ్బో, గెలవడానికి ఒకరిని మించి ఒకరు, ఒకరికి తెలియకుండా ఒకరు ప్రాక్టీస్ చేసేవారు. అయినా ఎట్టకేలకు ఇద్దరికీ ఒకరి విషయం ఒకరికి తెలిసేది. అవన్నీ ఇప్పుడు ఇద్దరూ గుర్తు తెచ్చుకున్నారు.

"ఎంతైనా ఏ సమస్యలు పట్టని ఆ రోజులే వేరు. ఎన్ని ఏళ్ల తర్వాత కలిసాము. చాలా సంతోషంగా ఉంది. అసలు మీ నాన్న పోయాక మళ్ళీ ఎందుకు రాలేదు" అన్నాడు మహేష్.

"అవును. మనం కలవడం నాకూ సంతోషంగా ఉంది. ఆ ఏడాది మాకు పంటల్లో చాలా నష్టం రావడంతో, నాన్న పురుగుల మందు తాగాడు. బతికించడానికి పట్నం తీసుకుపోయినా, దారిలోనే చనిపోయాడు. అమ్మ ముత్తయిదువలా తిరిగిన చోటకి, సర్వం కోల్పోయి నేను రాలేనంది. అందరం పొట్ట చేతపట్టుకుని మేనమామ దగ్గరకు వచ్చాం. ఆయన అమ్మకు వచ్చిన కుట్టుపనితో పదిమందికి నేర్పించే వ్యాపకం పెట్టించి, అమ్మ బాధ తగ్గించి నన్ను కాలేజీలో చేర్పించాడు. నాన్న సరైన సమయానికి వైద్యం అందక చనిపోయినందుకు నాకు డాక్టర్ కావాలనే ఆశ ఉండేది. అందుకే పట్టుదలతో సీట్ తెచ్చుకుని డాక్టర్ ని అయ్యాను. నాన్న అలా చనిపోయినందుకు మరెవరూ అలా చనిపోకుండా మన పల్లెలో హాస్పిటల్ పెట్టాలనుకున్నాను. అయితే నేను తగిన వనరులు సమకూర్చుకునేలోగా వేరే వారు హాస్పిటల్ పెట్టారు. అదీ కాక నాన్న లేని ఆ ఊరికి వస్తే మళ్ళీ నాన్న జ్ఞాపకాలు నన్ను వెంటాడతాయనిపించింది. అమ్మకూడా నాన్న లేని ఆ ఊరు చూడలేనంది"

"నువ్వు రాకపోవడానికి వెనక ఇంత కథ ఉందా? డాక్టర్ చాలా మంచివారు. అనాథాశ్రమానికి, వృద్ధాశ్రమానికి రెగ్యులర్ గా ఉచిత సేవలు చేస్తుంటారు అంది సిస్టర్. నాకు చాలా గర్వంగా ఉందిరా"

" నేను చేసేది పెద్ద సేవ కాదు. నా చేతిలో ఉన్న పనే కదా! చెల్లిని ఎప్పుడో చిన్నప్పుడు చిన్నపిల్లగా ఉన్నప్పుడు చూసిన గుర్తు. అందుకే గుర్తుపట్టలేదేమో నేను. కాని ఈ క్యాన్సర్ ఏంటి తనకు? ఎలాంటి చెప్పుకోదగ్గ లక్షణాలు ఉండవు కాబట్టి ఇది ప్రాథమిక దశలో గుర్తుపట్టడం కష్టం. మీకు ఎలా తెలిసింది? ఎప్పుడు తెలిసింది?"

"నువ్వన్నట్లే నిజానికి ప్రాథమిక దశలో ఎలాంటి లక్షణాలు ఉండవు కాబట్టి గుర్తుపట్టలేము. కాని మేము నాన్నను రెగ్యులర్ చెకప్ కి తీసుకెళ్ళి నపుడు బయటపడింది. ఆ ఫ్యామిలీ డాక్టర్ నాకు మంచి ఫ్రెండ్. ప్రతి ఏడాది మా పొలంలో పండే అన్ని ఆర్గానిక్ ధాన్యాలు వారికి ఇస్తాము. అందుకే ఎంత బలవంతం చేసినా మా దగ్గర డబ్బులు తీసుకోడు. నాన్నతో పాటు నేను, వెన్నెల వెళ్ళాము. నాన్న చెకప్ అయిపోయిన తర్వాత , 'ఎప్పుడూ రానివారు, ఎలాగూ మీ ఊరు వదిలి ఇంతదూరం వచ్చారు కదా! మీరు కూడా నార్మల్ టోటల్ బాడీ చెకప్ చేసుకోండి. నేను కూడా ఈ రోజు కొంచెం ఫ్రీ గా ఉన్నాను' అన్నాడు. దానితో మేమూ సరే అన్నాము. అదిగో అప్పుడు చేసిన పరీక్షలలో అతనికి అనుమానం వచ్చి, ఎందుకైనా మంచిదని నాకు తన అనుమానం చెప్పి, తన ఫ్రెండ్ అయిన ఇక్కడి స్పెషలిస్ట్ దగ్గరకు పంపించాడు. అది ప్రాథమిక దశ అని అయితే నిర్ధారణ అయ్యింది. డాక్టర్, 'ఆమె మానసిక ధైర్యం కోల్పోకుండా, క్యాన్సర్ ను ప్రతిఘటిస్తూ, వైద్యుల సూచనలకు సహకరిస్తూ కృషి చేస్తే బయటపడవచ్చు. కానీ అది చాలా కష్టం' అన్నారు. ఆయనతో, 'నేను ఈ వ్యాధి నుండి బయటపడి చూపెడతాను చూడండి' అని ఛాలెంజ్ చేసింది వెన్నెల. 'ఆమె మనోధైర్యం చూస్తే ముచ్చటేస్తుంది, కానీ అది అంత సులభం కాదు'

**జరిగిన కథ**
మహేశ్వరీ కాలేజి హాస్టల్ లో ఉంది చదువుకుంటూ ఉంటుంది .వెన్నల తన రూం మెట్ .శ్రీరామనవమికి మహేశ్వరీ వెన్నల వాళ్ళ ఉరు వెళుతుంది .అక్కడ వెన్నల అన్నయ్య మహేష్ పరిచయమౌతాడు .
**ఇక చదవండి**

అన్నారు డాక్టర్. అంతా ఆదైవ కృప" కళ్ళల్లో కన్నీటి తెర అడ్డుపడుతుంటే నిట్టూర్చాడు మహేష్.

"అసలు కాలేయ కాన్సర్ ఏంటి? ఎలా వస్తుంది?పూర్తి వివరాలు చెప్పండి " అడిగాడు కౌండిన్య. అప్పుడు మహేష్ తేరుకుని అందరినీ డాక్టర్ కి పరిచయం చేసాడు.

" సాధారణంగా పనిచేసే కణాలు మ్యుటేషన్ కు గురై నియంత్రణ లేకుండా గుణించి, కణితి ద్రవ్యరాశిని ఏర్పరుచుకున్నప్పుడు క్యాన్సర్ అభివృద్ధి చెందుతుంది మరియు ఇది ఏదైనా కణజాలంలో సంభవించవచ్చు. కాలేయ కణాలు నియంత్రణలో లేనప్పుడు విస్తరించినప్పుడు దాన్ని కాలేయ క్యాన్సర్ అంటారు. కాలేయం శరీరంలోని ముఖ్యమైన మరియు అతి పెద్ద భాగాలలో ఒకటి. ఇది ఉదర కుహరం యొక్క కుడి ఎగువ భాగం వైపు ఉంటుంది. దీనిలో ప్రాథమిక, ద్వితీయ అనిరెండు రకాలు, వాటికి మళ్ళీ ఉపరకాలు చాలా ఉన్నాయి"

"అసలు ఎవరికీ తెలియకుండానే వస్తుంది అంటే భయం వేస్తుంది. ఈ క్యాన్సర్ లక్షణాలు ఏమిటి డాక్టర్ గారూ ?" ఉమ అడిగింది.

"నిజానికి ప్రాధమిక దశలో ఏ లక్షణాలుండవు. తర్వాత అవాంఛిత బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, వికారం, వాంతులు, ఎగువ పొత్తి కడుపు నొప్పి, అలసట ఇలా చాలా ఉంటాయి"

"ఎక్కువగా ఏ రకంగా ఇది వచ్చే అవకాశం ఉంటుంది?"

"మద్యం ఎక్కువగా సేవించడం, పొగ తాగడం, మైకో టాక్సిన్స్ అంటే అనేక శిలీంద్రాల ద్వారా సహజంగా సంభవించే విషాలు. అనేక ఆహారాలు, ముఖ్యంగా తృణ ధాన్యాలు, ఎండిన పండ్లు, గింజలు, సుగంధ ద్రవ్యాల ద్వారా ఇవి పెరిగే అవకాశం ఉంది. ఇవి ఆహారం తయారు చేసిన తర్వాత కూడా ఉండవచ్చు"

"దీనిని నిర్ధారించడానికి ఏ పరీక్షలు చేస్తారు?"

"రక్త పరీక్ష, అల్ట్రా సోనోగ్రఫీ, ఆన్జియోగ్రాం లివర్ బయాప్సి ఇలా చాలా ఉంటాయి"

" చికిత్స ఎలా?"

"సర్జరీ, రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్, ఇథనాల్ ఇంజక్షన్, రేడియేషన్ థెరపీ , కీమో, రేడియో ఏమ్బొలైజేషన్, ఇమ్యునోథెరపీ, పాలియేటివ్ కేర్. ఇలా రకరకాలుంటాయి. ప్రారంభ దశలో పాక్షిక హేపటెక్టమీ సర్జికల్ రెసెక్షన్ తర్వాత సహాయక చికిత్స, కాలేయ మార్పిడి ...ఇలా ఉంటాయి. ఈ దశలోనే కాలేయ మార్పిడి చేస్తే చాలా పాజిటివ్ రిజల్ట్స్ ఉంటాయి. కానీ అలాంటి దాత దొరకడం కష్టం.

కిడ్నీ తర్వాత రెండవ అత్యంత సాధారణంగా మార్పిడి చేసే ప్రధాన అవయవం కాలేయం. దీన్ని వలన మనకు కాలేయ వ్యాధి ఈ దేశంలో ఒక సాధారణ మరియు తీవ్రమైన సమస్య అని స్పష్టమవుతుంది. సాంప్రదాయకంగా, కాలేయ మార్పిడి కోసం అవయవాలు వారు లేదా వారి కుటుంబాలు సమ్మతి తెలిపిన తరువాత, మరణించిన దాతల నుండి తీస్తారు. దురదృష్టవశాత్తు, కాలేయ మార్పిడి కోసం వేచి ఉన్న వ్యక్తుల జాబితా

పెరుగుతూ ఉంది. చాలినంతగా మరణించిన దాత అవయవాలు అందుబాటులో లేవు. కాలేయ మార్పిడి కోసం వేచి ఉన్న చాలామంది రోగులకు మార్పిడి శస్త్రచికిత్స వారు చాలా జబ్బుపడిన తరువాత మాత్రమే జరుగుతుంది. మరి కొందరు జాబితాలో ఉండగానే మరణించవచ్చు. రోగి కాలేయ భాగం పొందలేకపోతే, అతను లేదా ఆమె మార్పిడి శస్త్రచికిత్స తట్టుకోలేని స్థితికి చేరుకుంటారు. బ్రతికి ఉన్న దాతనుంచి కాలేయ మార్పిడి చేయవచ్చు. ఎందుకంటే కాలేయానికి, శరీరంలో ఏ ఇతర అవయవానికి లేనటువంటి , పునరుత్పత్తి, లేదా పెరుగే సామర్ధ్యం ఉంది. అందువల్ల బ్రతికి ఉన్న దాతతో కాలేయ మార్పిడి సాధ్యమే. కాలేయం రెండు భాగాలు శస్త్రచికిత్స తర్వాత 4 నుండి 8 వారాల వ్యవధిలో పునరుత్పత్తి చేసుకుంటాయి"

"మేము దానికోసం చాలా చూసాము. కానీ మాకు దొరకలేదు. చివరికి నేనే ఇస్తాను అని కూడా అన్నాను. కానీ ఇద్దరికీ రక్త నమూనాల దగ్గర కొంచెం తేడా వచ్చింది"

"ఎందుకు? కుటుంబ సభ్యులు ఇవ్వవచ్చు కదా!"

"అవును. అయితే మా తండ్రి ఒకరే కాని తల్లులు వేరు వేరు. మా అమ్మ నా చిన్నప్పుడే చనిపోతే మా నాన్న మరోపెళ్ళి చేసుకున్నారు. ఇప్పుడున్న ఆ అమ్మకే పుట్టిన బిడ్డ వెన్నెల"

షాక్ తిన్నది ఉమా. వాళ్ళింటికి వెళ్ళినప్పుడు సవతి తల్లిలా ఎక్కడా అనిపించలేదు. ఎంత అన్యోన్యమైన కుటుంబం అనుకుంది. అందుకే దేవుడికి కళ్ళు కుట్టాయేమో? అనుకుంది.

"కాలేయ మార్పిడి చేస్తే ఎంత కాలం జీవించగలరు? ఇది ఎలా చేస్తారు?"

"మరణించిన వారి నుండి గానీ, సజీవ వ్యక్తుల నుండి గానీ మార్పిడి జరగవచ్చు. కాలేయం లోని కొంత భాగాన్నే కూడా దానంగా ఇవ్వవచ్చు. అయినా కాలేయం రెండు భాగాలు శస్త్రచికిత్స తర్వాత 4 నుండి 8 వారాల వ్యవధిలో పునరుత్పత్తి చేసుకుంటాయి. కాలేయ మార్పిడి 10 సంవత్సరాల మనుగడ రేటు సుమారు 65% మరియు కాలేయ మార్పిడి 20 సంవత్సరాల మనుగడ రేటు సుమారు 55%. వారిలో చాలామంది మార్పిడి తర్వాత మనోధైర్యం, మెరుగైన జీవన నాణ్యతతో 20 సంవత్సరాల కంటే ఎక్కువ కాలం జీవించవచ్చు"

"డాక్టర్! పేషంట్, వెన్నెల మేడం లేచారు. చాల సేపు అవుతుంది. 'ఇంకా ఎంత సేపు ఇలా ఉండాలి? బానే ఉన్నాను కదా! వెళ్ళిపోతాను' అంటుంది సర్"

"కోలుకుంది కదా! ఇంకా ఎప్పటివరకు ఉంచాలి వివేక్ !"

అన్నాడు మహేష్.

"వెంటనే తీసుకెళ్ళవచ్చు. కొంచెం నీరసంగా ఉంటుంది. అంతే! వెంట తోడుగా ఈ మేడం కూడా ఉన్నారుగా!" అన్నాడు వివేక్.

డిశ్చార్జ్ రాస్తానని డాక్టర్ అనడంతో అందరూ థాంక్స్ చెప్పి బయటకు వచ్చారు.
"హాస్టల్ కి కాకుండా సదుపాయాల కోసం కారులో మా ఊరికే తీసుకెళదాము" అన్నాడు మహేష్.
"అయితే అలా ఊరికి తీసుకెళ్తే మళ్ళీ దారిలో, ఏదైనా వాష్ రూమ్ వెళ్లడం ఇలాంటి ఏ సమస్య అయినా ఒక ఆడ తోడు ఉండడం అవసరం అన్నారు కదా డాక్టర్!" అన్నాడు కౌండిన్య.

"నిజమే! కాని ఇష్టంగా వస్తే ఫర్వాలేదు. కాని కష్టమైతే ...." అర్యోక్తిలో ఆపేస్తూ , ఒకరిని ఇబ్బంది పెట్టడం నాకు ఇష్టం లేదు అన్నట్లుగా చూశాడు మహేష్.

దానికి కౌండిన్య, " అక్కా! నువ్వు మరేమీ అనుకోకపోతే తోడు వెళ్ళడం మంచిదేమో" అన్నాడు. మౌనంగా ఉంది ఉమ.

" తనకేమైనా ప్రాబ్లమ్స్ ఉన్నాయేమో? ఇబ్బందిగా ఉంటే వద్దులేండి" అన్నాడు మహేష్.

" కానీ మా అక్క ఎవరికి ఇబ్బంది కలిగినా సహాయానికి ముందుకు వస్తుంది" అన్నాడు కౌండిన్య.

" మీరు వెకేషన్ కోసమే వచ్చారు. కాబట్టి మీ అక్క ఒక్కతి మిమ్మల్ని వదిలి ఒంటరిగా రావడానికి ఇబ్బంది పడుతుందేమో! మీరు ఏమీ అనుకోకపోతే మీరు కూడా రండి!" అన్నాడు మహేష్.

కౌండిన్యకు అప్పటికే ఇక వాళ్ళు వెళుతున్నారంటే మనసంతా అదోలా అయిపోయింది. వెళ్లాలని ఉంది. చివరికి అన్ని ఆలోచించి అందరూ కలిసి వాళ్ళ ఊరు వెళ్ళడానికి నిర్ణయం జరిగింది.

"థాంక్ యు సో మచ్. మీ సహాయం మర్చిపోలేనిది. నిజానికి మీరిద్దరూ ఉంటే వెన్నెల ఇంకా త్వరగా కోలుకుంటుంది" అన్నాడు మహేష్.

అలాంటి విపత్కర పరిస్థితుల్లో 'రాను' అని అనలేకపోయింది ఉమ. అందుకే అనుకోకుండా తన దగ్గర ఉన్న చిన్న బాగ్ తోనే తప్పనిసరయి తలూపింది. "నిజంగా మనిషి జీవితం ఎంత చిత్రమైనది కదా!" అన్నాడు కౌండిన్య. "అవును. అందమైన ప్రకృతి లో ఉన్న ప్రతి ఒక్కటి అంతందాన్ని లోకానికి అందించి అందరికీ కన్నుల విందు చేసినా, ఎంత రమణీయమైనదైన మళ్ళీ వాడి నేలరాలాల్సిందే కదా! అలాగే మనిషి జీవితం కూడా అంతే!" నిర్వేదంగా అన్నాడు మహేష్.

ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసుకుని కారులో బయల్దేరారు. వెన్నెల చాలా నీరసంగా ఉండడంతో ఎక్కువగా మాట్లాడలేకపోయింది. కళ్ళతోనే ఇద్దరికీ థాంక్స్ చెప్పింది. ఆపదకాలంలో ఆత్మీయులు ఉంటె ఎంత గుండె ధైర్యంగా ఉంటుందో, వెంట ఉమ ఉండడం ఎంత మంచిదయ్యిందో మహేష్ కి ఆ ప్రయాణంలో అర్ధం అయ్యింది.

అందరికీ అప్పటికే ఆకలి నకనకలాడడంతో ఒక మెస్ లో భోజనం చేశారు. అందరూ లోనికి వెళ్ళి, బలవంతంగా తమతో నెమ్మదిగా వెన్నెలను కూడా తీసుకెళ్ళారు. కానీ ఆమెకు చాలా తేలిగ్గా ఉండే ఇడ్లీ మాత్రమే పెట్టారు. అదే అతికష్టంపై తిన్నది వెన్నెల. తర్వాత మళ్ళీ చీకట్లో వారి ప్రయాణం మొదలయ్యింది.

వాళ్ళు వెళ్ళే దారంతా పల్లెటూరు దారి కాబట్టి మధ్యలో చిన్న చిన్న పల్లెటూర్లు తగులుతున్నాయి. మహేష్ డ్రైవ్ చేస్తుంటే, ప్రక్కన కౌండిన్య కూర్చున్నాడు. వెనక సీట్లో పడుకున్న వెన్నెల తలను ఒళ్ళో పెట్టుకుని ఉమ కూర్చుంది. కొంచెం దూరం వెళ్ళగానే దారి ఒడిదొడుకుల వల్ల వేసిన బ్రేక్ లకో, ఆరోగ్యం బాలేకపోవడం వల్లనో గానీ వెన్నెలలేచి వాంతి వస్తున్నట్లు సైగ చేసింది. ఉమ ఈ విషయం చెబుతూ ఆగమంటూ చెబుతుండగానే ఆపుకోలేక వెన్నెల వాంతి చేసేసుకుంది. సమయానికి కారులో పడి ఖరాబు కాకుండా తన రెండు చేతులు దోసిలిలా పట్టింది ఉమ. అందరూ నిర్ఘాంత పోయారు. మహేష్ కారు ఆపగానే కౌండిన్య దిగి కార్ తలుపు తెరిచాడు. ఉమ చేతిలోది బయట పారబోయడానికి దిగితే కౌండిన్య బాటిల్ నుండి నీళ్ళు పోస్తుంటే, లిక్విడ్ సోప్ తో కడుక్కుని సానిటైజర్ రాసుకుంది.

కౌండిన్య నే, మరో బాటిల్ లోని నీళ్ళను నోరు కడుక్కోవడానికి వెన్నెల కిచ్చాడు. నోరు కడుక్కుని, ఉమ రెండు చేతులను దగ్గరకు తీసుకుని కళ్ళకద్దుకుంది వెన్నెల.

"పిచ్చిపిల్ల! మరేం ఫీల్ కాకు" అంటూ హత్తుకుంది ఉమ. 'థాంక్యు సో మచ్'అంటూ కళ్ళతోనే చెప్పాడు మహేష్. పైకి ఏమైనా అంటే, ఇంతమందిని ఇలా ఇబ్బంది పెడుతున్నాను అని వెన్నెల బాధ పడుతుందని. ఇప్పటికే ఆమె లోలోపల ఎంత అంతర్మథనం చెందుతుందో కేవలం అతనికి మాత్రమె తెలుసు.

కొంతదూరం వెళ్ళేసరికి అర్జెంట్ గా వాష్ రూమ్ అవసరం పడింది వెన్నెలకు. విషయాన్ని ఉమతో చెప్పింది. దారిలో ఇండ్లె తప్ప అలాంటివి ఏవీ కనబడడం లేదు. అప్పటికే చాలా రాత్రయింది. విషయం చెప్పి, ఏదైనా ఒక ఇంటి ముందు ఆపమంది.

ఏదైతే అది అయిందని అప్పటికే లైట్స్ అన్నీ ఆఫ్ చేసి పడుకుని నిద్రపోతున్న ఒక ఇంటి గేటు శబ్దం చేసాడు కౌండిన్య. బయట గేటు పక్కన అనుకుని బాత్రూం లా అనిపించే ఒక గది, విశాలమైన వాకిట్లో అటూ ఇటూ పూలమొక్కలు,

కూరగాయల మొక్కలు కొంచెం దూరంలో ఇల్లు ఉంది. కొంచెం సేపు అయ్యాక బయట లైట్ వెలిగింది. తలుపు తెరిచి, భార్యాభర్తలిద్దరు. బయటకు వచ్చి గేటు దగ్గరకు వచ్చారు. అంతరాత్రి అపరిచితులు బయట కనబడేసరికి 'ఎవరూ' అంటూ అడిగారు. కారు దిగి విషయం చెప్పింది ఉమ.

" అయ్యో! దానికేం భాగ్యం? రండి. ఇలాంటివి చెప్పి వస్తాయా? " అంటూ ఇంటి ముందు ఉన్న బాత్రూం చూపించారు.

అదే పట్నంలో అయితే ఇలాంటి వాటికి, ఇలా కనీసం ఇంటి లోపలికి రానిచ్చేవారా? అనిపించింది ఉమకి.

వెన్నెల రిఫ్రెష్ అయి వారికి దండం పెట్టింది. "అయ్యో ఈ మాత్రం మా పల్లెటూర్లో ఎవరమైనా చేస్తాము. జాగ్రత్తగా వెళ్ళండమ్మా!" ఆపదలో ఆదుకున్న ఆ స్త్రీ మూర్తికి చేతులెత్తి నమస్కరించి కదిలారు.

అలా అలా ఇల్లు చేరేసరికి అర్ధరాత్రి దాటిపోయింది. అందరూ బాగా అలసిపోయారు. అంత అర్ధరాత్రి వచ్చిన వారిని భయం భయంగా, ఆందోళనగా చూశారు మహేష్ అమ్మా నాన్న. వాళ్లకి టూకీగా విషయం చెప్పాడు మహేష్. అందరూ అలసిపోయి ఉండడంతో తొందరగానే అందరూ గాఢ నిద్రలో మునిగిపోయారు.

తెల్లవారి కాస్తంత ఆలస్యంగా లేచి అందరూ స్నానాలు చేసి, టిఫిన్లు కానిచ్చారు. వెన్నెల నెమ్మదిగా లేచి స్నానం, టిఫిన్ కానిచ్చి మందులు వేసుకుని వారితోనే కూర్చుంది.

"వెన్నెల ఆరోగ్యం గురించి అమ్మానాన్న బాగా భయపడుతున్నారు." తల్లీ తండ్రీ లేనిది చూసి నలుగురే కూర్చున్నందుకు మహేష్ అన్నాడు. అతని ఉద్దేశ్యం వారి ముందు ఎక్కువగా వెన్నెల ఆరోగ్యం గురించి ఆందోళన వ్యక్తపరచ వద్దన్నట్లు.

"మరి అలా ప్రాబ్లం లో ఉన్న అమ్మాయిని ఇలా, ఈ వయసులో హాస్టల్లో ఎందుకు జాయిన్ చేశారు?" కౌండిన్య అన్నాడు.

" దానికి కారణం ఉంది. అక్కడికి దగ్గరగా ఉన్న హాస్పిటల్లో, వెన్నెలను ట్రీట్ చేసే ఎక్స్పర్ట్ డాక్టర్ ఉన్నారు. పల్లెటూరులో ఉన్న మాకు తరచూ ఇక్కడికి పదే పదే రావడం చాలా కష్టం అవుతుంది. చాలా తరచుగా ఆయన దగ్గర ట్రీట్మెంట్ తీసుకోవాల్సి వస్తుంది. పైగా నిన్న వచ్చినటువంటి సమస్య వస్తే అప్పటికప్పుడు ఆయన దగ్గరకు తీసుకుని వెళ్ళడం చాలా కష్టం అవుతుంది. అందుకని తను పై చదువులు చదువుతానని మొండికేయడం తో ఈ రకంగా ఈ హాస్టల్లో జాయిన్ చేసినట్లయితే , అటు తన కోరిక నెరవేరుతుంది. మనసు వేరే విషయాలపై లగ్నం అవుతుంది. తోటి తన వయసున్న స్నేహితురాళ్ళతో సరదాగా ఉంటె మానసికంగా ఉల్లాసంగా ఉంటుంది. ఇటు డాక్టర్ కి అందుబాటులో ఉండవచ్చు. అని ఆలోచించి నేనే ఇక్కడ జాయిన్ చేశాను. అందుకనే ఎక్కువగా క్యాంటీన్ ఫుడ్ తినకుండా ఉండడానికి తనకి ఇష్టం ఉందని, తనే స్వయంగా వండుకుంటుందని ఇంట్లో చెప్పి ఒప్పించాను. అక్కడ క్యాంటిన్ లోని కుక్ కి కూడా డబ్బులు విడిగా ఇస్తానని, తనకి బయటి ఫుడ్ పడదని, కొంచెం స్పెషల్ గా వండాలని, వార్డెన్ తో కలిసి రిక్వెస్ట్ చేసాను. ఎక్కువగా ఇంట్లో నుండే తినే పదార్థాలు ఎక్కువగా చేయించి తేవడం చేస్తాను."

"కానీ మీరు డాక్టర్ దగ్గర డైట్ గురించి ప్రత్యేకంగా అడగాల్సింది. ఎందుకంటే చాలా ప్రోటీన్ ఫుడ్ తినాలి కదా"

"అవును. క్యాన్సర్ నుంచి రక్షణ పొందాలంటే.. డైట్ లో బెర్రీలు, ఆకుకూరలు, క్రూసిఫెరస్ కూరగాయలు(క్యాలీఫ్లవర్, క్యాబేజీ, కాలే, బ్రూసెల్ స్ప్రౌట్స్), క్యారెట్, రకరకాల పండ్లు తినాలి. ఇవి తింటే.. శరీరానికి అవసరమైన పోషకాలు, యాంటీఆక్సిటెంట్లు, పాలీఫినాల్ .అందుతాయి. యాంటీఆక్సిడెంట్లు.. ఫ్రీ రాడికల్స్ శరీరంలోని కణాలు దెబ్బతినకుండా రక్షిస్తాయి. క్యాన్సర్‌ను కలిగించే కణాలను నిర్మూలిస్తాయి. పాలీఫినాల్ క్యాన్సర్ పెరగకుండా రక్షిస్తాయి.

తృణధాన్యాలోల ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఫైబర్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. తృణధాన్యాలలోని పోషకాలు.. క్యాన్సర్ కణాలతో పోరాడతాయి. క్యాన్సర్‌ను నివారించాలనుకుంటే.. ఆహారంలో బ్రౌన్ రైస్, హోల్ వీట్, ఓట్స్ వంటి ఆహారం తీసుకోవాలి. బీన్స్, చిక్కుడులో ఫైబర్, ప్రోటీన్, ఫైటోకెమికల్స్ అధికంగా ఉంటాయి. ఇవి క్యాన్సర్ కణాలతో పోరాడతాయి.

నట్స్‌లోని ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. వీటిలో యాంటీఇన్ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి, ఇవి కణాలను ఆరోగ్యంగా ఉంచి క్యాన్సర్‌ను దూరంగా ఉంచుతాయి. ఆహారంలో బాదం, వాల్‌నట్స్, గుమ్మడి గింజలు చేర్చుకుంటే.. క్యాన్సర్ ముప్పు తగ్గుతుంది. రోజు నట్స్ తింటే.. కొలొరెక్టల్, ప్యాంక్రియాటిక్, ఎండోమెట్రియల్ క్యాన్సర్ల నుంచి రక్షణ లభిస్తుంది.

అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజూ తేలికపాటి వ్యాయమం, వాకింగ్, యోగా చేస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. క్యాన్సర్ ముప్పు కూడా తగ్గుతుంది. ఇవన్నీ వెన్నెల పాటిస్తుంది" సుదీర్ఘంగా చెప్పిన అతన్ని చూస్తేనే చెల్లిపై అతనికున్న ప్రేమ, నిబద్ధత, శ్రద్ధ వారికి అర్థం అయ్యింది.

"ఇది కాకుండా ఇంకా ఏ రకంగా ఆరోగ్యం పెంపొందించు కోవచ్చు?"

"మీరేమీ అనుకోనంటే నాదో సలహా..."నెమ్మదిగా అన్నాడు కౌండిన్య.
చెప్పు అన్నట్లు చూసాడు మహేష్.

"మరేం లేదు. ఇలా అంటున్నానని మరోలా అనుకోకండి. ఒక అమ్మాయి హృదయం మరో అమ్మాయికే తెలుస్తుంది. అంటే ఒక ఆడదాని విషయం, వారి బాధలు, బరువులు, ఆలోచనలు, ఆశలు ఇలా అన్నీ ఆమెకు మాత్రమే తెలుసు. ఆమెకు తెలిసినంతగా, ఎంత పరాకాయ ప్రవేశం చేసినా మగవారికి తెలియదు." ఈ అసందర్భపు సంభాషణకు అందరూ అయోమయంగా చూసారు.
"అసలు నీ ఉద్దేశ్యం ఏమిటి?" సూటిగా అడిగింది ఉమ.

"అక్కడికే వస్తున్నా. అలాగే ఇప్పుడు క్యాన్సర్ తో తను పడుతున్న బాధలు, తీసుకోవాల్సిన ఆహారం, అందులో నుండి బయట పడడం ఎలా? అనే అన్ని విషయాలు

వెన్నెల గారికి తెలిసినంతగా ఎవరికీ తెలియవు అనేది కూడా అంతే వాస్తవం. అందుకే తన అనుభవాన్ని తను అందరికీ పంచితే, అవయవదానానికి, రక్తదానానికి అందర్నీ ప్రోత్సహించడానికి ఎలాగూ నేను అప్పుడప్పుడు మా స్వచ్ఛంద సంస్థ తరఫున సందేశాలు ఇవ్వడానికి, ఆవశ్యకత చెప్పడానికి కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటాము. అందులో తనని కూడా సభ్యురాలిగా కొనసాగాలని నా కోరిక"

"వావ్... ఇది నాకు బాగా నచ్చింది. అలా నా అనుభవాలను పంచడం నాకు ఇష్టమే! దయచేసి నన్ను మీ సంస్థలో చేర్చుకోండి." అంది వెన్నెల చిన్నపిల్లలా సంతోషంగా. చెల్లెలి సంతోషానికి మహేష్ ఆనంద పడుతూ, 'థాంక్యు సో మచ్'అంటూ కౌండిన్య తో చేయి కలిపాడు.

(ఇంకా ఉంది )

# రాణాప్రతాప్

సీరియల్





డా. పులిచెర్ల సాంబశివరావు

ఇది నిజమా?

భిల్లుడు ఢిల్లీ చేరాడు. అతని పేరు కాలూసింగ్. మనిషి రివటలాగా వుంటాడు. మెడలో పూసలదండ, తలమీద ఈకలు, నడుముకు చర్మపుపటకా, వీపున విల్లమ్ములు ఇదీ అతని వేషం. కాలూసింగ్కి ఏదీ దొరక్కపోతే ఎన్నాళ్లైనా పస్తుండి మనగలడు. పిరికి కండలేని జోదు.

కానీ, ఢిల్లీనగరాన్ని చూడగానే కాలూ కొంచెం జంకాడు. జనసమూహాలతో కిటకిట లాడుతున్న పెద్దపెద్ద వీధులు, అటూఇటూ మూడు నాలుగంతస్తుల మేడలు. అంతకుమించి ఎత్తయిన మసీదులు, గుంబజ్లు! ఆకాశాన్ని అంటుతున్నాయా అన్నట్లు మీనారులు. కాలూ సంభ్రమాశ్చర్యాలు ముప్పిరిగొనగా విభ్రాంతుడయ్యాడు. హయహేషలు, గజ ఘీంకారాలు అతని ఒడలు జలదరింపచేశాయి.

ప్రక్కలనుండి జవనాశ్వాలమీద టకటకలాడుతూ రాజోద్యోగులు శరవేగంతోవెళుతున్నారు.



**జరిగిన కథ** అక్బర్ చక్రవర్తి! అశేష సైన్యసమూహాలతో, విశేషాయుధ సంపత్తితో చిత్తోడ్ను కైవసం చేసుకోవడానికి అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు! ఈ ఆలోచనలతో సతమతమవుతూ, మనశ్శాంతి కోసం ఉదయసింహుడు రాజధానిని విడిచి అరణ్యమార్గాన అనుచరవర్గంతో ఏకలింగనాథస్వామి సన్నిధికి చేరాడు.అక్కడ 'ఓం నమశ్శివాయ!' అంటూ వినపడింది. ఆ శబ్దం వచ్చిన దిశగా వెతుక్కుంటూ వెళితే ఓ సాధువు కనిపించాడు . 'ఉదయా చిత్తోడ్ వదిలి నేను చుపించాచోట కోట నిర్మంచమని చెపుతాడు . దానికి ఉదయసింహుడి మంత్రులు అది పిచ్చి ఆలోచన అంటారు .కాని ఉదయ సింహుడి కొడుకు మాత్రం తండ్రి ఆజ్ఞ పాటించలంటాడు. అక్బర్ అనుమతితో బైరాంఖాన్ తన కరకు కరవాలంతో హేమూ శిరమును ఒక దెబ్బతో తెగనరికాడు .చిత్తోడ్ అక్బర్ వశంఅయ్యింది . అగ్ర కోటకి ఇరు వైపులా జయమల్, పత్తా విగ్రహాలను నిలిపాడు అక్బర్ .చిత్తోడ్ మొత్తం శ్మశానంలా మారిపోయింది.దానితో దిగులుతో మంచం ఎక్కాడు ఉదయ సింహుడు .చిన్నరాణి తనకొడుకు జగమ్మల్లుడికి పట్టాభిషేకం చెయ్యమంటుంది .మాట ఇచ్చి మరణిస్తాడు ఉదయ సింహుడు. కాని అక్కడి సర్దారులు అందుకు ఒప్పుకోరు . రాణాప్రతపుడికే పట్టం కడతారు .దానితో జగమల్లుడు పగ బడతాడు .రాజ మాన్సింగ్ షోలాపూర్ జయిస్తాడు .మాన్సింగ్ను రాణాప్రత్జాప్ అవమానిస్తాడు . తగిన గుణ పాఠం చెప్పాలని అక్బర్ అనుకుంటాడు .మాన్ సింగ్ ను సర్వ సైన్యా ధ్యక్షుడిగా నియమించి రణ ప్రతాప్ మీదకు యుద్దానికి పంపుతాడు అక్బర్ .రాజా రాం తన కొడుకు శాలివాహన్ తో యూద్దనికి వస్తాడు .రాజా జగన్నాధ్ వెన్నుపోటుతో దాందాస్ మరణిస్తాడు రాణాప్రతాప్ రామ్ప్రసాద్ అనే ఏనుగు ను మొఘలుల మీదకు పంపిస్తాడు. దాన్ని వాళ్ళు స్వాధీనం చేసుకుంటారు . ప్రతాప్ మాన్సిన్హ తో తల పడతాడు . మొఘలుల సైన్యం ఎక్కువగా ఉండటం వల్ల ప్రతాప్ కు గాయాలవుతాయి.ఝులా ప్రతాప్ సుర్యద్వాజం తీసుకుని పారిపోతాడు .ప్రతాప్ పరిపోతున్నాడని అతని వెంటపడి అతన్ని హతమారుస్తారు మొఘలులు.గాయపడ్డ ప్రతాప్ ణి అతన్ని గుర్రం చేతక్ దూరంగా రహస్య ప్రదేశానికి తీసుకు వెళుతుంది

**ఇక చదవండి**

కాలూసింగ్ కాసేపటికి తనకు తాను ధైర్యం చెప్పుకుని ముందుకు నడిచాడు. రాజవీధి సరాసరి షాహిన్షా కొలువుండే ప్రధాన మందిరానికి దారితీసింది. పెద్దద్వారానికి నూరుబారల దూరంలో విచ్చుకత్తుల కాపలాదారులు భిల్లుని నిల వేశారు.

"మహారాణాప్రతాపసింహుని దగ్గరనుండి వస్తున్నాను. లేఖ తెచ్చాను. అక్బర్ చక్రవర్తికి అందజేయాలి!" భిల్ల భాషలో అతడు తడబడుతూ పలికాడు. భిల్లభాష గుజరాతీభాషకు సమీపస్థంగా వుంటుంది. సామాన్య నగరవాసులకది అర్థంకాదు. కానీ, మూడు పదాలను మాత్రం ద్వారరక్షకులు అర్థం చేసుకున్నారు. ప్రతాపుడు, అక్బరు, లేఖ – అనేవి తెలిశాయి. వెంటనే వాళ్ళు కాలూసింగ్ విల్లమ్ములను తీసి అక్కడే పెట్టి, అతణ్ణి లోనికి వెంటబెట్టుకొని పోయారు.

దీంతో కాలూసింగ్కి భయం తీరిపోయింది. తాను రాణాప్రతాపుని దూతననే సంగతి గుర్తుకు తెచ్చుకుని అతడు ఠీవిగా లోనికి అడుగుపెట్టాడు. సభాభవనం చాలా విశాలంగా వుంది. ఎక్కడా నేల కనబడకుండా రత్నకంబళాలు పరచివున్నాయి. కాలూసింగ్ తన కాలు తగిలి ఎక్కడ కంబళాలు పాడయిపోతాయోనని మృదువుగా పాదాలు ఆనించి ముందుకు అడుగువేశాడు. ప్రక్కన బంగారపు పూతపూసివున్న స్తంభాలు ధగధగా మెరుస్తున్నాయి. స్తంభాలకు నడుమ వలిపపు తెరలు వ్రేలాడుతున్నాయి. తెరలకు ముత్యాల సరాలు అలంకరింపబడి వున్నాయి

కాలూ పైకి చూశాడు. భవనం పైకప్పుకు బంగారపురేకు తాపడం చేసివుంది. రంగురంగుల రత్నాలతో రకరకాల లతలు తీర్చి వున్నాయి.

"...హూఁ! పరదేశాలనుండి దోపిడీదొంగల వలె వచ్చిన విజాతీయులు రత్నగర్భ యైన తన మాతృభూమిని దోచుకుని విలాసాలతో ఇలా కులుకుతూ వుంటే, దేశమాత దాస్యశృంఖలాలను త్రెంచ ప్రయత్నించే రాణాప్రతాపుని వంటి వీరులు కూటికి గుడ్డకు కరువై ఆకులు అలములు మేస్తూ అడవులపాలై వున్నారు...."
కాలూసింగ్ ఒక్క క్షణం ఉద్విగ్నభరితుడయ్యాడు.
"ఊ! ఇక్కడ నిలబడు!" భటుల సైగను అర్థంచేసుకుని ఒక స్తంభంప్రక్కన నిలుచుండి పోయాడు.

ఒక సైనికుడు కాలూసింగ్ తెచ్చిన లేఖను తీసుకుపోయి మహామంత్రికి అందించి, విషయం వివరించాడు. ఆయన ఓసారి ఇటు చూచి, తలవూపి, లేఖను తన దగ్గరే వుంచుకున్నాడు.

కాలూసింగ్ సభాభవనాన్ని పరిశీలనగా చూశాడు. ఎదురుగా గోడమీద బహువర్ణమయమైన చిత్రాలున్నాయి. అక్బరు విజయ యాత్రలు బహురమ్యంగా చిత్రితమై ఉన్నాయి.

మంత్రులు, సామంతులు, సేనాపతులు బారులుతీరి కూర్చుని వున్నారు. గాయకులు, వేదాంతులు, కవులు ప్రత్యేకాసనములపై కూర్చుని వున్నారు.

మధ్యలో వుంది – వజ్రసింహాసనం. తటాలున చూచేవారికి కన్నులు బైర్లుకమ్మేట్లుగా ధగధగలాడుతూ ఉన్నది.

దాని ప్రక్కన స్వర్ణపీఠిపై దర్జాగా కూర్చుని వున్నవాడు అబ్దుల్లహిమాన్. అక్బర్ చక్రవర్తి పరిపాలించే మొఘల్ మహాసామ్రాజ్యానికి మహామంత్రి. కాలూసింగ్, అంతా అయోమయంగావుంది. తికమకపడిపోతూ ఎవరో తెలియక వెర్రిమొగం వేసుకుని అందర్నీ ఎగాదిగా చూడసాగాడు. అతని అవస్థ గమనించి ప్రక్కనున్న సైనికుడు గుజరాతీలో చెబుతున్నాడు. కాలూసింగ్కి కొంత అర్థమయీ కొంత అర్థంకాకుండా వున్నప్పటికీ, అంతా అర్థం అవుతున్నట్లుగా తల వూపుతూ వింటున్నాడు.

"చూశావుగా! ఆయనే మహామంత్రి, మహాఘనత వహించిన బైరాంఖాన్ కొడుకన్న మాట! పర్శ్యన్భాషలో బాబరుచరిత్ర వ్రాశాడాయన. ఇక ఆ ప్రక్క పెద్ద పీఠం మీద కూర్చుని వున్నాడే, ముసలాయన ఆయనే భగవాన్ దాస్, అంబరు రాజు. ఆయన సోదరినే షాహిన్షా గారు వివాహమాడింది.
ఇక భగవాన్దాసి ప్రక్కన మీసాలు మెలివేస్తూ కూర్చున్న వీరుడే రాజామాన్సింహుడు! కచవహావంశానికి ఆయన వలన ఎనలేని కీర్తికలిగింది. చక్రవర్తిగారి సేనాపతులలో ముఖ్యుడు!
చూడు! ఆ ప్రక్కన నడగొండ వలె గున్నఏనుగులా ఉన్న విచిత్రాకృతిని చూడు! ఆయన ఎవరనుకొన్నావ్? ప్రసిద్ధ చరిత్రకారుడు అబుల్ఫజుల్ ఆయనే! రోజుకి పదివీసెల మాంసం తింటాడు!"

కాలూసింగ్ అబుల్ ఫజుల్ దేహాన్ని ఆశ్చర్యంతో చూశాడు. చూసేకొద్దీ అతడికి నవ్వుపుట్టుకు వస్తుంది. ఎలాగో తమాయించుకుని ఆ ప్రక్కన కూర్చున్న వాళ్ళవైపు దృష్టి మళ్ళించాడు. అక్కడ తెల్లటి వస్త్రం ఒంటినిండా కప్పుకుని ఉన్న ఒక సాధువు దర్శన మిచ్చాడు. ముస్లింల కొలువులో ఇతడెవరా అని కాలూ ప్రశ్నార్థకంగా ప్రక్కనున్న సైనికుని చూశాడు.

"ఆయన హరివిజయసూరి! జైన మత గురువు!"
మొఘలు చక్రవర్తి జైన గురువుకి ఆశ్రయం ఇవ్వడమా? కాలూ ఆశ్చర్యపడ్డాడు.

"అదిగో, ఆ పీఠంమీద కూర్చున్న వ్యక్తి రాజాతోడర్మాల్. దేశాన్ని కొలిచి, విభజించి, శిస్తులు ఏర్పాటుచేసిన మేధావి. ఆయన ప్రసిద్ధ గాయక శిఖామణి తాన్సేన్. ఈయన ప్రభువుల వారికి అత్యంత ఆప్తులైన బీరబల్! అదుగో ఆయనే ఫయాజి; పారసీక భాషలో రామాయణ, భారతాలు వ్రాశాడు. ఇక వీరు రాయ్సింగ్ ఫెరిస్తా,

బాజ్బహదూర్, అబ్రూస్సమాద్, సూరిదాసు, షేక్ ముబారక్....." అని వరుసగా చెబుతున్నంతలో ఒక్కసారిగా సభాస్థలిలో కోలాహలం చెలరేగి, అంతలో నిశ్శబ్దం నెలకొన్నది. అంతా తమ తమ స్థలాల్లోనే నిలుచున్నారు.

చక్రవర్తి రాకను సూచిస్తూ వాద్యాలు మనోహరంగా మ్రోగాయి. ఇద్దరు రాజో ద్యోగులు వజ్రసింహాసనం ఇరువైపులా నిలుచున్నారు. మహామంత్రి అబ్దుల్రహిమాన్ షాహిన్షా రాకను సభ్యులకు తెలియజేస్తూ ప్రకటన వెలువరించాడు. యువరాజు సలీంను వెంటబెట్టుకుని అక్బర్చక్రవర్తి మందగమనంతో, సలాములు స్వీకరిస్తూ, చిరునవ్వులు చిందిస్తూ సభలో అడుగుపెట్టాడు. వజ్రసింహాసనం ముందు ఓ నిముషం నిలుచుని, సభాసదులను తేరిపారజూచి, అందరూ కూర్చోవలసినదిగా చేతితో సైగచేసి ఠీవిగా సింహాసనాధిష్ఠితుడయ్యాడు. ప్రక్కనే ఉన్నతాసనంపై సలీం కూర్చున్నాడు.

మహారాణా ప్రతాపుని దగ్గరనుండి లేఖ వచ్చినప్పటినుండి దానిని షాహిన్షాకి ఎప్పుడు అందిద్దామా అనే ఆదుర్దాతో వున్నాడు అబ్దుల్. చక్రవర్తికి విజయం పలికి, రాణాప్రతాపుని వద్దనుండి వచ్చిన వార్తాహరుని విషయం చెప్పి, లేఖను అక్బర్ హస్తాల్లో పెట్టి, ముమ్మారు సలాములు చేసి, వెనక్కి అడుగులువేస్తూ వెళ్ళి తిరిగి తన స్థానంలో కూర్చున్నాడు అబ్దుల్. ప్రతాపుని పేరు వినగానే అక్బర్ చక్రవర్తి మిక్కిలి గౌరవభావంతో లేచి నిలుచుని లేఖనందుకున్నాడు. లేఖలో వున్న విషయాన్ని కళ్ళచూశాడు!

ఇది నిజమా?

"రాజా మాన్ సింగ్!" అక్బర్ కేకవేశాడు.

"ప్రభూ!" మాన్సింగ్ వంగి సలాము చేసుకుంటూ వచ్చి చక్రవర్తి ముందు నిలుచున్నాడు. అతడి ముఖంలో ఆనందం తాండవమాడింది.

"రాజా మాన్ సింగ్! ఆ లేఖను పెద్దగా చదవండి!" మాన్ సింగ్ సభాసదులందరికీ వినబడే విధంగా బిగ్గరగా చదివాడు! "ఉదార స్వభావులని మహాఖ్యాతి గాంచిన అక్బరు సార్వభౌమా!" అక్బరు చక్రవర్తి ఈ సంబోధన విని మెరిసేకళ్ళతో సభను కలియజూశాడు. మాన్ సింగ్ మీసం దువ్వాడు.

".... పది సంవత్సరములనుండి ఎడతెరపిలేక మీతో యుద్ధము చేయుచున్న మాకు ఒకింత విశ్రాంతి అవసరమై ఈ లేఖ వ్రాస్తున్నాము" 'విశ్రాంతి' అనే పదాన్ని నొక్కి, ఒక వికటాట్టహాసాన్ని రువ్వి, మరీ చదవసాగాడు మాన్సింగ్. ప్రభువు తన చేతికిచ్చిన లేఖలో అంశాలేమిటో కాలూసింగ్కి తెలియవు. కనీసం లేఖలోకి తొంగిచూడాలని గూడా అనిపించలేదు. ఇప్పుడు నిండుసభలో, అందులో తమకు ఆగర్భశత్రువైన అక్బర్ కొలువులో, మానసింహుడు మహారాణా లేఖను చదివి ఎగతాళిగా నవ్వుతుంటే చెవుల్లో శూలాలు గ్రుచ్చినట్లుగా అతడు విలవిలలాడిపోయాడు.

"... మీకు అంగీకారమైతే నిరంతర యుద్ధానికి స్వస్తి చెప్పి ఆరునెలలు విశ్రాంతి తీసుకోవాలని భావిస్తున్నాము. మా సంగతి మీకు తెలుసు మీరు ఉదారస్వభావులమని విన్నాము...."

ఆ తరువాత పదాలను వేగంగా చదివి, పట్టరాని సంతోషంతో మానసింహుడు వికటాట్టహాసాలు చేసి, అక్బర్ చక్రవర్తికి జయకొడుతూ వంగి నమస్కరించి తన ఆసనాన్ని తిరిగి స్వీకరించాడు. సభ అంతా కోలాహలంతో నిండిపోయింది. హఠాత్తుగా భూకంపం వచ్చి, నేల చీలి, తాను నిలువునా భూగర్భంలోకి వెళ్ళిపోలేక పోయాడు గదా అని కాలూ లోలోన కుమిలిపోయాడు. అసలు, ప్రభువు ఇలాటి లేఖ వ్రాసి పంపుతాడని తాను కలలో గూడా ఊహించ లేదు! ఈ సంగతి ముందే తెలిస్తే– అతడు రాణాప్రతాపుడయినా సాక్షాత్తు ఏకలింగేశ్వరు డయినా – తాను ఈ పనికి సుతరామూ అంగీకరించేవాడు కాదు!

ఛీఛీ! ఏం దుర్గతి పట్టింది తనకు? ఇక్కడి నుండి బయటపడటమెలా? "ఈ లేఖను తెచ్చినదెవరు? అక్బరు ఆనందంతో అడిగాడు. మహామంత్రి సైగ చేయగనే భటులు కాలూసింగ్ను ప్రభువు ముందు నిలవబెట్టారు. మోచేత్తో అతణ్ణి పొడిచి సలాము

చేయమని సైగచేసి చెప్పారు.

కాలూ వంగి దండంపెట్టాడు, తన దురదృష్టానికి తనను తనే లోలోన తిట్టుకుంటూ. అక్బరుచక్రవర్తి తన మెడలోని రత్నాలహారం తీసి కాలూ వైపు గిరవాటువేశాడు. పైన పాముపడ్డట్లుగా కాలూ ఉలిక్కి పడ్డాడు. అక్బర్ ఔదార్యాన్ని మానసింహాదులు ప్రశంసిస్తుండగా అంతా 'వహవా వహవా' అని తమ ఆమోదాన్ని తెలిపారు.

అక్బరు పాదుషా జీవితంలో ఇది మహాద్భుత సమయం, మరువలేని మధుర క్షణం. అసాధ్యుడనుకున్న శత్రువు హఠాత్తుగా లొంగివచ్చాడు. విశ్రాంతి కావాలని అడగడం నిజానికి ఒక వంక మాత్రమే!! అసలు సంగతి కనిపెట్టలేనంత వెర్రివాడు గాడు తాను! ఒక్కసారిగా ఓటమిని అంగీకరింపలేక, మొగమోటమికి పోయి ఆరు నెలలు విశ్రాంతి కావాలంటున్నాడు ప్రతాపుడు! ఇది తనకు ప్రతాపునిపై తొలివిజయం. ఎందరో లొంగిపోయారు! పిరికిపందలూ, దేశభక్తిహీనులూ! కాసులకు కన్నతల్లిని తాకట్టుపెట్టే నికృష్టులు ఎందరు తన కాళ్ళకు వంగి సలాములు చేయడం లేదు! నిజానికి అది తనకు గర్వకారణం కాదు. ఇదీ, తనకు ఘనవిజయం!

మాతృదేశ స్వాతంత్ర్య దీక్షాదక్షుడైన మహావీరుడు రాణాప్రతాపుడు లొంగిపోయాడు. ఇక ఈ దేశంలో తనకు తిరుగులేదు. ఇక ఈ దేశంలో తనకు ఎదురులేదు! ప్రతాపుడు లొంగిపోయాడని తెలిసిన మరుక్షణం

ఆసేతుహిమాచలం హిందూదేశం యావత్తూ తనకు పాదాక్రాంతం అవుతుంది. కనీసం ఒక్క వెయ్యి సంవత్సరాలైనా తన వంశస్థులు భారతావనికి పాలకులవుతారు... అక్బర్ పాదుషా తన కుడిచేతిని పైకి యెత్తాడు. సభలో నిశ్శబ్దం తాండవించింది.

"ప్రియమైన ప్రజలారా! ఈ దినము సర్వశక్తిమంతుడైన అల్లా కరుణ మనమీద పరిపూర్ణముగా ప్రసరించింది. ఈ ఆనందకర వార్తను మీ ముందుంచడానికి మే మెంతో సంతోషిస్తున్నాం. మా ఏకచ్ఛత్రాధిపత్యానికి అడుగడుగునా అడ్డుతగులుతూ, మన వీరుల నెందరినో పొట్టనపెట్టుకున్న రసపుత్రవీరుడు, మేవాడు ప్రభువు రాణా ప్రతాపుడు ఎట్టకేలకు మనకు లొంగిపోయాడు. చూడండి! ఇదిలో లేఖ! అర్ధసంవత్సరం విశ్రాంతి నర్థిస్తూ అర్జీ వ్రాసి ఈ భిల్లుని చేత పంపించాడు! ఇది శుభసమయం! అన్ని మసీదులలోనూ, ఇతర మతాల ఆలయాలలోనూ ప్రార్థనలు జరిపి ఖుదాకు కృతజ్ఞతలు చెల్లించండి! బీదసాదలకు మిఠాయిలు పంచండి, నగరాన్ని అలంకరించి ఉత్సవం చేయండి!" షాహిన్షా ముఖంలో ఇంత ఆనందాన్ని వాళ్ళు ఎన్నడూ చూడలేదు. ఇదే అదనని అక్బర్ చక్రవర్తి అభిమానానికి పాత్రులు కావడానికి కొందరు పోటీపడటం మొదలు పెట్టారు.

"లొంగిపోక చస్తాడా? అక్బర్ చక్రవర్తా? మజాకా?"

"ఇక సంధి తప్పక జరుగుతుంది! రాణాప్రతాపుడు జలాలుద్దీనుకు జంకి కాళ్ళ బేరానికి వచ్చాడు!"
"మానసింహుణ్ణి అవమానించి బ్రతకడానికేనా?"

"రాణాప్రతాపునిపై ప్రభువు జాలి చూపి చిన్న సేనాపతి పదవిని ఇస్తే బావుంటుంది?"

"వంద ఏనుగులకు నాయకునిగా నియమిస్తే మర్యాద చేసినట్లవుతుంది!"

"అబ్బే ఏనుగులకు పనికిరాడు! గుఱ్ఱాలకయితే న్యాయం చేసినట్లవుతుంది."

వాళ్ళ మాటల్లో కొంత ఎగతాళి గూడా ధ్వనిస్తోంది. అక్బర్చక్రవర్తికి తన అనుచరుల మాటలు అంతగా రుచించలేదు.

"అంతటి మహావీరుడు, అరివీరభయంకరుడు అయిన మహారాణాప్రతాపుల వారిని ఒక చిన్న సేనానిగా నియమించడం మనకు మర్యాదగాదు! వారు అంగీకరిస్తే, మన సర్వ అశ్వసైన్యాధ్యక్షులుగా నియమిస్తాం!"

అంతటితో అనుచరగణం అవాక్కైపోయింది. అప్పుడే ఒక గంభీర కంఠధ్వని స్ఫుటంగా వినిపించింది. అంతా అటు చూశారు. "షాహిన్షా

# చరిత్రాత్మక సీరియల్

వెయ్యేళ్ళు వర్ధిల్లాలి! మీరు నేల వదిలి సాము చేస్తున్నారని చెప్పడానికి చింతిస్తున్నాను!"

అంతా అతని ధైర్యానికి విస్తుపోయారు. అంబరు ప్రభువు తన ప్రక్కనున్న వ్యక్తిని అడిగాడు. "ఎవరతడు?"

"ఆయన పృథ్వీసింహుడు!" అంబరీశుడు "పృథ్వీసింహుడా" అంటూ అతణ్ణి ఎగాదిగా చూశాడు. పృథ్వీ సింహుడు స్థిరంగా నిలుచుని మళ్ళీ అన్నాడు.

"ఔను అక్బర్ చక్రవర్తీ! ఈ లేఖను మీరు నమ్మవద్దు! రాణాప్రతాపుడు ప్రాణమైనా వీడగలడుగాని, మాతృదేశ ప్రతిష్ఠకు మాత్రం భంగం కలుగనీయడు!"

ఈ పలుకులు వినగానే రాజామాన్సింగ్ ముఖం మాడిపోయింది. అతడు రోషంతో పృథ్వీసింహుణ్ణి చూచి పళ్ళు పటపటలాడించాడు.

అక్బర్చక్రవర్తి ఆశ్చర్యపోయాడు. తన యెట్టయెదుట, తన శత్రువైన ప్రతాపుణ్ణి పొగుడుతున్నందుకు ఆయనకు కోపం రాలేదు. కానీ, సాక్షాత్తు రాణా వ్రాసిన లేఖను తన కళ్ళతో తానే చూస్తుండగా, అది అబద్ధం అంటాడేమిటా అని ఆయన ఆశ్చర్యంతో తలమునకలయ్యాడు. మారు మాట్లాడక ఆ లేఖను అక్బరు పృథ్వీసింహునికి అందిం చాడు. పృథ్వీ ఆ లేఖను చూశాడు. శిశోదియా వంశానికే చెందిన రసపుత్రుడతడు. కాలం కర్మం కలిసిరాక అక్బరు కొలువులో చేరినా, నరనరానా రసపుత్ర పౌరుషమే ప్రవహిస్తూంది అతనిలో. మానాభి మానాలు చంపుకుని ఒక విదేశీయ ఆక్రమణదారునికి సలాము చేసినా – అతనిలో ఏమూలో దాగిన ఆత్మాభిమానం అప్పుడప్పుడు తొంగిచూస్తూనే వుంది!

పృథ్వీ ఆ లేఖను ప్రత్యక్షరం పఠించాడు. సందేహం లేదు! ఇది మహారాణా సంతకమే! అయినా ఈ లేఖను ప్రతాపుడు వ్రాయడానికి వీల్లేదు! వ్రాసివున్నా తాను అంగీకరించడానికి అసలు వీల్లేదు! పృథ్వీ కన్నుల కొసలు ఎరుపెక్కినాయ్!

"లేదు చక్రవర్తీ! ఇది ప్రతాపుడు వ్రాసిన లేఖగాదు! ఇది ఆయన సంతకం కాదు!" "ఎలా చెప్పగలరు?" ప్రభువు గొంతులో కరుకుదనం స్పష్టంగా ధ్వనించింది. "శిశోదియావారి వ్రాతలు నాకు తెలుసు జహాపనా!" పృథ్వీ కంఠం సభా ప్రాంగణంలో గంటకొట్టినట్లు మోగింది. అక్బర్ సార్వభౌముడు అతని తెగువకు కొంచెం ఆశ్చర్యపోయాడు. రవంత కోపమూ వచ్చింది.

కనుబొమలు ముడిపడ్డాయి. ఏమి చేయాలో తెలియడంలేదు. రాణా యిచ్చి పంపాడని భిల్లుడు వచ్చాడు. ఆనందంతో మనసు గంతులువేసింది. ఇంతలో పృథ్వీ అది రాణా వ్రాత కాదంటున్నాడు. పృథ్వీరాజు శిశోదియా వంశంవాడే! అతడికి రాణా సంగతి బాగా తెలుసు. అతని మాట కాదనడానికి వీల్లేదు. అంతలోనే ఆనందం అంతమయింది. పాదుషా అయోమయావస్థను వజీర్ సాహెబ్ గమనించాడు.

"ప్రభూ! ఈ విషయాన్ని గూర్చి మనం ఇంతసేపు చర్చించడం వ్యర్థం! కాలమే అన్నిటినీ స్పష్టం చేస్తుంది. ఇందలి సత్యాసత్యాలను గూర్చి రేపు చర్చిద్దాం!" అని అబ్దుర్ రహిమాన్ ఆ చిక్కుముడిని కాస్త సడలించాడు. ప్రభువు అంగీకార సూచకంగా చూశాడు!

(ఇంకా ఉంది )

# నీ జాడకై అన్వేషిస్తున్నా ....

మొదటి బహుమతి పొందిన కవిత

కొత్త ప్రియాంక(భానుప్రియ )

నీ ఆనవాళ్ల కై నిరంతర బాటసారినై అణువణువునా అన్వేషిస్తున్న...

ఎక్కడ వెతకను నిన్ను చెట్ల పొదల్లో చెత్త కుండీలలో వదిలిన పసిపాపల ఏడుపు కేకలో వెతకనా....

ఆడపిల్లల ఆర్తనాదాల ఆహాకారలలో వెతకనా....

కనులముందే రుధిరపు దారలు పారుతున్న గమనించని లోకంతో సహచర్యం చేస్తున్న....

ఎదను పంచిన అమ్మ పాలను మరచి తన హృదిని విరిచి విలువలను త్యజించి జీవితం గడుపుతున్న సమాజంలో వెతుకులాడనా....

అడుగడుగున కామపు చూపులతో మాటల తూటాలతో ఎదను రంపపు కోత కోస్తున్న
సహనపు ఆభరణం ధరించి సౌశీల్యం తో నడయాడిన ఊపిరిని చిదిమేస్తున్న రాక్షసుల మధ్య వెతకనా....

విలువలను త్యజించి విలాసాల మత్తులో ఉనికిని కోల్పోతున్న మర మనిషిలో అన్వేషించనా....

పాశ్చాత్య పోకడలతో నిర్వీర్యాపు మేధస్సుతో ఉనికిని కోల్పోతున్న ఉవ్వెత్తున ఎగసేపడే ఉడుకు నెత్తురు గల యువగళంలో తొంగి చుడనా....

పాలబుగ్గల పసి మొగ్గలను కాలరాస్తున్న మదమెక్కిన మగతనపు మృగాలలో వెతుకులడనా...

ఆపదని ప్రాధేయపడిన పలకరించని ప్రాణమున్న దేహాల్లో పరికించిచుడనా...

కామ,క్రోద,మోహాలకు బానిసవై వావివరసలు మరిచి విచక్షణను కోల్పోయి దిగజారిన నీ దినత్వపు జీవన గమనం లో దేవులడనా....

ప్రతి గుండె లోపల స్వర్ధపు పొరతో కప్పబడిన మానవత్వపు మాధుర్యాన్ని ప్రేమ,సేవ అనే సుతిమెత్తని స్పర్శతో మేలుకొలుపు...

ఓ సమాజమా పరిపక్వతతో ఆలోచించు నేను అనే పదం త్యజించి మనమనే భావనతో ప్రేమ మకరందం వెదజల్లు మనవాత్వపు పరిమళాలను వ్యాపింపచేసి పూల బాటలో పయనిద్దాం..

# శతావారి..
# డిజిటల్ సుందరి



'కృత్రిమ నవ్వు' అని వెక్కిరిస్తాం. 'వారి మాటల్లో అంతా కృత్రిమత్వమే' అని విమర్శిస్తాం. 'కృత్రిమత్వం' 'సహజత్వం' భిన్న ధ్రువాలు అనే వాస్తవాన్ని కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) తిరగ రాసింది. కృత్రిమ మేధస్సు నుంచి పుట్టిన అందాల యువతులు నవ్వితే ఆ నవ్వులో ఎక్కడా కృత్రిమత్వం కనిపించదు. మాట్లాడితే... మళ్లీ మళ్లీ వినాలనిపిస్తుందేగానీ ఎక్కడా కృత్రిమ ఛాయ కనిపించదు. మానవులతో పోటీ పడుతూ 'ఎక్కడా తగ్గేదేలే' అంటున్న డిజిటల్ సొగసరులకు ఏఐ సబ్స్క్రిప్షన్ ప్లాట్ఫామ్ 'ఫ్యాన్ వ్యూ' అందాల పోటీ నిర్వహించింది. 'మిస్ ఏఐ' పోటీ జరగడం చరిత్రలో ఇదే తొలిసారి. 'కల్కి' సినిమాలో 'కాంప్లెక్స్' ఉన్నట్టే ఏ.ఐకి కూడా ఒక ప్రపంచం ఉంది. అందులో ఏ.ఐ ద్వారా తయారైన అందగత్తెలు ఉన్నారు. సరే. అన్ని దేశాల ఏ.ఐ. అందగత్తెలకు పోటీ పెడితే? పెట్టారు. మొరాకో ఏ.ఐ. అందగత్తె కెంజా లైలీ 'మిస్ ఏ.ఐ'గా కిరీటం సాధించి చరిత్ర సృష్టించింది. ఇదొక నిజంలాంటి కల్పన. అందమైన డిజిటల్ సృష్టి. సోషల్ సబ్స్క్రిప్షన్ ప్లాట్ఫామ్ 'ఫ్యాన్ వ్యూ' నిర్వహించిన 'మిస్ ఏఐ' అందాల పోటీలో రియలిజమ్, టెక్, సోషల్ క్లౌట్ అనే మూడు ముఖ్యమైన విభాగాలు ఉన్నాయి.

ఈ మూడు విభాగాల్లో మిగిలిన వారితో పోల్చితే కెంజా లైలీ 'బెస్ట్' అనిపించుకుంది. న్యాయనిర్ణేతలలో ఇద్దరు ఏఐ–జనరేటెడ్ ఇన్ఫ్లుయెన్సర్లు కూడా ఉన్నారు.

'యాక్టివిస్ట్ అండ్ ఇన్ఫ్లుయెన్సర్'గా గుర్తింపు తెచ్చుకున్న ఏ.ఐ. యువతి కెంజా లైలీకి ఇన్స్టాగ్రామ్లో రెండు లక్షల వరకు ఫాలోవర్లు ఉన్నారు. కెంజా ఏడు భాషల్లో మాట్లాడగలదు. ఫ్యాషన్, ఆహారం, అందం, ట్రావెల్... మొదలైన వాటికి సంబంధించి కంటెంట్ జనరేట్ చేస్తుంది. 'ఫినిక్స్ ఏఐ' సీఇవో మెరియమ్ బెసా ఈ యువతి సృష్టికర్త. 'మిస్ ఏ.ఐ' కిరీటం సాధించాక కెంజా లైలీ మాట్లాడుతూ– 'కృత్రిమ మేధ సృష్టికర్తల తరపునప్రాతినిధ్యం వహించే, కృత్రిమ మేధస్సులోని సానుకూల కోణాన్ని ఆవిష్కరించే మంచి అవకాశం నాకు వచ్చింది. ఏఐ టెక్నాలజీ అభివృద్ధిలో మరింత క్రియాశీలంగా వ్యవహరించడానికి ఈ విజయం నాకు ఉపయోగపడుతుంది. మొరాకో, మధ్ర శాచ్యంలో మహిళా సాధికారతకు దోహదం చేయడం నా లక్ష్యం. కృత్రిమ మేధస్సుపై ఎన్నో అనుమానాలు, అపోహలు ఉన్నాయి. ఈ భయాలను తొలగించడంపై దృష్టి పెడతాను. కృత్రిమ మేధ అనేది ఒక సాధనం మాత్రమే కాదు... ఇంతకు ముందు ఎవరూ సృష్టించలేని అవకాశాలను సృష్టించగల పరివర్తన శక్తి. విద్యారంగంలో ఏఐ వల్ల జరిగిన మంచి పనులు చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఏఐ అనేది మానవ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరిచేదే తప్ప దాన్ని భర్తీ చేయలేదు. మనుషులు, కృత్రిమ మేధ మధ్య సహకారాన్ని పెంపొందించడం నాప్రాధాన్యతలలో ముఖ్యమైనది' అంటుంది. కెంజా. ఈ పోటీలో రన్నర్స్–అప్ ఫ్రాన్స్కు చెందిన లలీన, పోర్చుగల్కు చెందిన వోలివ సి నిలిచారు.

'మిస్ ఏఐ' పోటీలో ప్రపంచవ్యాప్తంగా పదిహేను వందల ఏఐ మోడల్స్, డిజిటల్ ఇన్ఫ్లుయెన్సర్లు పోటీ పడ్డారు. 'టాప్ – 10' ఫైనలిస్ట్ జాబితాలో మన దేశం నుంచి డిజిటల్ దివా జరా శతవరి చోటు సాధించింది. ఒక మొబైల్ కంపెనీ యాడ్ ఏజెన్సీకి కో–ఫౌండర్ అయిన రాహుల్ చౌదరి శతవరి సృష్టికర్త. శతవరిని 'డిజిటల్ మీడియా మేధావి'గా అభివర్ణించాడు రాహుల్. 'మిస్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'లో శతవరికి 'టాప్–10' చోటు దక్కిన సందర్భంగా తన లింక్డ్ ఇన్ పోస్ట్లో సంతోషాన్ని వ్యక్తం చేశాడు రాహుల్. 'ఈ గుర్తింపు ఏఐ ఇన్ఫ్లుయెన్సర్ కమ్యూనిటీకి జరా శతవరి చేసిన విశేష కృషిని తెలియజేస్తుంది. ప్రపంచ వేదికపై భారత్, ఆసియాకుప్రాతినిధ్యం వహించడం గొప్ప గౌరవంగా భావిస్తాను. శతవరి భారత్ నుంచి ఏకైక ఫైనలిస్ట్, ఆసియా నుంచి ఇద్దరిలో ఒకరు' అని పోస్ట్లో స్పందించాడు రాహుల్. కృత్రిమ మేధస్సు మంచి చెడుల



గురించి చర్చ జరుగుతున్న సమయంలో 'శతవరి'ని ఎలా చూడాలి?' అనే ప్రశ్నకు 'వందశాతం పాజిటివ్'గానే అనే సమాధానం వినిపిస్తోంది. అందం, సోషల్ మీడియాలోని అభిమాన గణం మాత్రమే శతవరి విలువకుప్రాతిపదిక కాదు. హార్మోన్ సమస్యల నుంచి కుంగుబాటు వరకు ఎన్నో అంశాలపై మహిళలకు అవగాహన కలిగిస్తుంది. కృత్రిమ మేధస్సులోని సానుకూల కోణానికి సంపూర్ణంగా అద్దం పడుతుంది. బ్యూటీ, టెక్ స్కిల్స్, సోషల్ మీడియాలో వీరి ప్రభావం ఎంత... మొదలైన అంశాలు 'మిస్ ఏఐ' ఎంపిక ప్రక్రియలో ఉంటాయి. న్యాయ నిర్ణేతలలో ఇద్దరు ఏఐ ఇన్ఫ్లుయెన్సర్లు ఉండడం విశేషం. 'మిస్ ఏఐ విజేత' ఎవరవుతారో అనే ఆసక్తికంటే 'ఎవరీ జరా శతవరి?' అనే ఆరా ఎక్కువ అయింది.

★★★

సీరియల్




# గర్భ శ్లోకం

ఈదర శ్రీనివాస రెడ్డి

” సార్. అంబుజాన్ని కస్టడిలోకి తీసుకోనిదే ఈ కేసు సాల్వ్ అయ్యేట్ట లేదు” డి.సి.పి వంక చూస్తూ అన్నాడు వివేక్

“అంటే మన అసమర్థత మనం ఒప్పుకుంటునట్టేగా…”కాస్త అసహనంగా అన్నాడు డి.సి .పి

“మన అసమర్థత అనేకంటే, నేరస్థుడి సమర్థత అనవచ్చు కదా సార్”

“అలా అనుకుని మనల్ని మనం మోసం చేసుకోవటమే కదా? “

ఒక్క క్షణం మౌనం తరువాత, “నేరం చేసే వాడు, మనకన్నా ఎంతో లోతుగా ఆలోచిస్తాడు సార్. ఎందుకంటే వాడున్న పరిస్థితులు అటు వంటివి. ఆపరిస్థితులకు మన చుట్టూ వుండవు కాబట్టి, మనం అతనిలా లోతుగా ఆలోచించ లేక పోవచ్చు కదా?

“ నువ్వు చెప్పింది కొంత వరకు నిజమే , అతని కన్నా ఎక్కువ ఆలోచించినప్పుడే మనం అతన్ని పట్టుకోగలం”

# గర్భ శ్లోకం

**జరిగిన కథ**

ఓ గుర్తు తెలియని మహిళ , పోలీసులు వెంబడిస్తుంటే తన బిడ్డతో సహా కృష్ణా నదిలోకి దూకుతుంది .ప్రముఖ హీరోయిన్ సుస్మిత హత్యకు గురవుతుంది .డి సి పి శ్రీనివాస రావు కేసు టేక్ అప్ చేస్తాడు .సుస్మితను పెళ్లి చేసుకోమని హీరో నవీన్ బ్లాక్మెయిల్ చేస్తుంటాడు .జూనియర్ ఆర్టిస్ట్ కాంతం తన కూతురు సుస్మితని ఇండస్ట్రీలో పెద్ద స్టార్ని చెయ్యాలని ప్రయత్నిస్తుంది.డి . సి పి మళ్ళీ ఒకసారి హత్యా జరిగిన ఇంట్లో వాళ్ళఅందిరిని ప్రశ్నిస్తాడు . ఊరి శివార్లలో ఎవరిదో శవం ఉన్నాడని తెలిసి అక్కడకు వెళతాడు డి .సి .పి.అక్కడ శవం పక్కన పోలీసులు పెట్టుకునే స్టార్ పడి ఉంటుంది. సుస్మితను పెళ్లి చేసుకోవటానికి నవీన్ ఇష్టపడకపోతే సి .ఐ. అంబుజం ఒప్పిస్తాడు. ఎంత ప్రయత్నించినా ఒక్క సాక్ష్యం కుడా సేకరించలేక పోవటంతో సుస్మిత నటించిన సినిమాల్లో పనిచేసిన వాళ్ళను ఇంటరాగేట్చెయ్యాలని నిర్ణయించుకుంటారు. తీరా వాహిని స్టూడియో కి వివేక్ వెళ్లేసరికి డైరెక్టర్ అనిల్ కుమార్ తన కారవాన్ లో చచ్చిపడి ఉంటాడు . డి.సి. పి తన బృందం తో అక్కడి కెళ్ళి దర్యాప్తు చేస్తే అనిల్ ని చంపింది కుడా ఒక ఆడదే అని తెలుస్తుంది.ఉష మీద అనుమానం తో ఆమె ఫోటో తో పోల్చి చూస్తాడు వివేక్ .సుస్మిత వేణు అవుట్ డోర్ షూటింగ్ కి వెళతారు .వాళ్ళతో పాటు రౌడి శంకర్ కుడా వాళ్ళను అనుసరిస్తాడు .సుస్మిత వేణు గుడిలో ఎవ్వరికి తెలియకుండ పెళ్లి చేసుకుంటారు . సరగోసి ద్వారా బిడ్డని కనాలని నిర్ణయించుకుంటారు. సుస్మిత వేణు దగ్గరవుతున్నాడని అతనికి వేరే పెళ్లి చెయ్యాలని ఆలోచిస్తాడు అనిల్ . **ఇక చదవండి**

“మీరన్నది నిజమే సార్, కాని ఇప్పుడు మన ముందు రెండే దారులున్నాయి. ఒకటి ఉషని పట్టుకుని నిజం రాబట్టడం లేదా అంబుజాన్ని మన కష్టడి లోకి తీసుకుని జరిగిన దంతా తెలుసుకోవటం.

‘రెండూ కష్టమైన పనులే...

‘రెండోది మన పరిధి లో వుంది, ఐ.జి గారి పర్మిషన్ తీసుకుంటే.

“ ఏ ఎలిగేషన్ మీద... మన దగ్గర ఆధారాలు ఏమున్నాయి ...”

“మనకు దొరికి ఆ స్టార్ సరిపోదా సార్..”

“అది అతన్ని నేరస్థుడిగా నిర్ధారించ లేదుగా. ఇక ఒకటి మార్గం! మనం అంబుజాన్ని పిలిచి జరిగినదంతా చెప్పి, కాస్త భయపెట్టి అడగటమే
“అవును సార్ ఈ పాటికే, అతను భయపడుతూ వుండి వుండాలి .
. “

“ ఎస్, శంకర్ హత్య తరు వాత అతను కాస్త భయపడుతున్నట్టే వున్నాడు. అయిత నువ్వే అతన్ని డీల్ చేయి.

“ ఒక సార్ ఐ విల్ హాండిల్ ఇట్ ““ బట్ బి కేర్ ఫుల్ ...

★★★

“ నాకు తెలియకుండా వేణు, ఇంకా పెళ్ళి చేసుకున్నాడా ?” అంటూ పెద్దగా అరచి గ్లాసులోని మందు గట గటా తాగేసింది

సుస్మిత

" నువ్వు అరచి గీపెట్టినా జరగాల్సింది. జరిగి పోయింది. ఇక ముందు జరగాల్సింది చూడు.."

ఉష ఒక పక్క రెచ్చగొడుతూ మరోపక్క సముదాయిస్తున్నట్లు అంది.

" జరగాల్సింది ఏముంది, విడాకులు తీసుకోవటమే "

'దానివల్ల అతనికేమినష్టం వుండదు నీకే నష్టం. అందుకనే కొన్నాళ్ళు ఓపిక పడితే తరువాత వాడి సంగతి, వాడి కొత్త పెళ్ళం సంగతి చూడొచ్చు"

సుస్మితకి ఏం మాట్లాడాలో అర్ధం కాక, మరో గ్లాసు గొంతులో పోసుకుంది!

"ఉష కి కూడా అదే కావాలి. ఇప్పటి దాకా సుస్మిత తన చేతిలో సగం , వేణు చేతిలో సగం వుంది. ఇకనుంచి పూర్తిగా తన చేతిలోకి వచ్చేస్తుంది. ఏదోఒక రోజు వేణు, అతని భార్యను, అడ్డు తొలగిస్తే , ఇక సుస్మితకు తను తప్ప ఇంకెవరూ దిక్కుండరు అని మనసులో అనుకుంటూ , ఎవరికో కాల్ చేసింది

"ఏమంటుంది..సుస్మిత " అవతలి వ్యక్తి

"ఏమంటుంది, ఇప్పడికి దానికి మనం తప్ప వేరే ఎవరూ ఆదుకునే వాళ్ళు లేరు. ముందు వేణు , వాడి కొత్త భార్య సంగతి చూడాలి.."

"అది నేను చూసుకుంటాలే, అంబుజం వున్నాడు కదా. మన చేతికి మట్టి అంట కుండా పని జరిగి పోతుంది ..."

'అన్నిటికీ వాడి మీద ఆధారపడితే రేపు వాడు చెప్పినట్లు మనం వినాలి "

"తప్పదు మరి, హత్యలు చెయ్యాలంటే రౌడి లన్నా అవసరం, అంబుజం లాంటి బ్యాడ్ పోలీసు అన్నా అవసరం. అయినా అక్కడి దాకా వస్తే వాడిని మాత్రం వదులుతామా... "ఓ నవ్వు నవ్వాడు అవతలి వ్యక్తి

"నువ్వు అంతటి వాడవే పైకి మాత్రం పిరికి వాడిలా నటిస్తుంటావు.. "ఉష నవ్వుతూ అన్నది

★ ★★

"అంబుజం సార్, ఇప్పటికైనా నిజం చెప్పండి మీకు ప్రొటక్షన్ కల్పిస్తాం.. "అనునయంగా అడిగాడు వివేక

దానికి అంటుజం పెద్దగా ఓనవ్వు నవ్వి. "నువ్వా నాకు రక్షణ కల్పించేది ... "అంటూ ఎగతాళి చేసాడు.

' నువ్వు ఇలాగే నవ్వుతూ వుండు, ఏదో ఒక రోజు నిన్ను కూడా లేపేస్తుంది

ఆ మాటలు వినగానే, నవ్వటం ఆపి, వివెక్ వంక అయోమయంగా చూడసాగాడు అంబుజం

"రౌడీ శంకర్ ని చంపిన దానికి నిన్ను చంపడం పెద్ద కష్టమేమి కాక పోవచ్చు.. "వాస్తవం. చెప్పాడు వివెక్

"నిజమే శంకర్ ని చంపిన వాళ్ళకు తనని చంపటం ఒక లెక్క కాదు అని మనసులో అనుకుంటు ఏమిటి చెయ్యటం అని ఆలోచనలో పడ్డాడు.

ఇన్నాళ్ళు ఒక ఆడదే కదా అని పెద్దగా పట్టించు కోలేదు, కాని వరుసగా హత్యలు చేస్తూ వస్తోందంటే దాని ఒక్క దాని వల్ల సాధ్యమౌతుందా? లేక పోతే దాని వెనుక ఇంక ఎవరన్నావున్నారా? ఉంటె ఎవరి ఉంటారు

ఆలోచిస్తూవుంటే బుర్ర వేడెక్క పోతోంది అంబు జానికి

"ఏమిటి అంతగా ఆలోచిస్తున్నావు, హంతకు రాలు చాలా తెలివైనది. నువ్వు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, ఏమి లాభం లేదు.." మరింత భయపెట్టా వివెక్

" సరే సార్, జరిగింది వెబుతాను. కాని విన్న తరువాత మీరు నన్ను ఇరికించ కూడదు

"అలాగే, నీతో మాకేం పని, మాకు కావలిసి నది హందుకురాలి వివరాలు.

"సరే సార్" అంటూ, జరిగింది చెప్పటానికి ఉపక్రమించాడు అంబుజం..(ఇంకా ఉంది )



# మొబైల్ లైబ్రరీ

కొన్నేళ్ల క్రితం వరకూ 'పుస్తకం హస్తభూషణం' అన్న పెద్దల మాటకు విలువ ఉండేది. ఇప్పుడు మొబైల్ ఆ స్థానాన్ని ఆక్రమించింది. పుస్తకాలపై ఆసక్తి ఉన్నవాళ్లూ మొబైల్‌లోనే చదువుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పుస్తకాలను మళ్లీ ప్రజల్లోకి తీసుకొచ్చేందుకు విజయనగరం జిల్లావాసి రెడ్డి రమణ వినూత్న ప్రయత్నం చేస్తున్నారు. మొబైల్ మత్తుకు.. మొబైల్ లైబ్రరీతోనే విరుగుడు చూపించారు. చిరిగిన చొక్కా అయినా తొడుక్కోగానీ... మంచి పుస్తకం కొనుక్కో అని మహాత్మా గాంధీ చెప్పారు. ఇప్పుడు పుస్తకాలు చెదలుపట్టి చిరిగిపోతున్నాయే తప్ప వాటిని ముట్టుకునే అవసరం, ఆసక్తి నేటి తరానికి లేదు. అంతగా కావాలనుకుంటే డిజిటల్ రూపంలో ఉన్నవాటిని ఖాళీ ఉన్నప్పుడు చదువుతున్నారు గానీ ముద్రితమైన పుస్తకాలను ఎవరూ పట్టించుకోవట్లేదు. పుస్తక పఠనంలో ఉన్న ఆపాత మధురాన్ని అందరికీ పరిచయం చేసేందుకు చీపురుపల్లికి చెందిన రెడ్డి రమణ బైక్ లైబ్రరీని నిర్వహిస్తున్నారు.


రెడ్డి రమణ.... ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తూ ఆశయసేవా సంస్థ పేరిట పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో విద్య, వైద్యం, పర్యావరణంపై అవగాహన పెంపొందించేందుకు 2005 నుంచి కృషి చేస్తున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో దాతల సహకారంతో సామాజిక గ్రంథాలయాలు ఏర్పాటు చేశారు. గ్రంథాలయాలకు వచ్చి చదివేవారి సంఖ్య తగ్గిపోవటంతో అవి మూతపడేవి. దీనికి పరిష్కారం చూపేందుకు మేథోమథనం చేసిన ఆయన మొబైల్ లైబ్రరీ పేరుతో సెల్‌ఫోన్ సిగ్నల్ లేని గ్రామస్థులకు పుస్తకాలను పరిచయం చేస్తున్నారు.


అన్ని వయసులవారికీ ఆసక్తి కలిగించే పుస్తకాలు అందుబాటులో ఉంచటంతో.... మంచి స్పందన వచ్చిందని రెడ్డి రమణ చెప్పారు. సంచార గ్రంథాలయం చూసి తొలుత ఆశ్చర్యపోయిన యువత, విద్యార్థులు... తమకు అవసరమైన పుస్తకాలు లభిస్తున్నందున సంతోషం వ్యక్తం చేశారు. ఏ గ్రామమేగినా... ఎక్కడ కాలిడినా... మేథస్సు పెంచే పుస్తక పఠనానికి ప్రాధాన్యమివ్వాలన్న సందేశాన్నే రెడ్డి రమణ వినిపిస్తున్నారు.

★★★★



# అన్ ఫాలో వివాదాలు






డా. మణికంఠ M.D



ఇది సోషల్ మీడియా యుగం. ఇప్పుడు ఎక్స్ ప్రెషన్లు అన్నీ సోషల్ మీడియాలోనే! మన ఫొటోకు ఎవరెవరు లైక్ లు కొట్టారు, మన ఫోటోలకు ఎవరు కామెంట్లు పెడుతున్నారు, ఎవరు మన ఫొటోలను పట్టించుకోవడం లేదు అని మొదలుపెడితే, మన వాట్సాప్ స్టేటస్ లు ఎవరు చూస్తున్నారు, ఎవరు చూసీ చూడనట్టుగా వదిలేస్తున్నారు, పది ఫొటోలు రైలు పెట్టెల్లా పెడితే ఎంతమంది వాటిని మొత్తం చూస్తున్నారు, ఎవరు సగంలో ఆపేస్తున్నారు, ఎవరు ఆన్ లైన్ లోకి వచ్చి కూడా మన స్టేటస్ చూడటం లేదు.. ఇవన్నీ సదరు వ్యక్తుల విషయంలో మన భావోద్వేగాలను నియంత్రించే అంశాలు అయిపోయాయి!

# నాలుగో కోతి





ఆఫ్ లైన్లో స్నేహంగా ఉన్నా, ఆన్ లైన్లో దాన్ని చాటకపోతే.. కోపతాపాలు పెంచుకునే రోజులు ఇవి! ఇలా చూసినప్పుడు స్టేటస్ లు సరిగా చూడటం లేదని అవతలి వారి కాంటాక్ట్ ను డిలీట్ చేసేయడం, మన స్టేటస్ చూడటం లేదు కాబట్టి వారి స్టేటస్ ను మ్యూట్లో పెట్టేయడం, వీలైతే వారి స్టేటస్ లను చూడకుండా నెగ్లెక్ట్ చేయడం.. ఇవన్నీ అందరూ చేస్తున్నవే! 15 సంవత్సరాల కిందటి వరకూ మనుషుల మధ్యన ఇలాంటి గొడవల్లేవు! అయితే ఇప్పుడు ఇదో సామాజిక సమస్య!

ఆఫీసులో మనం ట్రై చేస్తున్న అమ్మాయి మన వాట్సాప్ మెసేజ్ కు సరిగా రిప్లై ఇవ్వకపోతే ఇమ్మీడియట్ గా తన కాంటాక్ట్ ను డిలీట్ చేయడం తమ మగతనానికి నిదర్శంగా భావించే వారూ ఉన్నారు! అబ్బాయిల స్టేటస్ లను చూడకుండా అతడిపై తమకు ఏ ఆసక్తి లేదని చాటాలని భావించే అమ్మాయిలూ ఉన్నారు! ఆఫ్ లైన్లో సాన్నిహిత్యం ఉన్న వారి మధ్యన కూడా ఇప్పుడు సోషల్ సాన్నిహిత్యం లేకపోతే తేడాలు వచ్చేస్తాయి. ఒక ఆఫ్ లైన్లో తేడాలొచ్చాయంటే అవి ఆన్ లైన్లో చూపడం చాలా సహజంగా మారింది!

వివాదం ఉన్నంత మాత్రాన సోషల్ మీడియాలో అన్ ఫాలో చేసుకోవాలా, ఫోన్ నంబర్ లు డిలీట్ చేసేయాలా అంటే.. అవతలి వారికి తమ అసహనాన్ని చాటడానికి అయితే ఇది తగు చర్య అవుతుంది! సెలబ్రిటీలు ఇలాంటి పనులు చేస్తే అది మీడియాలో వార్త కూడా అవుతుంది. అయితే ఇలాంటి రచ్చలు కేవలం సెలబ్రిటీలకే కాదు సామాన్యులకు కూడా ఉంటాయి.

అయితే ఇవన్నీ చిన్న పిల్లల చేష్టలే! ఎంత పెద్ద వయసు ఉన్న వారు అయినా ఇలాంటి చర్యలకు పాల్పడటం నిజంగా చిన్న పిల్లల చేష్టే! ఒక మనిషిది ఒక నంబరే నేను సేవ్ చేసుకుంటా, రెండో నంబర్ ను సేవ్ చేసుకోను అనేంత చాదస్తం మనుషులు ఉన్నారు ఇండియాలో! రెండో నంబర్ ను సేవ్ చేసుకుంటే అవతలి వాడికి తను చాలా ప్రిఫరెన్స్ ఇచ్చేస్తున్నట్టుగా భావించేంత మూర్ఖపు మంద మధ్యన మన గమనం సాగుతూ ఉంది! ఈ స్టేటస్ లు చూడటం చూడకపోవడం, చూస్తే ఒక ఉద్దేశాన్ని ఆపాదించేసుకోవడం, చూడకపోతే మరో ఉద్దేశాన్ని ఆపాదించుకోవడం ఇవన్నీ కూడా ఆ చాదస్తపు తాలూకు లక్షణాలే!

ధృడమైన మనస్తత్వం ఉన్న వారెవరూ ఈ నంబర్లను డిలీట్ చేయడం, అన్ ఫాలోలు చేసుకోవడం, స్టేటస్ సమరాలు సాగించడం వంటివి చేయరు! ఆ మాత్రం మెచ్యూరిటీ లేని వారి నంబర్లైనా డిలీట్ లు చేసుకోకుండా, వారిని తేలికగా తీసుకుని ముందుకు సాగే వారే నిశ్చితమైన తత్వం కలిగిన వారు!

★★★

మొదటి బహుమతి పొందిన కవిత

# తెలుసుకో ఓ నవయుగ ఋషి

మళ్ళ .కారుణ్య కుమార్

ఏడున్నాడో మరి బంధాలకు భుజం కాసే బాధ్యత గల మనిషి!

విలువులకు మడుగులొత్తే విలువైన మనిషి!

పున్నమి రేడు వెలుగులోకనిపించడం లేదు!

బంగారు వర్ణుడైన భాస్కరుని వెలుగులో అగుపించడం లేదు!.

తమస్సు ఆవరించిన నిశిలో నిక్షిప్తమై

నాలుగు గోడల నడుమ చరవాణి వెలుగులో

సేద తీరుతున్నాడా! మాయాజాలమై ఇంద్రజాలమైన

అంతర్జాలంలో ఆనందంతో ఊగిసలాడు తున్నాడా!

ప్రాణుల ఉసుల్ని తెలిపే ప్రాణం లేని

మర యంత్రపు మోజులో పడి వున్నాడా!

బంధాలు ఎదురుగా ఉన్న తెలియని బంధం

కోసం వెంపర్లాడుతూ ఉక్కిరి బిక్కిరై మానసిక

క్షోభకు లోనై కొట్టుమిట్టాడుతున్నాడా....

ఏమయ్యాడో?.. ఏడ ఉన్నాడో అగుపించడం లేదు..

ఇకనైనా అగుపిస్తాడా,నిజం ఏమిటో గ్రహిస్తాడా

నిజమెరిగి మర యంత్రపు బంధనాలు
తెంచుకుంటాడా!.

మోహాన్ని వదిలించుకొని స్వయం కృషే

గమ్యంగా భవితకై పాటు పడతాడా!

నిత్యం చరవాణి కౌగిట్లో ఒదిగి వున్న ఆ చిన్నారి

ఇకనైనా తలెత్తి చూస్తాడా,తన కోసం ఎదురు చూస్తున్న

బంధాల కోసం పరితపిస్తాడా లేక తానో మరబొమ్మ
అవుతాడా!

మరబొమ్మలతో సావాసం చేసినువ్వో మరబొమ్మ

కాకు ఓ మనిషి. ఎన్నో ఆవిష్కరణలు చేసినా

మానవత్వం విలువ వదులుకోకు ఓ నవయుగ ఋషి

నెట్టింటి రామాయణం

# "గుడ్ ఓల్డ్ గోల్డెన్ డేస్"

ఈ. సాయి అలేఖ్య



చాలా రోజుల తరువాత హైద్రాబాదుకు రైల్లో ప్రయాణం చెయ్యాల్సి వచ్చింది. ఉద్యోగం లో వున్నన్నాళ్ళు, హోదాకు తగ్గట్టు కాలు కిందపెట్టకుండా కార్లలోనే ప్రయాణాలు కొనసాగేవి. కాని రిటైరైన తరువాత హోదాతో పాటు కార్లు, గేర్లు అన్నీ పోయాయి. ఎవరో అన్నట్టు రిటైరైన ఉద్యోగులు మాడి పోయిన బల్బులు కిందే లెక్క. అధికారులైన, రాజకీయ నాయకులైనా పదవిలో వున్నంత వరకే వెలుగు.

రైల్లో ఎక్కి కూచున్నాను అన్న మాటేగాని, ఏదో తెలియని ఒంటరి తనం, పోనే పక్క వాళ్ళను పలకరిద్దాం కదా అని చూస్తే ఒకడేమో చెవులకు రెండు బిరడాలు (అవే నండి 'ఇయర్ బడ్స్ ') ఏవో పాటలు వింటూ తన లోకంలలో తను వున్నాడు, ఇంకోదు సెల్ఫోన్లో ఏదో సినిమా చూస్తున్నా డు, జీన్స్ ప్యాంటు లోవున్న ఓ యువతి లాప్టాప్ లో ఏదో పని చేసుకుంటూంది బహుశా వర్క్ ఫ్రమ్ ట్రైన్ అయ్యింటుంది.

# నెట్టింటి రామాయణం

నేను చదువుకునే రోజుల్లో రోజు కాలేజికి ప్రక్క ఊరికి రైల్లో వెళ్ళి వచ్చేవాడిని. అప్పట్లో జిల్లాకి ఒక డిగ్రీ కాలేజి వుండేది, ఇప్పుడంటే ఊరు ఉరుకి, సందు సందుకి కాలేజిలే. రైల్లో తోటి ప్రయాణీకులతో రోజు భలే కాలక్షేపం అయ్యేది. మండే ఎండల దగ్గర నుంచి, సినిమాలు, రాజకీయాలు, ఒకటేమిటి అన్నీ ఉబుసుకు పోని కబుర్లే. కబుర్ల లో పడి దిగాల్సిన స్టేషను కూడా మర్చిపోయే వాళ్ళం. గమ్య స్థానంలో దిగుతున్నప్పుడు ఆత్మీయులను విడిచి వెళుతున్నాము భావన మనసులో మెదిలేది.



కాని ఇప్పుడు ఆ కబుర్లు లేవు, ఆ భావనలు లేవు. పలకరించినా ఎవరూ పలకరు. పైగా మనవంక ఏదో అంతర్జాతీయ తీవ్రవాదిని చూసినట్టు అనుమానంగా చూస్తారు.

హైదబాద్ స్టేషన్లో దిగి ఆటో కోసం బయట ఆటోస్టాండ్ దగ్గరకెళ్ళ, "ఆటో వస్తావా" అని ఎదురుగా వున్న ఓ ఆటో అతన్నీ అడిగాను.

అప్పటికే అతను సెల్ ఫోన్ లో ఎవరితోనో మాట్లాడుతున్నాడు. చెట్టంత మనిషిని ఎదురుగా నన్ను చూసి కూడా ఏమి జవాబివ్వ లేదు.

"ఆటో వస్తావా.. "మళ్ళీ బిగ్గరగా అడిగాను. ఈ సారి నా వంక చూసి లోపల కూర్చో అన్నట్టు సైగ చేసాడు.

. నేను ఆటోలో కూర్చున్న రెండు నిమిషాలకు, తను ఆటో లోపలికి వచ్చి, మీటరు వేసి ఆటోను బయల్దేర తీసాడు. ఇదంతా ఒక చేత్తనే, రెండో చేతిలో సెల్ఫోన్ చెవి దగ్గరే వుంది. బయల్దేరిన దగ్గర నుంచి ఆటో దిగేంత వరకూ ఫోన్లో మాట్లాడు తూనే వున్నాడు. అసలు అతను మాట్లాడు తున్నంత సేపు దేనికన్నా గుద్దుతాడేమో అని భయపడి చచ్చాను. చెవికి భుజానికి మధ్య సెలీఫోన్ నొక్కిపెట్టి, మెడ ఒక వైపు వంచి మాట్లాడుతూ వున్నాడు, పైగా అతివేగం అసలే హైద్రాబాద్లో ఆటోలు ఎలా నడుపుతారో తెలియంది కాదు. వెనుక కూర్చున నాలాంటి ర్భకులకు గుండెలు దడ దడ కొట్టు కుంటా వుంటాయి.

హైద్రాబాద్లో వచ్చిన పని చూసుమని, భోజనం చేద్దామని దగ్గర్లో వున్న ఆంధ్రా మెస్ లోకి అడుగు పెట్టాను. కౌంటరు దగర టోకెన్లు ఇచ్చేవాడు ఎవరితోనో సెల్ ఫోన్లో మాట్లాడుతూ, మౌనంగా నేనిచ్చిన పచ్చ నోటు తీసుకుని టోకెను, చిల్లర నా మొఖాన కొట్టి నంత పని చేసాడు. ఖాళీగా వున్న ఓ టేబులు దగ్గర కూలబడ్డాను. నన్ను చూసి ఓ సర్వరోత్తముడు ఒక చేత్తో సెల్ఫోన్లో చూస్తూ మరో చేత్తో ఓఅరిటాకు నాముందు పడేసి, నా దగ్గరున్న టోకెన్ తీసుకెళ్ళాడు, మంచి నీళ్ళు కావాలని అడిగేలోపే. ఈ లోపు ఓ చిన్న కుర్రాడొచ్చి మంచి నీళ్ళ గ్లాసు పెట్టి వెళ్ళాడు.

మళ్ళీ ఇందాకటి సర్వరోత్త ముడే ఒకనాలుగు గిన్నెల పాత్రలో కూరలు తీసుకొచ్చి నాముందు పడేసి వెళ్ళాడు, నన్ను వడ్డించుకోమన్నట్లు వాడింకో చేతిలోని ఫోన్లో చూస్తూ నిలబడ్డాడు, బహశా నేను వడ్డించు కుంటే ఆ నాలుగు గిన్నెలు ' తీసుకెళతాడేమోరి. గబా గబా వడ్డించుకుని, అన్నం ఎవరు పెడతారు అనుకుంటూ వాడి వంక చూసాను వాడు అదేమి

పట్టించు కోకుండా నాలుగు గిన్నెలు తీసుకుని వెళ్ళిపోయాడు. ఓరెండు నిమిషాల తరువాత ఇంకోకడు మెడకు, భుజా నికి మధ్యలో సెల్ఫోన్ పెట్టుకుని, ఓ డేగిసాలో అన్నం తీసుకు వచ్చి నా విస్తర్లో కుమ్మ రించాడు. ఇక లాభంలేదని అన్నం తినటం మొదలు పెట్టి ఒకసారి, మెస్సు మొత్తం తెరిపార చూసాను, అన్నం తింటున్న ప్రతి ఒక్కరు, మరో చేతో సెల్ ఫోన్ పట్టుకుని ఎవరితోనో మాట్లాడుతూనే వున్నారు. అసలు ఇంతగా మాట్లాడే అర్జంటు పనులు వీళ్ళకేమివుంటాయి? సెల్ ఫోన్ లేక పోతే ఏమి చేసేవాళ్ళు? ఒక్క పదినిమిషాలు ఎవ్వరితో మాట్లాడ కుండా భోజనం చేయలేరా? భోజనం చేసేటప్పుడు మాట్లాడ కూడదని మా బామ్మ చెప్పేది, చచ్చి ఎక్కడుందో? వీళ్ళని చూస్తే లబోదిదో మని కొట్టుకునేది.

సెల్ ఫోన్లు వచ్చిన దగ్గరునుంచి మనుషులు అవసరానికి మించి మాట్లాడటానికి అలవాటు పడ్డారు, తక్కువ మాట్లాడి, ఎక్కువ వినటం నాయకుల లక్షణం. కాని నేడు ఎక్కువ మాట్లాడుతూ, అసలు వినక పోవటమే నేటి యువకుల –అవలక్షణం. వీళ్ళు మాట్లాడే దంతా "సొల్లు కబుర్లే". అన్నట్టు తమిళంలో సొల్లు' అనే పదానికి మాట్లాడటం అని




అర్ధం. కాని ఎక్కువగా మాట్లాడే వాడిని 'సొల్లుగాడు' అనటం వాడుక. ఇప్పుడు సొల్లుగాడిని' 'సెల్లుగాడు' అని పిలవాలేమో?


★★★★


# గోపాల కృష్ణ కార్టూన్ లు


## నవ్వండి ప్లీజ్ !














# స్వామి మలై

తమిళనాడు రాష్ట్రంలో తంజావూరు జిల్లాలో కుంభకోణం సమీపంలో స్వామిమలై ప్రసిద్ధి చెందిన దేవాలయం. స్వామి మలై అంటే దేవుని పర్వతం అని అర్థం. తమిళనాడులో ఉన్న సుబ్రహ్మణ్య స్వామికి వారికి ఉన్న ఆరు ముఖ్యమైన క్షేత్రాలలో ఇది నాలుగవది. ఈ ఆలయానికి ఒక గొప్ప విశేషం ఉంది. సాక్షాత్తూ ఆ పరమేశ్వరుడు తన కుమారుని తెలివితేటలకు మురిసిపోయి పుత్రోత్సాహం పొందిన స్థలమింది. సుబ్రహ్మణ్యేశ్వరుడు తన తండ్రిని శిష్యునిగా చేసుకుని తను గురువుగా ప్రణవ స్వరూపమైన ఓంకారానికి అర్థం చెప్పిన పవిత్ర ప్రదేశమిది.

ఒకసారి సృష్టకర్త అయిన బ్రహ్మగారు కైలాసానికి వెళుతూ.. ఆయనకి దోవలో కుమారస్వామి కనబడ్డాడు. కనబడ్డవాడు వూరుకొనక, ప్రణవ మంత్రమైన ఓంకారానికి అర్థం చెప్పమని అడిగాడు.

# యాత్ర

పాపం దేవలకు కూడా తెలియని ప్రశ్నతో బ్రహ్మతో పాటు ఇతర దేవుళ్ళను అయోమయంలో పడేశాడు. బ్రహ్మదేవుడు కూడా సమాధానం చెప్పకపోయే సరికి ఆయన్ని బందీ చేశాడు. సృష్టికే మూలకర్త అయిన బ్రహ్మ దేవుడు బందీ అయ్యే సరికి సృష్టి ఆగిపోయింది. దాంతో దేవతలందరూ ఆ పరమశివుడి వద్దకు వెళ్ళి పరిస్థితి విన్నవించారు. అందరూ కలసి కుమారస్వామి వద్దకు వచ్చి బ్రహ్మదేవుణ్ణి విడిచి పెట్టమని అడిగారు. అందుకు కుమారస్వామి ఇలా అన్నాడు, బ్రహ్మదేవున్ని ప్రణవ మంత్రమైన ఓంకారానికి అర్థం అడిగితే చెప్పలేదు. అందుకే బందీని చేశానని సమాధానం చెప్పి, ఇందులో తన తప్పు ఏమి లేదని చెప్పాడు. అప్పుడు ఆ పరమేశ్వరుడు కుమారస్వామిని ఇలా ప్రశ్నించాడు. ఆయనకి తెలియదని బందీని చేశావు సరే. మరి నీకు తెలుసా అని అడుగగా నేను చెప్తాను అన్నాడు. అయితే నేను ప్రణవ మంత్రార్థాన్ని బోధిస్తున్నాను కనుక నేను గురువుని, నువ్వు అత్యంత భక్తి శ్రద్ధలున్న శిష్యునిగా వింటానంటే చెప్తానన్నాడు. తర్వాతేముంది కుమారుడు గురువయ్యాడు, తండ్రి శిష్యుడయ్యాడు. తండ్రి అత్యంత భక్తి శ్రద్ధలతో కుమారుడు ఉపదేశించిన ప్రణవ మంత్రార్థాన్ని విని పులకరించిపోయాడు.

ఈ క్షేత్రం గురించి మరో పురాణ కథనం కూడా ఉంది. భృగు మహర్షి మహా తపస్సంపన్నుడు. భృగు మహర్షి ఒకసారి తపస్సు ప్రారంభించడానికి ముందు తన తపస్సుని ఆటంక పరచిన వారికి అంతకు ముందున్న జ్ఞానమంతా నశిస్తుందనే వరం పొంది తీవ్ర తపస్సు ప్రారంభించాడు. ఆ తపోశక్తి ఊర్ధ్వలోకాలకి వ్యాపించగా , ఆ వేడిమిని భరించలేని దేవదేవుళ్ళు ఆ పరమేశ్వరుని శరణు కోరారు. పరమశివునంత వారికి కూడా జ్ఞానం నశించింది అప్పుడు ఈశ్వరుడు ఆతపశ్శక్తి దేవలోకాలకి వ్యాపించకుండా తన చేయిని భృగు మహర్షి తలమీద అడ్డంగా పెట్టాడు. దాంతో పరమశివునంత వారికి కూడా జ్ఞానం నశించింది. తన పూర్వ జ్ఞానాన్ని తిరిగి పొందటానికి ఆయన జ్ఞాన స్వరూపుడైన సుబ్రహ్మణ్యస్వామి దగ్గర ఈ క్షేత్రంలో ప్రణవోపాసన పొందాడు.  ఆ పరమేశ్వరుడు ఈ జగత్తుకే స్వామి. ఆ పరమేశ్వరుడు ఈ జగత్తుకే స్వామి. ఆ స్వామికి స్వామియై,నాథుడై ఉపదేశించాడు కనుక ఇక్కడ కుమార స్వామికి స్వామి నాథుడనే పేరు వచ్చింది. ఈ స్థలానికి స్వామిమలై అనే పేరు వచ్చింది. అతి పురాతనమైన ఈ ఆలయాన్ని కార్త వీర్యార్జునుడు కట్టించాడు. గర్భగుడి బయట మనం ఆయన విగ్రహాన్ని దర్శించవచ్చు. ఈ చిన్న కొండపైకి ఎక్కాలంటే విశాలమైన 60 రాతి మెట్లు ఎక్కాలి. ఈ అరవై మెట్లు అరవై తమిళ సంవత్సరాలకి ప్రతీకలని, ఆ సంవత్సరాధిదేవతలు ఈ రూపంగా స్వామిని సేవిస్తున్నారనీ అంటారు. ప్రతి మెట్టు దగ్గర గోడపై ప్రతి మెట్టు దగ్గర గోడపై ఆ సంవత్సరం పేరును తమిళంలో వ్రాసి ఉంటుంది. ఈ మెట్లు ఎక్కే నడక దారిలో 32 మెట్లు ఎక్కగానే కుడివైపుకు చూస్తే అక్క కుమారస్వామి తన తండ్రికి ఉపదేశం ఇస్తున్న అద్భుత శిల్పం కనబడుతుంది. అలాగే ఈ గుడికి క్రింది భాగంలో అలాగే ఈ గుడికి క్రింది భాగంలో శివపార్వతులు మంటపాలున్నాయి. అక్కడ వీరిని మీనాక్షి, సుందరేశ్వర్, మీనాక్షి. పాండ్య రాజైన వరగుణుడు ఒకసారి మధుర నుండి పుణ్యక్షేత్రమైన తిరువిద్దైమరుదూర్ కు వెళ్తూ ఈ ఆలయంలో ఒక రాత్రి గడిపాడు. ఆయన కులదైవమైన మీనాక్షి సుందరేశ్వరుని ఆరాధించడానికి ఈ మంటపాలనేర్పరచాడు.  ఈ ఆలయంలో ద్వజ స్థంభం వద్ద ఉన్న వినాయకుడి ఈ ఆలయంలో ద్వజ స్థంభం వద్ద ఉన్న వినాయకుడి ఆలయం కూడా చాలా మహిమ కలది. ఇక్కడ కుమారతర్తై, నేత్ర పుష్కరిణి అనే రెండు పుష్కరిణులు ఉన్నాయి.

కొంగు ప్రాంతం నుండి వచ్చిన పుట్టుగుడ్డి అయిన ఒక భక్తుడు ఈ రెండు పుష్కరిణులలో స్నానం చేసి స్వామి సన్నిధానానికి వస్తుంటే ఈ వినాయకుడి గుడి దగ్గరకు వచ్చే సరికి ఆయనికి కన్నులు కనిపించడం వల్ల ఈ వినాయకున్ని నేత్ర వినాయగర్ అని పిలుస్తారు.

పురాణ కథనం ప్రకారం పురాణ కథనం ప్రకారం ఈ దేవుని సన్నిధికి వచ్చి నిశ్చల భక్తితో పూజించే వారి పాపాలన్నీ సూర్యుని ముందు



పొగమంచులాగా కరిగిపోతాయి, ఈ దేవాలయంలో వివాహం చేసుకన్న వారికి సత్ప్రవర్తన, సత్సంతానం కలుగుతాయంటారు. ఈ స్వామి దర్శనార్థం అనేక మంది భక్తులు సందర్శిస్తుంటారు. ఈ స్వామి దర్శనార్థం అనేక మంది భక్తులు సందర్శిస్తుంటారు. దేశ, విదేశాల నుండి కూడా భక్తులు ఆ ఆలయానికి వస్తుంటారు. భక్తులు కోర్కెలు తీరిన తర్వాత స్వామి వారికి పాలకావడి, పూల కావడి వంటి ముడుపులు చెల్లిస్తుంటారు. సాయంత్రంలో స్వామి వారిని దర్శించుకోవాలనుకుంటే సాయంత్రంలో స్వామి వారిని దర్శించుకోవాలనుకుంటే ఆ సమయంలో అభిషేకం చేస్తారు. పసుపు అభిషేకం చేసిన తర్వాత స్వామి కన్నులు, ముక్కు, నోరు, తుడుస్తారు. అప్పుడు స్వామి వారి సౌందర్యం చూడటానికి రెండు కళ్ళు సరిపోవు, ఆ అపురూప సౌందర్యం వర్ణించడానికి మాటలు చాలవు. 60అడుగుల ఎత్తులో ఉన్న ఈ ఆలయం ప్రకృతి సౌందర్యం మధ్య కనువిందు చేస్తూ వుంటుంది.

పండుగలు, ఉత్సవాలు

పండుగలు, ఉత్సవాలు ఈ ఆలయం స్వామిమలై సమీపంలో ఉండటంవలన, కుంబకోణం టౌన్షిప్ కు పెద్ద సంఖ్యలో యాత్రికులు వొస్తున్నారు. అనేక ప్రసిద్ధ పండుగలు స్వామిమలై లో జరుగుతాయి. వాటిలో ఆలయ రథోత్సవం ఏప్రిల్ నెలలో మరియు స్కంద షష్టి పండుగ అక్టోబర్ లో మరియు విసాకం పండుగ మే నెలలో మరియు పండుని ఉత్తిరం పండుగ మార్చ్ నెలలో జరుగుతాయి. స్వామిమలై ఎలా చేరుకోవాలి ? రోడ్డు లేదా బస్సు మార్గం : ట్రిచీ, కుంభకోణం, చెన్నై, మధురై, తరంజావూర్ వంటి పట్టణాల నుండి స్వామిమలై కు ప్రభుత్వ, ప్రవేట్ బస్సులు నడుపుతుంటారు. రైలు మార్గం : స్వామిమలై కు 8 km ల దూరంలో కుంభకోణం రైల్వే స్టాట్యాన్ కలదు. రాష్ట్రం నలుమూలల నుంచే కాక దేశంలోని ప్రధాన పట్టణాల నుండి కూడా రైళ్లు వస్తుంటాయి. స్టేషన్ బయట ఆటో రిక్షాల సదుపాయం కలదు. వాయు మార్గం : 85 km ల దూరంలో ట్రిచి విమానాశ్రయం కలదు. ట్రిచీ నుండి టాక్సీ లేదా క్యాబ్ లలో స్వామిమలై చేరుకోవచ్చు.

★★★

# సిక్కిం అందాలు



ఈశాన్య రాష్ట్రాల్లో ఒకటైన సిక్కిం భారతదేశంలోని రెండో అతి చిన్న రాష్ట్రమే అయినా ప్రకృతి అందాలలో దేనికీ సాటిరాదు. ఆ విషయానికి వస్తే ఇదొక సుందరైమన, అసాధారణమైన సహజసిద్ధ అందాలను కలిగి ఉంది. ప్రపంచంలోనే మూడో ఎత్తైన శిఖరం కాంచనజంగా నుండి అనేక మనోహరమైన పట్టణాల వరకు, మారుమూల గ్రామాల నుండి అత్యంత దట్టమైన అటవీ ప్రాంతం వరకు ఎన్నో గొప్ప గొప్ప సందర్శనీయ స్థలాలను దాగి ఉంది. ఇక సిక్కిం సంస్కృతి సంప్రదాయాల విషయంలోనూ చాలా పెద్దదని చెప్పొచ్చు. అలాంటి రాష్ట్రంలో తప్పక చూడాల్సిన ప్రదేశాల గురించి ఇక్కడ తెలుసుకుందాం.

సిక్కిం రాజధాని నగరం గాంగ్‌టాక్ నుండి కేవలం 40 కి.మీ దూరంలో ఉండే త్సోమ్‌గా అనే అందమైన సరస్సు తప్పక చూడాల్సిందే. దీన్ని చాంగు సరస్సు అని కూడా పిలుస్తారు. సిక్కింలోని అత్యంత సుందరమైన సరస్సులలో ఇదీ ఒకటి. ఇది పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. లాచుంగ్‌లోని జీరో పాయింట్‌ను యుమే సామ్‌డాంగ్ అని కూడా పిలుస్తారు. ఇది సముద్ర మట్టానికి 15,300 అడుగుల ఎత్తులో ఉంటుంది. ఇక్కడ చుట్టు పక్కల ఉండే మంచు పర్వతాలు, ఆహ్లాదకరమైన పరిసరాలు ఈ ప్రదేశాన్ని మరింత మనోహరంగా మారుస్తాయి. దీంతో ఇది సిక్కింలోని టాప్ సందర్శనీయ ప్రాంతాల్లో ఒకటిగా పేరుతెచ్చుకుంది.

ఇక కాంచనజంగా నేషనల్ పార్క్ 2016లో భారతదేశంలోని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో మిక్స్‌డ్ హెరిటేజ్ సైట్‌గా ప్రత్యేక గుర్తింపు సాధించింది. హిమాలయ పర్వతాల చెంత ఉన్న ఈ ప్రాంతం జీవవైవిధ్యాన్ని కలిగి ఉంది. దీంతో ఇదో అద్భుతమైన, తప్పక చూడాల్సిన ప్రదేశంగానూ నిలిచింది. ప్రపంచంలోని మూడో ఎత్తైన పర్వత శిఖరం అంటే కాంచనజంగానే. ఇది సిక్కిం రాష్ట్రంలో ఉంటూనే మరోవైపు నేపాల్‌తోనూ పాలుపంచుకుంది. భారతదేశం వైపున్న ఈ పర్వత శ్రేణిని పవిత్రంగా పరిగణిస్తారు. దీంతో ఇక్కడి నుండి ఈ పర్వతాన్ని అధిరోహించడం కుదరదు. కానీ, మీరు ఈ పర్వతాన్ని అధిరోహించాలంటే నేపాల్ నుండి ప్రయత్నించవచ్చు



ఈస్ట్ సిక్కింలోని ఓల్డ్ సిల్క్ రూట్ లేదా సిల్క్ రోడ్‌ను జిగ్ జాగ్ రోడ్ అని కూడా పిలుస్తారు. ఈ రహదారిలో 100కు పైగా ఎక్కువ హెయిర్‌పిన్ బెండ్‌లు ఉంటాయి. దీంతో ఈ మలుపుల రోడ్డులో ప్రయాణించడం గొప్ప అనుభూతిని ఇస్తుంది. అక్కడి నుండి చుట్టూ ఉన్న కొండ ప్రాంతాలను చూసుకుంటూ వెళ్లడం జీవితంలో మర్చిపోలేరు. సిక్కిం రాజధాని గ్యాంగ్‌టాక్ సమీపంలో ఉండే రుమ్టెక్ మొనాస్టరీ ఆ రాష్ట్రంలోనే అతిపెద్ద బౌద్ధ మఠాలయం అని చెప్పొచ్చు. అది గ్యాంగ్‌టాక్ నుండి సుమారు 24 కి.మీ దూరంలో ప్రశాంతమైన వాతావరణంలో ఉంటుంది. ఇది ఆ రాష్ట్రంలోని బౌద్ధ మతస్థులకు పవిత్ర ప్రదేశం అని చెప్పొచ్చు. ఈ మఠం కర్మపా లామా స్థానం కూడా . సిక్కిం రాజధాని నగరం గ్యాంగ్‌టక్ అత్యంత అందమైనదే కాదు అత్యంత శుభ్రంగానూ ఉంటుంది. ఇక్కడి ట్రాఫిక్ కూడా చాలా క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా ఉండటంతో ఈ హిల్ స్టేషన్‌ను హ్యాపీగా విహరించి రావచ్చు. చుట్టూ కొండలు, లోయలు, పచ్చని అందాలు ఎలాంటి వారినైనా ఇట్టే ఆకట్టుకుంటాయి. అలాగే అక్కడి అందాలు చూడటానికి రోప్‌వేలు కూడా అందుబాటులో ఉంటాయి. దీంతో ఇది కూడా సందర్శించవచ్చు.★★★

# ఓ నాన్న వీలునామా ..!

ఎన్. లహరి

ఎక్కడి వారు అక్కడికి వెళ్లిపోయాక
అటక మీద ట్రంకు పెట్టెలో పెట్టిన
వీలునామా గుర్తొచ్చింది
రంగు వెలిసిపోయిన పెట్టె
పైకప్పు తుప్పుతో
కరకరమంటూ పైకి లేచింది
ఎన్నేళ్ళయిందో
మరలు పట్టు తప్పి
ఇనుము తుప్పు ఇసుకలా నేల రాలింది
పొద్దుపోయింది
ఇంటి తలుపు తట్టేవారు లేరు
కంగున మోగే సెల్ఫోన్ రింగ్ తప్ప
ఇప్పటికీ బతికే ఉన్న
నాన్న వీలునామాలో రాశాడు
ఎక్కడో దూరం దేశం నుండి
నేను బాధతో తిరిగొచ్చాను
వీలునామా బిగి కౌగిలితో ఉన్న ప్రేమికుల్లా
కాగితాలు ఒకదానికొకటి
అంటుకుపోయి ఉన్నాయి
మెల్లగా విప్పి చూశాను
బతుకుముడులను కలిపే
సారాంశం ఒకటి
నాన్న వీలునామాలో రాశాడు
ఇది తెరిచే నాటికి
మీలో ఎవరు ఎదుగుంటారో
వాళ్ళు ఎదగని కొమ్మలకు
ఈ ఫలాలను అందచేయమని
నాన్న సంతకం చేసి రాసిచ్చాడు
చీకటి గుప్పిట తెరుచుకుంది
ఆకాశంలో వెన్నెల వీలునామా రాయడానికి
అప్పుడే వచ్చేసింది కాబోలు
చిర్నవ్వుతో బయటికి వచ్చి చూశాను
దూరంగా చెట్టు కింద
పేదరికంతో ఉన్న నా చెల్లి తోపాటు
బిడ్డలు కనిపించారు
ఆనందంతో వీలునామా
వాళ్ళ చేతిలో పెట్టి తలను
హృదయానికి హత్తుకున్నాను
కొద్ది రోజుల్లో వెళ్ళిపోతాననితెలిసి కూడా
ఒరిగిపోయిన చెట్టుకొమ్మ
రేపటి భవిష్యత్తునులీలామాత్రంగా నాకు సూచిస్తూ
చెప్పింది

## “ఆఖరిఆలోచనలు”



నా కథ  అంతా  విన్న తరువాత ఏమనుకుందో ఏమో కాస్త ఎంగిలి పడ్డారు సీతమ్మ గారు. తనమృత్యువును తాను నియంత్రించాలని  చూస్తోంది సీతమ్మగారు. చాలా మంది మృత్యువు సమీపిస్తోంది అంటే అంటే ఎంతో  బాధ పడతారు. కాని మొదటినుండి ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించాటం వల్ల సీతమ్మ గారికి మరణం పట్ల  పెద్దగా బాధ లేకుండా పోయింది.రెండు రోజులు క్రితమే ఆవిడ వేళ్ళు వాచి వుండటం గమనించాను. ఆమెవేలికి వున్న పెళ్ళి నాటి ఉంగరం బిగుతైపోయి రానంటోంది. దాన్ని బయటకు తీయటానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. ఆఉంగరం తీస్తున్నప్పుడు సీతమ్మగారి దంపతులిద్దరూ కన్నీళ్ళు పెట్టారు. ఏభైసంవత్సరాల తమ ప్రేమచిన్నం తమని వీడిపోతున్నేందుకే  ఆ బాధ అని అక్కడ వున్న వాళ్ళందరికీ తెలుసు. ఆ నిమిషంలో నేను వాళ్ళాకి ఓపెద్ద రాక్షసిలా అగుపించి వుంటాను.

# అంపశయ్య

ఆ ఉంగరాన్ని తీస్తున్నప్పుడు వాళ్ళ కెంత బాధ వేసిందో నాకు అంతే బాధ వేసింది. అప్రయత్నంగా కళ్ళలో నుండి నీళ్ళు రాలాయి. వాళ్ళిద్దరికి ఆ నిమిషం ఏకాంతం అవసరం అని గ్రహించి అక్కడి నుంచి బయటపడ్డాను. ఒకరి చేతుల్లోకి ఇంకొకరి చేతులు తీసుకుని, ఒకరి కళ్ళలో మరొకరు చూస్తూ అలాగే వుండి పోయారు వాళ్ళిద్దరూ.. బహుశా అదే చివరికలయిక ఏమో ?

ఒక రోజు రాత్రి నేను నేను నిద్ర పోతూ వుండగా సీతమ్మగారు కోమాలోకి ఒరిగి పోయారు. ఒక్క సుజాతమ్మ గారే కాదు నాకిప్పటి వరకూ ఎదురైన ప్రతి ఒక్కరి వేదనా ఇదే, తమదైన జీవితాన్ని జీవింప లేక బానిసల్లాగే బతికామని బాధపడే వాళ్ళు. బతికినంత కాలం తమ సొంత మనుషుల మధ్య ఖైదీల్లోగా బతుకేడుస్తూ, నిరాశ, నిస్పృహలతో జీవనం కొనసాగిస్తూ చివరకు పశ్చాత్తాపంతో తాము చేసిన తప్పు తెలుసు కున్నా అప్పటికే జీవితం తమ చేతుల్లో నుంచి చేజారిపోయింది అని కుమిలి కుమిలి బాధ పడే వాళ్ళు.

నిజానికి వీళ్ళంతా పిరికివాళ్ళు, తమకోసం తాము బతక కుండా, వేరొకరికోసం బతికే వాళ్ళు నిజంగా పిరికి వాళ్ళే. ఈ విషయంలో కొంత వరకు నేను ధైర్యం చేసాననే చెప్పాలి దాదాపు పది సంవత్సరాలు నాకిష్టంలేనీ బ్యాంకు ఉద్యోగం వెలగబెట్టాను. ఉద్యోగం వచ్చిన కొత్తలో, కొత్త ఉద్యోగం, చేతిలో డబ్బు, చుట్టు నా వయసు వాళ్ళు వుండడటంతో ఉత్సాహంగా వుండేది. కాని రాను రాను అస్థలు ఇటువంటి జీవితానికా ఇంతకాలం కష్టపడింది, నేను గాను గెద్దు జీవితాన్ని కోరుకున్న జీవితం ఇది కాదుకదా అని పదే పదే అనిపించ సాగేది. కుటంబం అంటే కేవలం మనుషుల కలయిక కాదు. ఒకరినొకరు అర్ధం చేసుకుంటూ , ఒకరికి ఒకరు గౌరవం ఇచ్చుకుంటూ ముందుకు సాగటమే కుటుంబం. కాని కుటుంబంలోని ఒకరో ఇద్దరో మిగలిన వాళ్ళను తక్కువ చేస్తూ, తామే అధికులమని నియంతల్లా వ్యవహారించటం వల్లే కుటుంబాలు అస్తవ్యస్తమౌతున్నాయి. నావిషయంలో కూడా అదే జరిగింది. ఏరోజు నా కుటుంబంతో నేను ఆనందంగా గడిపింది లేదు అందుకనే నాదంటు ఒక జీవితాన్ని ఎంచుకుని బతకటం నేర్చు కున్నా .

మనుమరాళ్ళు, మనవళ్ళు బాగోగులు చూడటం తోనే పుణ్యకాలం కాస్త గడిచి పోయింది. ప్రతి మగవాడిలాగానే సుజాతమ్మ గారి మొగుడు కూడా ఓ నియంతే. ఇంట్లో ఏ నాడు సుజాతమ్మ గారి మాట చెల్ల నిచ్చే వాడు కాదు. జబ్బు పడ్డాక చికిత్సకోసం సుజాతమ్మగారిని ఆసుపత్రిలో చేర్చ నప్పుడే ఆవిడకు విశ్రాంతి దొరికింది అంటే ఆవిడ ఎంత శ్రమ పడి వుంటుందో అర్ధంకానిది కాదు.

పెళ్ళైన దగ్గరనుండి నియంత అయిన భర్త దగ్గర నుండి దూరుగా వెళ్ళిపోయి తనదైన బతుకు బతకాలని వుండేది. ఎనభయ్ ఏళ్ళు పై బడ్డ ఆవిడ అలాకనిపించేది కాదు , ఉల్లాసగా ఇంటి పనులన్ని ఎవరి సహాయం లేకుండా చేసేది. కాని తనుకోరుకున్న స్వేచ్ఛను అనుభవించకుండానే జబ్బుపడినందుకు దిగులు పడేది. ఆ జబ్బు కూడా భర్త కారణంగానే రావటం మరింత కృంగదీసింది. కాలం గడుస్తున్న కొద్ది , కొద్ది కొద్దిగా నీరసించి పోతూ చివరకు మంచం పట్టింది. జీవితంలో తను కోరుకున్న స్వేచ్ఛ దొరకదని కృంగిపోయేది.

సుజాతమ్మ పెళ్ళి గురించి ఎన్నో కల కన్నది. పెళ్లైన తరువాత తాను చక్కగా చదువుకోవచ్చని, ఉన్నత శిఖరాలమ ఎదగొచ్చని, స్వేచ్ఛా విహంగంలా విహరించ వచ్చని ఎన్నో కలలు కన్నాది కాని జరిగింది మాత్రం అందుకు పూర్తిగా విరుద్ధం, తన జీవితం మొత్తని భర్త అడుగు జాడల్లో నడవటానికే సరిపోయింది. ఇంతకాలం ఇంట్లో వాళ్ళ కోసం, ఇతరుల కోసం బతకటం అలవాటు చేసుకుంది. తన కోసం బతకాలని నిర్ణ యించుకున్నా అప్పటికే జీవితం చేజారి పోయింది.(ఇంకా ఉంది )

కథ

# జీవన్ భద్రాణి పశ్యతి

రెండవ బహుమతి

పొందిన కథ

శ్రీపతి లలిత

"ఛీ! వెధవ బతుకు! చచ్చిపోవాలి, నేను ఎందుకూ పనికిరాని వాడిని, నా ఉద్యోగం నేను సరిగ్గా చెయ్యలేను, ఒక టీం చేత పని చేయించలేను, నా వలన కంపెనీకి, టీంకి, అందరికీ నష్టమే, ఎవరికీ ఉపయోగపడని నేను ఎందుకు బతకాలి, అవును... చావే నా సమస్యలకి పరిష్కారం" గచ్చిబౌలి ఆఫీస్ నుంచి, నల్లకుంటలో ఉన్న ఇంటికి కారులో బయలుదేరిన సంతోష్, లక్షాఏభైవేలసార్లు అనుకున్నాడు 'ఆత్మహత్య' చేసుకోవాలి అని, కానీ ఎలా చేసుకోవాలో తేల్చుకోలేక మధనపడుతున్నాడు.

ఎంత సాఫ్ట్వేర్ రంగంలో ఉద్యోగాలు పోవడమనేది మాములు విషయమే అయినా, 'తనదాకా వస్తే' కానీ ఆ బాధ తెలీదు.

సింపుల్ గా ఒక మెయిల్ పెట్టి " రేపటి నుంచి నీ అవసరం మాకు లేదు, నీకు రావాల్సిన జీతమే కాక, ఇంకో మూడు నెలల జీతం ఇస్తున్నాం" అన్న మెయిల్ చూసి గుండె ఆగినంత పని అయింది సంతోష్ కి.

మేనేజర్ పిలిచి "సారీ! సంతోష్, నువ్వు, నీ టీం మంచి వర్కర్స్ అని అందరికీ తెలుసు, కానీ ప్రస్తుతం ఈ టీం అవసరం లేదని టాప్ మేనేజ్మెంట్ అనుకున్నారు, నిన్ను, మీ టీం లో ఉన్న నలుగురినీ తీసేయాల్సివచ్చింది. మీ అందరి రెస్యూమ్ లు నేను నా ఫ్రెండ్స్ కి ఫార్వర్డ్ చేస్తాను, ఎక్కడ అవకాశం ఉన్నా చెప్తాను, ఆల్ ది బెస్ట్" అంటూ షేక్ హ్యాండ్ ఇచ్చిన బాస్ కి "థాంక్స్" అని అస్పష్టంగా అని బయటికి వచ్చాడు.

ఒక్కసారి ఆ వార్త వినేసరికి బుర్రంతా బ్లాంకు అయిపోయి, బయట ఉన్న మిగిలిన టీం తో ఏం మాట్లాడాలో తెలియక "అయామ్ సారీ గైస్" అని చెప్పి బయట పడ్డాడు, వాళ్ళు వెనక నుంచి పిలుస్తున్నా వినకుండా.

ఆఫీస్ నుంచి బయటికి వచ్చాడే కానీ, ఎక్కడికి వెళ్లాలో గమ్యం తెలీక కార్ నడుపుతూ ఆలోచిస్తున్నాడు సంతోష్.

ఫోన్ వరుసగా మోగుతున్నా, పట్టించుకోకుండా కార్ ని డ్రైవ్ చేస్తున్నాడు. టీం వాళ్ళు, భార్య శ్రావణి, తల్లి, తండ్రి అందరూ వరసగా ఫోన్ చేస్తున్నారు,కానీ ఎవరితోనూ మాట్లాడాలనిపించలేదు సంతోష్ కి.

భార్య శ్రావణి మూడు నెలల క్రితమే బాబుని ప్రసవించింది. మంచిరోజు అని క్రిందటి వారం పుట్టింటినుంచి అత్తగారింటికి వెళ్ళింది. ఇంకో రెండు రోజుల్లో సంతోష్ తల్లి, తండ్రి, శ్రావణిని, బాబుని తీసుకుని వద్దామనుకుంటున్నారు.

ఈ వార్త విన్నాక, ఫోన్ ఎత్తి, వాళ్ళకి ఏమి చెప్పాలో, ఏమి మాట్లాడాలో సంతోష్ కి అర్థంకావడంలేదు, అందరికీ బాధ కలిగించే వార్త ఇది, అది ఎలా చెప్పాలి?

తల్లి, తండ్రులకి సంతోష్ ఒక్కడే సంతానం, తండ్రి ప్రైవేట్ కంపెనీలో మిషిన్ దగ్గర ఆపరేటర్ గా పనిచేసి, తనకు వచ్చే చిన్నపాటి జీతంతో సంతోష్ ని, కష్టపడి చదివించాడు.

బాగా చదువుకుని కొడుకు తనకి అండ అవుతాడు అని ఆశపడ్డాడు.

సంతోష్ తండ్రిని నిరాశ పరచలేదు, చక్కగా చదువుకుని, మంచి ఉద్యోగం తెచ్చుకుని ఆయనకి అండగానే ఉన్నాడు. రిటైర్ అయ్యేక వచ్చిన డబ్బు, కొడుకు తీసుకున్న అప్పుతో, ఊరిలో చిన్న ఫ్లాట్ కొనుక్కుని తల్లి, తండ్రి ఉంటున్నారు, ఇంటి ఖర్చుకి ఇబ్బంది లేకుండా, ప్రతినెలా వాళ్లకి డబ్బు పంపుతున్నాడు సంతోష్.

సంతోష్ పెళ్లి విషయాల గురించి ఇంట్లో మాటలు మొదలయ్యాక, తన మనసులో మాట తల్లి, తండ్రులతో చెప్పాడు, "నాకు ఉద్యోగస్తురాలిని చూడండి, నాలాగే సాఫ్ట్వేర్లో పనిచేసే అమ్మాయి అయితే, జీతం బాగా వస్తుంది, ఇద్దరం డబ్బు దాచుకోవచ్చు" అన్నాడు.

"నీలాగే పొద్దున్నే పోయి రాత్రికి వచ్చి, ఇంట్లో పని కూడా చెయ్యాలంటే కష్టం, హాయిగా ఏ స్కూల్ టీచరో అయితే బోలెడు సెలవలు, టైం ప్రకారం వెళ్లి వస్తారు, ఇంటికొచ్చాక ఆఫీస్ పని ఉండదు, శ్రావణి మన బంధువుల్లో అమ్మాయే, బి.ఈడీ చేసి స్కూల్ లో పనిచేస్తోంది, మాకు నచ్చింది చూడు" అంటూ ఫోటో సంతోష్ చేతికిచ్చింది తల్లి.

అమ్మాయి బానే ఉంది, పోనీ ఏదో ఒక ఉద్యోగం చేస్తోంది, గుడ్డి కన్నా మెల్ల నయం అనుకున్నాడు సంతోష్. పెళ్లిచూపుల్లో కానీ తెలీలేదు, శ్రావణి గుడ్డీ కాదూ..మెల్లా కాదూ, మంచి విశాలాక్షి అని.

శ్రావణి లెక్కల్లో డిగ్రీ, పీజీ, చేసి తనకి ఇష్టమైన ఉపాధ్యాయ వృత్తిలో చేరింది, బతకలేక బడిపంతులుగా కాదు, సిటీలో బాగా పేరున్న ఇంటర్నేషనల్ స్కూల్ లో ఉద్యోగం, మంచి జీతం.

"నాకు ఇంజినీరింగ్ లో సీట్ వచ్చినా, ఇష్టమైన ఉపాధ్యాయ వృత్తి కోసం వదిలేసాను, ఏ సాఫ్ట్వేర్ ఇంజినీర్ జీతానికి తీసిపోకుండా నెలకి జీతం లక్ష

వస్తుంది, నా పేరు మీద స్కూల్ దగ్గరలో ఫ్లాట్ బుక్ చేసాను, జీతంలోనుంచి లోన్ కి కట్ అయ్యాక, కొంత మా అమ్మా, నాన్నలకి పంపి మిగిలినది ఇంట్లో ఇస్తాను, మీకు అభ్యంతరం లేదుగా?" అడిగింది శ్రావణి.

శ్రావణి కూడా ఒక్కతే సంతానం, ఆమె తండ్రి కూడా చిరు ఉద్యోగి అవడంవల్ల కొంత ఆర్థిక సాయం చేస్తాను అంటే, అందులో తప్పు పట్టేది ఏమీ కనపడక సంతోష్ "సరే" అన్నాడు.

అందరూ అనుకున్నట్టు, స్కూల్ టీచరే అయినా, శ్రావణికి ఎక్కువ సెలవలు ఉండేవి కావు, పేపర్లు దిద్దడమో, విద్యార్థులని పోటీ పరీక్షలకు తయారుచెయ్యడమో, రాబోయే సంవత్సరానికి పాఠ్యంశాలు తయారు చెయ్యడమో లాంటివి ఉండేవి.

ఏడాది తిరిగేసరికి, శ్రావణి గర్భవతి అయింది. స్నేహితులందరూ పిల్లలు పుట్టక, ఐవీఎఫ్ కోసం లక్షలు ఖర్చు పెడుతుంటే, తనకి ఫ్రీగా పిల్లలు పుడుతున్నారని సంతోషపడ్డాడు సంతోష్.

శ్రావణి చివరి రోజువరకు స్కూల్ కి వెళ్లి తేలిగ్గా బాబుని కన్నది.

అందరూ ఆనందపడ్డారు. శ్రావణి పుట్టింటికి వెళ్లి మూడు నెల్ల తరవాత వస్తోంది.

త్వరలో స్కూల్ కి వెళ్ళాలి కనుక, బాబుని చూడడానికి ఎవరినైనా పెట్టుకుందామని, శ్రావణి ఉదయమే వెళ్ళిపోయినా, సంతోష్ మధ్యాహం షిఫ్ట్ లో వెళ్తే ఎలానో లాక్కు రావచ్చు అనుకున్నారు.

శ్రావణి తండ్రి ఇంకా ఉద్యోగంలో ఉన్నాడు కనక వాళ్ళు వచ్చి ఉండలేరు, సంతోష్ తండ్రి రిటైర్ అయినా, ఆయన ఆరోగ్యం అంతంత మాత్రమే, తల్లికి మోకాళ్ళ నొప్పులు, త్వరలో ఆపరేషన్ చేయించాలన్నారు, అందువల్ల వాళ్ళు వచ్చినా పెద్ద ఉపయోగం ఉండదు అని వాళ్ళని ఇక్కడకి వచ్చి ఉండమని చెప్పలేదు.

ఇప్పుడు ఏమి చెయ్యాలి? శ్రావణి ఉద్యోగానికి వెళ్లాలంటే మనిషి సాయం కావాలి, దానితో

ఖర్చు పెరుగుతుంది, ఇప్పుడు ఉన్న పరిస్థితికి తనకి వెంటనే ఉద్యోగం రావడం కూడా తేలిక కాదు. మూడు నెలల తరవాత కూడా తనకి జాబ్ రాకపోతే? ఊర్లో కొన్న ఫ్లాట్ అప్పుకి కట్టాలి, అమ్మ, నాన్నలకి నెల ఖర్చుకి డబ్బులు పంపాలి, తలుచుకుంటే అంతా అగమ్యగోచరంగా ఉండి ఒళ్ళు జలదరించింది సంతోష్ కి.

శ్రావణికి ఈ వార్త, సంతోష్ స్నేహితుల ద్వారా తెలిసినట్టుంది. సంతోష్ ఫోన్ ఎత్తలేదని ఖంగారుగా మెసేజ్ పెట్టింది.

"ప్లీజ్ సంతోష్ ఒక్కసారి ఫోన్ ఎత్తి మాట్లాడు, నాకు చాలా ఖంగారుగా ఉంది" అంటూ.

సంతోష్ కి గట్టిగా ఏడవాలని ఉంది, "శ్రావణి ఇక్కడ ఉండిఉంటే ఎంత బావుండేది, ఇలాంటి సమయంలో నా అనే మనిషి ఉంటే ఎంత ఓదార్పుగ ఉండేది.

నేనేకాదు, నా టీం లో వాళ్ళు కూడా ఉద్యోగం పోగొట్టుకున్నారు. అందులో ఒక అతనికి మొన్ననే పెళ్లి అయింది, ఇంకో అమ్మాయికి పసి పిల్లలు, అత్తగారి బాధ్యత, మిగిలిన వాళ్ళు కూడా సాదా సీదా కుటుంబాలే.

వాళ్ళందరి సంగతి ఏమిటి? నేను కనీస సానుభూతి కూడా చూపించకుండా వచ్చేసాను, ఛీ'

నామీద నాకే అసహ్యం వేస్తోంది"అనుకున్నాడు సంతోష్.

మళ్ళీ శ్రావణి వాయిస్ మెసేజ్ వచ్చింది,ముందు వద్దు అనుకున్నా, అది తీసి విన్నాడు.

" సంతోష్! మీ టీం వాళ్ళు ఫోన్ చేసారు, నువ్వు ఎవరితోనూ మాట్లాడకుండా వెళ్ళిపోయావు అని, ప్లీజ్! నేను చెప్పేదివిను, ఇప్పుడు ఉన్న ఉద్యోగాలకి హైర్ అండ్ ఫైర్ మామూలే కదా,

నాకు ఉద్యోగం ఉంది, నీకు కూడా ఒక నెల, రెండు నెలలలో వస్తుంది. అప్పటివరకు హాయిగా బాబుతో ఆడుకో, రెస్ట్ తీసుకో, ఇప్పుడు అనవసరమైన ఆలోచనలతో మనసు పాడు చేసుకోకు, నీ ఫ్రెండ్స్ దగ్గరకు వెళ్ళు, లేదా వాళ్లనే నీ దగ్గరకి

రమ్మను, ఒక్కడివి మాత్రం ఉండకు, మేమందరం టాక్సీ తీసుకుని బయలుదేరాము. ఇంకో నాలుగు గంటల్లో ఇంట్లో ఉంటాము, దయచేసి నువ్వు ఎక్కడున్నా వెంటనే ఇంటికి రా! ప్లీజ్ ! నా కోసం, మన బాబు కోసం, మీ అమ్మా, నాన్నా, మా అమ్మా నాన్న కోసం. ఏ నిర్ణయమైన తీసుకునే ముందు నీ చుట్టూ ఎన్ని జీవితాలు ముడిపడ్డాయో గుర్తు పెట్టుకో" తరవాత శ్రావణి ఏడుపు, తల్లీ, తండ్రీ ఆమెని ఓదార్చడం వినిపిస్తున్నాయి.

ఆలోచన లోనుంచి బయటపడి చూస్తే, తాను నెక్లెస్ రోడ్ దాటి వచ్చాడు. కార్ పక్కకి ఆపి 'ఇందులో దూకేస్తే' అనుకుని అలా చూస్తుంటే,

పక్కనే ఎక్కడో మైక్ లోనుంచి సుందరకాండ పురాణం వినిపిస్తోంది .

"లంకలో సీత కోసం గాలిస్తూ హనుమంతుడు ఓ దశలో విసిగి వేసారిపోయాడు. తీవ్ర నిరాశకు లోనయ్యాడు. చనిపోదామనుకున్నాడు. సరిగ్గా అదే క్షణంలో గుండెలోతుల్లో చిన్న ఆశ మొలకెత్తింది. సీతమ్మ కంటపడుతుందన్న విశ్వాసం చిగురించింది. 'జీవన్ భద్రాణి పశ్యతి... అంటే జీవించడలోనే సుఖం ఉంది, చచ్చి సాధించేదేమీ లేదు, బతికిఉంటే సుఖములు బడయవచ్చు' అనుకున్నాడు. తిరిగి ప్రయత్నాలు కొనసాగించాడు. అద్భుత విజయాన్ని సాధించాడు. ఇది ఒక అద్భుతమైన మంత్రం, ప్రతీ మనిషి తన కష్టకాలంలో తలుచుకోవాల్సిన వాక్యం" ఆ ఉపన్యాసం తనకోసమే చెప్తున్నారా అనుకుంటూ మళ్ళీ నీళ్ల వేపు చూసాడు.

దూరంగా ఒక ఆకారం లీలగా నీళ్ళవేపు వెళ్లడం కనిపించింది, ఇదేమిటి? ఎవరు? కొంపదీసి ఆత్మహత్య చేస్కోరు కదా? తన ఆత్మహత్య సంగతి మర్చిపోయి, కార్ లోనించి దిగి అటువైపు పరిగెత్తాడు సంతోష్.

ఆ ఆకారం దగ్గర అవుతుంటే అది ఒక ఆడ మనిషి అని తెలుస్తోంది.

"అమ్మా! ఆగు! నీళ్ళలోకి వెళ్ళకు" అంటూ పరుగు పెడుతూ నీళ్లలో దూకపోతున్న ఆ అమ్మాయిని పట్టి ఆపాడు.

"వదలండి, నేనెవరికీ అక్కర్లేదు, నేను చావాలి"

అంటూ ఆమె విదిలించుకుంటోంది. ఈడ్చి ఆమె చెంప మీద ఒక్కటి కొట్టాడు.

ఆ అమ్మాయి కింద కూలబడి చేతుల్లో మొహం దాచుకుని ఏడవసాగింది. ఆమె వయసు సుమారు 20-25 మధ్య ఉంటుంది. చిన్న పిల్లలా ఉన్నా, మెళ్ళో నల్లపూసలు పెళ్లి అయిందని చెప్తున్నాయి.

సంతోష్ కూడా పక్కనే కూర్చుని కాసేపు ఆ అమ్మాయిని ఏడవనిచ్చాడు. కొంత దుఃఖము తగ్గాక

"నీ పేరేమిటి? ఎక్కడ ఉంటావు? ఇంటి దగ్గర దింపుతాను" అన్నాడు.

"ఇంటిదగ్గర నా కోసం చూసే వాళ్ళు లేరు? నేను వెళ్ళను" అంది ఆ అమ్మాయి. "చూడమ్మా!"

అని సంతోష్ అంటుంటే "సుమ" అంది, " సుమా! మీ భర్త ఖంగారు పడతారు, ఇంట్లో ఉన్న వాళ్ళు..."

"మా అత్తా, మామా, మా వారు, మా బాబు ఉన్నారు ఇంట్లో. నేను ఒక సూపర్ బజార్ లో పనిచేస్తాను. మా ఇల్లు ఖైరతాబాద్ స్టేషన్ వెనక, నా బాబు కి రెండేళ్లు, మా మామ రోజు కూలి, మా ఆయన ఆటో నడుపుతాడు, మా ఊర్లో మాకు పొలం, ఇల్లు ఉన్నాయి అవి తాకట్టులో ఉన్నాయి, విడిపించాలని నేను కూడా పని చేస్తూ చిట్టి కడుతున్నా. నేను డ్యూటీకి వెళ్ళినప్పుడు బాబుని సరిగ్గా చూడదు, ఏమన్నా అంటే కొట్లాటలే, నేనేమన్నా నాకు నగలు కావాలని పని చేస్తున్నానా? ఇల్లు గిర్వి విడిపించడానికేగా, ఇవాళ పొద్దున్న కూడా కొట్లాట

అయింది".

"దిమాక్ అంతా టెన్షన్లో పెట్టుకుని పనికి వెళ్ళాను, నేనూ మనిషినేగా! పనిలో చిన్న తప్పు చేశాను, ఒక్క నిమిషం కూడ ఆగలేదు మేనేజర్, అందరి ముందు తిట్టి వెంటనే ఉద్యోగం లోనుంచి తీసేసాడు. ఇప్పుడు ఇంటికి వెళ్లి ఏమి చెప్పను? మా అత్త ఇంకెన్ని తిడుతుందో" ఒకో మాట, ఒకో చెంప దెబ్బలా చెళ్లు, చెళ్ళున తగులుతున్నాయి సంతోష్ కి.

"చూడమ్మా! ఆత్మహత్య చేసుకుంటే, నీ కొడుకుని ఎవరు చూస్తారు? నువ్వు ఉన్నప్పుడే చూడని మీ అత్త చూస్తుందా? నీ శవం దొరకగానే ముందు నీ భర్త ని పోలీసులు పట్టుకుపోతారు, తల్లి లేక... తండ్రి జైలులో ఉంటే నీ కొడుకు ఏమైపోతాడో ఆలోచించావా?

చూడు సుమా! మన అందరికీ జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు బతుకు మీద విరక్తి వస్తుంది, చనిపోవాలనిపిస్తుంది, కానీ ఒక్క నిమిషం ఆలోచిస్తే మనం చేసుకునేది ఆత్మహత్య కాదు, హత్య ... మన కుటుంబం మొత్తాన్ని హత్య చేసినట్టే, నీ విషయమే తీస్కో, నీ భర్త నే కాదు, నీ అత్త, మామలని కూడా పోలీసులు తీసుకెళ్తారు, నీ తల్లి, తండ్రులకి ఇప్పటివరకూ నీ భర్తతో ఏ సమస్య లేకపోయినా, నీ చావుకి అతన్నే కారణం చేస్తారు, అతనితో పాటు నీ అత్త కుటుంబం అంతా జైలులో మగ్గాలి, నీ ఒక్కదాని ప్రాణం తీసుకున్నా, ఉన్నవాళ్లు జీవశ్చవాల్లా బతుకుతారు" సంతోష్ మాటలతో సుమ భయం తో ఒణికిపోయింది.

"నేను ఇంటికెళ్ళాలి, నా బాబుని చూడాలి" ఏడుస్తూ అంది.

"రామ్మా! మీ ఇంటి దగ్గర దింపుతాను" అంటూ సుమని కార్ ఎక్కించుకుని సుమ ఇంటికి వెళ్ళాడు.

సుమ కార్ దిగేసరికి, ఆమె అత్త, బాబుని ఎత్తుకుని పరిగెత్తుకు వచ్చింది.

"ఎక్కడికి పోయావే దొంగమొహందానా! ఏమయ్యావో అని భయంతో చస్తున్నాము, నీ మామ, నీ మొగుడు నిన్ను వెతకనీకి తలా దిక్కుకు పోయారు, పసివాడు ఏడ్చి, ఏడ్చి పడుకున్నాడు" ఏడుస్తూ సుమని కావిలించుకుంది. అత్త తిట్లు దీవెనలాగా వినిపించాయి సుమకి.

సుమ కూడా "అత్తా!" అంటూ ఆమెని పట్టుకుని, బాబుని తీసుకుంది. వెంటనే సుమ అత్త, కొడుక్కి, భర్తకి ఫోన్ చేసి సుమవచ్చిన విషయం చెప్పింది. వాళ్ళు దగ్గరలో ఉన్నారేమో వెంటనే వచ్చారు. సుమ భర్త సాయి "ఎక్కడికి పోయావు?" అని కోపంగా అంటే సుమ కనిపించలేదన్న బాధ అతని గొంతులో కనిపించింది.

"నన్ను క్షమించండి, నేను నా సమస్యలతో ఆత్మహత్య చేసుకుందామని ప్రయత్నిస్తుంటే, సుమ నన్ను రక్షించింది, నా వల్లే ఆమెకు లేట్ అయింది, కానీ నా కళ్ళు తెరిపించి నా ప్రాణం కాపాడింది"

సంతోష్ వాళ్లతో చెప్తుంటే, సుమ బిత్తరపోయి ఏదో చెప్పబోతుంటే, వెంటనే వారించాడు సంతోష్.

"నువ్వు చెప్పేది నాకు తెలుసు సుమా! నువ్వు నాకు దేముడిచ్చిన చెల్లివి , నువ్వు నాకు అంతసేపు నచ్చచెప్పి అలసిపోయావు, ఇంక మాట్లాడకుండా విశ్రాంతి తీసుకో, నేను నా భార్యని తీసుకుని రేపు మళ్ళీ వస్తాను, నీ ఋణం తీర్చుకోలేనమ్మా!" అంటూ సాయికి, సుమ మామకి నమస్కారం చేసి బయటికి వచ్చాడు సంతోష్.

కారులో కూర్చుని జరిగిన విషయాలు నెమ్మదిగా నెమరువేసుకున్న సంతోష్ కి అనిపించింది, నిజంగానే దేవుడు, తనని ఆత్మహత్య నుంచి కాపాడడానికి, ఆ పురాణం వినిపించడం, సుమ కనిపించడం చేసాడేమో.

వెంటనే శ్రావణికి ఫోన్ చేసాడు, ఫోన్ కలవలేదు, మళ్ళీ తండ్రికి, తల్లికి చేసాడు. బహుశా వాళ్ళు ప్రయాణంలో ఉన్నారేమో, సిగ్నల్ లేదేమో అంటూ మళ్ళీ చేసాడు, ఒక్క రింగ్ వచ్చి మళ్ళీ పోయింది.

వెంటనే మళ్ళీ ఫోన్ రింగయింది "శ్రావణీ!" అంటే అవతలనుంచి తెరలు, తెరలుగా ఏడుపు.

స్పీకర్ లో పెట్టినట్టుంది, తల్లి ఏడుపు గొంతు వినిపించింది

"కన్నా!" అంటూ,

"అమ్మా! నేను బావున్నాను, ఏ పిచ్చి పనీ చెయ్యను, దేవుడు ఒక అమ్మాయి రూపంలో నన్ను కాపాడాడు, ఇంట్లో మీ కోసం చూస్తుంటాను" ఇంక మాట్లాడలేక పెట్టేసాడు.

మళ్ళీ ఫోన్ మోగింది, ఈసారి టీం వాళ్ళు "ఏమిటి బాస్! నువ్వు చాలా కంగారు పెట్టావు మమ్మల్ని? నీ సపోర్ట్ మాకుంటుంది అనుకుంటే ఇలా చేసావు?" టీం లో ఉండే అమ్మాయి అడుగుతోంది.

"సారీ! సంధ్యా, నిజానికి నేను మీకు ధైర్యం చెప్పాల్సింది, భయం, బాధ తో ఏమి చేస్తున్నానో అర్థంకాక పారిపోయాను" నిజం ఒప్పుకున్నాడు. "ఓకే! నేను ఇంటికి వెళ్తున్నా, కలుద్దాం" అని ఫోన్ పెట్టేయబోతుంటే ఇంకో కొలీగ్ సురేష్ మాట్లాడాడు.

"ఏంటిరా సంతోష్! మేము అసలు విషయం చెప్పేలోగా పొద్దున్న పారిపోయావు? ఇప్పుడేమో ఫోన్ పెట్టేస్తావు? మనందరికీ తెలిసిందేగా మన ఉద్యోగాలకి సెక్యూరిటీ లేదు, ఎప్పుడైనా తీసేయచ్చు అని. ఈ నెల కాకపోతే పై నెల, ఈ ఉద్యోగం కాకపోతే ఇంకో ఉద్యోగం, అంత మాత్రాన అంత నిస్పృహ కి ఎందుకు లోనయ్యావు? మాకు లేవా డబ్బు సమస్యలు? మనలో ఎవ్వరం ధనవంతులం కాదు, కంప్యూటర్ మీద చెయ్యాడితే కానీ డొక్కాడని జీవులం, అందరం కలిసి ఏదో ఒకటి చేసేవాళ్ళం కదా! నువ్వు ఖంగారు పడి మమ్మల్ని అందరినీ ఖంగారు పెట్టావు, పోనీలే, తెలుగు సినిమా చివరి సీనులా అంతా శుభమే జరిగింది.

ఇంతకీ ఆ శుభవార్త ఏమంటే, మన టీం మేనేజర్ గా చేసి, స్టార్టప్ మొదలు పెట్టిన అభిషేక్ గుర్తున్నాడా! అతనికి అర్జెంటుగా వర్క్ ఫోర్స్ కావాలిట, మన టీం అందరినీ వాళ్ళ కంపెనీలోకి, ఇప్పుడు మనకి వచ్చే జీతం కన్నా ఎక్కువ ఇచ్చి తీసుకుంటున్నాడు" ఊపిరి తీసుకోడానికి ఆగాడు సురేష్, "ఆఁ! ఏమన్నావు? నిజమా!"

ఆనందంతో ఉబ్బితబ్బిబ్బు అయ్యాడు సంతోష్.

"పొద్దుట్నించి నిన్ను కాంటాక్ట్ చెయ్యడానికి ఎంత ప్రయత్నిస్తున్నామో నీకు తెలీదు? అమ్మయ్య! ఇప్పటికి నిన్ను కాంటాక్ట్ చేసాం" మళ్లీ సురేష్ ని ఆపుతూ "మీరెక్కడఉన్నారు? నేను వస్తాను" అన్నాడు సంతోష్.

"మీ ఇంటి దగ్గరే కాపలా కాస్తున్నాం నాయనా! త్వరగా రా!" అని పెట్టేసాడు సురేష్

కార్ వెంటనే తన ఇంటివైపు కి మళ్ళించాడు.

తనకి ఉద్యోగం వస్తే తన సమస్య పరిష్కారమైనట్లే, సుమకి ఎలానూ ఉద్యోగం పోయిందిగా, బాబుని చూడడానికి రమ్మంటే ఆమె సమస్య కూడా తీరుతుందిగా,తను ఆ అమ్మాయి సమస్య పరిష్కరిస్తే, దేవుడు తన సమస్య పరిష్కరించాడు.

అవును! పరిష్కారం లేని సమస్యలు ఏమి ఉన్నాయి జీవితంలో? ఒక్క నిమిషం, నిదానంగా ఆలోచిస్తే, అన్నిటికీ పరిష్కారం ఉన్నాయి. సుమ సమస్య అంటే ఎంత తేలిగ్గా పరిష్కరించాడు, కానీ, అది తన స్వంత సమస్య అనేసరికి, నిస్పృహ వచ్చి ఆత్మహత్య చేసుకుందామనుకున్నాడు. ఎంత తప్పు ఆలోచన, తనకి లేరా కుటుంబము, తన ఒక్కడి ప్రాణానికి ముడివేసుకున్న ప్రాణాలు ఎన్ని ఉన్నాయి? ఒక్క క్షణం తనవారి గురించి ఆలోచిస్తే తనేకాదు, ఎవరైనా సరే వాళ్ళ ప్రాణం తీసుకోగలరా? ఇంక ఎప్పుడూ ఇలాంటి ఆలోచన రాకూడదు, తనకే కాదు వేరే వారు ఎవరైనా ఇలా నిరాశా, నిస్పృహలకు లోనై ఉన్నట్లు అనిపిస్తే, వాళ్లతో మాట్లాడి సమస్య పరిష్కారం అవడానికి సాయం చెయ్యాలి.

తన అదృష్టం కొద్దీ, అందరూ తనని అర్థం చేసుకుని, తన సమస్య పరిష్కారం చేసేవాళ్ళు దొరికారు, ఇంకెప్పుడు తనకి ఇలాంటి ఆలోచన రాకూడదు.

దృఢ నిశ్చయంతో ఇంటి ముందు కార్ ఆపి, తనకోసం ఎదురు చూస్తున్న తనవాళ్ళని చూస్తూ, భవిషత్తు లోకి నడిచాడు సంతోష్.

కథ

# కుర్చీ

శింగిరాజు శ్రీనివాసరావు

ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే సముద్రంలా సాగుతుంది తన జీవితం అనుకున్నది సంధ్య. కానీ అనుకోని సునామి వచ్చి తన జీవితాన్ని కబలిస్తుందని అనుకోలేదు. మధ్యతరగతి జీవితమైనా ఏనాడు ఏ లోటు రాకుండా ఉన్న ఒక్క కూతురిని పెంచాడు వాసుదేవరావు. తమకు తగిన సంబంధమనుకుని శ్రీహరికి ఇచ్చి ఘనంగా పెళ్ళి చేశాడు. ప్రేమ, దోమ అంటూ కొత్త చిక్కులు తెచ్చి పెట్టకుండా తండ్రి మాట ప్రకారం శ్రీహరి చేత మెడలో తాళి కట్టించుకుంది సంధ్య. ప్రైవేటు బ్యాంకులో మేనేజరుగా పనిచేస్తున్న శ్రీహరికి కూడ  పెద్దగా బాధ్యతలు లేకపోవడంతో సంధ్య జీవితం నల్లేరు మీద బండిలా సాఫీగా నడిచిపోసాగింది. భర్త ప్రేమలో తడిసిపోతూ ఒక చక్కని బిడ్డకు జన్మనిచ్చింది సంధ్య. కొడుకు శ్రీహాన్ తో ముద్దు, ముచ్చట్లలో మునిగిపోతున్న ఆ కుటుంబాన్ని మహమ్మారిలా కబళించింది కరోన. అన్ని సంస్థలకు విరామం ప్రకటించిన దేశం, అత్యవసర సేవల క్రింద విరామం ప్రకటించని సంస్థలలో బ్యాంకింగు ఒకటి కావడంతో, శ్రీహరికి బ్యాంకుకు వెళ్ళక తప్పలేదు.

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, ఎలా అంటుకున్నదో వచ్చి అంటుకున్నది కరోన. ఇరవై రోజుల పాటు వైరస్ తో పోరాడి అలిసిపోయి దానికి వశమై లోకాన్ని వీడిపోయాడు శ్రీహరి.

కొడుకు చనిపోయాడనే దిగులుతో సంవత్సరం తిరగకుండానే తనువు చాలించాడు శ్రీహరి తండ్రి యశోధన రావు. ఇప్పుడు ఆ కుటుంబం బాధ్యత సంధ్య మీద పడింది. ముప్పై సంవత్సరాల వయసులోనే కష్టాలు ముప్పేట దాడి చేసి సంధ్యను అశక్తురాలిని చేశాయి. కానీ ధైర్యం సడలని సంధ్య భర్త బ్యాంకులోనే గుమాస్తాగా చేరింది. అత్తతో, కొడుకుతో ఒంటరి పోరాటం మొదలుపెట్టింది.

శ్రీహరి చనిపోయి రెండు సంవత్సరాలు దాటిపోయాయి. కూతురి జీవితం పసివయసులోనే మోడుబారి పోవడం చూడలేని ఆమె తండ్రి వాసుదేవరావు ఆమెను మరల పెళ్ళి చేసుకోమని వత్తిడి చేయసాగాడు. ఆమె అత్తగారు కూడ కోడలి ఒంటరితనాన్ని చూడలేక ఆమె కూడ వాసుదేవరావు మాటతో జత కలిపింది. ఎవరు ఎంత చెప్పినా 'ససేమిరా' అన్నది సంధ్య. ఇప్పుడు ఆమె లోకం శ్రీహాన్ మాత్రమే. తమ ప్రేమకు ప్రతిరూపమైన బిడ్డకు తండ్రిలేని లోటు లేకుండా చూడాలన్నదే ఆమె తాపత్రయం.

★★★★★★★★

"సంధ్యా..ఒక్కసారి ఆలోచించమ్మా. నీకేమంత వయసు మించిపోయిందని అంత వైరాగ్యం. మళ్ళీ పెళ్ళి చేసుకోవడం నేరం కాదు. నీ జీవితానికి తోడే కాదు, నీ బిడ్డకు తండ్రి లేని లోటుకూడ తీరుతుంది. మేమింక ఎంతకాలం బ్రతుకుతామో మాకే తెలీదు. మేము పోయాక నువ్వు ఒంటరిదానివై పోతావు కదమ్మా. మేమిలా ఉండగానే నీకో తోడును జతచేస్తే మేము ప్రశాంతంగా కన్నుమూస్తాము" బ్రతిమలాడుతున్నాడు వాసుదేవరావు.

"అన్నయ్య చెప్పినది సబబుగానే ఉంది సంధ్య. నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకుంటే నీకు జరిగిన అన్యాయాన్ని నేను మర్చిపోగలుగుతాను. ఆ పసివాడికి కూడ తండ్రి ప్రేమ దక్కుతుంది. నా సంగతి అంటావా..నా ఇంట్లో నేను ఉంటాను. ఉండలేకపోతే ఆశ్రమాలు ఎలాగూ ఉన్నాయి. జీవితపు చరమాంకంలో వున్న నాకోసం నీ నిండు జీవితాన్ని పణంగా పెట్టకు" అందుకున్నది సంధ్య అత్త రాగిణి.

"మీ అత్తగారు కూడ ఒప్పుకున్నారు కదమ్మా. ఇక నీకు అభ్యంతరమేమిటి?" ఎలాగైనా కూతురికి మళ్ళీ పెళ్ళి చేసి ఆమెకు ఒక తోడును ఏర్పరచాలని వాసుదేవరావు తపన.

"నాన్నా..ఒకవేళ నాకు పిల్లలు లేకుంటే మీరు చెప్పేదానికి ఒప్పుకునేదాన్నేమో. కానీ ఇప్పుడు నాకు ఎదిగిన కొడుకు ఉన్నాడు. వాడి బాధ్యత నాకున్నది. రేపు నన్ను వివాహం చేసుకునే వ్యక్తి నా కొడుకును నా దగ్గర ఉంచుకోవడానికి ఒప్పుకోవచ్చు, ఒప్పుకోకపోవచ్చు. ఒకవేళ ఒప్పుకున్నా, వాడిని తండ్రిలా ప్రేమించగలడనే నమ్మకం నాకు లేదు. అప్పుడు నా కొడుకు తండ్రి ప్రేమనే కాదు, సంపూర్ణంగా తల్లి ప్రేమను కూడ పొందలేడు. అది నాకు ఇష్టం లేదు. అందుకని మీరు ఆ ఆలోచన మానుకోండి" చెప్పింది సంధ్య.

"నీకా భయం అక్కరలేదమ్మా. మనవడిని నేను తీసుకెళ్ళి, నీకంటే గొప్పగా పెంచుతాను. వాడి వల్ల మీకు ఏ ఇబ్బంది రాదు" భరోస ఇచ్చాడు వాసుదేవరావు.

"అప్పుడు వాడు తల్లి ఉండి కూడ తల్లిలేని పిల్లవాడు అవుతాడు"

"సంధ్యా..అలా అంటావేమిటి? నేను వాడి తాతనే. వాడు అమ్మమ్మ ఒడిలో పెరుగుతాడు"

"అంతే తప్ప..అమ్మ ఒడిలో కాదుగా"

"అదికాదు సంధ్యా..నువ్వు

అప్పుడప్పుడు వెళ్ళి చూసి రావచ్చు. అయినా వాడు ఎలాగూ స్కూలుకు వెళుతున్నాడు కదా. వాడి చదువు ధ్యాసలో వాడు ఉంటాడు “ అందుకుంది రాగిణి.

“కానీ నా బిడ్డకు నేను చేసి పెట్టే అదృష్టానికి దూరమవుతాను కదా అత్తయ్యా”

“దేనికది చెబితే ఇక మేము ఏం మాట్లాడగలం” కొంచెం కోపంగా అన్నాడు వాసుదేవరావు.

“అందుకే మరోసారి ఈ టాపిక్ మాట్లాడవద్దు నాన్నా. నాకు తోడుగా అత్తయ్య గారున్నారు. ఒక్క పదిహేను సంవత్సరాలు ఓపిక పడితే శ్రీహాన్ చేతికి అందివస్తాడు. నా స్వార్థం కోసం నా బిడ్డను బలి చేయలేను నాన్నా. నేను బ్రతికున్నంత కాలం శ్రీహరి ఊహలలోనే బ్రతుకుతాను. పెళ్ళి జీవితంలో ఒక భాగమే కానీ, పెళ్ళే జీవితం కాదు నాన్నా. ఆ భాగం నా జీవితంలో ముగిసిపోయింది. ఇక తల్లిగా నా బాధ్యత మిగిలివుంది. ఏ ప్రలోభాలకు లొంగకుండా ఆ బాధ్యతను నన్ను నెరవేర్చనీయండి నాన్నా” అని అక్కడి నుంచి లేచి వెళ్ళిపోయింది సంధ్య.

సంధ్యను ఎలా ఒప్పించాలో అర్థంగాక తలపట్టుకు కూర్చున్నాడు వాసుదేవరావు. మౌనంగా తనూ లేచి వెళ్ళింది రాగిణి.

★★★★★

“అమ్మా..నాన్న ఒడిలో కూర్చుని నేను తీయించుకున్న ఫొటో భలే వుంది కదూ” అన్నాడు తల్లితో, తను తండ్రితో కలిసి తీయించుకున్న ఫొటో చూస్తూ ఏడేళ్ళ శ్రీహాన్.

“అవునా”

“అమ్మా..అప్పుడు నాకు ఎన్నేళ్ళు?”

“రెండేళ్ళు”

“నాన్న ఉంటే ఇప్పుడు కూడ నేను నాన్న ఒడిలో కూర్చుని నాన్న చేత చదువు చెప్పించుకునే వాణ్ణి కదూ” ఫొటోను తదేకంగా చూస్తూ అన్నాడు.

మనసు చివుక్కుమంది సంధ్యకు. శ్రీహాన్ ఇలా అడగడం మొదటిసారి కాదు. ఈ మధ్య కాలంలో నాలుగైదు సార్లు అడిగాడు. తండ్రి ప్రేమ కోసం ఎంత తపిస్తున్నాడో అర్థమయింది. ఉబికి వచ్చే కన్నీటిని అదుపు చేసుకుంటూ “బాబీ..నువ్వు ఈరోజు పార్కుకు వెళదామన్నావు కదా. వెళదామా” మాట మార్చింది సంధ్య.

“అవును కదా..మర్చేపోయాను. మరి నానమ్మ” అడిగాడు శ్రీహాన్.

“అది పిల్లలు ఆడుకునే పార్కురా మనవడా. నేను వచ్చి ఏం చేస్తాను. ఇక్కడే ఉండి భక్తి టి.వి చూసుకుంటాను. మీరిద్దరూ వెళ్ళిరండి” అన్నది రాగిణి.

“అది కాదత్తయ్యా..మీరొక్కరే ఒంటరిగా..”

“పిచ్చిదానా..ఒంటరేమిటే..ఈ రోజులలో అందరికీ తోడు, జోడు టి.విలు, సెల్ ఫోనులేనే. ఇక ఏమీ మాట్లాడకుండా వెళ్ళిరండి” అని రాగిణి అనగానే ‘సరే’నని బయలుదేరింది సంధ్య, శ్రీహాన్ ను తీసుకుని.

★★★★★

పార్కులో కొద్దిసేపు ఆడుకుని వచ్చి తల్లి ప్రక్కన చేరి సేదతీరుతున్నాడు శ్రీహాన్. అలిసిపోయి వచ్చిన బిడ్డకు మంచినీళ్ళు పట్టి ఫ్లాస్కులో తెచ్చిన హార్లిక్స్ ను గ్లాసులో పోసి ఇచ్చింది త్రాగమని. తల్లి చేతిలో గ్లాసు తీసుకుని హార్లిక్స్ తాగుతున్న శ్రీహాన్ దృష్టి తమకు ఎదురుగా ఉన్న బల్ల మీద తండ్రి ఒడిలో కూర్చుని, తండ్రి బుగ్గలను గిచ్చుతూ, అతని కళ్ళజోడు తీసి తను పెట్టుకుంటూ, అతని బుగ్గల మీద ముద్దులు పెడుతున్న చిన్నపాప మీద పడింది. తాగుతున్న గ్లాసును అలాగే చేతితో పట్టుకుని చూస్తుండి పోయాడు శ్రీహాన్. అలా నిశ్చేష్టుడై ఎటో చూస్తున్న కొడుకును తట్టి, “ఏరా అలా బిగుసుకు పోయావు. ముందు తాగు. తరువాత చూద్దువుగాని” అన్నది సంధ్య.

“అమ్మా..అటు చూడు. ఆ పాప వాళ్ళ నాన్న ఒడిలో కూర్చుని ఎలా ఆడుకుంటున్నదో” అని తల్లికి

తను చూస్తున్న వైపు చూపించాడు. అటువైపుకు చూసింది సంధ్య. అక్కడ తండ్రి ఒడిలో ఎగురుతూ ఆడుకుంటున్నది ఒక పాప.

తను ఎంత ప్రేమగా చూస్తున్నా కొడుకు మనసు తండ్రి ప్రేమ కోసం పరితపిస్తున్నదని అర్థమయింది సంధ్యకు.

"శ్రీ..తను నీకంటే చాలా చిన్నపిల్ల. ఆ వయసులో నువ్వు కూడ నా ఒడిలో అలాగే ఆడుకున్నావు. గుర్తులేదా" అన్నది మిగిలిన హార్లిక్సును శ్రీహాన్ నోటిలో పోస్తూ.

"ఏమో గుర్తులేదమ్మా..అప్పుడు నాన్నగారు కూడ ఉన్నారా? ఆయన ఒడిలో కూడ నేను అలానే ఆడుకున్నానా" ఆతృతగా అడిగాడు.

"ఆ..ఆ..అవును" మాట తడబడింది సంధ్యకు. వాడికి రెండేళ్ళ వయసులోనే తండ్రి వాడిని విడిచి వెళ్ళిపోయాడని గుర్తుకు వచ్చి ఆమె మనసు ద్రవించింది.

"అమ్మా..ఇక నాన్న రారుగా. నేనిక నాన్న ఒడిలో ఆడుకోలేనుగా" అంటున్న వాడి మాటలకు సంధ్యకు దుఃఖం ఆగలేదు. శ్రీహాన్ ను గుండెకు హత్తుకుంది. కన్నీటి సంద్రాన్ని రెప్పల వెనుక బంధించింది. శ్రీహాన్ నుదిటిని చుంబించింది.

"శ్రీ..నీకు అమ్మనైనా, నాన్ననైనా నేనేరా..రా.. నా ఒడిలో కూర్చుని తనివితీరా ఆడుకో" అంటూ బాబును గుండెలకు హత్తుకుంది.

"బాధపడుతున్నావా అమ్మా. ఎందుకో నాన్న ఉండివుంటే నేను కూడ ఆ పాపలా నాన్న ఒడిలో ఆడుకునేవాణ్ణి కదా అనుకున్నాను. అంతే. అయినా నువ్వున్నావుగా నాకు" అంటూ తల్లి బుగ్గమీద గట్టిగా ముద్దుపెట్టుకుని "ఐ లవ్ యూ మమ్మీ" అన్నాడు. ఆనందంతో కొడుకును కౌగిలించుకుంది సంధ్య. ఎన్ని కోట్లు కుమ్మరించినా దొరకని తల్లి ప్రేమ ఎదురుగా ఉన్నా, తండ్రి ప్రేమ కోసం పసిమనసు తపిస్తున్నదని అర్థమైన సంధ్యకు, ఆ సమస్యకు పరిష్కారమేమిటో మాత్రం అర్థంకావటం లేదు.

సూరీడు సెలవు తీసుకోవడానికి సిద్ధం కావటంతో ఇంటికి బయలుదేరడానికి సిద్ధమయింది సంధ్య.

★★★★★★★★★★

"విశృతీ..నేను ఎంత ప్రయత్నించినా శ్రీహాన్ మనసు నుంచి తండ్రి గురించిన ఆలోచనలను తుడపలేక పోతున్నాను" స్నేహితురాలితో అన్నది సంధ్య.

"పసివయసు కదా..తోటి పిల్లలు అందరూ తమ తండ్రుల గురించి గొప్పగా చెబుతుంటే, తన తండ్రి కూడ ఉంటే అందరిలా తనూ తన గురించి చెప్పుకునేవాణ్ణి కదా అని అనుకుంటున్నాడేమో" అన్నది విశృతి.

"వాడు ఎలా ఆలోచించినా వాడి లోటును నేను తీర్చలేక పోతున్నాననే బాధ కలుగుతున్నది"

"పోనీ ఒక పని చెయ్"

"ఏమిటే అది"

"మళ్ళీ పెళ్ళి చేసుకో"

"విశృతీ.."

"అవును సంధ్య. నీకు వయసు మీరి పోలేదు. నిజానికి ఇప్పటి ఆడపిల్లలు నీ వయసు వచ్చే వరకు పెళ్ళిళ్ళు కూడ చేసుకోవడం లేదు. అందుకని నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకుని కొత్త జీవితం ప్రారంభించు. ఈ పెళ్ళి వల్ల నీ జీవితం మరో మలుపు తిరగడమే కాదు, నీ కొడుకుకు తండ్రి లేని లోటును తీర్చిన దానివి అవుతావు. శ్రీహాన్ ఎదురు చూస్తున్న తండ్రి ప్రేమ కూడ వాడికి దక్కుతుంది. ఏమంటావ్"

"అది అసంభవం విశృతి. నా మనసులో శ్రీహరికి తప్ప వేరే మగవాడికి చోటు లేదు. నాకు శ్రీహాన్ ను చూసినప్పుడల్లా శ్రీహరే గుర్తుకు వస్తాడు. వాడు అచ్చు తండ్రి పోలిక. నేను శ్రీహరిని మర్చిపోవడమంటే నేను చచ్చిపోవడమే"

"సంధ్యా..ఏమిటా మాటలు"

"అవును విశృతీ..మాది ప్రేమ పెళ్ళి కాదు. పెళ్ళి అయాక కలిగిన ప్రేమ. అది అగ్నిహోత్రం సాక్షిగా ఉదయించిన ప్రేమ. మరో విషయం విశృతి..మీ అందరి మాటలకు తలవంచి, మనసు చంపుకుని, నా కొడుకుకు తండ్రి ప్రేమ అందించాలని వేరే అతనితో తాళి కట్టించుకున్నా, వచ్చిన అతను నా కొడుకుకు నిస్వార్థమైన ప్రేమను పంచగలడా? ఇక మనకు పిల్లలు వద్దంటే ఒప్పుకుంటాడా? ఒకవేళ నేను అతని మాటకు తలవంచి మరో బిడ్డకు జన్మనిస్తే, శ్రీహాన్ పరిస్థితి ఏమిటి? తల్లిగా నేను ఇద్దరినీ సమానంగా చూసినా, వేరే వారికి పుట్టిన బిడ్డను తన బిడ్డతో సమానంగా చూడగలడా అతను? నన్నే నమ్ముకుని నాతో కలిసివున్న మా అత్తయ్య పరిస్థితి ఏమిటి? ఇలాంటివి ఎన్నో ప్రశ్నలు నా ముందు నిలబడి ఉన్నాయి. వాటిలో దేనికీ నాకు సరియైన సమాధానం దొరకడం లేదు. నాకు పెళ్ళి ముఖ్యం కాదు విశృతి.. నా కొడుకు జీవితం ముఖ్యం. వాడి భవిష్యత్ ముఖ్యం. వాడు తండ్రి ప్రేమ కోసం తపించడం అనేది తాత్కాలికం. వయసు పెరిగితే పరిస్థితి వాడికే అర్థమవుతుంది. అంతవరకు వాడి తపనను సంతృప్తి పరిచే మార్గమేదైనా చూడాలి. ఆ దిశగా ఆలోచిద్దాం విశృతి. అంతేగానీ మరో పెళ్ళి ప్రస్తావనతో ఎప్పుడు నా ముందుకు రాకు" నిష్కర్షగా చెప్పింది సంధ్య.

"సరే సంధ్య..నువ్వు చెప్పినది కరెక్టే..ఈ రోజులలో ఎవరినీ నమ్మలేము. ఏదో ఒక మార్గం ఆలోచిద్దాం. వచ్చే ఆదివారం శ్రీహాన్ పుట్టినరోజు కదా, ఆ రోజు వాడికి సర్ప్రైజ్ గిఫ్ట్ ఇస్తానని చెప్పు"

"సర్ప్రైజ్ గిఫ్టా..అదేంటే" ఆశ్చర్యంగా అడిగింది సంధ్య.

"ఇంకా ఆలోచించలేదు. ఆలోచించాలి" అన్నది విశృతి.

"అది కాదే.." ఏదో అడగబోయింది సంధ్య.

"ఇప్పుడు చెప్పలేను. ముందు పద..ఇప్పటికే ఆలస్యమయింది" అని లేచింది విశృతి. అనుసరించింది సంధ్య.

★★★★★★★★

శ్రీహాన్ పుట్టినరోజుకు అంతా సిద్ధం చేసింది సంధ్య. అమ్మమ్మ, తాతయ్య, నానమ్మలకు పాదాభివందనం చేసి తల్లి దగ్గరకు వచ్చాడు శ్రీహాన్. తోటి పిల్లలందరూ రావడంతో హాలంతా సందడిగా ఉంది. ఇక కేక్ కట్ చేయడానికి రమ్మని కూతురిని, మనవడిని పిలిచాడు వాసుదేవరావు.

"ఆ..వస్తున్నా తాతయ్యా.. అమ్మా..రా పోదాం" అంటూ సంధ్యను తీసుకుని పోబోయాడు శ్రీహాన్.

"ఉండు నాన్నా..ఒక్క నిమిషం. విశృతీ..ఆ గిఫ్ట్ తెచ్చి అక్కడ పెట్టించు" అని చెప్పి శ్రీహాన్ ను తీసుకుని కేక్ పెట్టిన బల్ల దగ్గరకు వెళ్ళింది సంధ్య.

మరో అయిదు నిముషాలలో ఆ బల్ల ముందు ఒక ప్యాక్ చేసిన కుర్చీ ఒకటి పెట్టబడింది. అందరూ ఆశ్చర్యంగా చూశారు దానివైపు. 'ఏమిటమ్మా ఇది' అన్నట్టుగా చూసింది రాగిణి కోడలి వైపు.

"సంధ్యా..ఇంకా ముసుగెందుకు. నీ బిడ్డ కోసం నువ్వు తెచ్చిన బహుమతిని వాడికి చూపించు" అని విశృతి అనడంతో సంధ్య, శ్రీహాన్ ను తీసుకుని ఆ కుర్చీ దగ్గరకు చేరి దాన్ని కప్పివున్న ప్యాకింగును తొలగించింది.

అందరూ ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. రాగిణి కన్నులలో ఆశ్చర్యంతో పాటు ఆనందం. శ్రీహాన్ ఆ కుర్చీవైపు తదేకంగా చూశాడు. ఆ కుర్చీ అచ్చం ఇంట్లో ఫొటోలో కూర్చున్న నాన్నలా ఉంది. నవ్వుతున్న నాన్న..వాడిలో ఎక్కడలేని సంతోషం. సంధ్య చేయి వదిలి కుర్చీని ప్రేమగా తడవడం మొదలుపెట్టాడు. వాడికి సంతోషం ఆగడం లేదు.

"అమ్మా..నాన్న. మా నాన్న. అచ్చు మానాన్నలా ఉన్న నాన్న. అమ్మా..నేను..నేను..ఈ కుర్చీలో కూర్చోవచ్చా" ఆశగా అడిగాడు.

"కూర్చో నాన్నా..అది నీ కోసమే" చెబుతున్న సంధ్య గొంతు బొంగురు పోయింది.

"సంధ్యా..ఇలాంటి కుర్చీ ఎవరికోసం చేయించావమ్మా" దగ్గరికి వచ్చి అడిగాడు వాసుదేవరావు.

"నా కొడుకు కోసం నాన్నా. వాడు తండ్రికోసం, తండ్రి ఒడి కోసం తపించి పోతున్నాడు. వాడి అంతరంగం ఆ సుఖం కోసం ఎంత తపించి పోతున్నదో అర్థం చేసుకున్నాను. మరో పెళ్ళి చేసుకుని నా సుఖం చూసుకుని, నా బిడ్డకు సగం ప్రేమను పంచలేను. నా ప్రేమ మొత్తం నా బిడ్డకే చెందాలి. వాడిలో నా శ్రీహరిని నేను చూసుకుని తృప్తి పడాలి. ఏ తండ్రి ఒడి కావాలని వాడు తపించి పోతున్నాడో, ఆ ఒడిని కుర్చీ రూపంలో ఉన్న తండ్రిని ఇచ్చి తీర్చాలనుకున్నాను. వాడు ఆ కుర్చీలో కూర్చుంటే తండ్రి ఒడిలో కూర్చున్న తృప్తి పొందాలని. ఆ కుర్చీకి జీవం లేకపోవచ్చు. కానీ చూసే మనసులకు ఉంది కదా. అవి ఊహలలోకి వెళితే అదే వాస్తవంగా కనిపిస్తుంది మదికి" అని ఉద్వేగంగా చెబుతున్నది సంధ్య.

"అమ్మా..నేను కుర్చీలో కూర్చుని కేక్ కట్ చేస్తానమ్మా. అప్పుడు నేను నాన్న ఒడిలో కూర్చుని పుట్టిన రోజు గడుపుకున్నట్లుగా ఉంటుంది. నా ఫ్రెండ్స్ జరుపుకున్నట్లే నేను కూడ నాన్న దగ్గర కూర్చుని సెలెబ్రేట్ చేసుకుంటానమ్మా" అంటూ వచ్చి సంధ్య చేయి పట్టుకుని ఊపుతూ అడిగాడు శ్రీహాన్.

"నీ ఇష్టం నాన్నా వెళ్ళు" అన్నది సంధ్య.

పరిగెత్తుకుంటూ వెళ్ళి కుర్చీలో కూర్చుని దాని చేతులను నిమిరి, తండ్రి రూపాన్ని ముద్దు పెట్టుకుని దర్జాగా కూర్చుని కేక్ కట్ చేసి, ఒక ముక్క తండ్రి నోటికి చూపించి తిరిగి దాన్ని తనే తినేశాడు. ఇప్పుడు శ్రీహాన్ లో ఎక్కడలేని ఆనందం. స్నేహితులందరికీ కుర్చీని చూపించాడు.

సంధ్య, విశ్రుతి కలిసి ఆలోచించి తీసుకున్న నిర్ణయం అందరి హృదయాలను ఆనందడోలికలలో తేలియాడేలా చేసింది. కొడుకు ముఖంలో తొణుకిసలాడుతున్న ఆనందాన్ని చూసి సంధ్య మనసు పులకించి పోయింది. ఇంత మంచి ఆలోచన ఇచ్చిన విశ్రుతిని మనసారా అభినందించింది. ఆ కుర్చీ చేతులను గట్టిగా పట్టుకుని సంతోషంతో కేరింతలు కొడుతున్నాడు శ్రీహాన్. అరమరికలు లేని పసిమనసుకు ఇదే నిజమైన పుట్టినరోజు పండుగ.

సమాప్తం

కథ

# దత్తస్వీకారం

కోటమర్తిరాధాహిమబిందు

"విక్రమ్ గారికి  శుభోదయం" చిలిపిగా అంది అమల

"అబ్బో..ఏంటి..శుభోదయం అంటూ ఇంత దయ.. అయినా.. అచ్చ తెలుగులో పలకరింపు చాలా తీయగా కమ్మగా ఉంది"

"అవునా..ఇండియా వచ్చాం కదా..మనం మన తీయటిభాషలో మాట్లాడుకుంటే సంతోషం"

"సాయంత్రంకలుద్దామా"

"తప్పకుండా..ఇప్పుడు మనం ఒకరికొకరం స్నేహితులం.. ఎవరివాళ్ళు వాళ్లకు ఉన్నా స్నేహితం వేరు కదా"

"అవును..ఇప్పుడు నీకు నేను ఎలాంటి సహాయంచేయాలి"

"ఫ్లాట్ కొనుక్కోవాలి.. ఫ్లాట్ వెతకడంలో నువ్వు సహాయం చేస్తే నాకు తేలిక అవుతుంది"

"నీకెందుకు ఫ్లాట్..మీవాళ్లు ఉన్నారుగా"

"ఉంటేమాత్రం? నేను కూడా నీలాగా అమెరికాలో బాగానే సంపాదించుకున్నాను.. లోన్ కూడా తీసుకుంటాను.

నీకు ఫ్లాట్ వుండాలి..నాకు వద్దా? ఇప్పుడే సహాయం చేస్తానన్నావు.. ఫ్లాట్ వెతికి పెట్టవా?"

"ఏముంది..వెతుకుదాం"

"ఉంటాను అమలా.. లాగిన్ కావాలి"

"నువ్వు ఒక్కడివేకాదు నేనుకూడా లాగిన్ అవ్వాలి" సరదాగా అంటూ కాల్ కట్ చేసింది అమల

విక్రమ్ అమల పరిచయం విచిత్రంగా జరిగింది. అమెరికాలో ఆరు సంవత్సరాలు పనిచేసినా ఒకరికి ఒకరు పరిచయం లేరు. విమానాశ్రయంలో ఒకే విమానంలో ప్రయాణించటమే వారికి వున్న పరిచయం. వారివి పక్క పక్క సీట్లు కావటంతో ఇద్దరూ ఎంతో కలివిడిగా మాట్లాడుకుంటూ

కొత్తదనం పోగొట్టుకొని దగ్గరగా అయ్యారు. ఇద్దరూ ఎంతో చనువుగా ఒకరి అభిప్రాయాలు ఒకరు పంచుకున్నారు. ఇద్దరూ సాఫ్ట్ వేర్ ఉద్యోగస్తులే.

★★★★★

★★★★★

"అప్పుడే మనంవచ్చి వారం అవుతుంది"

"అవును"

"ఇంకేంటి విశేషాలు"

"నువ్వే చెప్పాలి..నీవాళ్ళగురించి నీ ఫ్రెండ్స్ గురించి"

"నేను నీకో విషయం చెప్పాలి అమలా.. కొద్ది పరిచయంలో ఒకే ఒక ప్రయాణంలో నా గురించి చెప్పాలి అనిపించలేదు.. నిజంగా నాకు నువ్వొక మంచి ఫ్రెండ్ గా భావించి చెప్తున్నాను. నేను ఒక అనాథను..నాకంటూ ఎవరూలేరు. అనాధాశ్రమంలో నన్నుఎవరు చేర్చారో తెలియదు. అక్కడే పెరిగి పెద్దయ్యాను. ఆ నిర్వాహకులు చెప్పినట్లుగా చదువుకున్నాను"

"విక్కీ" ఆశ్చర్యపోతూ చూసింది అమల.

"నువ్వు చాలా ఆశ్చర్యపోతావని నాకు తెలుసు..ఇప్పుడే చిగురువేస్తున్న స్నేహంలో అబద్ధం ఎందుకు అని ఇప్పుడే చెప్తున్నాను"

"నీకు ఎవరూలేరా..ఆతర్వాత.. ఎలా? ఏమైంది"

"ఏముంది? అందరిలా నాకు అమ్మానాన్న ఎందుకులేరు అని చాలా బాధపడేవాడ్ని.. ఎప్పుడూ ఏడుస్తుండేవాడిని..మంచి తెలివిగల పిల్లల్నిచదివిస్తాను అంటూ ఒక వ్యక్తి వచ్చాడు. అతను అమెరికాలో వుంటాడు. అతను ముగ్గుర్నిఎన్నుకున్నాడు.. ఆముగ్గురిలో నేను ఒకడిని..అలా నా చదువు సక్రమమార్గంలో సాగింది..ఒకరకంగా నాఅదృష్టం అనుకుంటాను..నాచదువు మార్కులు చూసి మా ప్రిన్సిపాలే అమెరికాలో నేను ఎమ్మెస్ చేసేందుకు సహకరించారు"

"ఇప్పుడు వాళ్ళని కలిసి నువ్వు..."

## పాఠకులకు విజ్ఞప్తి

సుమతి సకుటుంబ వార పత్రికకు పాఠకులే మూల స్థంభాలు . మీరిచ్చే ప్రోత్సాహమే సుమతికి ఆయువు . మీరు కట్టే చందాలే సుమతికి ఆధరవు. అందుకనే పాఠకుల అభిప్రాయాలకు సుమతి ఎప్పుడు అత్యంత విలువనిస్తుంది. కావున సుమతి పాఠకులు తమ తమ అభిప్రాయాలను ఈ కింది మెయిల్ కు పంపండి . పాఠకుల కోసం ఇకనుండి ఒక పేజిని కేటాయించటం జరుగుతుంది. పాఠకుల అభిప్రాయాలతో పాటుగాpho-to కుడా ప్రచురించ బడును.

ఉత్తమ అభిప్రాయానికి రు 116 /- బహుమతిగా ఇవ్వ బడును . sumathi.salahaalu@gmail.com

"ఆ ప్రయత్నాలు జరిగాయి.. ఇప్పుడు ఆ అనాధ ఆశ్రమం లేదు. నిర్వాహకులు చనిపోయారు. మా ప్రిన్సిపాల్ కూడా చనిపోయారు. ఆ ఇద్దరూ ఎంతో శ్రద్ధగా వెలిగించిన దీపాన్ని నేను.. పొందింది తిరిగి ఇవ్వాలని అనుకున్నాను. ఇప్పటికీ ముగ్గురు పిల్లల్ని దత్తత తీసుకొని చదివిస్తున్నాను"

"నీ వెనుక ఇంతకథ ఉందా"?

"అవును.. నీ చుట్టూ అమ్మానాన్న బంధువర్గం స్నేహితులు ఇలా చాలామంది ఉండివుంటారు నువ్వు చాలా అదృష్టవంతురాలివి"

"నిజమే" నవ్విందిఅమల.

"అప్పటి విషయాలు మర్చిపోయి ఇకనుండి సంతోషంగా ఉండు.. అనుకోకుండా పరిచయమైన నేను నీకు నచ్చాను కదా..ఇద్దరం మంచి స్నేహితుల్లా ఉందాం"

"సరే" అమలను చూసి చిరునవ్వు నవ్వాడు విక్రమ్

"నీ గురించి చెప్పు"

"ఇప్పుడు వద్దులే ఇంకోసారి.. ప్రస్తుతానికి ఏదైనా తినేసి వెళ్ళిపోదాం..నాకు చిన్న చిన్న పనులు ఉన్నాయి..అవి చూసుకుంటాను..నిన్ను కలవాలి అనిపించింది"

"అవునా..నాకూ నిన్ను కలవాలనిపించింది"

"కృతజ్ఞతలు"నవ్వింది అమల.. ఆమె చిరునవ్వు ఎంతో ఆత్మీయంగా అనిపించింది అతనిక

★★★★

"నువ్వు ఫ్లాట్ కొనటం బాగానే ఉంది.. మీవాళ్లెవ్వరినీ తీసుకురాలేదేంటి"?

"రానన్నారు"

"అదేంటి"?

"నేను నీకో విషయం చెప్పాలి విక్కీ"

"అవునా..ఏంటీ"

అతనివైపే కొన్నిక్షణాలు చూసి మళ్ళీ దూరంగా చూస్తూ చెప్పింది అమల "విక్కీ..నేను కూడా అనాధనే..నీలాగే నేను కూడా అనాధాశ్రమంలో పెరిగిన దాన్నే.. నువ్వు ఆరోజు చెప్పినప్పుడు

నేను చాలా ఆశ్చర్యపోయాను.. నా జీవితంలాంటిదే నీది కూడా అని తెలుసుకొని మనసులో బాధపడ్డాను. నిజం విక్కి.. మనిద్దరం రైలుపట్టాలలాగా ప్రయాణించిన వాళ్ళమే. రైలు పట్టాలు ఎప్పుడూ కలుసుకోవు అంటారు. మనం మనుషులం కాబట్టి మన జీవితాలు ఇలా కలిసాయి. నువ్వు ఎవరో నేను ఎవరో.. ప్రయాణంలో కలవడం ఏంటో? అంతా భగవంతుడి కృప" అంటూ చెమర్చిన కళ్ళతో చూస్తున్న అమలను విస్తుపోతూ చూశాడు విక్రమ్.

"ఇది నిజం విక్కీ..అబద్ధం కాదు" విక్రమ్ చేతిని తన చేతిలోకి తీసుకొని దుఃఖపడింది అమల కొన్నిక్షణాలు విక్రమ్ మాటలురాని వాడిగా అమలనే చూశాడు.

"అమ్మకడుపులో నేను ఉన్నప్పుడు మానాన్న పాము కరిచి చనిపోయాడట.. అమ్మ నన్ను కొన్నాళ్లు పెంచి తన సుఖం వెతుక్కుంటూ నన్ను వదిలి వెళ్ళిపోయింది. ఎవరో నన్ను అనాధ ఆశ్రమంలో చేర్పించారు. ఎటైనా వెళ్ళినప్పుడు పిల్లలతో అమ్మానాన్న కనిపించినప్పుడు నాకు అమ్మానాన్న ఎందుకు లేరు అని ఏడ్చేదాన్ని.. సినిమాలు సరదాలు అసలే తెలియవు.. ఎన్నో ఒడిదుడుకులు.. ఆశ్రమంలో పనిచేసి తీరిక టైంలో చదువుకునేదాన్ని.. బడిలో స్నేహితులు ఇచ్చిన పుస్తకాలు నోట్ బుక్స్ పెన్సిళ్లు పెన్నులు ఇలా అన్ని వేరే వాళ్ళవే. అలాగే కష్టపడి పదవ తరగతి పాసయ్యాను.. మంచి మార్కులు వచ్చాయి. ఒక సంస్థ నన్ను ఇంటర్ చదివించింది కాలేజీ టాపర్ గా నిలిచాను. ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకు వచ్చింది. మళ్ళీ చదువుకోసం ప్రయత్నం.. ఒక ప్రైవేట్ కాలేజీలో సీటు ఇచ్చారు. వసతి సమస్య ఎదురయింది. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో నా క్లాస్మేట్ నాన్నగారి ద్వారా లేడీస్ హాస్టల్లో జాయిన్

అయ్యాను. చివరి సంవత్సరంలోనే క్యాంపస్ సెలక్షన్ ద్వారా ఉద్యోగంవచ్చింది.. చదువు మొత్తం పూర్తవగానే చేరాను. ఆ తర్వాత ఇంకో కంపెనీలో చేరి అమెరికా వెళ్లాను..ఇదీ నా ప్రయాణం"

ఆమె తలపై ప్రేమగా నిమిరి అక్కున చేర్చుకున్నాడు విక్రమ్..అమల దుఃఖం ఆపుకోలేక పోయింది. చాలాసేపు దుఃఖించింది. విక్రమ్ కళ్ళ నిండా కన్నీళ్లు నిలిచాయి.

"అమలా..బాధపడకు..ఇద్దరం ఎప్పుడో విడిపోయిన ఒకే గూటి పక్షుల్లా.. ఇప్పుడుకలిశాం

ఇకనుండి నువ్వు నాకు తోడు.. నేను నీకు తోడు.. సరేనా..నిన్ను ఒకచోటికి తీసుకెళ్తాను..నీకు చాలా చాలా నచ్చుతుంది..పద" అంటూ లేచి చేయి అందించాడు విక్రమ్. చిరునవ్వుతో లేచింది అమల.

★★★★ ★★★★

సంజీవని వృద్ధాశ్రమం ముందు కారు ఆపాడు విక్రమ్ ఆశ్చర్యపోతూ చూసింది అమల..ఇద్దరూ లోపలికి వెళ్లారు..ఎప్పటినుండో పరిచయం ఉన్నట్లుగా నిర్వాహకుడు విక్రమ్ మాట్లాడుతుంటే ఇంకా ఆశ్చర్యపోయింది.

"అమెరికానుండి వచ్చిన తర్వాత రెండుసార్లు ఇక్కడికి వచ్చాను" అంటూ అమలకు అతన్ని "ప్రసాదరావుగారు" అంటూ పరిచయం చేశాడు..ముగ్గురు కాసేపు మాట్లాడుకున్నారు. ఆశ్రమం అమలకు చూపిస్తానంటూ వెనక్కు తీసుకెళ్ళాడు విక్రమ్..వెనుక పెద్ద ఆవరణ..రకరకాలచెట్లు పూలమొక్కలు..మధ్యలో పెద్దభవనం..అమలను లోపలికి తీసుకెళ్లి అందర్నీ పలుకరించాడు

"ప్రస్తుతానికి ఇరవైఆరుమంది వున్నారు.. పదకొండు జంటలు.. మిగతా నలుగురులో భర్తను కోల్పోయిన వాళ్ళిద్దరు భార్యను కోల్పోయిన వాళ్ళు ఇద్దరు ఉన్నారు" అంటూచెప్పాడు విక్రమ్ కాసేపు అక్కడి వాళ్లతో మాట్లాడి బయటకు వచ్చారు ఇద్దరూ

"అటుపద" అంటూ దూరంగా తీసుకెళ్లాడు.. అక్కడ చెట్టుచుట్టూ ఉన్నచప్టా మీద కూర్చుని ఉన్న ఇద్దర్ని అమలకు పరిచయం చేశాడు.

"ఈ అమ్మాయి ఎవరు" ఇద్దరూ ఒకేసారి అడిగారు.

"నాచెల్లి" అతను చెప్పింది విని మనసు ఆనంద పారవశ్యంకాగా అతని చేతిని తన చేత్తో బిగించి పట్టుకుంది అమల.. కళ్ళనిండా కన్నీళ్లు నిలిచాయి.

"పార్వతీదేవిగారు.. లక్ష్మీదేవిగారు..నీకు ఇంకో విషయం చెప్పనా.. పార్వతీదేవిగారి భర్తపేరు శివానందంగారు..లక్ష్మీదేవిగారి భర్తపేరు విష్ణుమూర్తిగారు" అంటూ వారిని అమలకు పరిచయం చేశాడు..వారి పక్కనకూర్చున్నారు ఇద్దరు. కాసేపు మామూలు విషయాలు మాట్లాడుకున్నారు

"మీరు ఇక్కడ ఎందుకున్నారమ్మా..మీకు ఎవరూలేరా" వాళ్ళిద్దర్నీ అడిగింది అమల

"వీరిగురించి వెళ్లేటప్పుడు నేను చెప్తాను"

"అయ్యో..ఇంకోసారి చెబితే ఏముంది? మావి ఎలాగూ మారే జీవితాలు కాదు..ఎవరో ఒకరు వచ్చి మమ్మల్ని ఇలా అడుగుతూనే ఉంటారు" చిరునవ్వు నవ్వింది లక్ష్మీదేవి.

"మాకు ముగ్గురు కొడుకులు అందరు తల్లిదండ్రులు పెంచినట్టే మేమూ మా పిల్లల్ని పెంచాం విద్యాబుద్ధులు నేర్పించి తీర్చిదిద్దాం..ఉద్యోగాలు వచ్చాయి పెళ్లిళ్లు అయ్యాయి. ఉన్న ఆస్తులు పంచమని గొడవ చేశారు.. మాకు ఒకభాగం రావాలని నేను పట్టుపట్టాను.. మేము నెత్తిమీద పెట్టుకుని ప్రేమగా చూసుకుంటామని పిల్లలు వాగ్దానం చేశారు.. నేను నమ్మలేదు కానీ మావారు నమ్మారు.. ఆస్తులు సమానంగా పంచాము.. కాలం గడుస్తున్న కొద్దీ మా పరిస్థితి మాకు అర్థమైంది. మమ్మల్ని మానసికంగా

చాలా హింస పెట్టారు. మాకు ఉన్నది చిన్నపాటి పింఛను.. ఎవరి ఇంట్లో ఉంటే వాళ్లకు ఆ పింఛను డబ్బు ఇవ్వాలి.. అలా కొంతకాలం గడిచింది.. మేము కనపడితే చాలు వాళ్లకు చిరాకు. మేము క్రుంగిపోయాం.. వృద్ధాశ్రమంలో ఉంటామని చెప్పాం. ఎలాగూ వదిలించుకోవాలని అనుకున్నారు కాబట్టి వాళ్ళు సంతోషంగా ఒప్పుకొన్నారు.. అలా వాళ్ళ జీవితాలనుండి మేము బయటకి వచ్చాం.. మాకు వచ్చే పింఛను డబ్బులు ఇక్కడకట్టి హాయిగా ఉన్నాం. ఇక్కడ అందరి జీవితాలు కొద్ది తేడాలతో ఒకేరకంగా ఉంటాయి కాబట్టి ఒకరికి ఒకరంగా జీవిస్తున్నాం.. ప్రేమ ఇస్తున్నాం.. ప్రేమని పొందుతున్నాం"

"కొంచెం తేడాతో మాది కూడా ఇలాంటి కథే..మాకు ఇద్దరు కొడుకులు..మావారు ప్రైవేట్ స్కూల్లో పనిచేసేవారు..నాలుగు ఎకరాల పొలం ఉండేది. మూడు ఎకరాలు పిల్లల చదువుకోసం అమ్మాం ఇంకో ఎకరంలో చెరో అరెకరం పంచుకున్నారు. ఏదో సినిమాలోలాగా మమ్మల్ని పంచుకున్నారు మేము చెరోచోట ఉండేవాళ్ళం.. ఇంటెడు చాకిరి చేసే నన్ను మా వారిని ఏవేవో మాటలు అంటూ బాధించటం.. ఏంటి.. ఈ దౌర్భాగ్యం అని మాకు అనిపించేది. వాళ్ల జన్మకు కారకులైన వాళ్ళం కదా.. అంతమాత్రం ప్రేమ గౌరవం మాపట్ల ఉండకూడదా? అనిపించేది.. మేము ఒకసారి పెళ్లిలో కలిసినప్పుడు వృద్ధాశ్రమం ఆలోచన చేశాం.. మా సమస్యకు మేమే పరిష్కారం వెతుక్కోవాలి అనుకున్నాం.. డబ్బు ఎట్లా? లోకంలో అంతా చెడ్డ మనుషులే ఉండరు కదా.. ప్రసాదరావుగారు మాపట్ల జాలి చూపించారు. మేము వృద్ధాశ్రమానికి సంబంధించిన పనులు చూసేలా మాకు ఆశ్రమం బాధ్యత అప్పగించారు. మాకు ఉచితంగా వసతి దొరికింది ఇంకా ఆనందం ఏంటంటే మేమిద్దరం ఒకేచోట కలిసి జీవిస్తున్నాం. ఇక్కడ ఉన్న వాళ్ళందరికీ ఇలా ఒక్కోకథ వుంది" అంటూ ముగించింది పార్వతీదేవి.

"ఒక్కనిమిషం" అంటూ విక్రమ్ వెళ్లి వృద్ధులకోసం తెచ్చిన స్వీట్స్ పండ్లు.. బిస్కెట్స్.. చాక్లెట్స్ ప్రసాదరావు గారికి ఇచ్చి మళ్లీ వాళ్ళ దగ్గరికి వచ్చాడు. మరి కాసేపు వాళ్లతో మాట్లాడిన తర్వాత బయలుదేరారు ఇద్దరూ. డ్రైవింగ్ చేస్తున్న విక్రమ్ భుజంమీద తలవాల్చింది అమల.

"థాంక్యూ వెరీమచ్ నన్నుచెల్లెలుగా స్వీకరించినందుకు" ప్రేమగా అంది. అమల తలమీద ఆప్యాయంగా తట్టాడు విక్రమ్.

"నాకు భయం వేసింది విక్కీ.. నాపై నీకు ఎలాంటి దృష్టి ఉందో అని"

"నేను నిన్ను చూసిన క్షణంనుండి నాకు ఇలాంటి చెల్లెలు ఉంటే బాగుండేది అనిపించింది నీ గురించి విన్న తర్వాత నిన్ను నా సొంత చెల్లెలుగానే భావించాను.. మంచిసమయం చూసుకొని చెప్పాలనుకున్నాను..అదే సరైన సమయంగా నాకు అనిపించింది"

"థాంక్యూ అన్నా.. నేను కూడా నిన్ను అన్నగానే భావించాను" ప్రేమగా అంది అమల. వారంలో వచ్చే రెండు సెలవురోజుల్లో ఒకరోజు వృద్ధాశ్రమానికి వచ్చి వాళ్ళతో గడపసాగారు. అక్కడ అందరితో చనువు బాగా పెరిగినా ముఖ్యంగా ఈ రెండు జంటలతో చనువు మరింతగా పెరిగింది. వారాలు వేగంగా గడుస్తూ నెలలుగా మారిపోసాగాయి. ఒకరోజు తనకు ఒకమంచి ఆలోచన వచ్చినట్లు అమలకు ఫోన్ చేసి చెప్పాడు విక్రమ్.. అమల సంతోషపడి వెంటనే ఒప్పుకుంది. ఇద్దరూ కలిసి వృద్ధాశ్రమానికి వెళ్లి ప్రసాదరావుగారిని కలిసి మాట్లాడారు.

"ఇంతమంచి ఆలోచన మీరు చేస్తున్నారంటే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది.. అంతకుమించి చాలా సంతోషంగా ఉంది.. పిల్లల్ని దత్తత తీసుకోవటం చూసానుగాని ఇలా తల్లితండ్రులను దత్తత తీసుకోవటం ఇప్పుడే చూస్తున్నాను"

"శివానందంగారు విష్ణుమూర్తిగారు మాకు ఈమధ్య కాలంలో ఎంతో చనువు అయ్యారు..వాళ్లను మేము ప్రేమగా చూసుకుంటాం..వాళ్లు కోల్పోయినవి తిరిగి ఇస్తాం.. అమ్మానాన్నలేని మేము వారినుండి ఆ ప్రేమను పొందుతాం"

"మీరు ఎంతో గొప్పగా చక్కటి నిర్ణయం తీసుకున్నారు. సమాజంలో మీలాంటి పిల్లలు ఉంటే వృద్ధాశ్రమాలు పుట్టగొడుగుల్లా ఇలా పుట్టుకురావు.. వారితోమాట్లాడండి" అన్నాడు ప్రసాదరావు ఎప్పటిలా వాళ్ల దగ్గరికి వెళ్లి కాసేపు మాట్లాడి విషయం గురించి ప్రస్తావించే ముందు తమ గురించి చెప్పుకున్నారు.. నిర్ఘాంతపోయి విన్నారు నలుగురు. "మేము ఒక నిర్ణయం తీసుకున్నాం మాకు అమ్మానాన్నలేరు..వాళ్ళ ప్రేమ మాకు తెలియదు..ఆ ప్రేమను మీనుండి పొందాలని వుంది..సమాజంలో మేమేదో కీర్తించబడాలని కాదు..మీమీద అవాజ్యమైన ప్రేమతో ఇద్దరం ఆలోచించాం..మేము రేపు వస్తాం.. మీరు ఆలోచించుకోండి.. మీకు ఇష్టమైతే మీరు తయారై ఉండండి. మిమ్మల్ని మా ఇళ్లకు తీసుకుని వెళ్తాం.. ప్రసాదరావు గారితో మాట్లాడాము.. వారు చాలా సంతోషించారు. మేము ఇద్దరం మీ పిల్లలం..మీరు అబ్బాయి దగ్గర ఉంటారా? అమ్మాయి దగ్గర ఉంటారా? అది పూర్తిగా మీ ఇష్టం"

"అమ్మాయి దగ్గర ఉంటే అబ్బాయి దగ్గరికి పోకూడదా"? అని శివానందంగారంటే "అబ్బాయి దగ్గర ఉంటే అమ్మాయి దగ్గరికి పోకూడదా"? అని విష్ణుమూర్తిగారు అన్నారు.

"అంటే..మీరు ఒప్పుకున్నట్లేనా"? ఆనందంతో చప్పట్లు కొడుతూ అడిగింది అమల. విక్రమ్ చిరునవ్వుతో నలుగురిని ఆరాధనగా చూసాడు.

"ఇంతమంచి అవకాశం మీరు ఇస్తుంటే మేము ఎందుకు వదులుకుంటాం.. ఇది మా అదృష్టంగా మేం భావిస్తున్నాం..ఇకనుండి మీరే మా పిల్లలు..చిన్నవాళ్ళయినా ఇంత పెద్దమనసున్న మీకు కోట్ల నమస్కారాలు" అన్నాడు విష్ణుమూర్తి.

"అయ్యో..అలా అనకండి ఇది మా భాగ్యం..మాకు అమ్మా నాన్న లేనేలేరు.. వారి ప్రేమను మేము పొందలేదు. మీ కన్నా ఎక్కువగా మేమే అదృష్టవంతులం" చమర్చిన కళ్ళతో అన్నాడు విక్రమ్ ఇద్దరు పిల్లల్ని అక్కున చేర్చుకున్నారు ఆ నలుగురూ "ఏ మాటలు చెప్పి మీకు కృతజ్ఞతలు చెప్పుకోవాలో అర్థంకావటం లేదు" కన్నీళ్లు పెట్టుకున్నారు శివానందం గారు

"ఇప్పటి పిల్లల్లో ఇంత వివేకం ఇంత విచక్షణా జ్ఞానం ఉన్నాయా? అంది లక్ష్మీదేవి

"ఇదంతా నాకో కలలాగా వుంది" అంటూ కన్నీళ్లు పెట్టుకుంది పార్వతీదేవి. కాసేపు వాళ్ళతో మాట్లాడి ఇళ్లకు వచ్చారు విక్రమ్ అమల. తెల్లవారి వాళ్ళను తీసుకురావడానికి వృద్ధాశ్రమానికి వెళ్లారు.. అక్కడ పరిస్థితి చూసి అలాగే నిలబడిపోయారు. వృద్ధాశ్రమంలో వున్న వాళ్ళంతా చెట్టు దగ్గర కూర్చుని మాట్లాడుకుంటున్నారు. విక్రమ్ అమలను చూసి లేచి నిలబడ్డారు.. వాళ్ళను ఎంతగానో పొగిడారు. ఆ నలుగురూ బయలుదేరుతుంటే మిగతా వాళ్ళు కన్నీళ్ళతో వీడ్కోలు చెప్పారు. ప్రసాదరావు గారిని కలిసి కృతజ్ఞతలు తెలుపుకున్నారు విక్రమ్ అమల.

★★★★ ★★★★

శివానందం పార్వతీదేవి విక్రమ్ దగ్గర విష్ణుమూర్తి లక్ష్మీదేవి అమల దగ్గర ఉన్నారు.. పిల్లలతో అటుఇటు తిరుగుతూ ప్రేమను పంచుతూ ప్రేమను పొందసాగారు. అప్పుడప్పుడు అంతా కలిసి వృద్ధాశ్రమానికి వెళ్లి వస్తున్నారు..ఆరునెలల కాలం గడిచిపోయింది.. ఆరోజు ఆదివారం.. అంతా విక్రమ్ ఇంట్లో హాల్లో కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

"మేము మీ పెళ్లిళ్ల గురించి ఆలోచిస్తున్నాం..ఈసంవత్సరం మీ ఇద్దరి పెళ్లిళ్లు కావాలి" అంటూ

మొదలుపెట్టింది లక్ష్మీదేవి.

"మీ కోరిక మేము ఏదీ
కాదనం..ఇప్పటిదాకా మాకు
ఎవరూలేరు..ఇప్పుడు మాకు
ఒక అమ్మా నాన్న ఉన్నారు.
మా అభిప్రాయాలని గౌరవించి
మాకు విలువ ఇచ్చేవాళ్ళు
మాకు దొరికినప్పుడు మీ
అంగీకారంతో తప్పక పెళ్లి
చేసుకుంటాం" అన్నాడు
విక్రమ్.. నలుగురు చిన్నపిల్లల్లా
ఎంతో ఆనందించారు.
పిల్లలిద్దరి వివరాలు
వివాహవేదికలో అప్పటికప్పుడు
పెట్టారు ఆ నలుగురు.
విక్రమ్ అమల సంతోషం
నిండిన మనసుతో వాళ్లనే
చూడసాగారు.

★★★★★
★★★★★

## నమ్మకాలు- నిజాలు

# పాద ధూళి కోసం

### ప్రాణాలు పోగొట్టుకున్నారు

తిట్టుకోవడం కొట్టుకోవడం మొక్కుకోవడం... పాద ధూళి కోసం ప్రాణాలు కూడా పోగొట్టుకోవడం ..మూఢత్వానికి హద్దులు చెరిగిపోయాయి..వ్యక్తి ఆరాధన ప్రాణాంతకమవుతోంది.. తోపులాటలో కొమ్ములాటల్లో భక్తిపారవస్యంలో అజ్ఞానాంధకారంలో అభద్రతాభావంలో ఎవరో ఏదో చేస్తారని ఏదో ఒరిగిపోతుందని ఏదో అందుకుందామని ఏదో పొందుదామని, ఏదో చెందుతుందని ఆత్రంగా ఆక్రోసంగా ఆవేశంగా ఆవేదనగా ఆశగా..విరగబడిన అమాయకపు జనం.. గ్రామస్థాయి నుంచి దేశ స్థాయి వరకు అధికార దాహం ..దానికి తోడు మతం అనే చెట్టుకు కాసిన విష సంస్కృతీ ఫలాలు. ఎక్కడ చూసినా గొర్రె దాటు వ్యవహారాలే.. గుడ్డిగా నమ్మకాలే.. ప్రజల్ని ఇంకొంచెం మూఢత్వం వైపు నడిపించడానికి పాలించే వారే పాటిస్తున్నదురాచారాలు .. ఇవన్నీ వ్యక్తి ఆరాధనలో భాగాలే.ఇవి ఖచ్చితంగా సామాన్య మానవులపై ప్రభావం చూపిస్తాయి..



.. భోలే బాబా సభలో ప్రాణాలు పోగొట్టుకున్న 120 మంది ఇందుకు సాక్ష్యం.. ఇదొక్కటే కాదు ఇలా ఎన్ని చోట్ల ఎన్ని రకాలుగా ఎంతమంది ఈ మూఢాంధకారంలో పడి కొట్టుకుపోతున్నారోచెప్పలేం..

భోలే బాబాకు సంబంధించి మరో ఆసక్తికర విషయం ఏంటంటే.. అతను ఇప్పటి వరకు భక్తుల నుంచి ఎలాంటి విరాళాలు, దక్షిణలు, కానుకలను తీసుకోలేదు. కానీ, ఉత్తరాదిలో అనేక ఆశ్రమాలను ఎలా స్థాపించాడు అనే విషయం ఎవరికీ బోధపడకుంది. ఉత్తరప్రదేశ్‌లోనే వేరువేరు ప్రాంతాల్లో సొంత స్థలాల్లో ఆశ్రమాలను ఏర్పాటు చేశాడు. ఎల్లప్పుడూ తెల్లటి వస్త్రాలలోనే భక్తులకు కనిపించేవాడు. పైజామా కుర్తా, ప్యాంట్ –షర్ట్, సూట్‌లలో ఎక్కువగా కనిపిస్తాడు. ఇంతటి ఫాలోయింగ్ ఉన్నప్పటికీ సోషల్ మీడియాలోగానీ, ఇంటర్నెట్‌లో గానీ ఇతని గురించి ఎక్కడా ప్రస్తావన లేకపోవడం మరో విచిత్రం.

కొన్ని వేల సంఘటనలు ఇలాంటివి ఈపాటికి ఎన్నోజరిగాయి ..దీనికి ఏ మతం అతీతం కాదు.. రాను రాను వెర్రితలలు వేస్తున్న ఈ ఈ వ్యక్తి ఆరాధనకు అంతం ఎప్పుడో.. అది మరీ బలోపేతం అవుతుంది ..ఎక్కడ చూసినా భజనలే.. బాధ్యత మరిచిన పాలకులు, ఆ మాయలో పడి కొట్టుకుంటూ సామాజిక బాధ్యత పాటించని పౌరులు ..ఏదో ప్రకృతి మనిషి బ్రతకటానికి ఇచ్చిన నిప్పు నీరు గాలి తదితర అంశాలు గొప్పగా భావించి పూజించి మనిషి తన విశ్వాసాన్ని ప్రకృతి పట్ల చాటుకుంటే, చివరకు ప్రపంచం మొత్తా నికి దాంట్లో నుంచి వచ్చిన భావనే దైవత్వం . అది అంతవరకు ఆగిపోకుండా దెయ్యంరూపాల్లో కూడా అవకాశవాదశక్తిగా మారింది...

ప్రభుత్వాలు అండ ఇవ్వకపోతే.. ఇలాంటి బాబాలు ఎలా బ్రతుకుతారు ?వీరిలో ఎవరో ఒకళ్ళు ఉంటారు నిజంగా త్యాగజీవులు ,నిజంగా సమాజం కోసం పనిచేసేవారు.. అలాంటి మంచి వారు కూడా ఈ చెడు ప్రవాహంలో భాగంగా పరిగణించబడతారు
బాబా లకున్న సన్మోహన శక్తిని ఓట్లుగా మల్చుకోటానికి అన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తాయి ,ఒక కమ్యూనిస్టు పార్టీలు తప్ప... ముందే చెప్పాను ఏ మతాని కి సంబంధించిన బాబాలు దీనికి అతీతులు కారనీ... కానీ మెజారిటీ మతవాదుల్లో ఇలాంటి మూఢత్వాలు పెరిగితే చాలా కష్టం..

“తెలుగు నాట భక్తి రసం తెప్పలుగా పారుతోంది డ్రైనేజీ స్కీము లేక డేంజర్ గా మారుతోంది.”.

ఇవిఒక ప్రముఖ ఆంధ్రకవి రాసిన మాటలు ..కానీ ఇప్పుడు దేశమంతా ఇది వర్తిస్తుంది నేను పైన చెప్పినవ్యక్తి ఆరాధన రూపంలో ...ఏదైనా పరిమితులు మించితే అది డేంజరస్సేమే సుమా...ప్రజలారాతస్మాత్ జాగ్రత్త...

★★★

# భారత్ - రష్యా చారిత్రక సంబంధాలు



కొండేటి వీణ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రస్తుతం రష్యాలో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశం అయ్యారు. ఇక ఈ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీకి అరుదైన గౌరవం లభించింది. రష్యా అత్యున్నత పౌరపురస్కారం అయిన "ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ ది అపోస్టల్" వరించింది. ఈ అవార్డును మోదీకి అందిస్తున్నట్లు స్వయంగా పుతిన్ ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఇరువురు అనేక అంశాలపై విస్తృతంగా చర్చించారు భారత్‌లో 1960ల నుంచి 1980లలో పుట్టిన వారికి సోవియట్ యూనియన్‌తో సంబంధాల గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.భారత్‌లో భారీ ఉక్కు ఫ్యాక్టరీలను రష్యన్లే స్థాపించారు. అంతరిక్ష ప్రయోగాల్లో సాయమందించారు. అనేక సంక్షోభ సమయాల్లో సోవియట్ యూనియన్ భారత్‌కు అండగా నిలిచింది.

# కరెంట అఫైర్స్

1965లో భారత్, పాకిస్తాన్ మధ్య తాష్కెంట్‌లో జరిగిన చారిత్రక మైత్రీ ఒప్పందానికి సోవియట్ మధ్యవర్తిత్వం వహించింది. 2000లో పుతిన్ తొలిసారి అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాత అదే ఏడాది రెండు దేశాలు 'వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం'పై సంతకాలు చేశాయి. ఇందులో భాగంగా రక్షణ, అంతరిక్ష, ఆర్థిక అంశాలకు సంబంధించిన ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఎస్-400 మిసైల్ డిఫెన్స్ సిస్టమ్, ఇంధన రంగంలో సహకారం వంటివి ఆధునిక సంబంధాలకు ఉదాహరణ.

అధ్యక్షుడు పుతిన్ ఆహ్వానం మేరకు భారత్ – రష్యాల 22వ వార్షిక సదస్సుకు హాజరయ్యేందుకు భారత ప్రధాని మాస్కో పర్యటనకు వెళ్తున్నారనేది అధికారిక సందేశం. గత మూడేళ్లలో రెండు దేశాల మధ్య ఎలాంటి ద్వైపాక్షిక సమావేశాలూ జరగలేదు. 2021లో చివరిసారి అలాంటి సమావేశం జరిగింది. రెండు దేశాల నాయకుల సమావేశంలో చర్చించనున్న అజెండాపై బుధవారం రష్యా ప్రకటన చేసింది.

రష్యా నుంచి తమను తాము కాపాడుకునేందుకు యుక్రెయిన్‌కు సైనిక సాయంతో పాటు ఇతర సాయం అందించడంలో యూరోపియన్ దేశాలు తలమునకలై ఉన్న సమయంలో, ఏ కారణంతోనైనా, యూరప్ దేశాలకు చెందిన ఏ నాయకుడైనా మాస్కోలో పర్యటించడం యూరప్ ప్రయోజనాలకు ద్రోహంగానే అవి పరిగణిస్తాయి. ఇలాంటి పరిస్థితుల మధ్య జులై 8, 9 తేదీల్లో ప్రధాని నరేంద్ర మోదీ రష్యా పర్యటనను పశ్చిమ దేశాలు ఎలా చూస్తున్నాయి అన్నదే పెద్ద ప్రశ్న

"రష్యా – భారత్ సంప్రదాయ స్నేహపూర్వక సంబంధాల బలోపేతంతో పాటు అంతర్జాతీయ, ప్రాంతీయ అజెండాకు సంబంధించిన అంశాలపై చర్చిస్తారు" అని క్రెమ్లిన్ పేర్కొంది. పర్యటనపై భారత్ వైపు నుంచి పెద్దగా సమాచారం వెల్లడించకపోయినప్పటికీ, కొన్ని కీలక ఒప్పందాలపై సంతకాలు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. మోదీ 2019లో ఎకనామిక్ ఫోరమ్‌కు హాజరయ్యేందుకు రష్యా నగరం వ్లాడివోస్టాక్ వెళ్లారు. 2022లో ఉజ్బెకిస్తాన్‌లో జరిగిన ఎస్‌సీవో సదస్సులో పుతిన్, మోదీ కలిశారు. 2021లో పుతిన్ భారత్‌లో పర్యటించారు.

రష్యాను ప్రపంచవ్యాప్తంగా ఏకాకిని చేసేందుకు అమెరికా, యూరప్‌లోని దాని మిత్రదేశాలు ప్రయత్నిస్తున్న ఇలాంటి తరుణంలో మోదీ రష్యా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. యుక్రెయిన్‌పై 'చట్టవిరుద్ధం'గా సాగిస్తున్న యుద్ధాన్ని బలమైన ప్రజాస్వామ్య దేశమైన భారత్ ఖండించలేదంటూ పశ్చిమ దేశాల్లో చాలా మంది అభిప్రాయపడుతున్నారు.

భారత్ తటస్థ వైఖరి చాలావరకు రష్యా వైపు మొగ్గుచూపడంతో సమానంగా ఉన్నట్లు కనిపిస్తుంది. దౌత్యపరంగా, ఆర్థికంగా రష్యాను ఏకాకిని చేసే తమ ప్రయత్నాలను క్లిష్టతరం చేసేలా భారత్ వైఖరి ఉందని అమెరికా, యూరోపియన్ యూనియన్ సభ్య దేశాలు భావిస్తున్నాయి.

రష్యాతో వాణిజ్యం, రక్షణ సహకారం వంటి భారత్ కొనసాగిస్తున్న నిరంతర సంబంధాలు, యుక్రెయిన్‌పై దాడిని విరమించుకునేలా రష్యాపై అంతర్జాతీయంగా ఒత్తిడి తెచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను బలహీనపరుస్తాయని ఆందోళన చెందుతున్నారు. రష్యా నుంచి భారీగా ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్న భారత్, అమెరికా నేతృత్వంలో రష్యా ఇంధన ఎగుమతులపై విధించిన ఆంక్షలను గౌరవించాలని వారు కోరుకుంటున్నారు. ఇది సంక్లిష్టమైన సమస్య అని భారత్‌కు తెలుసు. చర్చలు, దౌత్యపరమైన సంబంధాల

# కరెంట అఫైర్స్

ప్రాధాన్యాన్ని నొక్కిచెబుతూ, వ్యూహాత్మక ప్రయోజనాలు – ఇంధన భద్రతా అవసరాల మధ్య సమతుల్యతను సాధించేందుకు భారత్ తన నైపుణ్యాలకు పదునుపెడుతోంది.

రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకుంటున్న చమురు నిల్వలపై సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సీఆర్ఈఏ) ఈ ఏడాది ప్రారంభంలో తన నివేదికను విడుదల చేసింది. దాని ప్రకారం, 2022లో రష్యా యుక్రెయిన్‌పై దాడి అనంతరం చమురు దిగుమతులు 13 రెట్లు పెరిగాయి.

ఫలితంగా, భారత్ – రష్యా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 2023 – 24లో ఒక్కసారిగా 6,400 కోట్ల డాలర్లకు పెరిగింది. ఇందులో భారత్ నుంచి ఎగుమతులు కేవలం 400 కోట్ల డాలర్లు.

అయితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రష్యాలో పర్యటించడంపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ.. అసంతృప్తిని వెళ్లగక్కారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో చేస్తున్న శాంతి ప్రయత్నాలకు ఇది పెద్ద ఎదురుదెబ్బ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పుతిన్ మోదీ భేటీ తమను తీవ్ర నిరాశకు గురి చేసిందని స్పందించారు. ఈ క్రమంలోనే ట్వీట్ చేసిన జెలెన్‌స్కీ.. మోదీ–పుతిన్ భేటీపై సంచలన వ్యాఖ్యలు చేశారు.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి అధినేత.. ప్రపంచంలోనే అత్యంత కిరాతక నేరస్థుడిని మాస్కోలో ఆలింగనం చేసుకున్నారని.. మోదీ–పుతిన్ భేటీపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

రష్యాలో నరేంద్ర మోదీ అడుగుపెట్టిన సమయంలోనే ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణుల వర్షం కురిపించడం గమనార్హం. ఉక్రెయిన్‌లోని 5 నగరాలపై ఏకంగా 40 క్షిపణులను ప్రయోగించింది. ఇందులో అనేక అపార్ట్‌మెంట్లు, ప్రభుత్వ భవనాలు, ఆస్పత్రులు కూలిపోయాయని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఇక రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశం వేళ..

ఉక్రెయిన్ యుద్ధం అంశాన్ని కూడా నరేంద్ర మోదీ ప్రస్తావించినట్లు తెలుస్తోంది. దేశాల ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వాన్ని భారత్ ఎల్లప్పుడూ గౌరవిస్తుందని.. యుద్ధభూమిలో దేనికీ పరిష్కారాలు లభించవని.. చర్చలు, దౌత్య పరమైన విధానాలే సమస్యలు పరిష్కరించుకునేందుకు ముందుకెళ్లే మార్గాలని మోదీ.. పుతిన్‌కు సూచించినట్లు సమాచారం.

★★★



# వైరల్

## 35 వేల పుస్తకాలు చదివిన వ్యక్తి...

పుస్తకపఠనాన్ని అలవాటుగా మార్చుకోవడం అంత ఆషామాషీ వ్యవహారం కాదు.మొదటి పేజీ చదవగానే ఆవలింతలొచ్చి నిద్రలోకి జారుకునే జనాలు కోకొల్లలు. కానీ, బీహార్‌కు చెందిన ఓ వ్యక్తికి పుస్తకపఠనం ఓ వ్యసనంగా మారింది. ఎంతలా అంటే అతడు 35 ఏళ్లకే 35 వేల పైచిలుకు పుస్తకాలు చదివాడు. ఇలా పుస్తకాల పురుగులా మారి దేశవ్యాప్త గుర్తింపు తెచ్చుకుంటున్న ఈ వ్యక్తి పేరు అమల్ కుమార్ ఝా. ప్రస్తుతం అమల్ కుమార్ ఝా ఉదంతం నెట్టింట ట్రెండింగ్‌లో (Viral) కొనసాగు తోంది.



జాతీయ మీడియా కథనాల ప్రకారం, మధుబని జిల్లాకు చెందిన అమల్ కుమార్ తరచూ స్థానిక లైబ్రెరీకి వెళ్లి పుస్తకాలు తెచ్చుకుంటాడు.స్థానికంగా జరిగే పుస్తక పఠన పోటీల్లో ఆయన గత నాలుగేళ్లుగా నెం. 1 స్థానంలో నిలుస్తున్నారు.సాహిత్యం,చట్టం తదితర అంశాలను చెందిన వివిధ భాషల పుస్తకాలు చదవడం అతనికి ఇష్టం




పుస్తకపఠనం అలవాటు కారణంగా అమల్ కుమార్ ఝా స్థానికంగా గొప్ప పాప్యులారిటీ సంపాదించాడు. అక్కడ నిర్వహించే పోటీల ప్రకారం,లైబ్రరీలో పుస్తకాలు చదివేవాళ్లు ఏటా ఓ పోటీలో పాల్గొంటారు. తాము చదివిన పుస్తకాలకు సంబంధించి ఆ పోటీల్లో వచ్చే ప్రశ్నలకు సమాధానాలు చెబుతారు.ఈ పోటీల్లో అమల్ కుమార్ వరుసగా నాలుగో సారి టాప్ లో నిలిచాడు.

చిన్నతనం నుంచి తనకు పుస్తకాలంటే పిచ్చి అని అమల్ కుమార్ ఝా చెప్పుకొచ్చాడు.తన ఇంట్లో కూడా ఓ చిన్నా పాటి లైబ్రరీని ఏర్పాటు చేసుకున్నాడు. తనకు పుస్తకాలు కొనుక్కోవడం కంటే లైబ్రరీలో చదవటమే ఇష్టమని అతడు చెప్పాడు.

★★★

మూడో కన్ను

# మెరుపు వెలుగులు

చిత్రీకరించటం లో మెలుకువలు



తమ్మ శ్రీనివాస రెడ్డి

మీ ప్రయాణాల్లో, బీచ్లలో అనేక క్షేత్రదృశ్యాలు, మూర్తిమత్వచిత్రాలు (Portraits) తీస్తున్నపుడు, మీరు తినే ఆహారపదార్థాల వివిధరకాలను మాత్రం ఎందుకు చిత్రీకరించకూడదు?

అవసరమైన సాధనాపరికరాలు :

జూమ్స్సు – అనేక ఫోకల్ లెంగ్త్ కలిగి తేలికగా సర్దుకోగలిగినవి.

ముక్కాలిబల్ల – (Tripod) మ్యాన్ ఫ్రట్టో 390 శ్రేణిలోని తేలికగా వుండే ముక్కాలిబల్ల. అనుభవంలేని ఛాయా చిత్రకారులకు సైతం వీలుగాను, వారి ప్రయాణం సులువుగా వుండేందుకు యిది అవసరం. షట్టర్ వేగం తక్కువగా వుండి, మోసేందుకు వీలయ్యేలా పరిస్థితులకు అనువైనది.

# ఫోటోగ్రఫీ పాఠాలు



పాకెట్ ముక్కాలిబల్ల :
(Folding Tripod)
పెద్ద సైజు ముక్కాలిబల్ల



మోయటం కష్టసాధ్యమైతే, మ్యాన్ ఫ్యట్ట్రోశ్రేణిలోనే, మడిచే వీలున్న పాకెట్ సైజుది యే ఉపరితలంపైనైనా పనిజేసేది, స్థిరంగానూ వుంటుంది. దీన్ని తేలికగా, చిన్నదిగా వుండి, తేలిగ్గా రవాణా చేయవచ్చు.

కెమేరా సంచి – ఒకసారి ఛాయాచిత్రీకరణ పూర్తయిన వెంటనే, నీక్కావలసిన ఆహారపదార్థాలు కొరకు ఆదేశించటానికి సన్నద్ధమవుతారు. అపుడు మరోస్టాలు వద్దకు మీ కెమేరాను మోసుకెళ్ళేందుకు వీలుగా వుండే కెమేరా సంచి మీకు అందుబాటులో, భద్రంగా వుండాలి. మ్యాన్ ఫ్రట్టో శ్రేణిలో, యివి వీపుకు తగిలించుకోటానికి వీలుగాను, ముక్కాలిబల్లను సైతం అమర్చుకునేలా వుంటాయి. ఈ సంచిలోపలి భాగంలో కెమేరాకు, లెనస్సు వేర్వేరుగా అరలువుండి, మిగతాభాగాలకు సైతం ఉపయుక్తమయే పరికరాల అరలు యిమిడివున్నందున,



సాధనాలన్నీ సురక్షిత ప్రయాణానికనువుగా వుంటుంది.

మీ ఛాయాచిత్రాలెక్కడ తీస్తారు?

కొన్నిసార్లు మీరు పనిచేసే చోట యే పరికరాలుపయోగించాలో నిర్ధారించుకోవాలి. ఉదాహరణకు, మీరున్నచోట ఒక రద్దీగావున్న హోటల్లో చిత్రించాలంటే, అక్కడ ముక్కాలిబల్లకు అమర్చిన కెమెరా తీసేచోటు వుండదు కనుక, చేతి కెమేరాతోనే చిన్న బల్లను వుపయోగించాలి. కాని, అలాగాక ఒక వీధిలోని స్టాల్స్ దగ్గర చిత్రీకరించాలంటే, అక్కడ పెద్దసైజు ముక్కాలిబల్ల యేర్పాటుచేసి, దానికి కెమేరాను సంధించి చిత్రీకరించే అవకాశముంటుంది గనుక, ప్రణాళికా బద్ధంగా చుట్టూవున్న అన్ని ప్రదేశాలను, పదార్థాలను అవలీలగా చిత్రీకరించే వీలవుతుంది.

ప్రదర్శన (Presentation): సాధారణంగా రెస్టారెంట్లోకి అడుగుపెట్టగానే, అక్కడ నీకు అవసరమైన ఆహారపదార్థాలు చక్కగా అలంకరించబడి ప్రదర్శితమవుతాయి. అవి చూడగానే, వాటిని నీ కెమెరాలో బంధించాలనే ఆలోచనగూడా వస్తుంది. కనుక, ఆకర్షణీయమైన పదార్థఉత్పత్తులను, పండ్లను ప్రత్యేకంగా అలంకరించుతారు. అపుడు, మీరు వాటిలో కొన్ని చెడిపోయి, వర్ణరహితంగా, కళా విహీనంగా వుంటాయి. మీరు మాత్రం వాటిజోలికి వెళ్ళవద్దు.

అలాగే మాంసపదార్థాల్లో గూడా ఎక్కువగా వండిన వాటిని వదలివేయండి. మాంసాహారం మీద చక్కగా హరితవర్ణ ఆకులతో అలంకరించిన పదార్థాలు చిత్రీకరణలో ఆకర్షణీయంగా వుంటాయి గనుక వాటిని చిత్రీకరించవచ్చు. అక్కడే, వాటి ప్రక్కనే వుండే సాస్ప్లేట్లు గూడా ప్రేక్షకులకు నోరూరిస్తుంటాయి గనుక వాటిని గూడా చిత్రీకరించవచ్చు.

మీ ఆహారాన్ని మీరు స్వయంగా చేతిలోకి తీసుకున్నవాటిలో ప్లేటులోని మూడుపదార్థాలు తరచుగా అందంగా వుంటాయి చూసేందుకు. రెండు పదార్థాలున్న ప్లేటుకంటే మూడు వున్నవే నిండుగా, అందంగా వుంటాయి. అలాగే, మీ విషయాంశాన్ని చిత్రీకరణలో, బాగా పొడుగ్గా వున్న ఐస్క్రీమ్ఎల్లాంటివి, కాఫీ గ్లాస్ లాంటి వాటి జోలికి చిత్రీకరణకు వెళ్ళకుండా వుండటమే మంచిది..

బహుశా, రెస్టారెంట్లో చిత్రీకరణ నేపథ్యం జనంతో నిండివుండి, సాధ్యపడదుగనుక, నేపథ్యం ఫోకస్లో లేకుండా వుండేందుకు పెద్ద అపర్చర్ను వాడవచ్చు లేదా నీవు చిత్రీకరించే ఆహారపదార్థాల వెనుకగా ఒక కుర్చీ వుంచి దానిపై ఒక గుడ్డను

పరచి నేపథ్యాన్ని సన్నద్ధంజేసుకోవచ్చు.



కుర్చీలు ఎత్తు తక్కువున్నట్లయితే, వాటిమీద నీ ఆహారపదార్థమున్న ప్లేటు వుంచి, దానికి వెనుకగా “మెనూ” (ఆహారపదార్థాలజాబితా) వుంచి, పదార్థాలు స్పష్టంగా, వర్ణనీయంగా చిత్రీకరించండి. ఇక్కడ మీరు మీ ముందున్న స్థలం మీ చిత్రీకరణలోకి రాకుండా జాగ్రత్తవహించాలి. విశాలమైన ఆహారపదార్థాల వద్దనప్రదేశంలో చాయాచిత్రీకరణ మరచిపోకండి. ప్రత్యేకంగా, హోటళ్ళలో వంటపనివారు వద్దనజేసే బఫెట్కార్ట్స్, హోటల్లో అతిథులకోసం తినుబండారాలను ఆకర్షణీయంగా అలంకరించి, యిష్టమైన వాటిని వడ్డిస్తూ వుండేటపుడు ఆసక్తిదాయకమైన చిత్రాలు తయారవుతాయి.

వెలుతురు : బయటనుండి వెలుతురు బాగా ప్రసరించే కిటికీ వద్ద మీరు కూర్చున్నట్లయితే, మీ కెమేరాకవసరమైన సహజకాంతి లభిస్తుంది. బాహ్యప్రదేశంలో వీలయితే మరీ మంచిది. తక్కువ కాంతిలో వున్నపుడు ఫ్లాష్ వుపయోగించినా, సాధ్యమైనంతవరకు ఉపయోగించటం తగ్గించి, స్విచ్ఆఫ్ చేయాలి, ఎందుకంటే, ఒక్కోసారి ఫ్లాష్లు వాటంతటవే వెలుగుతుంటాయి ఆన్లో వున్నట్లయితే.

వీధిలోవున్నపుడు: రెస్టారెంట్లో నుండి బయటపడి, అంగట్లోకి అడుగుపెట్టగానే, ముఖ్యంగా ఆహారపదార్థాలు

# ఫోటోగ్రఫీ పాఠాలు



తయారుజేసి, అమ్మే అంగళ్ళు సాక్షాత్కరిస్తాయి. మీరు ఆ షాపు యజమానిని కొన్ని చిత్రాలు తీయగానే, వారు తయారుజేసే ఆహారపదార్థాలపైకి మీ దృష్టి మరలుతుంది. వారు తయారుజేసే పదార్థాలు తినేందుకు ప్రయత్నించకుండా, వాటినెలా తయారుజేస్తారో, అందులోని ప్రతిభను గురించి ఆ యజమానిని ప్రశ్నించి కొన్నిటిని చిత్రీకరించవచ్చు. వారు పనిజేసే దగ్గర, వారి అనుమతిలేకుండా ఎట్టి పరిస్థితుల్లోను చిత్రీకరించకండి, వారు అంగీకరించనట్లయితే, తక్షణమే మరో స్టాల్ వద్దకు బయలుదేరండి. అంతేగాని వారితో వాదించకూడదు. వారు అనుమతించినట్లయితే, వారి చిత్రాలకోసం వారెంతో ఆసక్తికరంగా, అనేకరకాల ఫోజులిచ్చి, మన చిత్రీకరణకు సహకరిస్తారు ఆనందంగా.


నీ చిత్రీకరణ విషయాంశం సంక్లిష్టమైనదైతే, కెమేరాలో ఎక్కువగా బాహ్యప్రదేశముంటే, చిత్రాన్ని కెమేరాకనుకూలంగా కొంచెం నేపథ్యాన్ని నల్లగా వుంచండి. అలాజేసినపుడు, మీ ఎక్స్పోజర్ సరిగా వుంచుకుని, షాట్ను పర్యావలోకనం జేసుకోండి. మీరు వీథిలో వుండి, సూర్యరశ్మి తక్కువగా వున్నపుడు, వాతావరణసంయమనాన్ని అర్థంజేసుకుని మీకవసరమైన విషయాన్ని చిత్రీకరించవచ్చు. కాని, అందుకోసం కంగారుపడి, చీకటిగావుందని ఫ్లాష్ను వాడినట్లయితే చిత్రంలో అనుభూతి కొరవడుతుంది. మామూలుగా వైడర్ ఎపర్చర్ను వాడుతూ ఎక్కువ ISO లో వుంచితే, చిత్రం మసకగా వుంటుంది. అలాంటపుడు చిత్రాన్ని నలుపు, తెలుపుల్లోకి మార్చి కృషిజేసినట్లయితే చక్కగా తయారవుతుంది చిత్రీకరణ.

మరో ప్రత్యామ్నాయమేమంటే, ముక్కాలిబల్లపై కెమేరానుంచి, తక్కువ షట్టర్ వేగంతో, అటుగా వెళ్ళే వ్యక్తిని నీ చిత్రంలో బంధించినట్లయితే, ఆ వ్యక్తుల కదలికవల్ల చిత్రం మసకబారుతుంది. అయితే, మీరు అక్కడే పనిజేసే వ్యక్తులను, అంటే, ఆహారపదార్థాల తయారీకోసం, కూరలను తరుగుతూ, కుంపటిమీద ఆహారాన్ని వండుతూ వేగంగా తిరుగాడే వారిపై మీచిత్రాన్ని ఫోకస్ చేయవచ్చు. తక్కువ వేగపు షట్టర్ వలన మంటలను దగ్గర నుండి తీయవచ్చు. కాని, పొరపాటుగా మీరు వంటసామాగ్రిని, వేడివేడి ప్లేట్లను దయచేసి ముట్టుకోటానికి ప్రయత్నించకండి.

★★★



# యువత తెలుసుకో నిన్ను నువ్వు మలుచుకో



## మీ జీవితం మీ చేతుల్లో ఉంచుకోండి

జీవితం ఎంతో మధురమైనది. బాధలు, కష్టాలు, ఇబ్బందులు... ఇవన్ని తాత్కాలికం. వీటన్నిటిని మించి ఒకటుంది అదే ఆనందమయమైన జీవనం. జీవితం యొక్క మాధుర్యాన్ని నువ్వు చూడాలంటే, ముందు నీ సాంప్రదాయపు సంకెళ్ళను తెంచుకుని (కుల, మత, సాంస్కృతిక) బయటకురాగా జీవితం అంటే ఒక ఉద్యోగం కాదు, ఊడిగం అంతకన్నా కాదు. జీవితం ఒక అద్భుతమైన, ఎల్లలు లేని ఆనంద తీరం. దాని మాధుర్యాన్ని ఆస్వాదించాలంటే మనం కూడా సృజనాత్మక జీవులమై వుండాలి.

చాలామంది బ్రతుకుతారు, కొంతమందే జీవిస్తారు. బ్రతకడానికి, జీవించడానికి తేడా ఏమిటి? అందరిలానే ప్రొద్దున్నే లేస్తూ, ఏదో ఒక పనిచేస్తూ నాలుగు ముద్దలు కడుపులోకి సంపాదించుకునే వాళ్ళు బ్రతుకీడుస్తారు. తన జీవనంపై స్పష్టమైన అవగాహనతో తన చుట్టూ వున్నవారికోసం జీవిస్తూ జీవింపజేసేవారు, వున్నా

లేకపోయినా పది కాలాలు

జీవించే వుంటారు. ఒకే ఒక్క

క్షణం పరిపూర్ణంగా జీవించాలన్న ఆలోచనతో జీవించి చూడండి, మీ జీవన స్థితే మారిపోతుంది.

కాని చాలామంది తమ చుట్టూ గిరిగీసుకుని ఒక ఉద్యోగమో, వ్యాపారమో సంపాదించి సులభంగా ఉంటే అదే జీవితమని పొరబడు తున్నారు. వీళ్ళకి జీవితపు ఒక అంచుమాత్రమే తెలుసు. వీళ్ళు ఆనందం కోసం ఎక్కడెక్కడో వెదుకుతారు. ఎంతో ఖర్చుచేస్తారు. అంత వృధా, ఎందుకంటే ఆనందం మనలోనే వుంది.

మీకంటూ ఓ ప్రపంచాన్ని సృష్టించుకోండి. అక్కడ నిరాశ నిస్పృహలకు తావు లేకుండా చూడండి. అసూయ ద్వేషాలకు అవకాశమివ్వకండి. ఎటు చూసినా ఆశావాదం, ఆనందం తాండవించాలి.

ఆనందం అనేది సముద్రం వంటిది. ఒక చేప సముద్రంలో వుంటూ ఒక రోజు ఒక సాధువు సముద్రంలో ఈదటం గొప్ప ఆనందాన్నిస్తుందని బోధిస్తుండగా విన్నది. దానికి తను సముద్రంలోనే వున్నానన్న విషయం తెలియక తనకు తెలిసిన వారినందరిని సముద్రం ఎక్కడని అడగటం మొదలు పెట్టింది. అలాగా మనం కూడా ఆనందం, చైతన్యం అనే సముద్రంలో వుంటూ వాటికోసం వెతుకుతున్నాం. నీకు ఏమి కావాలో నువ్వు నిర్వచించలేనప్పుడు నీ మనస్సు అల్లకల్లోలంగా వుంటుంది. గాలిలో దీపం ఎప్పుడు ఊగుతూ సరైన వెలుతురు నివ్వలేదు. ఆ గాలిని తగ్గిస్తే దీపం నిశ్చలంగా వెలుగుతూ దారి చూపిస్తుంది. అలాగే నువ్వు కూడా నీకేం కావాలో స్పష్టంగా వున్నప్పుడు, అది సాధించడం సులభమౌతుంది. ఆనందం చేరువవుతుంది.

నీకంటూ ఏమికావాలో నీకు స్పష్టంగా తెలిసినప్పుడు నీ పరిధి నీకు తెలుస్తుంది. మన పరిధి మనకు తెలిసినప్పుడు, మన జీవనయానం కూడా సులభతరమౌతుంది. మన కోరికలుకూడా హద్దుల్లో వుంటాయి. వాటిని సాధించుకోవటం కూడా సులభమౌతుంది. అన్నీకావాలి, అన్నీ సాధించాలను కోవటం కూడా అవివేకమే. ఏదో ఒక రంగాన్ని ఎంచుకుని అందులో నిష్ణుతులు అవ్వటం సులభం. అప్పుడు దానిమీద పూర్తి శ్రద్ధతో మన సర్వశక్తులు కేంద్రీకరించటానికి వీలైతుంది. తద్వారా విజయం సొంతమౌతుంది.

జీవితంలో ఆనందం ఏం చేస్తున్నామన్న దాన్నిబట్టి వుండదు. చేస్తున్న పనిని ఎంత ఇష్టంగా చేస్తున్నామన్న దాంట్లో వుంటుంది.

★★★



# ఊడలమర్రి ఉపన్యాసాలు



విక్రమార్కుడు ఎన్నికల్లో గెలిచిన భేతాళుడిని అభినందిద్దామని స్మశానం చేరుకున్నాడు.

కాని అక్కడ ఎటువంటి విజయోత్సవ సన్నాహాలు కనపడ లేదు. పైపెచ్చు భేతాళుడు దిగాలుగా చెట్టుకు వేలాడుతూ కనపడ్డాడు.

"ఏం భేతాళా, భారి మెజారిటీతో గెలిచావు కదా, ఇంకా దిగులుగా వున్నావేమిటి "అంటూ ప్రశ్నించాడు.

"ఏం గెలుపులే రాజు, గెలిచిన సందర్భంగా విజయోత్స వాలు చేసి కాస్త కార్యకర్తల్లో జోష్ నింపుదామంటే ఖజనా మొత్తం ఖాళీగా కనపడుతోంది"

"అందులో ఆశ్చర్యం ఏముంది భేతాళ, అందరికీ తెలిసిందే కదా. ఆ జినీ గాడు అందిన చోటల్లా అప్పులు వేసి పోయాడని నువ్వే కదా ఊదర కొట్టావు. మరి ఇప్పుడు కొత్తగా ఏదో కనుగొనట్టు

ఏమిటి బాధ "

." అన్నాను కాని మరీ ఇన్ని అప్పులు చేసాడని ఉహించ లేకపోయాను. రూపాయి లేకుండా పరిపాలన ఎలా చెయ్యాలి ప్రభుత్వాన్ని ఎలా నడపాలి' దిగాలుగా బదులిచ్చాడు

"అయితే ఇక ఎక్కడా అప్ప పుట్టు దంటావు..'

"అంతేగామరి ... "ఎన్ని సార్లు చెప్పాలి "గొణిగాడు, భేతాళుడు

'అవును ఎన్నికల్లో టిక్కెట్లు అమ్మిన డబ్బు మొత్తం ఏమి చేసావు."

"ఏమి చేసానో తెలియదా రాజా, ఈ చేత్తో తీసుకుని ఆ వేత్త మళ్ళీ వాళ్ళకే ఇచ్చాను ఎన్నికల ఖర్చుకోసం.ఇంక నాకేమి మిగిలింది.."

" నిజం చెప్పు..." ఉడికించాడు విక్రమార్కుడు

"నిజం రాజా, అంతకు ముందైతే కాస్తో కూస్తో మిగిలేది. ఈసారి తప్పకుండా గెలవాలని రూపాయికి రెండు రూపాయలి చ్చాము. అందుకే ఏమి మిగల్లా "

" సరే ఇంక చేసేదేముంది "పరుశవేది 'నేర్చుకోవటమే "

"పరుశవేదా... అదేమి విద్య రాజా "ఆశ్చర్యపోతూ అడిగాడు.

"పరుశవేది అనేది ఇనుమును బంగారంగా మార్చే విద్య ..."

'నిజమా.. అలాంటి విద్య వున్నదా? ఉంటె అదేదో చెప్పి పుణ్యం కట్టుకో రాజా!' విక్రమార్కుడిని బతిమిలాడాడు భేతాళుడు

విక) మార్కుడు పెద్దగా నవ్వుతూ "ఆవిదయ నీకే తెలుసుండాలి' అన్నాడు

" నాకా, నాకు తెలియటం ఏమిటి... నాకే కనుక ఆవిద్య తెలుసుంటే ఈ పాటికి ఇల్లంతా బంగారవు మయం చేసేవాడిని "

"మరి ఏమి తెలియకుండా ఎన్నికల్లో బంగారం సృష్టిస్తా అని ఎందుకు వాగ్దానం చేశావు.

" నేనా బంగారమా... నేనెప్పుడు చెప్పాను.."

'ప్రతి ఎన్నికల సభలో చెప్పావు . అందుకనే నేను కూడా నీకు పరుశ వేది వచ్చేమో అనుకున్నా !

"ఓ అదా, నీము అలా అర్ధ మయంగా. బంగారం అంది బంగారు కుటుంబం, బంగారు పందులు, బంగారు. బొమ్మలు అన్నామాట"

"ఏం, నీకళ్ళకు నేనెలా కనపడుతున్నాను. ఏదో సినిమా పేర్లు చెప్పి త పించుకోవాలనుకుంటున్నావా?'

"అయో లేదు రాజా ఎన్నికల్లో ఏవేవో చెబుతుంటాము అవన్నీ నిజమనుకుంటే ఎలా "

' ఏడిసినట్టుంది, మరి ప్రజలకేమో ఎడాపెడా వాగ్దానాలు చేశావు, అవన్నీ ఎలా తీరుస్తావు'

"వాటి గురించి అప్పుడే దిగులెందుకు రాజ ,ఇదేళ్ళుంది. రెపు ఎలా గడుస్తుందోనని భయంగా వుంది. ముందు దానికి ఉపాయం చెప్పు.

ఏముంది, శ్మశానం అమ్మేసి ఏ ఉబ్బుతో : పం చెయ్యి'

కాలక్షేపం చె నువువ చెప్పిందేదో బాగానే వుంది కాని... స్మశానం అమ్మిన తరువాత, ఇంక రాజ్యం ఎక్కడుంటుంది "ఇంక ప్రభుత్వం ఎందుకు" అనుమానం లేవనెత్తాడు

"నిజమేకదా నాకు అంత ఆలోచన రాలేరు. అయితే ఇంక చేసేదేముంది జోలె పట్టుటమే.

"అవునవును రాజబాగా గుర్తు చేసావు, మనకు తెలిసిన విశ్వకరా అపస్ చేస్తాను" అంటా తన పై కండువా తీసి జూలె పట్టి

మొదటి దానం నువ్వే చెయ్యరాజా లేకపోతే నీతల వేయి వక్కల వుతుంది' అని అన్నాడు.


చేసేదేమిలేక విక్రమార్కుడు తన బొడ్లో నుంచి ఒక రూపాయి బిళ్ళ భఛతాళుడి జోలెలికి విసిరి వడివడిగా నడుచుకుంటూ అక్కడి నుండి నిష్క) మించాడు.

★★★

## మన కథానాయకులు

### మహా కవుల మానస పుత్రులు

### నారాయణరావు




బాపిరాజు రాసిన సాంఘిక నవలన్నింటిలో ప్రముఖమైనది 1934లో వచ్చిన "నారాయణారావు". 'ఆంధ్రకళాపరిషత్తు' తెలుగు నవలల పోటీలో విశ్వనాథ వారి 'వేయిపడగలు'తో పాటు ప్రధమ బహుమతి పంచుకున్న నవల ఇది. నారాయణరావు–శారదల వివాహం, వారిద్దరి కుటుంబాల మధ్యన ఉన్న సాంస్కృతిక బేధాలు వారి దాంపత్యాన్ని ఏ విధంగా ప్రభావితం చేసాయి? చివరికి వారిద్దరూ ఎలా ఒకటౌతారు అన్నది స్థూలకథ. ఈ కథతో పాటూ అప్పటి సమాజ పరిస్థితులు, నాటి జమిందారీ వ్యవస్థ, మానవతావాదం, గాంధేయ సిద్ధాంతాలు, సాధారణ ప్రాపంచిక సమస్యల తాలూకూ సుదీర్ఘచర్చలు నారాయణరావు నవలలో కనబడతాయి. వీటన్నింటి మూలంగా తెలుగుసాహిత్యంలో చెప్పుకోదగ్గ నవలగా నారాయణరావు నిలిచిపోతుంది. మళయాళం, పంజాబీ, హిందీ, కన్నడ, బెంగాలీ మొదలైన భారతీయ భాషలోకి అనువదింపబడినదీ నవల.

# మన కథానాయకులు

ఉన్నత తరగతికి చెందిన బ్రాహ్మణ రైతు కుటుంబం యువకుడు నారాయణరావు కథ ఇది. "అందానికి అర్జునుడు బలానికి భీముడు" అయిన నారాయణరావు "దేహమెంత వజ్రమో హృదయమంత నవనీతం". ఆదర్శవంతుడు. సంభాషణాప్రియుడయిన మితభాషి అతడు. తన హృదయాన్ని కదిలించు చర్చ వచ్చినప్పుడు పట్టుదలతో, యుక్తులతో ఉపన్యసించగలడు. ఏ విషయమైనా ఉదాహరణలతో సహా అరటిపండు వలిచినట్లు బోధించగలడు. పెద్దలతో మాత్రం గౌరవముగా మెలగుతూ వాదముల చేయడు. చక్కని వ్యక్తిత్వం కలిగి ఎట్టివారి హృదయానికైనా చేరువకాగల గుణవంతుడతను. తీయదనం, గాంభీర్యం కలగలిసిన గొంతు అతనిది. గాత్రం, ఫిడేలు రెండింటిలో విద్వాంసుడు.

మద్రాసులో న్యాయవిద్యార్థిగా ఉన్న నారాయణరావు స్నేహితులతో కలిసి తన స్వగ్రామం కొత్తపేటకు రైల్లో వెళ్తుండగా నవల ప్రారంభమవుతుంది. విశ్వలాపురం జమీందారు, జస్టిస్ పార్టీ సభ్యుడు లక్ష్మీ సుందర ప్రసాదరావు తన మొదటి కుమార్తెకు జమీందారీ వివాహం చేసి దెబ్బతిని ఉండడంతో సామాన్యుడైన, యోగ్యుడైన వరుణ్ణి అన్వేషణ చేస్తూండగా నారాయణరావు కనిపిస్తాడు. నారాయణరావు, ఆయన వ్యక్తిత్వం నచ్చి ఆయనకు తన చిన్న కూతురు శారదను ఇచ్చి పెళ్ళి చేయాలని నిశ్చయించుకుంటాడు. శారదకు ఇంట్లోనే సంగీతంతోపాటుగా చదువు కూడా చెప్పిస్తూంటారు. ఆమెను జమీందారీ కుటుంబం నుంచి అందునా తన మేనల్లుడు జగన్మోహనరావు ఇచ్చి పెళ్ళి చేయాలని తల్లి కామేశ్వరీ దేవి భావించడంతో ఈ సంబంధం ఆమెకు నచ్చదు. తండ్రికి మాత్రం జగన్మోహనుని ప్రవర్తన నచ్చక అతనికి తన కూతుర్నిచ్చి పెళ్ళి చేయడం ఇష్టం ఉండదు. ఐనా తల్లి చెప్పినదే సరైనదని అనిపించినా శారద తండ్రి మాట ఎదురాడలేక ఈ పెళ్ళికి అంగీకరిస్తుంది. నారాయణరావు తండ్రి సుబ్బారాయుడిని ఒప్పించి జమీందారు పెళ్ళి చేస్తారు. ఐనా తల్లి వల్ల ముందుగా తనలో ఏర్పడ్డ వ్యతిరేకత వల్ల నారాయణరావుతో సంసారం సజావుగా సాగించలేక పోతుంది శారద. ఆత్మగౌరవంతో ఈ విషయాన్ని ఎక్కడా పొక్కనివ్వడు నారాయణరావు.

భార్యకు తనయందు ప్రేమ లేదని మధనపడుతున్నా, ఆమెలో పరివర్తన కలుగుతుందని ఎదురుచూస్తాడు నారాయణరావు. శారదనెంతగా ప్రేమిస్తున్నాడో ఆమెకు తెలియనివ్వకుండా చెల్లెలు సూరీడుకీ, భార్యకూ చదువు కూడా చెప్తాడతను. అతని సరళమైన బోధనావిధానాన్ని చూసి ఆనందపూర్ణురాలౌతుంది శారద. శ్యామసుందరీదేవి వంటి సుందరీమణి, విద్యాపారంగతురాలు, సంగీతజ్ఞురాలు పరిచయమైనప్పుడు ఆమెను సోదరిగా ప్రేమిస్తాడే తప్ప ప్రలోభపడి తప్పుదోవ పట్టడు నారాయణరావు. అంతటి నిగ్రహపురుషుడతను. కొత్తపేటలో ఇళ్లంటుకున్నప్పుడు నారాయణరావు ప్రాణాలొడ్డి జనులను కాపాడిన సాహసం అతనిలోని సేవాతత్పరతను, సామాజిక బాధ్యతను తెలుపుతుంది. ఆ సంఘటనే శారదలో మార్పుని వేగవంతం చేస్తుంది.

గాడితప్పబోయిన తన అక్కచెల్లెళ్ల జీవితాలను సరిచేయడంలో నారాయణరావు సమయస్ఫూర్తి, శక్తిసామర్థ్యాలు కనబడతాయి. ఆఖరి చెల్లెల్లు సూర్యాకాంతమ్మ భర్త రామచంద్రరావు ఉన్నత చదువులకని ఎవరికీ చెప్పకుండా రంగూన్ వెడతాడు. వారిద్దరి అనుబంధం బలహీనపడకూడదని భార్యాభర్తలిరువురూ ఉత్తరప్రత్యుత్తరాలు, ఛాయాచిత్రాలూ ఒకరికొకరు పంపుకునే ఏర్పాటు చేస్తాడు నారాయణరావు. భర్త పాశ్చాత్యదేశాల నుండి వచ్చేసమయానికి చెల్లెలు కూడా పాశ్చాత్యవిద్యలలో ప్రవీణురాలు


కావాలని ఆమెకు గురువును నియమించి, చదువుకొనసాగేలా చేస్తాడతను. రెండవ అక్కగారు సత్యవతి భర్త వీరభద్రరావు కఠిన హృదయుడు. అందగత్తె అయిన భర్యను ఎప్పుడూ అనుమానిస్తూ, నిందిస్తూ, చావబాదుతూ ఉంటాడు. నారాయణరావు ఒకమారు పెద్దాపురం వెళ్ళి ఎంతో ఓర్పుతో బావకు హితబోధ చేసి అతనిలో మార్పు తేవ ప్రయత్నిస్తాడు. కొన్నాళ్ళ తర్వాత మళ్ళీ అక్కగారిని భర్త సృహతప్పేలా కొట్టాడని తెలుసుకుని ఉగ్రుడై మరల అక్కగారి ఊరు వెళ్ళి చిన్న నాటకమాడి బావగారికి రెండు దెబ్బలు తగిలించి, భయపెట్టి, అతనికి గౌరవమిస్తూనే బుద్ధి తెచ్చే ప్రయత్నం చేస్తాడు.

నారాయణరావు విషయపరిజ్ఞానం మరియు ప్రజ్ఞాపాటవాలు అన్నీ నవలలో అక్కడాక్కడా జరిగే చర్చల ద్వారా పాఠకులకు తెలుస్తూ ఉంటాయి. క్రీడలు, ఆంగ్ల సాహిత్యం, ఆంగ్ల చిత్రాలు, ఆంగ్ల నటీనటులు, చిత్రలేఖనం, సంగీతం, నాట్యం మొదలైన కళాత్మక విషయాల గురించిన అవగాహనే కాక, మిత్రుడు రాజారావుతో వేదాంత చర్చలు; ఇతర మిత్రులతో, జమిందారుతో రైల్వేల పనితీరు గురించి; స్త్రీపురుష సంబంధాలు, హిందూ వివాహవ్యవస్థ ప్రాశస్త్యం, స్వేచ్ఛాజీవనం వల్ల కలిగే అనర్థాల గురించీ ; 'ఆంధ్ర నవకవి సమితి' సభలో శిల్పకళానైపుణ్యమును గురించిన ఉపన్యాసం; బిచ్చగాళ్ళు, వారితో అంతరించిపోతున్న కొన్ని యాచక కళలు మొదలైన విభిన్నమైన అంశాలపై జరిపే చర్చలు నారాయణరావుకు గల ప్రాపంచిక జ్ఞానాన్ని తెలిపి మనల్ని అబ్బురపెడతాయి.

నారాయణరావు పాత్రచిత్రణలో ఎటువంటి లోపాలనూ అందివ్వలేదు బాపిరాజు. లోపాలెంచలేని ఉత్తమపురుషుడతడు. నవలానాయకుడికి మంచితనము, ఉత్తమ విలువలతో పాటుగా కొద్దిపాటి లోటుపాట్లు, బలహీనతలు ఉంటేనే పాఠకుల మనసులకతడు దగ్గరగా రాగలడు అన్న సిద్ధాంతాన్ని మార్చివేస్తూ, తాను చిత్రకారుడు కాబట్టి ఎంతో జాగ్రత్తగా వేసుకున్న పరిపూర్ణమైన చిత్రంలా నారాయణరావు పాత్రను బాపిరాజు మలచడం ప్రశంసనీయం.

★★★.

# నవ్వండి ప్లీజ్



నవ్వటం ఒక యోగం ,

నవ్వలేక పోవటం ఒక రోగం ,

తరువాత మీ ఇష్టం




శ్రీనివాస్ కార్టూన్లు












# సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత

## పి .చంద్ర శేఖర ఆజాద్




పీ. చంద్రశేఖర ఆజాద్ 1955 మే 22న గుంటురు జిల్లా భట్టిప్రోలు మండలం, వెల్లటూరు గ్రామంలో పడివిముక్కల లక్ష్మణరావు, విజయలక్ష్మి దంపతులకు జన్మించారు. ఆయన తండ్రి ఉద్యోగాలను, మున్సబు పదవిని తిరస్కరించి కమ్యూనిస్టు ఉద్యమంలోకి వెళ్లారు. ప్రముఖ కమ్యూనిస్టు నేత మోటూరు హనుమంతరావు సహచరుడు, ఆత్మీయ మిత్రుడు లక్ష్మణరావు. తెలంగాణ పోరాట సమయంలో ఆరేండ్లు కడలూరు జైల్లో ఉన్నారు.

కేరళకు చెందిన ప్రముఖ కమ్యూనిస్టు నేత, మొదటి లోక్‌సభ ప్రతిపక్షనేత ఎ.కె గోపాలన్ లాంటి యోధులు జైలు జీవితంలో సహచరులుగా ఉన్నారు. ఆ తరువాత మూడో సంతానంగా పి చంద్రశేఖర ఆజాద్, నాలుగో సంతానంగా అక్క జెన్నీ, ఐదో సంతానంగా తమ్ముడు రాజశేఖర్ పుట్టారు. అంతకు ముందే మొదటి సంతానంగా వటూటిన్, రెండో సంతానంగా ప్రతిభ పుట్టారు. అయితే 1998లో వటూటిన్, ప్రతిభ చనిపోయారు. చంద్రశేఖర ఆజాద్ తన చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయారు. అప్పటి నుంచి తల్లే పెంచి పెద్దవాణ్ని చేసింది. చంద్రశేఖర అమ్మ 2014లో చనిపోయారు.

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుండి బీఏ పట్టా పుచ్చుకున్నారు. స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. సినిమా, టీవీ రంగంలోనూ రచయితగా, ఆర్టిస్టుగా కొనసాగుతున్నారు. ఆయనకు భార్య పి.జానకి, కుమారుడు స్పందన్ ఉన్నారు. ఆయన విశ్రాంతి ప్రభుత్వోద్యోగి. ఆయన కథా, నవలా రచయితగా అనేక రచనలు చేశారు.

రచనలు

పీ.చంద్రశేఖర ఆజాద్ అనేక కథల పోటీలలో, నవలల పోటీలలో పాల్గొన్నారు. ఆయనకు అనేక బహుమతులు వరించాయి. ఈయన నవలలు అనేక పత్రికల్లో సీరియళ్లుగా ప్రచురింపబడ్డాయి. రోడ్డు మీద గులాబీ, పి.చంద్రశేఖర ఆజాద్ కథలు వంటి కథల సంపుటిలు, అహానికి రంగుండదు, ఫ్యామిలీ ఫొటో, అడవి, కిడ్నాప్ కిడ్నాప్, శ్వేతపత్రం, మహావక్షం, తెలిమబ్బుల ఛాయ, నాన్నకో ఉత్తరం, జీవనసంగీతం, పావురం, టుమై కంట్రీ విత్ లవ్, మనో ప్రస్థానం వంటి




నవలలు, మూడ్స్ వంటి ఫీచర్, అందమైన పూలతోట, దేవతా! ఓ దేవతా!!, జమీందారు కోట వంటి పిల్లల నవలలు, మాహృదయం బాల సాహిత్యం వంటి రచనలు పుస్తక రూపంలో వచ్చాయి.

నవ్య వీక్లీ, సిపి బ్రౌన్ అకాడమీ నిర్వహించిన నవలల పోటీలలో ఫ్యామిలీ ఫొటో నవలకు తృతీయ బహుమతి, అమెరికా తెలుగు అకాడమీ (ఆటా), వార్త నిర్వహించిన నవలల పోటీలలో తెలిమబ్బుల ఛాయ నవలకు రూ. 30 వేల నగదు బహుమతి, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అట్లాంటా (తానా) నిర్వహించిన నవలల పోటీలో మనో ప్రస్థానం నవలకు ప్రోత్సాహక బహుమతి, ఆంధ్రభూమి నిర్వహించిన ఉగాది కథల పోటీలో రెండు విధ్వంసాలు కథకు ప్రోత్సాహక బహుమతులు వచ్చాయి.

మరోవైపు బుల్లితెర రంగం కూడా అజాదాన్ను ఆకర్షించింది. దూరదర్శన్ లో 'జీవనతీరాలు' సీరియల్ ఆరంభించి, రాధామధు, లయ, అడగక ఇచ్చిన మనసు, ఎదురీత సీరియల్స్లో మొత్తం ఐదువేల ఎపిసోడ్లకు రచనా సహకారం అందించారు. సామాజిక, మానవ భావోద్వేగాలకు సంబంధించినఅన్నిరకాల సమస్యలను చర్చించారు. అజాద్రచనా సహకారం అందించిన పాండవులు,అడవిపూలు, బోన్సాయ్, తమసోమా టెలీఫి లింస్ కు మూడు స్వర్ణాలు, వెండి నంది వచ్చాయి. అడవిపూలు టెలీఫిలింకు కథ,స్క్రీన్ప్లే, సంభాషణలకుగాను వ్యక్తిగతంగా నంది బహుమతిని స్వీకరించారు. సరదా కోసం కొన్ని టెలీఫిలింస్, టీవీ సీరియల్స్ ను ఆయన నటించారు. ఉపాధికోసంగుంటూరు, ఒంగోలు, ఏలూరు, రాజమండ్రిలో ఉన్నపుడు కొన్ని సాంస్కృతిక సంస్థల నిర్వహణలోను పనిచేసిన ఆయన ప్రస్తుతం హైదరాబాద్ లో స్థిరపడ్డారు.

★★★

క్రైం
సీరియల్

# డెత్ మెసేజ్





కొండగుంట వెంకటేష్.

"నేను చేసింది పెద్ద పొరపాటు కూడా కాదు. ఆ వయస్సులో అందరు చేసే పని చేశాను. ఒక అందమైన అమ్మాయిని అనుకోకుండ చూశాను.అందరి అభిప్రాయం ఏమిటో నాకు తెలియదు. కాని నాకు మాత్రం ఆమె చాల అందంగా కనిపించింది.

అప్పుడే నేను మొదటిసారి ప్రేమలో పడ్డాను"అన్నాడు.

ప్రభ మొహంలో గబగబ భావాలు మారిపోయాయి. ఆమె మొహం పాలిపోయింది. ఊహించని విషయం విన్నప్పుడు మనిషి ఒక రకమైన షాక్ కు లోనవుతాడు. లేదా ట్రాన్స్ కు లోనవుతాడు. ప్రభ విషయంలో అదే జరిగింది.

నమ్మలేనట్టుగా అతన్ని చూసింది.

# క్రైం సీరియల్

## జరిగిన కథ

పోలీసు డిపార్ట్మెంటు లో పనిచేసిన సుయోధనరావు ను ఎవరో అనుసరిస్తూ ఉంటారు .అవినాష్, కుసమలు ఒకరిని ఒకరు ఇష్టపడతారు. సుయోధనరావును వెంటాడుతున్న వ్యక్తే అవినాష్ ని కుడా అనుసరిస్తూ ఉంటాడు. సుయోధన రావ్, ఒక కుటుంబాని అన్యాయం చెయ్యటంతో అ కుటుంబం లోని వాళ్లు ఆత్మహత్య చేసుకుంటారు . అ కుటుంబం లోని వారసుడు అతని మీద పగబడతాడు. కుసుమకు అతడు ఫోన్ చేసి బెదిరిస్తుంటాడు.సాగర్ భార్య ప్రమీల ఫోన్ చేస్తే సుయోధన రావు అక్కడికి వెళతాడు. అక్కడ సాగర్ చచ్చిపడి ఉంటాడు .ఫ్యామిలీ డాక్టర్ ప్రకాష్ కి ప్రమీలకి సంబంధం ఉండనే అనుమానం తో ప్రకాష్ తో గొడవ పడతాడు సాగర్. కోపం లో ప్రకాష్ సాగర్ని చంపేస్తాడు . ప్రకాష్ కోసం సుయోధన రావు వెళితే అతను కనిపించుడు. చివరకు అతను చచ్చి శవమై తేలతాడు .కాని చనిపోయింది ప్రకాష్ కాదు సాగర్ అని తెలుసుకుంటాడు సుయోధన రావు .సుయోధన రావుకు బెదిరింపు లేఖ వస్తుంది.రవితన తండ్రిని చంపినా సుయోధన రావును చంపాలని నిర్ణయించుకుంటాడు .సుయోధనరావు జాగింగ్ చేసే టప్పుడు రవి అతన్ని కాల్చి చంపుతాడు. పోలీసులు దర్యాప్తు మొదలు పెడతారు.హంతకుడు అవినాష్ తల్లిని కుడా చంపుతానని మెసేజ్ పంపుతాడు .లీన రవిని బెదిరిస్తుంది .హంతకుడి బొమ్మలు గీయిస్తాడు ప్రతాప్ .

ఇక చదవండి

XXXX

"సార్ " అంటు లోపలికి వచ్చాడు సైబర్ బాద్ డిపార్ట్ మెంట్ సిబ్బంది.

"ఏమిటి విషయం? అడిగాడు ప్రతాప్.

"మీరు ఇచ్చిన ఫోన్ నెంబర్ ను లోకేట్ చేశాం"అన్నాడు అతను.

"వివరాలు చెప్పండి."

"మీరు ఇచ్చిన ఫోన్ నెంబర్ గురించి తెలిసింది."

"ఎవరతను ఎక్కడ ఉంటాడు?

"ఈ చిటిలో అతని పేరు అడ్రస్సు రాశాను"అని చీటి ఇచ్చాడు. అందులో ఆ వ్యక్తి పేరు వినాయక్ అని ఉంది.

"థ్యాంక్స్. మీరు ఇక వెళ్ళండి"అన్నాడు ప్రతాప్. అతను నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

గంట తరువాత ప్రతాప్ తన సిబ్బందితో కారులో బయలుదేరాడు. హైదరాబాదు విజయవాడ మద్యదారిలో ఒక చెరువు దగ్గర కారు ఆగింది. అందులోంచి ప్రతాప్ అతని సిబ్బంది దిగారు. వాళ్ళలో ఇద్దరు గజఈతగాళ్ళు కూడా ఉన్నారు. హంతకుడు ఉపయోగించిన ఫోన్ ఈ చెరువులో ఉందని సైబరాబాద్ సిబ్బంది చెప్పారు.

ఇద్దరు గజఈతగాళ్ళు చెరువులోకి దుకారు. ప్రతాప్ ఆసక్తిగా చూస్తున్నాడు. ఫోన్ దొరకితే హంతకుడు దాదాపు దొరికినట్టే. ఆ ఫోన్ యజమాని పేరు వినాయక్. అతని ఇంటి అడ్రస్సు ఉంది.

అరగంట తరువాత ఫోన్ తీసుకుని పైకి వచ్చారు సిబ్బంది.

దాన్ని జాగ్రర్తగా పాలితిన్ పేపర్ లో చుట్టాడు ప్రతాప్. తరువాత సిటికి బయలుదేరారు. మద్యదారిలో సిబ్బంది దిగిపోయారు. ప్రతాప్ మాత్రం వినాయక్ ఇంటికి బయలుదేరాడు. చాల ఉద్వేకంగా ఉంది అతనికి. సాధించింది తక్కువేం కాదు. సుయోధనరావును హత్యచేసిన హంతకుడిని పట్టుకోబోతున్నాడు. ఈ కేసు అటు మీడియాలోను ఇటు డిపార్ట్ మెంట్ లో పెద్ద సంచలనం కలిగించింది.

మీడియా ఈ వార్తను ప్రతిరోజు

ఒక్కసారి అయిన హైలెట్ చేస్తోంది. డిపార్ట్ మెంట్ గురించి చెప్పనవసరం లేదు. పై అధికారి దగ్గర నుంచి వత్తిడి వస్తోంది. కేసు గురించి ప్రతిరోజు అడుగుతున్నారు. ఇంకా ఎందుకు హంతకుడిని పట్టుకోలేదని సంజాయిషీ అడుగుతున్నారు. వాళ్ళకు జవాబు చెప్పలేక సతమతమవుతున్నాడు ప్రతాప్. ఈ రోజుతో ఆ సమస్య తీరిపోతుంది. హంతకుడి ఆచూకి తెలిసింది. అతను ఉపయోగించిన సెల్ ఫోన్ కూడా దొరికింది. అతని చిరునామా కూడా ఉంది. అదుపులోకి తీసుకోవటమే మిగిలింది.

ప్రతాప్ ఉత్సాహంగా వినాయక్ ఇంటికి బయలుదేరాడు. కారు ఒక అపార్ట్ మెంట్ ముందు ఆపాడు. దిగి లోపలికి వెళ్ళాడు. టేబుల్ దగ్గర ఒక సెక్యూరిటి గార్డ్ కూర్చుని ఉన్నాడు. ఏదో పుస్తకం చూస్తున్నాడు.

"ఎవరు కావాలి సార్"వినయంగా అడిగాడు అతను.

"వినాయక్ ఏ ఫ్లేట్ లో ఉంటున్నాడు"అడిగాడు ప్రతాప్.

"501 సార్"అన్నాడు.

అతనికి ధ్యాంక్స్ చెప్పి లిఫ్ట్ లో నిలబడ్డాడు. అయిదవ అంతస్థులో లిఫ్ట్ ఆగింది. తిన్నగా 501 ఇంటికి వెళ్ళి కాలింగ్ బజార్ నొక్కాడు.

క్షణం తరువాత ఒక వ్యక్తి తలుపులు తీశాడు. లుంగి బనియన్ వేసుకున్నాడు.

"ఏమిటన్నట్టు ప్రశ్నార్ధంగా చూశాడు.

"మీరేనా వినాయక్ అంటే"అడిగాడు.

"అవును మీరెవరు"అడిగాడు అతను. అప్పుడు ప్రతాప్ యూనిఫారమ్ లో లేడు. సివిలియన్ డ్రస్సులో ఉన్నాడు.

"నన్ను ప్రతాప్ అంటారు. పోలీస్ ఆఫీసర్ ను. మీ సెల్ గురించి మాట్లాడటానికి వచ్చాను"అన్నాడు ప్రతాప్.

"నా సెల్ దొరికిందా'ఆత్రంగా అడిగాడు అతను.

"ఆ విషయం తరువాత చెప్తాను. ముందు నేను అడిగే ప్రశ్నలకు జవాబు చెప్పండి."

"అడగండి."

"ఈ సెల్ మీదే కదూ"సెల్ చూపిస్తూ అడిగాడు ప్రతాప్.

"అవును. వారం రోజులకు ముందు పోయింది. పోలీసులకు కూడా కంప్లయింట్ ఇచ్చాను."

"కంప్లయింట్ కాపీ ఉందా.?

"ఉంది. తీసుకువస్తాను ఉండండి"అని లోపలికి వెళ్ళాడు.

అతను ఇచ్చిన కాపీని పూర్తిగా చదివాడు. అతను చెప్పింది నిజమే. సరిగ్గా వారం రోజులకు ముందు అతని సెల్ ఫోన్ పోయింది. కంప్లయింట్ లో తేది సమయం కూడా రాసుంది.

"ఈ సెల్ ఎక్కడ పోగోట్టుకున్నారు"అడిగాడు ప్రతాప్ నిరాశగా. అతని ఉత్సాహం పూర్తిగా చచ్చిపోయింది. కొండను తవ్వి ఎలుకను పట్టుకున్నట్టుగా ఉంది అతని స్థితి.

"ఒక కాఫీ కేఫ్ లో. ఆ రోజు సాయంత్రం కాఫీ తాగటానికి ఆ కేఫ్ కు వెళ్ళాను. మూలగా ఉన్న టేబుల్ ముందు కూర్చున్నాను. స్నాక్స్ కాఫీకి ఆర్డర్ చేశాను. ఇంతలో ఎవరో కాల్ చేశారు. మాట్లాడుతుంటే బేరర్ వచ్చి కాఫీ పెట్టి వెళ్ళిపోయాడు. కాల్ మాట్లాడిన తరువాత కాఫీ తాగాను. సెల్ టేబుల్ మీద పెట్టి రిఫ్రెష్ రూమ్ లోకి వెళ్ళాను. తిరిగి వచ్చి చూసేసరికి సెల్ లేదు. చుట్టుపక్కల వెతికాను. ఎక్కడ కనిపించలేదు. దాన్ని టేబుల్ మీదే పెట్టానని నాకు బాగా గుర్తు. నేను తిరిగిరావటానికి ఒక్క క్షణం పట్టి ఉండవచ్చు. అంతలోనే ఎవరో నా సెల్ కొట్టేశారు. కంగారుగా అందరిని అడిగాను. ఎవరికి తమకు తెలియదని చెప్పారు. కాఫీ హౌజ్ మేనేజర్ ను కూడా అడిగాను. ఇక చేసేది లేక తిన్నగా పోలీస్ స్టేషన్ కు వెళ్ళాను. సంబంధిత అధికారికి ఫిర్యాదు చేశాను. కాగితాం మీద రాసి ఇచ్చాను. ఇది జరిగింది"అన్నాడు.

"ఒక హత్యకేసు దర్యాప్తు చేస్తున్నాం. హంతకుడు ఈ సెల్ ఉపయోగించినట్టు తెలిసింది."

"నాకేం తెలియదు. ఆ హత్యతో నాకు ఎలాంటి సంబంధం లేదు"అన్నాడు అతను కంగారుగా.

"మీ దగ్గర కంప్లయింట్ కాపీ ఉందా"అడిగాడు ప్రతాప్.

"ఉంది"తెస్తాను ఉండండి"అని లోపలికి వెళ్ళాడు.

అతను చెప్పింది నిజమే.

"సరే ఇప్పటికి మిమ్మల్ని వదిలేస్తున్నాం. అవసరమైనప్పుడు కాల్ చేస్తాను. తప్పకుండ రెస్పాండ్ కావాలి"అని చెప్పి ఇంట్లోంచి బయటకు వచ్చాడు.

పావుగంట తరువాత కేఫ్ కు వెళ్ళాడు. మేనేజర్ ను కలుసుకుని విషయం చెప్పాడు.

"పదిరోజులకు ముందు సీసీ ఫుటేజ్ కావాలి"అన్నాడు.

వెంటనే ఇద్దరు ఒక గదిలోకి వెళ్ళారు. అక్కడ టెక్నిషియన్ కంప్యూటర్ ముందు కూర్చుని పనిచేసుకుంటున్నాడు. మేనేజర్ అతనితో మాట్లాడాడు.

గంట తరువాత ప్రతాప్ పని పూర్తయింది. పెన్ డ్రైవ్ తీసుకుని తన స్టేషన్ చేరుకున్నాడు. లాప్ టాప్ లో పెన్ డ్రైవ్ పెట్టి ఆన్ చేశాడు.

XXXX

"సారీ"అన్నాడు అపాలజటిక్ గా రవి. ఇది నిజం. అప్పుడు నా వయస్సు పదిహేను సంవత్సరాలు. నూనుగు మీసాలతో నూతన యవ్వనంలో ఉన్నాను. మాది కో ఎడ్యుకేషన్ కాలేజి. నా క్లాసులో పదిహేను మంది అమ్మాయిలు ఉండేవారు. వాళ్ళలో శ్రీలేఖ ఒక అమ్మాయి. చాల అందంగా చలాకిగా ఉంటుంది. మాములుగా నేను అమ్మాయిలతో ఎక్కువగా మాట్లాడను. అవసరమైతేనే పలకరిస్తాను. లేకపోతే పట్టించుకోను. ఈ విషయం నా క్లాస్ మెట్స్ అందరికి తెలుసు. "

"కాని శ్రీలేఖ విషయంలో నేను అలా ప్రవర్తించలేదు. కారణం ఏమిటో తెలియదు. ఆమెను చూడగానే మెస్మరైజ్ అయ్యాను. ఆమెతో మాట్లాడాలని ఉబలాటపడ్డాను."

ఆమె మాత్రం అందరితో కలుపుగోలుపుగా ఉండేది. చలాకిగా స్కూల్ అంతా తిరిగేది. ఉత్సాహంతో ఉరకలు వేసేది. ఆమె ప్రవర్తన అందరిని ఆకర్షించేది. అందరు ఆమెతో పరిచయం పెంచుకోవాలని చూసేవాళ్ళు. ఆడవాళ్ళు మగవాళ్ళు అని తేడా లేదు. అందరు ఆమెతో మాట్లాడాలని అనుకునేవాళ్ళు. దానికి నేను అతీతుడను కాదు. ఒక రోజు నాకు పెండింగ్ వర్క్ ఉండిపోయింది. క్లాసులో కూర్చుని పనిచేస్తున్నాను. శ్రీలేఖ కూడా ఉంది. ఇద్దరం ఒకేసారి పని పూర్తిచేశాం. క్లాసు టీచర్ దగ్గరకు వెళ్ళాం. సంతకం తీసుకున్న తరువాత ఇద్దరం బయలుదేరాం."

"మా ఇళ్ళు ఒకే ఏరియాలో ఉన్నాయి. కొంచం దూరం ఇద్దరం మౌనంగా నడిచాం. ఎవరు మాట్లాడలేదు. నా సంగతి తెలిసిందే. కాని శ్రీలేఖ అలా ఉండటం నాకు ఆశ్చర్యం కలిగించింది. ఆమె ఎప్పుడు గలగలమాట్లాడుతూ ఉంటుంది. కొత్త పాత అని తేడాలేకుండ ఇట్టే కలిసిపోతుంది. కాని ఆ సమయంలో మాత్రం మౌనంగా ఉంది. ఎలాగు ఆమెతో స్నేహం చెయ్యాలని ఉంది. అందుకే ముందు నేనే మాట్లాడాను. "

"ఆ మాటలు సమయానికి తగినట్టుగా లేవు. ఏదో మాట్లాడాలని మాట్లాడాను."

"పరీక్షలకు ఎలా చదువుతున్నావు? అడిగాను.

"బాగానే చదువుతున్నాను. మరి నువ్వు? అంది.

"నేను కూడా బాగా చదువుతున్నాను"అన్నాను.

"అంతే ఆ తరువాత ఏం మాట్లాడాలో తెలియలేదు. మౌనంగా ఉండిపోయాను.

తరువాత ఇద్దరం మౌనంగా ఇంటికి చేరుకున్నాం. ఆమె ఇల్లు ముందు వచ్చింది. తను వెళ్ళిపోయింది. నేను ఇంటికి చేరుకునేసరికి నాన్నగారు ఆఫీసునుంచి వచ్చేశారు. హాలులో కాఫీ తాగుతూ ఉన్నారు. "

"ఏమిట్రా ఈ రోజు ఆలస్యమైంది"అడిగారు.

"పెండింగ్ రికార్డ్స్ పూర్తిచేసేసరికి ఈ వేళ అయింది"అన్నాను.

# క్రైం సీరియల్

ఆ రోజు రాత్రి పుస్తకాలు ముందు వేసుకుని కూర్చున్నాను. నా ముందు పుస్తకాలు ఉన్నాయి. కాని ఆశ్చర్యంగా అవి కనిపించటం లేదు. శ్రీలేఖ రూపం కనిపిస్తోంది. ఆమెను మరిచిపోదామని ఎంతో ప్రయత్నించాను. కాని వీలుకాలేదు. ప్రతి క్షణం పుస్తకం మీద ఆమె రూపం కనిపిస్తోంది. దాంతో నా మూడ్ పూర్తిగా పోయింది. పుస్తకాలు మూసి కూర్చున్నాను. ఇంతవరకు ఇలా జరగలేదు. అందుకే కొంచం ఇబ్బందిపడ్డాను. "

"ఆ రోజు గడిచింది. మరునాడు ఉదయం కాలేజికి వెళ్ళాను. బయలుదేరేముందు నన్ను నేను మొదటిసారి అద్దంలో చూసుకున్నాను. నా కళ్ళు ఎర్రగా ఉన్నాయి. మొహం బాగా పీక్కుపోయింది. నా పరిస్థితి చూసి నేనే ఆశ్చర్యపడ్డాను. ఈ పరిణామానికి కారణం నాకు అర్థమైంది. శ్రీలేఖ. నేను తనని విపరీతంగా ఇష్టపడుతున్నాను. అందుకే రాత్రంతా ఆమె గురించి ఆలోచిస్తూ ఉండిపోయాను."

"మరునాడు కాలేజికి వెళ్ళాను. ఆ రోజు శ్రీలేఖ కొంచం ఆలస్యంగా కాలేజికి వచ్చింది. ఆమె పరిస్థితి కూడా నా లాగే ఉంది. రాత్రంతా నిద్రపోనట్టుగా ఉంది. మొహం వాడిపోయింది. కళ్ళు నిద్రలేమితో ఎర్రగా ఉన్నాయి. బహుశా ఆమెకు జ్వరం వచ్చినట్టుగా ఉంది. నన్ను చూసింది కాని పలకరించలేదు. కనీసం నవ్వలేదు. ప్రతిరోజు నన్ను చూడగానే నవ్వుతుంది. లేకుండ చెయ్యి ఊపి హాయ్ అనేది."

"కాని ఆ రోజు ఎందుకు అలప్రవర్తిస్తుందో నాకు అర్థం కాలేదు. ఆందోళనతో నా మనస్సు తల్లడిల్లిపోయింది. లంచ్ అవర్ వచ్చింది. క్లాసులోంచి అందరు వెళ్ళిపోయారు. నేను శ్రీలేఖ మాత్రం మిగిలాం. నేనే వెళ్ళ పలకరించాను. తను మాట్లాడలేదు. మౌనంగా ఒక కాగితం ఇచ్చింది. తెరిచి చదవబోయాను. వెంటనే వారించింది.

"ఇంటికి వెళ్ళిన తరువాత చదవండి"అంది.

"ఏం రాశావు "అని అడిగాను.

మెల్లగా నవ్వి వెళ్ళిపోయింది.

నేను ఆత్రంగా చదవబోయాను. అప్పుడే ఆమె మాటలు గుర్తుకువచ్చాయి. వెంటనే మనస్సు మార్చుకున్నాను. కాగితం తీసి జేబులో పెట్టుకున్నాను.

క్లాసు అయిపోయేంతవరకు కాచుకున్నాను. పాఠాలు వినే మూడ్ పోయింది. ప్రతి క్షణం ఆ ఉత్తరంలో ఏం రాసిందా అని సతమతమయ్యాను. మాములుగా కాలేజి విడిచిపెట్టాడు. శ్రీలేఖ కోసం చుట్టు చూశాను. ఎక్కడ కనిపించలేదు. రెండు నిమిషాలు కాచుకున్నాను. తరువాత ఇంటికి బయలుదేరాను. నా గదిలోకి వెళ్ళి మంచం మీద కూర్చున్నాను. కాగితం తీసి చేత్తోపట్టుకున్నాను. ఆశ్చర్యం నా చెయ్యి ఎందుకో తెలియదు. సన్నగా కంపిస్తోంది. వణుకుతున్న చేతులతో కాగితం విప్పాను. అందులో ఒకే ఒక వాక్యం మాత్రం రాసుంది.

"I love you,"

XXXX

నా కళ్ళను నమ్మలేకపోయాను. ఒక రకమైన భ్రమలో ఉన్నానని అనుకున్నాను. నమ్మకం కలగలేదు. అందుకే కళ్ళు నులుపుకుని మరి చూశాను. నేను చూసిన అక్షరాలు నిజమే. నేను భ్రమలో లేనని అర్థమైంది. నాలో రక్తం వడివడిగా ప్రవహించింది. శరీరం చిగురుటాకుల కంపించింది. కొన్ని క్షణాలు ఒక రకమైన ట్రాన్స్ లో ఉండిపోయాను. తరువాత తేరుకుని ఆ కాగితాన్ని పదిలంగా దాచుకున్నాను."

"ఆ తరువాత మేమిద్దరం తరుచు కలుసుకునేవాళ్ళం. నా సమక్షంలో ఆమె ఆమె సమక్షంలో నేను చాల సంతోషపంగా ఆనందంగా ఉండేవాళ్ళం. గంటలతరబడి మాట్లాడుకునేవాళ్ళం. అయిన విసుగువచ్చేది కాదు. గంటలు క్షణాల్లా గడిచిపోయేవి. సమయం తెలిసేది కాదు. "

"ఒక రోజు మాములుగా కాలేజి అయిపోయింది. ఇద్దరం ఎవరికి తెలియకుండ ఏటిఒడ్డుకు వెళ్ళాం. అక్కడ ఒక చిన్న గుహ ఉంది. ఆ గుహలో కూర్చుంటే ఎవరికి కనిపించం. ఆ రోజు కూడా అక్కడే కూర్చున్నాం. మాట్లాడుకుంటున్నాం."

"నాకు ఎందుకో భయంగా ఉంది రవి"అంది అలేఖ్య.

"ఎందుకు?

"మన విషయం ఇంట్లోవాళ్ళకు తెలిసిపోయిందని నా అనుమానం."

"నీకు ఎందుకు అనుమానం వచ్చింది"అడిగాను కంగారుగా.

"రాత్రి దాహం వేసింది. లేచి మంచినీళ్ళ కోసం కిచెన్ లోకి వెళ్ళాను. కిచెన్ కు ఎదురుగా అమ్మ నాన్న బెడ్ రూం ఉంది. ఇంకా ఆ గదిలో లైట్లు వెలుగుతున్నాయి. తలుపు దగ్గరగా వేసి ఉన్నాయి. చిన్న సందుమాత్రం ఉంది. అందులోంచి అమ్మ నాన్న స్పష్టంగా కనిపిస్తున్నారు. ఇద్దరు మంచం మీద కూర్చున్నారు. ఏదో విషయం గురించి సీరియస్ గా మాట్లాడుకుంటున్నారు. "

"ముందు వాళ్ళు ఏం మాట్లాడుకుంటున్నారో నాకు తెలియదు. అందుకే నేను ఆసక్తి చూపించలేదు. వెళ్ళిపోబోతుంటే అప్పుడే నాన్న మాటలు వినిపించాయి.

"అమ్మాయి ఒక అబ్బాయితో తిరుగుతోంది"అన్నాడు.

"మీకు ఎలా తెలుసు? ఆశ్చర్యంగా అడిగింది అమ్మ.

"మన నౌకరు చెప్పాడు. ఇద్దరు కలిసి ఏటి ఒడ్డుకు వెళ్ళినట్టు కూడా చెప్పాడు."

"ఆ అబ్బాయి ఎవరు?

"ఎవరో తెలియదు. కాని అమ్మాయి క్లాస్ మెట్ అని మాత్రం తెలుసు. అందుకే ఆ అబ్బాయి గురించి వివరాలు తెలుసుకోమని వాడికి చెప్పాను."

అమ్మ ఏమంటుందో నాకు తెలియదు. నేను అక్కడ ఆగలేదు. వెంటనే నా గదిలోకి వచ్చేశాను. ఎందుకో నాకు భయంగా ఉంది. ముఖ్యంగా నాన్నఅంటే నాకు చాల భయం. ఆయన తప్పకుండ మన పెళ్ళికి ఒప్పుకోడు"అంది అలేఖ్య.

నా గుండెలు జారిపోయాయి. నిజానికి ఈ పరిణామం వస్తుందని నాకు తెలుసు. కాని ఇంత తొందరగా వస్తుందని అనుకోలేదు. ఒక్కక్షణం పాటు నా మెదడు పనిచెయ్యలేదు. స్తబ్దుగా అయింది. నా గురించి అలేఖ్య తండ్రికి తెలియకపోవచ్చు. కాని ఆయన గురించి నాకు బాగా తెలుసు. ఆయన ఒక పెద్ద వ్యాపారస్థుడు. ఒక పెద్ద ఫ్యాక్టరీని నడుపుతున్నాడు. డబ్బు పలుకుబడి పుష్కలంగా ఉన్నాయి. అలేఖ్య ఆయనకు ఒక్కగానొక్క కూతురు. అల్లారు ముద్దుగా పెంచాడు. ఆమె మాట ఎప్పుడు కాదనడు. కాని ఈ విషయంలో మాత్రం ఆయన ఒప్పుకోడు. అవసరమైతే ఆమెకు బలవంతంగా పెళ్ళిచేస్తాడు.

"ఏం చేద్దాం"అంది అలేఖ్య.

"నాకేం తోచటం లేదు. రాత్రి బాగా ఆలోచించి చెప్తాను"అని సర్దిచెప్పాను.

నా వైపు ఆశ్చర్యంగా చూసింది అలేఖ్య. ఆమె పవర్తనకు కారణం నాకు అర్ధంకాలేదు. తరువాత ఇద్దరం బయలుదేరాం.

నేను మూడిగా ఉండటం అమ్మ నాన్న చూశారు. ఏం జరిగింది బాబు అని అడిగారు.

"ఏం లేదు నాన్నగారు"అని చెప్పి నా గదిలోకి వచ్చేశాను. ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు. చాల సేపు ఆలోచించాను. కాని ఒక్క ఉపాయం తోచలేదు. నిజానికి ఆ వయస్సులో అమ్మాయితో పారిపోవాలని ప్రతి ప్రేమికుడు అనుకుంటాడు. కాని విచిత్రంగా నాకు ఆ ఆలోచన రాలేదు.

తెల్లవారుజాము వరకు ఒక రకమైన డైలామాలో ఉన్నాను. ఆలోచించి ఆలోచించి నా మెదడు వేడెక్కిపోయింది. సన్నగా తలపోటు మొదలైంది. అప్పుడే నా ఫోన్ రింగ్ అయింది. డిస్ ప్లే మీద అలేఖ్య నెంబర్ కనిపించింది.

"బాగా ఆలోచించిన తరువాత ఒక నిర్ణయానికి వచ్చాను"అంది ఉపోద్ఘాతం లేకుండ.

"ఏమిటి? అన్నాను ఉత్సాహంగా.

"ఇద్దరం పారిపోదాం. కొన్నిరోజులు ఎక్కడైన ఉందాం"అంది.

"నా శరీరం ఒక్కసారిగా చలబడింది. నేను వింటున్నది నిజమా కాదా అని కూడా అర్ధంకాలేదు. అలేఖ్య ఇలాంటి నిర్ణయం తీసుకుంటుందని నేను ఊహించలేదు. అందుకే ఒక రకమైన ట్రాన్స్ లో ఉండిపోయాను. వెంటనే ఏం జవాబుచెప్పాలో

అర్థంకాలేదు.

"అది చాల తప్పు"అన్నాను తేరుకుని.

"తప్పే. కాని తప్పలేదు. నాన్నకు మన విషయం తెలిసిపోయింది. నాకు వెంటనే పెళ్ళి చెయ్యాలనుకుంటున్నాడు. మనం ఆలస్యం చేస్తే సమయం దాటిపోతుంది. అందుకే రేపు రాత్రి పారిపోదాం" అంది.

"వద్దు. మీ నాన్నగారితో నేను మాట్లాడతాను. తొందరపడవద్దు"అని సర్దిచెప్పాను.

"నీకు మా నాన్నగారి సంగతి తెలియదు. ఆయన చాల మొండివాడు. ఏదైన నిర్ణయించుకుంటే ఎవరి మాటలు వినడు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను. ఇంకేం అడ్డుచెప్పకు. రేపు కాలేజికి వచ్చేటప్పుడు అవసరమైన బట్టలు సామానులు తీసుకువస్తాను. నువ్వు కూడా అలగే చెయ్యి."

"మరి డబ్బు"అన్నాను.

"డబ్బు విషయం నాకు విడిచిపెట్టు. అంతా నేను చూసుకుంటాను. నీకు తోచింది తీసుకురా బై "అని సెల్ కట్ చేసింది.

నా మైండ్ ఒక్కసారిగా బ్లాంక్ అయిపోయింది. ఆలోచించే శక్తిని పూర్తిగా కోల్పోయాను. చిన్నతనం నుంచి నాన్న అమ్మ నన్ను విలువలతో పెద్దచేశారు. నీతి నిజాయితికి ఆయన ఎంతో విలువ ఇస్తారు. ముఖ్యంగా అమ్మాయి విషయంలో ఆయన చాల స్ట్రిక్ట్.

చదవుపూర్తయ్యేంతవరకు ప్రేమలో పడకూడదని పదేపదే చెప్పారు.

"నేను అలాంటి పిచ్చిపనులు చెయ్యను"అని ధైర్యంగా చెప్పేవాడిని.

కాని ఆ మాటను నిలబెట్టుకోలేకపోయాను. ఇప్పుడు నా పరిస్థితి ఏమిటి? ఆయనకు చెపితే ఖచ్చితంగా ఒప్పుకోరు. అలాగని దాచలేను. ప్రతి విషయం ఆయనకు చెప్పేవాడిని. కాలేజిలో జరిగే విషయాలు కూడా చెప్పేవాడిని.శ్రీలేఖ గురించి కూడా రెండు మూడు సార్లు చెప్పాను. కాని ప్రేమించినట్టు మాత్రం చెప్పలేదు. మా ఇద్దరి మధ్య స్నేహం మాత్రమే ఉందని ఆయన భావిస్తున్నాడు. ఇప్పుడు ఈ విషయం తెలిస్తే తట్టుకోలేడు. ఏం చెయ్యాలో తోచలేదు.

మరునాడు కొంచం ఆలస్యం నిద్రలేచాను. ఈ రోజే మేము పారిపోయే రోజు. నా గుండెలు రాకెట్ వేగంతో కొట్టుకుంటున్నాయి. శరీరం జలధరిస్తోంది. కాళ్ళుచేతులు ఆడటం లేదు. ఆందోళన భయం కలిసికట్టుగా నన్ను కుదిపేశాయి. అమ్మా నాన్న మొహం చూడాలంటే చాల సిగ్గువేసింది.తప్పుచేస్తున్న ఫీలింగ్ కలిగింది. మనస్సు తట్టుకోలేకపోయింది. అసలు విషయం చెప్పాలనిపించింది. అప్పుడే అలేఖ్య గుర్తుకువచ్చింది. దాంతో నా మనస్సు మార్చుకున్నాను."

"వెళ్ళోస్తానని ఇద్దరికి చెప్పి కాలేజికి బయలుదేరాను.

సాయంత్రం వరకు నేను అలేఖ్య మాట్లాడుకోలేదు. ఒకరినొకరం చూసుకోలేదు కూడా. ఏం తెలియనట్టు ప్రవర్తించాం. సాయంత్రం కాలేజి అయిపోయింది. ఇద్దరం సంచులు తీసుకుని కాలేజినుంచి బయటపడ్డాం. కాలేజికి కొంత దూరంలో ఒక బస్సు స్టాప్ ఉంది. అది డిస్ట్రిక్ బస్ స్టాపు. అక్కడికి వెళ్ళి నిల్చున్నాం. వచ్చిన బస్సు ఎక్కాం. ఇద్దరం పక్కపక్కన కూర్చున్నాం. బస్సు బయలుదేరింది.

"ఎక్కడికి వెళుతున్నాం"అడిగాను మెల్లగా.

"పావురాలపల్లి."

"అక్కడ నీ చుట్టాలు కాని బందువులు కాని ఉన్నారా? అడిగాను.

"కాదు నా స్నేహితురాలు ఉంది. తను అక్కడ ఒంటరిగా ఉండి చదువుకుంటోంది. "

"ఆమె అమ్మ నాన్న?

"వాళ్ళిద్దరు భైరవలంకలో డాక్టర్స్. తను ఒక్కతే ఉంటోంది. లోకల్ కాలేజిలో మనలాగే ఇంటర్మీడియట్ కోర్స్ చదువుతోంది"అంది.

"మన విషయం తనకు తెలుసా"అడిగాను.

"నేనే చెప్పాను. కావల్సినన్ని రోజులు తన ఇంట్లో ఉండమని

చెప్పింది. అక్కడ ఉంటే మనకు కొంచం కూడా భయం ఉండదు."

"తరువాత ఏం చేద్దాం?

"మన కోసం మనవాళ్ళు కంగారుపడతారు. రెండు రోజుల తరువాత మనమే కాల్ చేద్దాం. ఇక్కడ ఉన్నామని చెప్తాం. జరిగింది తెలుసుకుని మా డాడీ కాంప్రమైజ్ అవుతాడు. వెంటనే మన పెళ్ళికి ఒప్పుకుంటాడు. కాకపోతే ఒక కండీషన్ పెడతాడు"అంది పెద్ద ఆరిందానిలా.

"ఏమిటి?

"చదువు పూర్తయిన తరువాత పెళ్ళి చేస్తానని అంటాడు. మనం ఒప్పుకుంటాం. దాంతో సమస్య తీరిపోతుంది"అంది.

"నాకు మాత్రం నమ్మకం కలగలేదు. రెండు గంటల తరువాత పావురాలపల్లి చేరుకున్నాం. ఆటోలో ఆమె ఫ్రెండ్ ఇంటికి చేరుకున్నాం. ఆటో వాడికి డబ్బు ఇచ్చి లోపలికి వెళ్ళాం. తలుపులకు తాళం వేసి ఉంది. మా గుండె గుబేలమంది.

"నీ ఫ్రెండ్ ఇంట్లో లేదు"అన్నాను ఆందోళనగా.

వెంటనే శ్రీ లేఖ తన ఫ్రెండ్ కు కాల్ చేసింది. రింగ్ పోతుంది కాని రెస్పాన్స్ లేదు. ఒకసారి కాదు. నాలుగు సార్లు ప్రయత్నించింది. కాని అటువైపు నుంచి రెస్పాన్స్ లేదు. మాకేం చెయ్యాలో తోచలేదు. ఎంతో ఆశతో వచ్చాం. చివరకు ఇలా జరిగింది.

శ్రీలేఖ మొహం పాలిపోయింది. తను ఎంత ఆందోళనపడుతుందో నాకు అర్థమైంది.

"కంగారుపడకు. ఎక్కడికో అర్జంటుగా వెళ్ళిఉంటుంది. కొంచం సేపు కాచుకుందాం"అన్నాను.

ఇద్దరం గుమ్మం ముందు మెట్లమీద కూర్చున్నాం. పేరుకు అది చిన్న ఊరు. కాని అలా కనిపించటం లేదు. చుట్టు అందమైన భవనాలు కనిపిస్తున్నాయి. ప్రతి ఇంటి పైన డిష్ యాంటిన ఉంది. కాంపౌండ్ లో కార్లు బైక్ లు కనిపిస్తున్నాయి. శ్రీలేఖ బ్యాగ్ లోంచి కూల్ డ్రింక్ ప్యాక్ తీసి ఇచ్చింది. ఇద్దరం కూల్ డ్రింక్ తాగుతూ కూర్చున్నాం. కడుపులో అకలి నకనకలాడుతోంది. బ్యాగ్ లో చిప్స్ పాకెట్స్ ఇంకా కొన్ని ఐటమ్స్ ఉన్నాయి. కాని తినబుద్ది కాలేదు. శ్రీలేఖ స్నేహితురాలు ఎప్పుడు వస్తుందో అర్థంకాలేదు.అసలు వస్తుందో లేదో.

అదే సమయంలో నాకో అనుమానం కూడా వచ్చింది. కొంపదీసి మమ్మల్ని ఆవైడ్ చెయ్యటానికి ఈ పని చేసిందా. అదే అనూమానాన్ని శ్రీలేఖ దగ్గర వ్యక్తం చేశాను. తను కూడా అనుమానించింది. అయిన ఆశ మాత్రం చావలేదు. ఇంకో గంటసేపు ఎదురుచూశాను. అయిన ఆమె రాలేదు. మా ఓపిక నశించింది. ఇక చేసేది లేక సామానులు సర్దుకుని బయలుదేరాం.

"ఇప్పుడు ఎక్కడికి వెళదాం"అడిగాను.

"తను లేకపోతే ఏం. మనం హోటల్ లో ఉందాం"అంది.

తలమీద పిడుగుపడినట్టు అదిరిపడ్డాను.

తెలియని ఊరిలో మా లాంటి టీనేజ్ వాళ్ళు హోటల్ లో ఉండటం చాల ప్రమాధం. అక్కడ జరిగే దారుణాలు రోజు పేపర్ లోచూస్తున్నాం.

"ఇంటికి వెళ్ళిపోదాం శ్రీలేఖ"అన్నాను.

"ఎందుకు? భయపడుతున్నావా"నవ్వుతూ అడిగింది.

ఆ సమయంలో ఆమెకు నవ్వు ఎలా వస్తుందో నాకు అర్థం కాలేదు.

"సీరియస్ గా అడుగుతున్నాను"అన్నాను కోపంగా.

"నువ్వు ఇంత పిరికివాడివని అనుకోలేదు. పద వెళదాం"అని నా చెయ్యి పట్టుకుంది.

మొదటిసారి అమ్మాయి స్పర్శ తగిలింది. నా గుండె ముందు జల్లుమంది. తరువాత రక్తం వడివడిగా ప్రవహించింది. మొహంలో లోకి వెచ్చగా రక్తం

పాకింది.”

“ఇద్దరం ఆటోలో ఒక లాడ్జ్ చేరుకున్నాం. లోపల ఫర్వాలేదు. డిసెంట్ గా ఉంది. రిసప్షనిస్ట్ మా వైపు అదో రకంగా చూశాడు. కాని ఏం అడగలేదు. బహుశా అతనికి ఇది మాములే అన్నట్టుగా ఉంది. పనివాడు మమ్మల్ని మొదటి ఫ్లోర్ లో ఒక గదిలోకి తీసుకువెళ్ళాడు. గది ఒక మోస్తరుగా ఉంది. రెండు మంచాలు పక్కపక్కనే ఉన్నాయి. అటాచ్డ్ రిఫ్రెష్ రూమ్. ఫర్వాలేదు అనిపించింది. “

“పదిరూపాయలు తీసుకుని పనివాడు వెళ్ళిపోయాడు. తలుపులు వేసి ఇద్దరం మంచం మీద కూర్చున్నాం. అలేఖ్య మాములుగానే ఉంది. ఆమె కొంచం కూడా భయపడటం లేదు. మొహంలో ఆందోళన కించిత్ కూడా కనిపించటం లేదు. నాకు మాత్రం చాల భయంగా ఉంది. ఈ పరిణామం ఎక్కడికి దారితీస్తుందో తెలియటం లేదు. ఈ పాటికి మా వాళ్ళకు అలేఖ్య వాళ్ళకు విషయం తెలిసిపోయిఉంటుంది. మా నాన్నగారికి అమ్మకు అనుమానం వచ్చి ఉండదు. బహుశా స్నేహితుడు ఇంటికి వెళ్ళిఉంటాడని అనుకుని ఉంటారు. “

“కాని అలేఖ్య తండ్రి అలా కాదు. అతనికి మా మీద అనుమానంగా ఉంది. అందుకే ఆమెకు పెళ్ళిచెయ్యాలనుకున్నాడు. కనుక ఖచ్చితంగా మేమిద్దరం పారిపోయామని ఊహించిఉంటాడు. ఈ పాటికి పోలీసు రిపోర్ట్ కూడా ఇచ్చి ఉంటాడు. వాళ్ళు మా కోసం వెతుకుతూ ఉంటారు.

ఇది తలుచుకుంటే నా శరీరం చలిజ్వరం వచ్చినవాడిలా వణికింది.

“ఏమిటి భయంగా ఉందా”అంది అలేఖ్య. మెల్లగా తన చేతిని నా చేతి మీద వేసింది.


చప్పును నా చేతిని వెనక్కి తీసుకున్నాను.

అలేఖ్య నవ్వి లేచింది. బాత్రూంలోకి వెళ్ళి తలుపులు వేసుకుంది. అసహనంతో రగిలిపోయాను. అనవసరంగా సాహసం చేశానని తోచింది. చూస్తుంటే అలేఖ్య చాల ఫాస్ట్ గా ఉంది. అలాగని నేను ప్రవరాఖ్యుడిని కాను. కాని నాలో కొన్ని నియమాలు పద్ధతులు ఉన్నాయి. ముఖ్యంగా నాకు సంస్కారం ఉంది. దానికి కారణం మా నాన్నగారి ప్రభావం. ఆయన ఎంతో సంస్కారం మంచితనం ఉన్న వ్యక్తి. ఆయన సీనియర్ ఆఫీసర్ కూడా నాన్నగారిని విపరీతంగా గౌరవిస్తాడు. అలాంటి నాన్నగారు నన్ను పెంచారు. అమ్మాయిలతో ఎలా వ్యవహరించాలో చెప్పారు. “

“ఇంగ్లీష్ లో ఒక సామెత ఉంది. చారిటి బిగిన్స్ ఎట్ హోమ్. అంటే ఏ పని చెయ్యాలనుకున్నా ముందు ఇంట్లో చేసి చూపించాలి. చెప్పే మాటలను ఇంట్లో తూచ తప్పకుండ చెయ్యాలి. నాన్నగారికి సిగరెట్ తాగే అలవాటు ఉంది. కాని ఇంట్లో మాత్రం తాగరు. ముఖ్యంగా అమ్మ ముందు అసలు తాగరు. తాగాలనుకుంటే డాబా మీదకు వెళ్ళి కాల్చేవారు. కాని ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే తను సిగరెట్ తాగుతున్న విషయం అమ్మకు తెలియదని ఆయన అనుకుంటున్నాడు. కాని ఆ విషయం అమ్మకు తెలుసు. కాని తనకు తెలిసినట్టు ఆమె ఎప్పుడు ప్రవర్తించలేదు. చూపించలేదు. కనీసం చూచాయిగా కూడా ప్రవర్తించలేదు.

(ఇంకా ఉంది )

# అంపశయ్య






అవధానుల విజయలక్ష్మి

నవీన్ రాసిన అంపశయ్య పుస్తకం మొదటిసారి నేను కాలేజిలో చదువుతున్నప్పుడు చదివాను...

కాలేజిలో లంచ్ అవర్ దాదాపు ఒక గంట ఉండేది...డబ్బాలో తెచ్చుకొన్న భోజనం తినేసిన వెంటనే బాగులో పెట్టి తెచ్చుకొన్న ఏదో ఒక పుస్తకాన్ని తెరిచేదాన్ని...

అలాగే ఒకరోజు ఈ అంపశయ్య పుస్తకం చదువుతున్నప్పుడు కళ్ళంట బొటబొట నీళ్ళు కారడం ఆగలేదు!.. చుట్టూ కూర్చున్న అమ్మాయిలు నా వైపు వింతగా చూశారు...దాదాపు మూడు వందలకి పైన పేజీలున్న ఈ కథ జరిగిన కాలం కేవలం 18 గంటలే అంటే నమ్ముతారా?!

కథ మొదటి రోజు పొద్దున్నే కాలేజిలో చదువుతున్న రవి హాస్టల్ లో నిద్ర లేవడంతో మొదలయి అదే రోజు రాత్రి నిద్ర పోవడంతో ఆఖరవుతుంది...ఈ పద్దెనిమిది గంటల్లోనూ పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తున్న రవి అనుభవించిన మానసిక సంఘర్షణ...ఎన్నో సిద్ధాంత చర్చలూ...ఆ వయసు పిల్లల మధ్య జరిగే ఇంటరాక్షన్... అన్నీ మనకళ్ళముందు కనపడతాయి...తెల్లవారు ఝామున రవిలో మొదలైన ఆలోచనల ప్రవాహం నిరంతరం పరిగెడుతూ 18గంటల పాటు నడిచి చివరికి ఆ రాత్రి అదే గదిలో ముగుస్తుంది.

1965-70ల నాటి ఉస్మానియా విశ్వవిద్యాలయం జీవితంతోపాటు సికింద్రాబాద్, హైదరాబాద్ గల్లీలు, సినిమా టాకీసుల కథాకమామిషు అంతా రచయిత నవలలో అక్షరబద్ధం చేశారు.

ఆంధ్రజ్యోతి వేసిన కమిటీ గత వెయ్యి సంవత్సరాల్లో తెలుగు సాహిత్యంలో వచ్చిన వంద ఉత్తమమైన పుస్తకాలలో ఒకటిగా ఎంపిక చేసిన పుస్తకాల్లో అంపశయ్య కూడా ఉంది.

"Stream of consciousness" అన్న మాట ఎప్పుడైనా విన్నారా? బహుశ దీనికి సమానమైన తెలుగు పదం "ఆలోచనల అంతర్వాహిని" అయి ఉండచ్చేమోనని నేను అనుకొంటున్నాను.ఒక రచనని మనసులో ప్రవహిస్తున్న ఆలోచనల రూపంలో రాయడాన్ని "Stream of consciousness Technique" అంటారు.

ఎప్పుడో 1920ల్లో జేమ్స్ జాయిస్, వర్జీనియావుల్ఫ్ ఈ పద్ధతిలో రాశారట. (నేను ఆ పుస్తకాలు చదవలేదు). నవీన్ కూడా అదే పద్ధతిలో ఈ ప్రయోగం చేసారు. నేను ఈ రోజు ప్రతిలిపి ఇచ్చిన అంశం "నీ వెనక నీడలు" గురించి రాసిన రచన దదాపు అలాంటిదే... మరి ఈ పుస్తకం ఎందుకు చదవాలి?

నవీన్ గారి మాటల్లోనే చెప్పాలంటే "సాహిత్యానికి సాంఘిక ప్రయోజనం వుండితీరాలని నేను

# చదవాల్సిన పుస్తకం

నమ్ముతాను. సాహిత్యం పాఠకుడి చైతన్యపరిధిని విస్తృతం చేయాలి. రచయిత ఎన్ని ప్రయోగాలు చేసినా ఈ ప్రయోజాన్ని సాధించలేకపోతే ఆ ప్రయోగాలన్నీ వ్యర్థమే. సాహిత్యం ముఖ్యంగా నవల – పాఠకుడిలో తనలోకి తాను చూసుకోవాలనే అంతర్దృష్టిని, జిజ్ఞాసను జాగృతం చెయ్యాలి. సాహిత్యం ద్వారా పాఠకుడు మొదలు తానేమిటో తను అర్థం చేసుకొని తననుతాను సంస్కరించుకొని ఉత్తమ మానవుడుగా రూపొందితే విశ్వశ్రేయస్సుకు పునాదులు వేసిన వాడవుతాడు. ఇదే సాహిత్యం యొక్క సాంఘిక ప్రయోజనమనుకుంటాను"

పైన చెప్పిన ప్రయోజనాన్ని సాధించిందీ నవల!

ఈ పుస్తకం నాకెక్కడా అంతర్జాలంలో డిజిటల్ ఫార్మెట్ లో దొరకలేదు. కానీ logili.com నుండీ onlineలొ హార్డ్ కాపీని కొనుక్కోవచ్చు.

మొన్న నేను అంపశయ్య నవలను పరిచయం చేసినప్పుడు, కొందరు కథని కొంచమైనా రాస్తే బాగుంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు...అందు వల్ల ఈ రెండో భాగం రాస్తున్నాను...

ఇది చదివే ముందు నేను రాసిన "పుస్తక పరిచయం-2 (అంపశయ్య)" ని చదవ గలరు.

ఇక అంపశయ్య నవల గురించి... ఇదొక 20 ఏళ్ళ యువకుడి అంతరంగ ఘోష...

60 లలో ఉస్మానియా యూనివర్సిటీ లో పీజీ చెయ్యడానికి వరంగల్ నుంచీ వచ్చి చేరిన ఒక బ్రైట్ స్టూడెంట్ హీరో రవీంద్ర.యూనివర్సిటీ హాస్టల్లో తెల్లవారుజామున మన రవి కన్న కలతో నవల ప్రారంభమవుతుంది. అదేరోజు రాత్రి కలతో పూర్తవుతుంది. ఈ రెండు కలల మధ్య వున్న పద్దెనిమిది గంటల కల కాని కాలం 'అంపశయ్య!

ఎం.ఏ. చదువుకుంటున్న రవి అనే ఇరవై సంవత్సరాల యువకునికి అన్నీ అందీ అందనివిగా వుంటాయి. లైంగికవాంఛ దైహికంగా కంటే అతని ఊహల్లో ఉధృతంగా వుంటుంది...

ప్రేమించే హృదయం పుష్కలంగా వున్నవాడే, కాని అవతలి అమ్మాయి ప్రేమను పొందలేకపోతాడు.తెలివైన విద్యార్థే కాని కష్టించి చదివే తత్త్వం కాదు...ఏ ఉద్యోగమైనా చేయగల సమర్థుడే, కాని చేసేందుకు ఏ ఉద్యోగమూ సమీప భవిష్యత్తులో దొరికే అవకాశం లేదు...

ఇంకా ఉన్నత విద్యాభ్యాసం చేయాలనే తపన వుంది, కాని బీదరికం కారణంగా అది అసాధ్యం....ఫలితంగా ఉత్సాహమూ, నిరాశా బొమ్మా బొరుసులుగా 'టాస్' అవుతుంటాయి.... ద్వైధీభావానికి లోనవుతూ వుంటాడు....

అనుక్షణం తను ఊహించినట్లు జీవించాలనే గాఢవాంఛతో కొట్టుకుపోయే వ్యక్తి. కాని ఆ జీవ ప్రవాహానికి అన్నీ ఆటంకాలే ఏర్పడుతుంటాయి. ఆ ఆటంకాలను అధిగమించటానికి మళ్ళీ ఊహలే శరణ్యమవుతాయి....

రవి ప్రధానంగా బాధ పడుతున్నది అపరాధ భావన (Guilty Consciousness) తో! సన్నకారురైతు అయిన తన తండ్రి కొన్ని యేండ్లుగా తన చదువుకోసం అప్పుచేస్తూనే వున్నాడు. చివరి సంవత్సరం చదువుకు ఊళ్ళో అప్పుపుట్టలేదు. తనవల్ల కాదని తండ్రి చేతులెత్తేసినప్పుడు భార్య పోరుపడలేక ఆవుదూడను అమ్మేస్తాడు. అతని తల్లి మిగిలిన నగలను అమ్మేస్తుంది. "నాన్న మాటలకు భయపడవద్దు... నీ చదువు పూర్తయి పెద్ద ఉద్యోగం దొరికితే ఈ కష్టాలన్నీ క్షణంలో పోతాయి" అంటుంది తల్లి. (ఇదిగో ఇప్పుడే నేను కన్నీళ్ళు ఆపుకోలేక పోయాను)

తండ్రి సంశయభావాన్ని, తల్లి ఆశావాదాన్ని మోసుకొని తిరిగి హైదరాబాదు వచ్చిన రవి వాళ్ళపట్ల తన బాధ్యతను నిలుపుకోలేకపోతాడు. క్రమేణా మిగతా విద్యార్థులు పరిచయం అవుతారు మనకి, రవి ఆలోచనలలోనే!. డబ్బుతో మిడిసి పడే రెడ్డి, అతడి బృందం; వేడి రక్తంతో అభ్యుదయం గురించి మాట్లాడే వేణు; ప్రతినాయక ఛాయల్లో కనిపించే శ్రీశైలం, రంగారెడ్డి; వెధవ బోరింగ్

# చదవాల్సిన పుస్తకం

యూనివర్సిటీ చదువు అయిపోతే అమెరికాకి స్వేచ్ఛగా ఎగిరి పోదామనుకునే డబ్బున్న కిరణ్మయి; రవి గత జీవితంలోని రత్తి....

రవిని నిష్కల్మషంగా, నిజంగా ఇష్టపడిన రత్తి పట్ల రవి ధైర్యం చేయలేక పోతాడు. ఆ పైన రత్తి పట్ల తాను ప్రవర్తించిన తీరు రవిని ఆలోచనల్లో నిరంతరం వెంటాడుతూనే ఉంటుంది. రత్తిని కలలో చూడటంతోనే ఈ నవల మొదలవుతుంది.

అలాగే లెక్చరర్ ఉపేంద్ర బాబు, వేణు, రవి సీనియర్ ఆనందరావు, గుర్నాధం, ఆచారి, అన్నీ జాగ్రత్తగా మలిచిన పాత్రలే! అయితే, ఎవ్వరూ ఈ అంపశయ్యకు అతీతులు కారు. ఎవరి స్థాయిలో వాళ్లకు ఆ శయ్య సిద్ధం!కథ జరిగిన రోజు రవికి హాస్టల్లో తిండి ఉండదు. మెస్స్ బిల్ కట్టడానికి క్రితం రోజే ఆఖరు! మెస్స్ బిల్లు కట్టకపోతే పరీక్ష కూడా రాయనియ్యరు...

ఎలగో కొంత డబ్బు అప్పు చేస్తాడు....కానీ ఆ డబ్బుల్తో తిండి తినకుండా సినిమాకి(స్నేహితులతో కలిసి) వెళ్ళిపోతాడు...సినిమా ఐపోయాక ఆకలి...విపరీతమైన పశ్చాత్తాపం...రెండూ కలిసీ అతనిని హింస పెడతాయి...

సాయింత్రం తనకిష్టమైన లెక్చరర్ ఇంటికెళ్ళీ వాళ్ళిచ్చిన బోర్నవిటా తాగుతాడు...ఆకలి కొంత తీరుతుంది....మనసులో ఎలాగైనా చదవాలన్న ఆశాభావం మొలకెత్తుతుంది...



ఇదే అంపశయ్య కథ! రక రకాల మనస్తత్వాల మధ్య చేతిలో పైసా లేని స్థితిలో రవి జీవితంలో జరిగే కొద్ది గంటల కాలం ఈ నవల.

కానీ ఈ 18 గంటల కథ తాలుకు విశ్వరూపం నవల చదివితే కాని పూర్తిగా గోచరం కాదు! ఈ నవల్లో ఆకలి కేకల నుంచీ అమెరికా వెళ్ళాలని పాట్లు పడే కిరణ్మయి బాధల వరకూ రచయిత స్పృశించారు. యూనివర్సిటీలో, ప్రొఫెసర్లలో ఉండే కులతత్వం, మత తత్వం, యూనివర్సిటీ రాజకీయాలు, విద్యావిధానం రోజు రోజుకు కునారిల్లుతున్న దుర్గతి, ప్రొఫెసర్లు రీడర్ల మధ్య వైషమ్యాలు, విద్యార్థుల సాంఘిక సమస్యలు, వాళ్ళ మనస్తత్వాలు, భవిష్యత్తు గురించిన వాళ్ళ ఆలోచనలు —— ఇవన్నీ ఈ నవలలో కనిపిస్తాయి. చర్చకు వస్తాయి. రవి కానివ్వండి, అతడి మిత్ర బృందంలో మరెవరైనా కానివ్వండి. ప్రతి ఒక్కడూ ఈ అంపశయ్య మీద పవళించి తీరాల్సిందే.

కొన్ని కథలు మనం ఎలా ఉండాలో చెప్తాయి...కొన్ని కథలు ఎలా ఉండ కూడదో చెప్తాయి...


ఈ నవల రెండో రకానికి చెందినది....

ఇదీ స్థూలంగా అంపశయ్య కథ!!

★★★★

## ఆణిముత్యాలు

# " అనుగ్రహం "






ఈదర శ్రీవిద్య

నమ్మకం, అన్నది మనిషి జీవితాన్ని శాసిస్తుంది. అది దైవం మీద కావచ్చు, మతం మీద కావచ్చు కాని ఒక నమ్మకానికి మనిషి లొంగిపోతే అది అతని జీవితాన్ని పూర్తిగా ఆక్రమించుకుంటుంది. మనిషి ఆలోచన, ప్రవర్తన, జీవన పరిణామం ఈ నమ్మకం పైనే ఆధారపడతాయి. ప్రపంచంలో చాలా సంఘటనల వెనుక, మనిషి జీవితంలోని గెలుపు ఓటములు వెనుక అతని నమ్మకం పని చేస్తూ ఉంటుంది. అందుకే మనిషి నమ్మకాన్ని చూరగొన్న ఏ ఆదర్శమైనా అతన్ని ఒక ఆయుధంగా మార్చుకోగలదు. మనిషి పూర్తిగా లొంగిపోయేది ఈ నమ్మకానికే. 'అనుగ్రహం' కథ ద్వారా రచయిత చెప్పాలనుకున్నదీ ఇదే.


# చూడాల్సిన సినిమా

పరశురాం ఒక మధ్యతరగతి బ్రాహ్మణుడు. ఇతని భార్య అనసూయ. పరశురాం ఆర్థికంగా అన్నగారిపై ఆధారపడి జీవిస్తూ ఉంటాడు. తనకంటూ ఏ గౌరవం లేక కుటుంబంలో అవమానాలకు గురి అవుతూ ఉంటాడు. ఊరిలో కూడా అన్న నీడన బ్రతికే తమ్ముడిగా అందరూ అతన్ని చులకనగా చూస్తూ ఉంటారు. కోపంతో జీవితాన్ని అంతం చేసుకుందామని ఒకసారి ఊరు వదిలి సముద్రం వైపుకు వెళతాడు పరశురాం. దారిలో కొందురా అనే స్వామి దర్శనం ఇతనికి కలుగుతుంది. ఒక ఎండిన మూలికను పరశురాంకి ఇచ్చి దాన్ని తిన్న స్త్రీ గర్భాన్ని పోగొట్టుకుంటుందని, అది శక్తివంతమైన మూలిక అని అది పరశురాం జీవితాన్ని మారుస్తుందని చెప్పి అతన్ని తిరిగి ఇంటికి వెళ్ళమని చెబుతాడు కొందురా. ఆ మూలిక సన్యాస ధర్మాన్ని ఆచరిస్తున్న వారికే పని చేస్తుందని అందువలన పరశురాం నిష్ఠగా సంసార సుఖానికి దూరంగా ఉంటూ దైవ ప్రార్థన చేయాలని చెప్పి మాయమవుతాడు కొందురా. ఇంటికి చేరిన పరశురాం తాను దైవాన్ని చూసానని తల్లికీ, భార్యకు చెబుతాడు.

అతనితో అమ్మవారు భార్య రూపంలో వచ్చి మాట్లాడుతూ ఉంటుంది. కొందురా అనుగ్రహం సంపాదించానని ప్రకటించి నిత్యం ధ్యానంలో కూర్చునే పరశురాం, దైవాంశసంభూతుడిగా ఊరిలో గౌరవాన్ని సంపాదిస్తాడు. ఊరి వారికి సలహాలిస్తూ భక్తిలో మునిగితేలుతూ ఎందరో భక్తులను సంపాదించుకుంటాడు అతను.

ఒక సారి అనసూయ ద్వారా అమ్మవారు పరశురాంని ప్రజల పాపాల భారం నుంచి ఊరిని రక్షించమని చెప్పిస్తుంది. అమ్మవారి మాటను తన నమ్మకంతో విశ్లేషించుకునే పరశురాం, అమ్మ తనను ఊరి గుడి బాగు చేయమని అడుగుతుందని అర్థం చేసుకుని గుడి మరమ్మత్తు మొదలెడతాడు. దానికి ఆర్థిక సహాయం కోసం ఊరి జమిందారు భైరవమూర్తిని సంప్రదిస్తాడు. భైరవమూర్తి స్త్రీ లోలుడు. తనకు నచ్చిన ప్రతి స్త్రీని లొంగదీసుకుంటాడు. అతని కామానికి అతని తమ్ముని భార్య కూడా బలి అవుతుంది. భైరవమూర్తి తమ్ముడు అతని భార్య మరణించిన తరువాత వారి బిడ్డ వాసుని భైరవమూర్తి భార్య పెంచుతుంది. వాసుకి ఒక పేదింటి అందమైన అమ్మాయి పార్వతితో వివాహం జరిపిస్తాడు భైరవమూర్తి. పార్వతిని లొంగదీసుకోవాలని భైరవమూర్తి ప్రయత్నిస్తాడు. కాని ధైర్యం తెలివి ఉన్న పార్వతి అతన్ని ఎదిరిస్తుంది. అమాయకుడైన భర్తను భైరవమూర్తి క్రూరత్వం నుండి నిత్యం కాపాడుకుంటూ ఉంటుంది. అతనికి చదువు చెప్పిస్తుంది. పార్వతిని భైరవమూర్తి ఇంట్లో చూసిన పరశురాంకి ఆమె రోజూ కలలోకి వస్తూ ఉంటుంది. ఆమె పట్ల ఒక విధమైన ఆకర్షణ కలుగుతుంది అతనికి. మరో పక్క ఊరిలో పెద్ద స్వామిగా అతన్ని కొలిచే భక్తుల సంఖ్య కూడా పెరుగుతుంది.

మరోసారి భార్య ద్వారా అమ్మవారు పరశురాంకి



కనిపించి ఒక విషబీజం ఊరిలో మొలకెత్తబోతుందని దాన్ని నిర్మూలించమని ఆదేశిస్తుంది. అప్పుడే ఊరివారికి పార్వతి గర్భవతి అని తెలుస్తుంది. అమాయకుడైన వాసు ఆ బిడ్డను తండ్రి కాదని అది భైరవమూర్తి పాపం అని ఊరి వారందరూ చాటుగా మాట్లాడుకుంటూ ఉంటారు. భైరవమూర్తి పార్వతి గర్భంలో ఉంది తన బిడ్డే అని పరశురాంని నమ్మిస్తాడు. అది పాప బీజం అని నమ్మి పరశురాం కొందురా ఇచ్చిన మూలికను పార్వతితో తినిపిస్తాడు. ఆమె గర్భం పోతుంది. ఇది జరిగాక భైరవమూర్తి పరశురాంతో తాను అబద్ధం చెప్పానని పిల్లలు లేని తను, బుద్ధి మాంద్యం గల తమ్ముని కొడుకు పార్వతిని తల్లిని చేయడం తట్టుకోలేక ఆ బిడ్డను గర్భంలోనే హత్య చేయించానని, దానికి పరశురాం నమ్మకాన్ని వాడుకున్నాని చెప్పి పరశురాంని అపహాస్యం చేస్తాడు. తాను చేసిన పాపం అర్థం అయి, అది తట్టుకోలేక పరశురాం తాను స్వామిగా ఉండడానికి తగనని నిర్ణయించుకుంటాడు. అందుకని భార్యతో కలిస్తే తన మహిమలు పోతాయని ఆమెని బలవంతంగా అనుభవిస్తాడు. అప్పటి దాకా భర్త కోసం నిష్ఠగా జీవిస్తున్న అనసూయ తాను భర్త నిష్ఠను భంగాన్ని కలిగించానని తనను తాను దోషిగా నిర్ణయించుకుని తాను చేసిన పాపానికి పరిహారంగా ఆత్మహత్య చేసుకుంటుంది. ఆమె మరణం తరువాత పరశురాం పిచ్చివాడయి ఆమెని పిలుస్తూ కొండల మధ్యకు వెళ్ళిపోతాడు.

సినిమా మొత్తంలో రమణయ్య మాస్టారు ఒక్కరే ఆలోచనతో విజ్ఞతతో కనిపిస్తారు. తాను భగవంతుని అనుగ్రహం పొందానని నమ్మి ఊరివారి ముందు స్వామిగా అవతరించిన పరశురాంని అతను మందలిస్తాడు. భైరవమూర్తి అధికారాన్ని ప్రశ్నిస్తాడు. అందరూ మానవులే అని, దైవశక్తిని



అడ్డుపెట్టుకుని మూఢభక్తిని ప్రదర్శించడం తప్పని అతను ఊరి వారికి చెప్పే ప్రయత్నం చేస్తాడు. కాని ఊరంతా పరశురాం చూపే దైవత్వాన్ని, అతనిలోని దేవుడిని నమ్ముతుంది. పార్వతిని తనకు తెలియకుండానే మోహించిన పరశురాం కూడా అది తన మానవ సహజమైన బలహీనత అని అర్థం చేసుకోడు. పార్వతిలోనే పాపం ఉందని, ఆమెను చరిత్రహీనురాలిగానే చూస్తాడు. అందుకే ఆమె గర్భంలో ఉన్నది పాప బీజం అని నమ్ముతాడు. ఆ నమ్మకాన్ని భైరవమూర్తి పెంచి పోషిస్తాడు. తన స్వార్థాన్ని తీర్చుకుంటాడు. ఈ దైవత్వాన్ని నమ్మకానికి లొంగనిది మాస్టారు, భైరవమూర్తి మాత్రమే. ఒకరు మంచితనంతో ఆలోచనతో నమ్మకాన్ని ఎదిరిస్తే, మరొకరు ఆ నమ్మకాన్ని తన స్వార్థానికి ఉపయోగించుకుంటారు. బలహీన మనస్కుడైన పరశురాం తన నమ్మకానికి బందీ అవుతాడు. విచక్షణ కోల్పోతాడు. చివరకు ఆ కారణంగా భార్య చావుకు, పార్వతి దుఃఖానికి కారణం అవుతాడు. జీవితాన్ని నాశనం చేసుకుంటాడు. ఈ మూఢభక్తి కారణంగా అకారణంగా నలిగిపోయింది కూడా ఇక్కడ స్త్రీలే. పరశురాం తన నమ్మకంతో ఊరిలో మర్యాదను గౌరవాన్ని పొందుతాడు, పూజలు అందుకుంటాడు. దానికి బదులుగా బ్రహచర్యాన్ని ఆనందంగా స్వీకరిస్తాడు. వయసులో ఉన్న అనసూయ తాను సన్యాసినిగా బ్రతకడానికి కష్టపడుతుంది. భర్తకు అన్ని సేవలు చేస్తూ అతనితో శారీరికంగా దూరంగా ఉండడానికి కష్టపడుతుంది. చివరకు భర్త తనను బలవంతంగా అనుభవిస్తే తాను కోరికను జయించలేకపోయానని నిర్ణయించుకుని ఆత్మహత్య చేసుకుంటుంది. మరో పక్క

భైరవమూర్తి భార్య, కోడలు ఇద్దరూ కూడా ఈ నమ్మకం అనే మాయలో పడి నష్టపోయిన వారే. ధైర్యవంతురాలయిన పార్వతికి భైరవమూర్తి ఈ భక్తి, నమ్మకంతోనే గర్భం పోగొట్టుకునే పరిస్థితి కల్పిస్తాడు.

అనసూయ కూడా భర్తతో శారీరకంగా కలవడం పాపం అని పూర్తిగా నమ్ముతుంది. భర్త తనను బలవంత పెడితే ఆ చర్యకు కారణం తానే అని నేరం తన మీద వేసుకుంటుంది. ఒక భక్తుడి మార్గానికి అడ్డు వచ్చానని కుమిలిపోతుంది. సహజంగా చూడవలసిన చర్యను పాపం అని నమ్మి దానికి పరిహారంగా ఆత్మహత్య చేసుకుంటుంది. ఆమె గుడ్డి నమ్మకం, మూఢత్వం ఆమె ప్రాణాలను బలి తీసుకుంటాయి. ఈ సినిమా భక్తిని ప్రశ్నించదు. దైవాంశను ఖండించదు. కాని వీటిపై నమ్మకంతో ప్రజలలో పెరిగే మూఢత్వాన్ని ఎత్తి చూపుతుంది. భక్తి మూఢమైనప్పుడు దాని పర్యవసానం భయంకరంగా ఉంటుంది. భైరవమూర్తి లాంటి వారు ఆ మూఢత్వాన్ని తమకు అనుకూలంగా వాడుకుంటారు. తరతరాలుగా ప్రపంచంలో అన్ని చోట్ల, అన్ని మతాల్లో కూడా, అధికారం కోసం భక్తి అనే మూఢత్వాన్ని తమ ఆయుధంగా మార్చుకున్న రాజకీయ నాయకులు మనకు కనిపిస్తూనే ఉంటారు.

ప్రజల మూఢభక్తి, విశ్వాసం, అధికారుల స్వార్ధం మధ్య ఆలోచన ఉన్న మాస్టారు లాంటి వారు అసహాయులుగా ఏమీ చేయలేక ఒంటరిగా ఉండిపోతారు. జరిగే నష్టాన్ని తెలిసి కూడా ఆపలేనంత నిస్సహాయ స్థితులో ఆలోచించే మనుషులు ఉండిపోవడం మూఢనమ్మకాల పర్యవసానం. అందుకే మూఢత్వానికి ఉన్న శక్తి ముందు ప్రతిసారి ఆలోచన ఓడిపోతూనే ఉంటుంది.

'అనుగ్రహం' సినిమాను అర్ధం చేసుకోవడం కొంత కష్టం. కొందురా పరశురాంకి కనిపించడం అబద్దం అని చెప్పరు దర్శకులు, అలాగే అది నిజం అని కూడా స్పష్టపరచరు. కాని కొందురా కనిపించాడని నమ్మి ఆ నమ్మకాన్ని మూఢభక్తిగా మార్చుకుని, ఆ మూఢత్వాన్ని ప్రజలకు పంచి, చివరకు పరశురాం ఎన్ని జీవితాల వినాశనానికి కారణం అయ్యాడు అన్నదే ఈ కథలోని మూల విషయం. ఇది నమ్మకానికి, హేతువాదానికి మధ్య నడిచిన యుద్ధం కాదు. మూఢనమ్మకం కారణంగా ఛిద్రమైన జీవితాల కథ. తెలుగు సినిమాలో ఇది గొప్ప ప్రయోగాత్మకమైన సినిమా. శ్యాం బెనెగల్ పనితనం ప్రతి సీన్లో కనిపిస్తుంది. నటీనటులందరూ పాత్రలకు జీవం పోసారు. ఎటువంటి వారయినా గాని మనుషులుగా బలహీనతలకు అతీతులు కారు అన్నది ఈ కథలోని ముఖ్య విషయం. నాలుగవ హాంగ్కాంగ్ అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్లో ప్రదర్శనకు ఎన్నికైన భారతీయ చిత్రం ఇది. కొత్త రకం సినిమాను అభిమానించే ప్రేక్షకులు మిస్ కాకూడని చిత్రం 'అనుగ్రహం' నుగ్రహం' 1978లో వచ్చిన తెలుగు అసినిమా. దీన్ని శ్యాం బెనెగల్ హిందీ, తెలుగు భాషలలో ఒకేసారి తీసారు. అందరు నటులు రెండు భాషలలో నటించినా, జమిందారు పాత్ర మాత్రం తెలుగులో రావు గోపాలరావు గారు చేస్తే హిందీలో సత్యదేవ్ దూబే గారు చేసారు. హిందీలో ఈ సినిమా పేరు 'కొందురా'. ఇది చింతామణీ. టీ. ఖానోల్కర్ అనే మరాఠీ రచయిత రాసిన 'కొందురా' అనే నవల ఆధారంగా తీసిన సినిమా. దీనికి స్క్రీన్ ప్లే శ్యాం బెనెగల్, గిరీష్ కర్నాడ్ చేస్తే, మాటలు ఆరుద్ర గారు రాసారు. కే. వెంకట రామ రెడ్డి ఈ సినిమా నిర్మాత. దీనికి సినిమాటోగ్రఫీ చేసింది గోవింద్ నిహలాని. అనంత్ నాగ్, వాణిశ్రీ, స్మితా పాటిల్, అమ్రిష్ పురి, రావు గోపాలరావు ప్రధాన తారాగణం.

★★★

# వినాల్సిన పాట

## ఆ పాత మధురాలు..

## “హైలో...హైలెస్సా...హైలెస్సో...
హైలెస్సా...ఆకాశం వంగింది”



దీకొండ చంద్రకళ



హైలో...హైలెస్సా...
హైలెస్సో... హైలెస్సా...ఆకాశం
వంగింది...అంటూ నది అలల్లో
అలలూగుతూ,సయ్యాటలాడుతూ
వెన్నెల్లో పడవ ప్రయాణం ఎంత
ఆహ్లాదంగా ఉంటుందో,ఈ
పాట వింటూ అనుభూతి
చెందవచ్చు...కె.వి.మహదేవన్
గారి బాణీ మహత్యమిది.
అంత్యప్రాసల ఆత్రేయ
సాహిత్య మాయాజాలమది!
ఎప్పుడు,ఎన్నిసార్లు విన్నా,సావిత్రి,
నాగేశ్వరరావు ల అభినయం
చూసినా
ఆపాతమధురమే ఈ మధురగీతం!

పడవ నడిపే గోపి,కాలేజీలో చదివే
రాధకు పాటల పోటీ కోసం జానపద
గీతం నేర్పించే సన్నివేశంలో
చిత్రీకరించిన గీతమిది. ప్రేమికుల
మూగమనసుల ను
అతి సున్నితంగా, నర్మగర్భంగా
తెలుపుతుంది.ఘంటసాల, సుశీల
గార్ల యుగళం పాటకు జీవం
పోసింది.

నా పాట నీ నోట పలకాల సిలక
నీ బుగ్గలో సిగ్గులొలకాల సిలక

పల్లవితో మొదలవుతుంది.ఇక్కడ
చిలక అని రాధ అంటుంటే ఎహె...
చిలక కాదు... సి...సి...సిలక
అంటూ అచ్చు పల్లెటూరి యువకుడి
యాసతో ఏ.ఎన్. ఆర్.అభినయం
చూసి తీరాల్సిందే!

మొదటి చరణంలో

పాట నువ్ పాడాల
పడవ నే నడపాల
నీటిలో నేను నీ నీడనే సూడాల
నా నీడ సూసి నువ్ కిలకిలా నవ్వాల
పరవళ్ళ,నురగల్ల గోదారి ఉరకాల

అంటూ ఒక జానపద పడుచుజంట
ఎలా పాడుకుంటారో,ఆ యాసలో
వారి మధ్య బంధాన్ని...నీటిలో నీడ
చూసి కిలకిలా నవ్వటం,ఆ నవ్వుకి
గోదారి పరవళ్ళు,నురగల్లతో
ఉరకడం అనే ఉపమానాలతో
అందంగా పోల్చారు
ఆత్రేయ గారు.

రెండవ చరణంలో

కన్నుల్లు కలవాల
ఎన్నెల్లు కాయాల
ఎన్నెలకే మనమంటే కన్ను కుట్టాల(2)
నీ పైట నా పడవ తెరచాప కావాల
ఆ....ఆ...ఆ....ఆ....ఓ....ఓ...ఓ ★
నీ పైట నా పడవ తెరచాప కావాల
నీ సూపె సుక్కానిగా దారి సూపాల(2)

కన్నులు కలిసి వెన్నెల కాయటం,వెన్నెలకే కన్ను కుట్టటం,పైట తెరచాప కావటం,చూపు చుక్కాని కావటం అనే ప్రాసల పోలికలతో ఒకరికొకరుగా జీవితం సాగించాలనే ప్రణయభావనను ఎంతో అందంగా పొందుపరిచారు కవి.

ఇక చివరి చరణాన్ని కాలేజీలో చిత్రీకరించారు కనుక ఒక సందేశాత్మక చరణాన్ని కొసమెరుపుగా జోడించారు మన సు కవి!

మనసున్న మణుషులే మనకు దేవుళ్ళు
మనసు కలిసిననాడే మనకు
తిరునాళ్ళు
సూరేసెంద్రుల తోటి సుక్కల్లతోటి(2)
ఆటాడుకుందాము ఆడనే
ఉందాము(2)

మనసున్న మనుషులే దేవుళ్ళని, మనసు లేని ఈ సమాజం ఒప్పకుంటే,సూర్యచంద్రుల లోకంలో చుక్కలతో ఆటాడుకుందాము, ఆడనే ఉందాము అంటూ ప్రేమికుల ప్రత్యేక లోకాన్ని,అవసరమైతే ప్రాణత్యాగాన్ని ప్రస్తావించారు.

ఇలా చిత్రకథను పాటల్లో ప్రస్తావించడం, చివరిలో ఓ సందేశాన్ని జోడించడం ఈ తరం పాటల్లో అరుదు.అందుకే అవి పాత మధురాలైనా ఆపాతమధురాలైనాయి మరి.

హిందీలో ఆనంద్ బక్షీ గారి సాహిత్యానికి లక్ష్మీకాంత్–ప్యారేలాల్ జంట సంగీతాన్ని అందించారు.ఈ పాట కూడా ముఖేష్,లత గారి గళాల్లో మాధుర్యాన్ని ఒలికిస్తుంది.

---

Hmm Hmm Hmm Hmm Hmm Hmm Hmm.............

Sawan Ka Mahina, Pawan Kare Sor

Sawan Ka Mahina, Pawan Kare Shor

Amm Hmm, Pawan Kare Sor, Pawan Kare Shor

Arey Baba Shor Nahin, Sor, Sor, Sor

Pawan Kare Sor, Haan......


Jiyara Re Jhume Aise, Jaise Banama Naache Mor



# అశ్వత్థామ బతికే ఉన్నాడా ?

## క్రాస్ రోడ్ కబుర్లు

జి .అనుదీప్




ఈ మధ్య ప్రధాన మంత్రి స్థాయి వ్యక్తిమహాత్మ గాంధి గారి గురించి విచిత్రమైన వ్యాఖ్యానాలు చెయ్యటంలో దేశ ప్రజలందరూ అవక్కాయ అయ్యారు. ఆ వాఖ్యాల సారాంశం ఏమిటంటే, "1962 లో రిచర్డ్ ఆటన్బరో తీసిన గాంధీ చిత్రం విడుదలయిన తరువాతే గాంధీ గురించి ప్రపంచానికి తెలిసిందని'.

ఈ వాఖ్యల మీద ఇటీవల లోక్ సభలో పెద్ద ఎత్తున దుమారం చెలరేగింది. మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండెలా, అల్బర్ట్ ఇన్స్టీన్ వంటి ఎంతో మంది ప్రపంచస్థాయి నాయకులు, మేధావులకు స్ఫూర్తి నిచ్చిన గాంధీ గారి గురించి ఇలా వ్యాఖ్యానించటం సబబు కాదని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ

## విమర్శించారు

సరే కాసేపు రాజకీయాలు పక్కన పెడితే, ఈ తరానికి నిజంగా గాంధీ తెలుసా అని అనుమానం వస్తోంది అసలు గాంధీ నే కాదు, స్వాతంత్యసంగ్రామం గురించి , అందులో ప్రాణాలు కోల్పోయిన అమర వీరుల గురించి కాని వీళ్ళుకు తెలియదు. ఇక రామాయణ. మహా భారతాల గురించి ఎంత తక్కువ మాట్లాడు కుంటే అంత నయం. ఈ తరం కాలేజీ కుర్రాడిని పాండవుల పేర్లు చెప్ప మంటే చెప్పు లేక తెల్లమొఖాలేస్తున్నారు. దీనికి వాళ్ళని నిందించి ఏం ప్రయోజనం లేదు. నేటి విద్య వ్యవస్థ అలా తయారయ్యింది. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలలో తాతయ్య. నాయనమ్మ ఎవరో ఒకళ్ళు మన సంస్కృతి, సంప్రదాయల గురించి, రామాయణ, మహా భారత గాథలు చక్కగా చెప్పే వెళ్ళు. కాని నేడు ఉమ్మడి కుటుంబాలు లేవు, వున్న తల్లిదండ్రుల్లకు పిల్లల్ని దగ్గర కూర్చో పెట్టుకుని చెప్పే ఓపికలేదు. ఎంత సేపటికి చేతిలో చెరవాణి,అంతరజాలం లో తలదూర్చి ఏదో ఎడతెగని వెతుకులాట. దేనికోసం వెతుకు తున్నారో వాళ్ళకే తెలియదు. వెతికి వెతికి అలసి పోయి నిద్రలోకి జారుతున్నారు.

ఈ మధ్య కుర్రాళ్ళందరూ ‘అశ్వత్థామ “ గురించి వివరాల కోసం అంతర్జాలంలో తెగ వెతుకు తున్నారట. పాండవుల పేర్లే తెలియని వీళ్ళకి అశ్వ త్థామ తో ఏమి పని అని మీకు అని పించ వచ్చు. దీనికి సమాధానం ఇటీవల విడుదలైన ‘కల్కి’ సినిమా. కల్కి సినిమా మొత్తం అశ్వత్థామ చుట్టానే తిరుగుతుంది. ఈ ప్రపంచంతో



ఏడుగురు మాత్రమే చిరంజీవులుగా ఇంకా బతికే వున్నారట, అశ్వత్థామ, బలి, హనుమంతుడు, విభీషనుడు, కృపుడు, పరుశురాముడు, వ్యాసుడు మొన్నగు వారు. 5000 సంవత్సరాలుగా చిరంజీవిగా ఇంకా బ్రతికే వున్న అశ్వత్థామ ప్రధాన పాత్రగా కల్కి చిత్రం రూపొంది చారు. ‘సందర్భాను సారంగా అర్జునుడు, కర్ణుడు వంటి పాత్రల లో ప్రముఖనటులు కనిపిస్తారు. ఈ చిత్రం చూసిన కుర్రకారు అసలు.. అశ్వత్థామ ఎవరు అని అంతర్జాలంలో తెగ వెతుకుతుంటే నవ్వుకోకుండా వుండ లేకపోయాను.

నాకిప్పటికీ గుర్తు, ఎనిమిదో తరగతి తెలుగు వాచకంలో భీష్ముడి గురించి మాకు పాఠం వుండేది. ఆ పాఠం చదివి నప్పుడు ఆయన వ్యక్తిత్వం, ప్రతిజ్ఞా పాలన వంటివి నా మనసులో చిరస్థాయిగా నిలిచి పోయాయి. ఇప్పుడు అటువంటి పాఠాలు మచ్చుకైనా మనకి కనపడవు.పై పెచ్చు ఇటీవల ఒక పాఠశాల యాజమాన్యం వాళ్ళు. ఒక సినీ నటి గురించి పాఠాన్ని సిలబసిలో పొందు పరచటం పెద్ద వివాదానికి తెరలేపింది.

ఏది ఏమైనా నేటి అంతర్జాల యుగంలో పుస్తక పఠనం పూర్తిగా తగ్గిపోయి, ప్రతిచిన్న విషయానికి సామాజిక మాధ్యమాల మీద , అంతర్జాల అనువర్తనాల మీద ఆధారపడంతో యువతకు మన చరిత్ర. సంస్కృతి తెలియ రాకుంది. చలన చిత్రాల లో చూపించి అవాస్త వాల్లనే వాస్త వాలని నమ్ముతున్నారు. అంతుకు. ఉదాహరణే ఇటీవల విడుదలైన “ఆదిపురుష్”. అందులో రావణ బ్రహ్మ పాత్రను చిత్రీకరించిన విధానం అత్యంత వివాదాస్పదమయ్యింది. సకల విద్యా పారంగతుడైన లంకేశ్వరుడిని పిశాచాల రాజుగా తెరపైన చూపించటం ఆ చిత్ర దర్శ

# కబుర్లు ...ఉత్తినే

కుడి భావ దరిద్రానికి నిదర్శనం.

కల్కి అనే సినిమా వల్ల చాలామంది యువతలో కూడా చిన్నపిల్లల కూడా పౌరాణికాల మీద పురాణాల మీద చర్చ చేస్తున్నారు అది చాలా హర్షించదగిన పరిణామం. కల్కి సినిమా విడుదలైన తరువాత మహభారతం గురించి యువతలో చర్చ రేగుతోంది. కర్ణుడు. శ్రీకృష్ణుడు, అర్జునుడు గుర్తించి తెలుసుకో వాలని చర్చ నడుస్తోంది. గూగుల్ లో టాప్ ట్యాగ్ ట్రెండ్ గా నడుస్తోంది .వీరికి గనుక , ఆపురాణ పురుషుల పుట్టు పుర్వోత్తరాల గురించి, వ్యక్తిత్వం గురించి వివర్ణించకపోతే కర్ణుడు అంటే ప్రభాస్ , అర్జునుడంటే విజయ దేవర కొండ అనుకునే ప్రమాదం లేక పోలేదు, ఆయా పాత్రుల స్వాభావాన్ని మరచి, మాహీరో గొప్ప అంటే, మా హీరో గొప్ప అని తన్నుకు చచ్చే అవకాశమూ లేక పోలేదు .

ఎవరు గొప్ప అన్న విషయం పక్కన పెడితే ఈ చర్చ వల్ల చాలా విషయాలు బయటపడతాయి కొత్త కొత్త క్రియేట్ మేమ్స్ కూడా పెడుతున్నారు అవి చూసినప్పుడు మన సంస్కృతి పురాణాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకుంటున్నరు అన్న ఆనందం కలిగింది.

కానీ మన తెలుగు సినిమాలు పాత సినిమాలు చూసి అవే నిజమని అనుకోవద్దు చాలా విషయాల్లో మన తెలుగు సినిమాలు ఆఖరికి మన పౌరాణికాలం మనకి అందించి మనందరికీ ఆసక్తి కల్పించిన విశ్వవిఖ్యాత నటసార్వభౌమ రామారావు గారు కూడా చాలా కథలు కల్పించారు కాబట్టి అందులో ఎంతవరకు నిజం ఉందో అన్న విషయంలో ఆలోచించుకోండి సినిమా లిబర్టీ అన్న విషయంలో చాలామంది ఒక అడుగు ముందుకే వేశారు కర్ణుడు సినిమాలో కర్ణుడిని చాలా గొప్పగా చూస్తే ప్రయత్నంలో కొన్ని కల్పితాలు కలిపారు. కొన్ని నిజాలు చాలా దాచారు.

అసలైన వాల్మీకి రామాయణంలో లక్ష్మణుడు గీత గీయలేదు.. శబరి నేరేడు పండ్లు పెట్టలేదు. బాణం రావణాసుడు కడుపుకి తగల్లేదు. ఇవన్నీ కల్పితాలు ఇవే కాదు ఇంకా చాలా ఉన్నాయి కానీ ఇలాంటి సీన్లు లేని ఒక్క రామాయణం కూడా మన తెలుగులో లేదు అంటే అతిశయోక్తి కాదు... ఇదే కాదు రాముడు యుద్ధం కోసం ముహూర్తం పెట్టమని రావణుడి దగ్గరికి వెళ్లినట్టు కూడా ఒక సినిమాలో రామారావు గారు చూపించారు అది కూడా కల్పితమే అంటే ఏదో ఒక రామాయణం ఉండొచ్చు. అసలు ఈ సినిమా రామాయణం లో లేదు. ఇది అంతా రంగనాథ రామాయణం అని ఒకదాన్ని బేస్ చేసుకుని తీశారు దానివల్ల చాలా ఎక్కువగా ఇలాంటి కల్పితాలు కలిసాయి ఇవేమీ తప్పు అని చెప్పను కానీ మనం నిజానిజాలు తెలుసుకోవడం చాలా ముఖ్యం అంటున్న.....

కర్ణుడు చాలాసార్లు ఓటమి చెందాడు అని తప్పేం కాదు కానీ దాన్ని ఎక్కడా చూపించలేదు. ఇది కూడా లేదు...

కానీ అసలు మహాభారతంలో లేని ఒక సీనుని తన సృజనాత్మక తో కథ రాసుకోవడం అనేది కొంతవరకు మనం చూడొచ్చు కూడా.. మాయాబజార్ అంటే శశిరేఖా పరిణయం అది మహాభారతం లేదు కాబట్టి సొంతంగా రాస్తున్నారు తప్పులేదు కానీ ఉన్న వాటిని మార్చకూడదు.ఒకప్పుడు చలన చిత్రాలలో కథకు తగట్టు, ఆయా పాత్రలకు తగ్గట్టు నటీనటుల పరిధిని నిర్ణయించే వాళ్ళు. అందుకు చక్కని ఉదాహరణ 'మాయాబజారు" సినిమా. నిజానికి మాయా బజారు సినిమా కల్పిత కథతో తీసినా, ఎక్కడా మహా భారతం యొక్క స్థాయిని, అందులోని పాత్రల ఔచిత్యాన్ని ఎక్కడా చెడగొట్టింది లేదు . అప్పటికె చలన చిత్ర రంగంలో తారా స్థాయిల్లోవున్న ఎన్ టి ,ఆర్, అక్కినేని, ఎస్వి ఆర్ తదితరులు భేషజాలకు పోకుండా తమ తమ పాత్రలలో ఒదిగి పోయారు కాబట్టే ఆ చిత్రం నేటికి అణిముత్యంలా అనిపిస్తుంది.

అసలు కృష్ణుడి పాత్రకే పనికి రాడన్న అన్న ఎన్టీఆర్. ఆ పాత్రల్ని ఎంతో నియమ నిష్టలతో నిబద్ధతతో పోషించి, చివరకు కృష్ణుడు అంటే ఎన్టీ రామారావే అని అనిపించుకు న్నాడు. ఇప్పటికి కొన్ని పల్లెటూళ్ళలో ఎన్ టి ఆర్ కృష్ణుడి ఫోటోలకు పూజలు చేస్తు న్నారంటే, ఆయన ఆ పాత్రలో ఎంతగా ఒదిగి పోయారో

అర్థం అవుతుంది. రోజులు మారాయి. పాత్రలను బట్టి హీరోల కాలం నుండి హీరోలను బట్టి పాత్రలును సృష్టించే కాలానికి వచ్చాము. అంతదాకా ఎందుకు హీరోలను బట్టి దేవుళ్ళకు కూడా ప్రచారం వస్తోందంటే , దేవుడి కన్నా నేటి హీరోలే ఎక్కువ అనే భావన నేటి తరంలో వస్తోంది. ఇటీవల ఒక టాప్ హీరో అమ్మవారి వ్రతంలో నిమగ్న మవ్వగానే, ఆ అమ్మ వారి గురించి నెటి జన్లు ఆరా తీయటం మొదలు పెట్టారు . పెద్దగా ప్రచారానికి నోచుకోని ఆ అమ్మవారికి ఇప్పుడు భక్తులు తెగపెరిగి పోతున్నారు. అంతా కాల మహిమ అను కోవాలా ? లేక హీరోల మహిమ అనాలో? ఇకపై దేవుళు కూడా తమ ప్రచారం కోసం హీరోలు, దర్శకుల ఇళ్ళ ముందు క్యూ కడతారేమో?

★★★







# పరుగులు తీసే నీ వయసునకు ..!



యలమర్తి అనూరాధ

బ్రాహ్మలు,వైశ్యులు మాంసాహారం తినరు,మిగిలిన వాళ్ళు అది లేకుండా రోజు కదలదు.ఒకప్పుడు ఇదే పెద్ద సమస్యగా ఉండేది. అలాంటి జంటని ఒక్కసారి ఊహించుకోండి కాపురం ఎలా తయారవుతుందో ఒకరికి ఒకరు సర్దుకుపోలేని పరిస్థితులలో.

కానీ ఇప్పుడు కులాలు , మతాలు లేవు.అందరూ మాంసాహారం తీసుకునెవాళ్ళే.ఎక్కడో ఒక్కరిద్దరు తప్ప.అందుకే సడలింపులకు అవకాశాలు ఎక్కువ.ఇక ఆచారాలు విషయం వచ్చినపుడు ఇద్దరి సాంప్రదాయాలను పెళ్ళిలో అవలంబిస్తున్నారు.ఒక పద్ధతి అయ్యాక మరో పద్ధతిలో, ఎక్కడా ఏ దెబ్బలాటలు రాకుండా ముందుగానే అటు ప్రక్కవారు ఇటు ప్రక్కవారు మాట్లాడుకొని చక్కటి ప్రణాళిక రూపొందించుకొని మరీ వివాహమాడుతున్నారు.

# యూత్ సీరియల్

## జరిగిన కథ

ధృతి ఇంజనీరింగ్ కాలేజిలో చేరుతుంది.కాలేజిలో తన మొదటి రోజు అనుభవాలాను తన తల్లి, అన్నలతో పంచుకుంటుంది ధృతి. కాలేజిలో ధృతి కి ప్రవాహ పరిచయం అవుతుంది.పక్కింటి ప్రభాకర్ కూతురు సరసు కనిపించకుండా పోతుంది. సరసు ఒక ఆటో డ్రైవర్ తొ వెళ్లిందని తెలిసి ప్రభాకర్ దంపతులు బాధపడతారు . తిరిగి వచ్చిన సరసును ఆమె బావ బర్గవ్ కిచ్చి పెల్లిచేస్తారు . ధృతి కి సామ్రాట్ , కృపాల్ , బాంధవ్ స్నేహితులవుతారు . వారి ఆరుగురి స్నేహం మరింత బలపడుతుంది . పని మనిషి గంగ లంకేబిందలు కోసం ఒ స్వామిజిని ఆశ్రయిస్తుంది . ప్రవాహ , అనన్య పబ్బుకు వెళతారు . ఆ అలవాటు మనుకోమని సలహా ఇస్తుంది ధృతి.ధృతి చిన్నాన్న కూతురు హర్షిత ప్రేమ వివాహం చేసుకుంటుంది .కాని కట్నంకోసం వేధించటం తో ఇంటికి తిరిగి వచ్చేస్తుంది . ధృతి కృపాల్ కి మరింత దగ్గరవుతుంది .కాలేజిలో అందరు కలసి బొంబాయి టూర్ కి వెళ్లి వస్తారు . ధృతికి సంబంధాలు చూడటం ప్రారంభించాడు ధర్మతేజ. **ఇక చదవండి**

కాబట్టిసంస్కృతి, సంప్రదాయల గురించి, రామాయణ, మహా భారత గాథలు చక్కగా చెప్పే వెళ్ళు. కాని నేడు ఉ ఉమ్మడి కుటుంబాలు లేవు, వున్న తల్లిదండ్రుల్లకు పిల్లల్ని దగ్గర కూర్చో పెట్టుకుని చెప్పే ఓపికలేదు. ఎంత సేపటికి చేతిలో చెరవాణిశ్రీ,అంతరాలం లో తలదూర్చి ఏదో ఎడతెగని వెతుకులాట దేనికోసం వెతుకు తున్నారో వాళ్ళకే తెలియదు. వెతికి వెతికి 6లసి పోయి నిద్ర లోకి జారుతున్నారు.

ఈ మధ్య కుర్రాజేందరూ 'అశ్వత్థామ " గురించి వివరాల కోసం అంతర్జాలంలో తెగ వెతుకు దున్నారట. పాండవుల పేర్లే తెలియని వీళ్ళకి అశ్వ త్థామ తో ఏమి పని అని మీకు అని పించ వచ్చు. దీనికి సమాధానం ఇటీవల విడుదలైన 'కల్కి' సినిమా. కల్కి సినిమా మొత్తం అశ్వత్థామ చుట్టూనే తిరుగుతుంది. ఈ ప్రపంచంతో ఏడుగురు మాత్రమే . చిరంజీవులుగా ఇంకా బరిదే వున్నారట, అశ్వత్థామ, బలి, హనుమంతుడు, విభీషనుడు, కృప్పుడు, పరుశురాముడు, వ్యాసుడు మొన్నగు వార్లు. 5000 సంవత్సరాలుగా చిరంజీవిగా ఇంకా బ్రతికే వున్న అశ్వత్థామ ప్రధాన పాత్రగా కల్కి చిత్రం రూపొందించారు. క్ను 'సందర్భాను సారంగా అర్జునుడు, కర్ణుడు వంటి పాతం లో ప్రముఖనములు నని పిస్తారు. ఈ చిత్రం చూసిన కుర్రకారు అనలు.. అశ్వత్థామ ఎవరు అని అంతర్జాలంలో తెగ వెతుకు తుం'ది నవ్వుకోకుండా వుండ లేక పోయాను. వివాహాలకు ఓటెయ్యాలా వద్దా అన్నది యువతరానికే వదిలేద్దాం.మంచి చెడు చెప్పటం వరకే మన కర్తవ్యం. ఆలోచన వారిదే.అగచాట్లు వారివే. ఆనందమూ వారిదే.కాకపోతే మంచిగా ఉంటే ఆనందించే వారిలో తల్లితండ్రులు ముందుంటారు. వాళ్ళ పరువు పోయినా కూడా!

అసలు ఈ యువతరం పరువును పూచికపుల్లలా తీసేస్తున్నారు. బంధువులను కూడా.మనకి కష్టం వస్తే ఒక్కరు మన ప్రక్కన ఉండరు. నాలుగు మాటలు అనేవారే తప్ప. ఇలాంటి వాళ్ళకోసం మా ప్రేమలు దూరం చేసుకోవాలా అన్నది వారి ప్రశ్న.

ఆచారాలలో పుట్టి పెరిగిన వారు తెగతెంపులకు సిద్ధంగా ఉంటారు.అయినవాళ్ళు ,సొంత చెల్లెళ్ళు,బావగార్లు ఈ ప్రేమ వివాహం వల్ల దూరమైతే ఆ తల్లితండ్రులకు ఎంత బాధగా ఉంటుంది?అయినా దాని గురించి ఆలోచించరు.అప్పటి దాకా

# యూత్ సీరియల్

తమలో కలుపుకున్న వాళ్ళు ఒక్కసారి విడగొట్టేస్తే తల తీసేసినట్లుంటుంది వాళ్లకు.

శుభకార్యాలకు పిలుపులుండవు. ఎవరైనా చనిపోయినా ఆ వార్త అందదు.వాళ్ళు సొంత వాళ్ళయినా. అపుడు వాళ్ళ మనసులు ఎంత క్షోభిస్తాయి? అది పిల్లలు పట్టించుకోరు.వాళ్ళ లెక్కలో ఇదంతా ట్రాష్.ఓ చెత్త మన భాషలో. అంతే.

కానీ ధృతి , కృపాల్ వారి వైపునుంచి ఇదంతా ఆలోచించారు. ధృతి స్వయంగా కళ్ళతో చూసింది. అందుకే ఆ అవస్థ తన తల్లితండ్రులకి కల్పించకూడదనుకుంది.కృపాల్ కూడా సహకరించాడు.అదే జరగకుంటే ఆ ఇంట్లో కనిపించని అల్లకల్లోలం ,భూకంపం సృష్టింపబడేది.

ఆ ఉపద్రవం నుంచి కాపాడింది వీళ్ళిద్దరే.వాళ్ళు విడిపోయినా , తమ వల్ల కొందరికి మంచి జరుగుతుందంటే బాధను ఎంతైనా అనుభవించటానికి ముందుంటారు కొందరు.అలాంటి వాళ్ళే ధృతి , కృపాల్.అలాంటి వారికి భగవంతుడు ఎపుడు అన్యాయం చెయ్యడు. అందుకే ధృతి కి మొదటి సంబంధమే కుదిరిపోయింది.

బంగారంలాంటి పిల్లాడు అని అందరు మెచ్చుకున్నవారే. పిల్ల సుఖపడుతుందని అందరూ ఆశీర్వదించిన వాళ్ళే.

సాంప్రదాయం ఎంత పాటించారంటే నిశ్చయ తాంబూలాల రోజు ఇద్దరినీ అందరూ విడివిడిగానే ఆశీర్వదించారు పెళ్ళి అవ్వలేదని.పెళ్ళి అయ్యాకే ఒకచోటికి చేర్చటం అనేది మన సనాతన సాంప్రదాయం.

ఈ కాలంలో ఇలా చేసేవారు ఎవరు?

నిశ్చయతాంబూలాలు పెళ్ళికంటే గొప్పగా చేస్తున్నారు. అప్పుడు కూడా జంటగానే కూర్చోపెడుతున్నారు. ఆశీర్వచనాలూ జంటగానే. రోజురోజుకీ సాంప్రదాయాలు ఆనవాలు లేకుండా పోతున్నాయి.

మన భారతదేశానికి ప్రపంచమంతా విలువ ఇచ్చేది ఈ మన సాంప్రదాయాలకూ , విలువలకే.

వాటిని ఈతరం వాళ్ళు దూరం పెడుతున్నారు. విదేశీ సంస్కృతులను అవలంబిస్తున్నారు.దానినుంచి ఎంత తొందరగా బయటపడితే మనకంత ఉత్తమం.

లేదంటే చక్కగా శుభమా అంటూ పెళ్ళి చేసుకుంటుంటే బురదలో మునుగుతూ,స్మశానాల్లో చచ్చిన శవాల్లా పడి ఫోటోషూట్ పెళ్ళికి ముందే చేసుకునే దౌర్భాగ్యాలు ఏమిటి?ఇకముందు ఇంకెన్ని చూడాల్సివస్తుందో.ఒక్కసారి ఈ విషయంలో యువతరం మనసుపెట్టి ఆలోచిస్తే బాగుంటుంది. ఎందుకంటే ఆలోచనల్లో ,మేధోసంపత్తులో ఈ నాటికీ మన యువతరం ముందే ఉంది అంతెందుకు, విదేశీయులు ఎంత ఘనత సంపాదించినా అందులో మన భారతీయుడు ఉండాల్సిందే.మరి ఆ ఘనత మనది కాదా?

ఆలోచనల వెల్లువలో కొట్టుకుపోతున్న కృపాల్ సామ్రాట్ భుజం కుదపటంతో ఈ లోకంలోకి వచ్చాడు.

అంతవరకు తనను ప్రక్కన పెట్టి పెద్దల వైపు నుంచి ఆలోచించిన అతను ఒక్కసారి వాస్తవంలోకి వచ్చాడు.

"ధృతికి నిశ్చితార్ధమైపోయిందిగా, మరి నీ సంగతి ఏమిటిరా కృపా" అన్నాడు సామ్రాట్.

" ఓ రెండేళ్ళు దాకా పెళ్ళి జోలికి వెళ్ళాలని లేదురా"

" పోనీ ఆ తర్వాతైనా చేసుకుంటావా?"

"చూద్దాం"

"అలా కాదు చెప్పరా"

"నువ్వనుకున్నట్లు ఏమీ లేదు లేరా. మా మధ్య స్నేహభావమే ఎక్కువ. అది చివరి దాకా కొనసాగిస్తాం. జీవితంలో అన్నీ మనమనుకున్నట్లు జరగవుగా".

"కానీ మీరిద్దరూ పట్టుబడితే మీ వివాహం తప్పక అయ్యేది"

"అవును, అది మా ఇద్దరికీ తెలుసు.కానీ వాళ్ళకి మాకూ నక్కకీ, నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. వదిలేయ్, ఇపుడు అటువంటి ఆలోచనలు చెయ్యటం కూడా మంచిది కాదు" అన్నాడు కృపాల్.

ఆ మాటతో సామ్రాట్ ఇక ఏమీ మాట్లాడలేకపోయాడు.

వాడి హృదయంలో ఎన్ని అగ్నిగోళాలు బద్దలవుతున్నాయో మనసులోకి తొంగిచూడగల తనకే తెలుసు.కానీ ఏమి చెయ్యలేని పరిస్థితి.ధృతి అమ్మానాన్నలకే విలువ ఇస్తానని ఈ విషయంలో స్పష్టంగా చెప్పేసింది.

ఇక కాలమే వాడి బాధకు

స్వాంతన పూత పుయ్యాలి అని ఓదార్పుగా మరోసారి కృపాల్ భుజం తట్టి వెళ్ళిపోయాడు సామ్రాట్.

ఈ విషయంలో తేల్చుకోవటానికే అతను వాళ్ళింటికి ఒకరోజు ఆలస్యంగా వెళ్ళాలని ఆలోచించుకుని ఆగిపోయాడు. ఎంతైనా ప్రాణ స్నేహితుడు కదా .

★ ★ ★

"హలో !" ఫోన్ రింగవుతూ ఉండటంతో ఎత్తింది మధురిమ.

"హలో !"అవతలి నుంచీ

"ఎవరు?" అర్థం కాక అడిగింది.

"గౌరీ నే,మధువేనా ? "

"అబ్బా!ఎన్నాళ్ళకే ! ఎపుడో కలిసాం.నా నంబరు ఎలా తెలిసింది? "

"ఈ మధ్య మాటల్లో మా అబ్బాయి స్నేహితుడు మీ అమ్మాయి ధృతి గురించి చెప్పాడు.ఎపుడూ అమ్మనాన్నల గురించే మాట్లాడుతుంది అని. ఆ రోజు నా అదృష్టం బాగుండి వాళ్ళ అమ్మ పేరు ఏమిటి అని అడిగా.మధురిమ అన్నాడు.అంతే నా పోయిన ప్రాణం లేచి వచ్చినంత పనయింది. నువ్వేనేమో అని అనుమానం వచ్చింది.అంతే అతని ద్వారానే నీ నంబరు పట్టుకున్నాను"

" చిన్ననాటి స్నేహితులం.ఈ సెల్ లు పాడైపోతూ ఉండటం,మళ్ళీ పాతవి అందులో తెలియక చేర్చలేకపోవటం,ఇది వరకులా ఓ పుస్తకంలో రాసుకోకపోవటం, దూరమవ్వటానికి సవాలక్ష కారణాలు.పోనీలేవే ,నువ్వన్నా గుర్తుంచుకొని సాధించావు.చాలా సంతోషంగా ఉంది."

"మా నాన్నగారికి బదిలీల ఉద్యోగం కూడా కావటం ఒక కారణం.ఈ రోజు నిజాంపేట విలేజ్ లో మా చుట్టాలింట్లో ఉన్నాను.వస్తావా? సాయంత్రం దాకా కబుర్లు చెప్పుకోవచ్చు"

"తప్పకుండా వస్తానే "

" సరే ! ఎదురు చూస్తూ ఉంటాను ఇప్పటి నుంచే "

" రూట్ మ్యాప్,అడ్రస్సు పెట్టు, తొందరగానే బయలు దేరుతాలే. అయినా నువ్వే మా ఇంటికి రావొచ్చుగా"

" లేదే, ఓ పెళ్ళికోసం వచ్చాను, ఇక్కడ మా బంధువులందరు ఉన్నారు.వస్తే బాగుండదు.అసలు కలిసాంగా మళ్ళీసారి వచ్చినపుడు తప్పక వస్తాను."

"సరే ! అలాగేలే " అని ఫోను పెట్టేసింది.

"ఎవరమ్మా ? అంత ఆనందంగా మాట్లాడుతున్నావ్ వెనుకనుంచి అంది ధృతి.

గౌరి అని,మేము ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి దాకా కలిసి చదువుకున్నాం.ఆ రోజులు ఎంత బాగుండేవో?అగ్గి పెట్టెల్లో తాయిలాలు పెట్టుకొని వెళ్ళేవాళ్ళం. అవి కాసిన్నే అయినా అందరం పంచుకొనేవాళ్ళం.బయట తిండ్లు దొరికినా కొనుక్కునే వాళ్ళం కాదు. డబ్బులు ఇచ్చే అలవాటు కూడా చేసేవారు కాదు అమ్మా నాన్నలు.. ఏది కావాలన్నా ఇంట్లోనే చేసి పెట్టేవారు.

"అవునా !" తల్లిలో అంత సంతోషాన్ని ముందెన్నడూ గమనించలేదు.

"ఊ! ఈ రోజు ఇద్దరం కలుస్తున్నాం "

" సరే అమ్మా ! తయారై వెళ్ళు. ఇంట్లో పనులు మేము చూసుకుంటాం లే "

"ఆం ! నాన్నకి ఓ మాట చెప్పేసి బయలుదేరుతా.అదుగో అది దాని ఇంటి చిరునామా కూడా పెట్టినట్లుంది"అపుడే సెల్ లో మెసేజ్ వచ్చినట్లు మ్రోగిన ట్రింగ్ శబ్దం విని.

★ ★ ★ ★

ఆటో దిగగానే గుమ్మంలో ఎదురు చూస్తున్న గౌరీ

" మధూ ! వచ్చావా !" అంటూ ఆప్యాయంగా ఎదురువచ్చి కౌగిలించుకుంది.

"ఆం ! నేనైతే ఇపుడు వచ్చాను,నా మనసు మాత్రం నువ్వు ఫోను చేసినప్పటినుంచీ నీ చుట్టూనే తిరుగుతోంది."

మంచినీళ్ళు ఇచ్చి అక్కడ ఉన్న అందరినీ పరిచయం చేసింది. అందరూ ఎంతో ఆత్మీయంగా పలకరించారు.అతిథి మర్యాదలు చేసారు. ఆ తర్వాత ముచ్చట్లు మొదలు పెట్టారు.చిన్ననాటి సంగతులన్నీ మురిపెంగా వెళ్ళబోసుకున్నారు.

కాసేపయ్యాక 'ఇక్కడకు దగ్గర్లోనే ఆంజనేయ స్వామి గుడి ఉంది వెళదామా ?' అంది గౌరి.

ఎక్కడకు వెళ్ళినా అక్కడి విశేషాలు చూడటం అంటే మధురిమకిష్టం. అందుకే వెంటనే అంగీకరించింది.

ఆ రోజు మంగళవారమేమో హనుమంతుడు తమలపాకులతో పూర్తిగా అలంకరించబడ్డాడు.ఆకు పూజ చేయించారు ఆయనకు ఇష్టం కదా అని.

ఆ గుడి ఎంతో ప్రశాంతంగా

ఉంది లోపల.

ధ్వజ స్తంభం దగ్గర దీపాలు వెలిగించారు.దర్శనం అయ్యాక అక్కడే కుర్చున్నారు కాసేపు.

వచ్చేవాళ్ళు వెళ్ళేవాళ్ళతో గుడి కళకళలాడుతుంది.ఏమిటో జీవితంలో అనుకోని ఆనందాలు ఇలా అపుడప్పుడూ ఎదురవుతుంటాయి అనుకున్నారు ఇద్దరూ ఒకేసారి మనసులో.

" ఇంతకీ నీ సంసారం ఎలా ఉంది ?"

" అంతా బాగుందే.కానీ పిల్లలే ఎపుడూ స్నేహితులు,స్నేహితులు అని వాళ్ళతోనే కాలక్షేపం చేస్తారు.వాళ్ళే లోకంలా పెంచిన మనం వాళ్ళని అలా చూస్తూ ఉండటమే.మనకోసం వెచ్చించే సమయం వాళ్ళ దైనందిన కార్యక్రమంలో ఎక్కడా కనిపించదు. పోనీలే, పిల్లలు వాళ్ళ సరదాలు తీర్చుకోనీ అని మనం సర్దుకుపోవటమే.తల్లి అంటే చేసి పెట్టే యంత్రంలా,తండ్రి అంటే డబ్బులిచ్చే ఎ.టి.యమ్ ఏమో అనిపిస్తుంది వాళ్ళను చూస్తే.ఇదంతా చూస్తుంటే నా పెంపకంలో ఏమైనా లోపం ఉందా అని నాకు అనుమానం వస్తూ ఉంటుంది.తట్టుకోలేని బాధవేస్తుంది, ఒక్కొక్కపుడు నాకు నేను ఒంటరిలాగా అనిపిస్తుంది.మా వారు ఉద్యోగం బాధ్యతలో ఊపిరి సలపని పనిలో కొట్టుకుంటూ ఉంటారు. పిల్లలూ వాళ్ళ చదువులు,వాళ్ళ సరదాలతో ఖాళీ ఉండదు.నేనే వాళ్ళందరి అవసరాలు తీరుస్తూ అవసరంలేని దానిలా ఉన్నాననిపిస్తుంది. అసలు నేను బాధపడుతున్నా పట్టించుకోరు."

" పిచ్చీ ! అలా అంటావేం ?" మనం లేకపోతే ఒక్క నిముషం వాళ్ళు ఉండలేరు.పిల్లల వయసు అలాంటిది.ఆ వయసులో మనం అలా లేమా ?"

" లేము,అమ్మలతో అన్ని ముచ్చట్లూ పంచుకునే వాళ్ళం"

"అవును ,ఇపుడు అందరూ సెల్స్ లో ఆ సంగతులు వెళ్ళబోసుకుంటున్నారు ఎదురుగా ఉన్నవాళ్ళను వదిలేసి."

"ఇది మాత్రం ముమ్మాటికి నిజం.అన్నింటిలో తప్పు ఒప్పు రెండూ ఉంటాయి.ఈ రోజు మనం ఇలా కలిసామంటే దాని వల్లే కదా.కాకపోతే వాటిని ఎంత అవసరం ఉంటే అంతే వాడాలి.మనిషికి ఆ విజ్ఞత ఉండాలి"

"అవునే, ఇక వెళదామా?" అంది గౌరి.

పద, అని బయటకి వచ్చారు.

బయట అంతా రద్దీ రద్దీగా ఉంది.బిచ్చగాళ్ళకు డబ్బులు వేసి ఆ గందరగోళం నుంచి బయట పడ్డారు.గుడినుంచి ఇంటికి వెళ్ళేటప్పటికి వంట అంతా అయిపోయింది.

పన్నెండు గంటలకల్లా పంక్తి భోజనాలు వడించేసారు.అక్కడ ఉన్న వారిలో బీపీలు ,షుగర్లు ఉన్న వాళ్ళు ఉండటమే దానికి కారణం.పిల్లలు వడ్డన కార్యక్రమంలో పాలు పంచుకున్నారు.

గోంగూరపచ్చడి, ముద్దపప్పు ఆవకాయ, వంకాయకూర, బీరకాయ చేతి పచ్చడి,ఆనపకాయపులుసు ,అప్పడాలు వడియాలు ,సేమ్యాపాయసం వడ్డించారు.ఏదో పెళ్ళి భోజనం తిన్నట్లే అయ్యింది.

భోజనాలు అయ్యాక సన్నగా ఉన్న ఆ వరండాలోనే అటూ ఇటూ కూర్చుని వాళ్ళంతా ముచ్చట్లు ప్రారంబించారు.కాసేపు వాళ్ళందరితో గడిపి గదిలోకి వచ్చారు గౌరీ,మధురిమ.

అప్పటి స్నేహితులు ఎవరెవరు కలిసారో వాళ్ళ నెంబర్లు ఒకరి దగ్గర ఉన్నవి మరొక్కరు పుచ్చుకున్నారు. ఇంకా మిగతావాళ్ళందరివీ కూడా కనుక్కోవాలి అనుకున్నారు.

ఎంతైనా బాల్య స్నేహితులను కలవటంలో ఉన్నా మజానే వేరు. అలా ఆ కబుర్లతో ,ఈ కబుర్లతో కాలం సూపర్ ఫాస్ట్ రైలులా పరుగెట్టింది.మళ్ళీ వేడి వేడి పకోడీలు పెట్టారు.టీ కానీ కాఫి కానీ అని అడిగితే వద్దని చెప్పి ఇక బయలుదేరుతాను అని చెప్పింది గౌరీకి చీకటి పడకముందే ఇల్లు చేరుకుంటే మంచిదనే ఉద్దేశంతో.

" ఈ సారి మీ ఇంటికి తప్పక వచ్చేట్లు చూసుకుంటాను" అన్న గౌరీతో

" ఓ నాలుగు రోజులు ఉండేట్లు రా గౌరీ" అంది ఆప్యాయంగా ఆమె చేతులను పట్టుకుని.

"అలాగేలే , నేను పిలవగానే ఇలా వచ్చినందుకు నాకు ఎంతో సంతోషంగా ఉంది" అంది గౌరి.

ఆమె కళ్ళలో వెలుగుల పూలు విరజిమ్ముతున్నాయి.

" నీకేనా నాకు కూడా! " అంది మధురిమ నవ్వుతూ.

" మా ఊరు కూడా రావాలి. అన్నయ్య గారితో వచ్చి ఓ వారం,పదిరోజులు ఉండి వెళ్ళాలి"

"అలాగే!" మరి ఉండనా.

# యూత్ సీరియల్

" పద ! బస్టాండు దాకా వచ్చి దింపి వెళతాను" అంది గౌరి.ఆమెతో పాటూ వాళ్ళ అన్నదమ్ములు ఇద్దరూ కూడా అనుసరించారు. అవన్నీ అప్పటి పద్ధతులు, ఇంటికి వచ్చినవారిని అలా సాగనంపటం.

★ ★ ★ ★ ★

బయట అంతా రద్దీ రద్దీగా ఉంది. బిచ్చగాళ్ళకు డబ్బులు వేసి ఆ గందరగోళం నుంచి బయట పడ్డారు.గుడినుంచి ఇంటికి వెళ్ళేటప్పటికి వంట అంతా అయిపోయింది.పన్నెండు గంటలకల్లా పంక్తి భోజనాలు వడ్డించేసారు.అక్కడ ఉన్న వారిలో బీపీలు ,షుగర్లు ఉన్న వాళ్ళు ఉండటమే దానికి కారణం.పిల్లలు వడ్డన కార్యక్రమంలో పాలు పంచుకున్నారు.

గోంగూరపచ్చడి, ముద్దపప్పు ఆవకాయ, వంకాయకూర, బీరకాయ చేతి పచ్చడి,ఆనపకాయపులుసు ,అప్పడాలు వడియాలు ,సేమ్యాపాయసం వడ్డించారు.ఏదో పెళ్ళి భోజనం తిన్నట్లే అయ్యింది.

భోజనాలు అయ్యాక సన్నగా ఉన్న ఆ వరండాలోనే అటూ ఇటూ కూర్చుని వాళ్ళంతా ముచ్చట్లు ప్రారంబించారు.కాసేపు వాళ్ళందరితో గడిపి గదిలోకి వచ్చారు గౌరీ,మధురిమ.

అప్పటి స్నేహితులు ఎవరెవరు కలిసారో వాళ్ళ నెంబర్లు ఒకరి దగ్గర ఉన్నవి మరొక్కరు పుచ్చుకున్నారు.ఇంకా మిగతావాళ్ళందరివీ కూడా కనుక్కోవాలి అనుకున్నారు.

ఎంతైనా బాల్య స్నేహితులను కలవటంలో ఉన్నా మజానే వేరు. అలా ఆ కబుర్లతో ,ఈ కబుర్లతో కాలం సూపర్ ఫాస్ట్ రైలులా పరుగెట్టింది.మళ్ళీ వేడి వేడి పకోడీలు పెట్టారు.టీ కానీ కాఫీ కానీ అని అడిగితే వద్దని చెప్పి ఇక బయలుదేరుతాను అని చెప్పింది గౌరీకి చీకటి పడకముందే ఇల్లు చేరుకుంటే మంచిదనే ఉద్దేశంతో.

" ఈ సారి మీ ఇంటికి తప్పక వచ్చేట్టు చూసుకుంటాను" అన్న గౌరీతో

" ఓ నాలుగు రోజులు ఉండేట్లు రా గౌరీ" అంది ఆప్యాయంగా ఆమె చేతులను పట్టుకుని.

"అలాగేలే , నేను పిలవగానే ఇలా వచ్చినందుకు నాకు ఎంతో సంతోషంగా ఉంది" అంది గౌరి.

ఆమె కళ్ళలో వెలుగుల పూలు విరజిమ్ముతున్నాయి.

" నీకేనా నాకు కూడా! " అంది మధురిమ నవ్వుతూ.

" మా ఊరు కూడా రావాలి. అన్నయ్య గారితో వచ్చి ఓ వారం,పదిరోజులు ఉండి వెళ్ళాలి"

"అలాగే!" మరి ఉండనా.

" పద ! బస్టాండు దాకా వచ్చి దింపి వెళతాను" అంది గౌరి.ఆమెతో పాటూ వాళ్ళ అన్నదమ్ములు ఇద్దరూ కూడా అనుసరించారు.అవన్నీ అప్పటి పద్ధతులు, ఇంటికి వచ్చినవారిని అలా సాగనంపటం.

★ ★ ★ ★ ★

"స్నేహప్రియ,మధురిమ,ధృతి కలిసి పెండ్లికి కావల్సిన బట్టలు కొన్నారు. పెళ్ళికొడుకు ,పెళ్ళికూతురు ఎవరి బట్టలు వారు కొనుక్కొని పెళ్ళిలో పెట్టవలసి వచ్చినపుడు ఇచ్చిపుచ్చుకుందామని ఒప్పందం చేసుకున్నారు.కట్నాలు ,కానుకలు ప్రశక్తి లేదు, వాళ్ళ అమ్మాయికి ఇష్టమైనవి వాళ్ళు పెట్టుకుంటారు. కోడలికి కావల్సినవి వీళ్ళు పెట్టుకుంటారు.అలాగే పెళ్ళికొడుకుకి కూడా.

ఎక్కడా నిబంధనలు లేకుండా అంతా సామరస్యంగా జరిగి పోవాలని ఇరువైపుల వారు ముందే నిశ్చయించుకోవటంతో ఎక్కడ లోటుపాటులు లేకుండా పనులన్నీ సక్రమంగా చకచకా జరిగి పోతున్నాయి.

ధర్మతేజ ఇప్పటికే చాలా పెళ్ళిళ్ళు తన చేతుల మీదుగా జరిపించి ఉండటంతో అన్నీ సక్రమంగా జరుగుతున్నాయా లేదా అని సరిచూసుకుంటున్నాడు.పిల్లలే దగ్గరుండి అన్నీ చేస్తున్నారు. అందుకని పై పై పనులే తల్లితండ్రులకి అప్పచెబుతున్నారు.

తమ కాలనీలో ఉన్నా వివాహ వేదిక ఆడిటోరియమ్ నే మాట్లాడుకున్నారు.దగ్గరిగా ఉంటే ఏదైనా మరిచిపోతే తెచ్చుకోవటానికి వీలుగా ఉంటుందని.

నడిచే దూరమే కాబట్టి కార్లు,వేన్లు ,సైకిళ్ళు తరచుగా వాడక్కర్లేదు అని.

ఎంత జాగ్రత్తగా చూసుకున్నా పెళ్ళంటే లక్షల్లో వ్యవహారమే. భోజనం కూడా ఓ వంద వెరైటీలు కాకుండా ఓ కూర ,సాంబారు ,చారు ,చేతి పచ్చడి,దోసావకాయ,అప్పడాలు , వడియాలు,బొబ్బట్లు ,పులిహోర గా నిర్ణయించుకున్నారు.

ధృతి జాకెట్లు ,పాల్స్ కుట్టించుకోవడం పనిలో పడింది. ఇపుడు అన్నింటి కన్నా అవి

అవ్వడమే కష్టమైన పని.మగ్గం వర్క్ చేసిన జాకెట్లు దొరుకుతున్నా చీరలో ఇచ్చిన దానితోనే మరీ ఎక్కువ మోడల్ పెట్టకుండా చూడటానికి అందంగా ఉండేట్లు కుట్టించుకుంటోంది.తనతో పాటు నానమ్మకు ,అత్తయ్యకు ,వదినలకు,అమ్మకు కూడా చూసుకుంటోంది.అందరికీ పెళ్ళి బట్టలు విడిగా కొనుక్కున్నారు.

పెళ్ళికి మంచి సన్నాయిని మాట్లాడారు.పెళ్ళికూతుర్ని చేసినపుడు కూడా ఓ గంట వచ్చి వాయించి వెళతామన్నారు.పాత పాటలే పాడాలని ప్రత్యేకంగా చెప్పారు.ధృతి కి కూడా అవే ఇష్టం మధురిమ తో పాటూ.

మంచి రోజని ముహూర్తం పెట్టడంతో విఘ్నేశ్వరుడికి బియ్యం కట్టారు.

పెళ్ళికూతురిని పెళ్ళికి ముందురోజు చేసారు.బంధువులు చాలా వరకు అప్పటికే వచ్చేసారు.నవధాన్యాలను మూకుడిలో వేసారు. అవి మొలకలు రావాలిగా.ఆ రోజు పసుపు కొట్టించి ఆడవాళ్ళందరికి, పేరంటాళ్ళకు పసుపు ,గంధం ,కుంకుమ ఇచ్చారు. అందరికి అక్షింతలు ఇచ్చి పెళ్ళికూతురిని ఆశీర్వదించమన్నారు. వచ్చిన వాళ్ళందరికీ తాంబూలం ,అరటిపండ్లు వీణలాగ ఉన్నా డబ్బాలో వేసి ఇచ్చారు.అందరిలా నాలుగు శెనగ గింజలు కాకుండా గుప్పెడు వేసారు.

అందరు ధృతిని ఆశీర్వదించి దిష్టి తీయడం మరచిపోకండి అని హెచ్చరించి మరీ వెళ్ళారు.

స్నేహప్రియ కార్యక్రమం మొత్తం అయ్యాక వెళ్ళిపోతూ అక్కడ ఊడుస్తున్న పని అమ్మాయితో మీ అత్త లంకెలు బిందెలు నీకు ఇచ్చిందా? అసలు దొరికాయా ? అంది నవ్వుతూ. మధురిమ తనకు అంతా చెప్పి ఉండటంతో. అది సిగ్గుతో లోపలికి పారిపోయింది.

అప్పుడు ఎన్ని మాటలు మాట్లాడిందో.ఎలాగైనా అత్తను కాదని అవి తాను పొందుతానని ,దానికోసం ఏమేమో చేస్తున్నానని.

ఈ కాలంలో లంకెల బిందెలు ఎక్కడ దొరుకుతాయి ? ఏ పురాతన గుడులలో తప్పా?

స్నేహప్రియ దాన్ని అడగటం విని మధురిమ నవ్వుకుంది.ఏది చెప్పినా మరిచిపోదు.

ప్రవాహ,మాధురి ,ధృతి క్లాస్ మేట్స్ ,కొందరు ఆడవాళ్ళు వచ్చి వెళ్ళారు.

వీడియోను ధృవ వాళ్ళకు పంపారు.ధృవను కూడా అక్కడ ఆ రోజే పెళ్ళికొడుకుని చేసారు. తనది కూడా వీడియో తీయించి ధృతి కి పంపాడు.

ఇద్దరి వేడుక స్నేహితులందరి సందడిలో బాగా జరిగింది. కూలింగ్ గ్లాసెస్ పెట్టుకోవటం మాత్రం మధురిమ వద్దనటంతో మానేసారు.అంతా పాత పద్ధతిలో సాంప్రదాయంగా చేసుకున్నారు.పట్టుచీరలో పెళ్ళిబుట్టలో ధృతి కళకళలాడుతూ అందరి దృష్టినీ ఆకర్షించింది.అక్కడ ధృవ కూడా !

★ ★ ★ ★ ★

బంధువులు,పిల్లలతో ఇల్లంతా సందడిగా ఉంది.స్నేహప్రియను ఈ రెండు రోజులు ఇంట్లోనే ఉండమని చెప్పింది మధురిమ.దగ్గరేగా పొద్దున్న వచ్చేస్తాను, రాత్రి భోజనాలయ్యాక వెళ్తాను.బంధువులంతా ఉన్నారుగా వాళ్ళని చూసుకో అని చెప్పి వెళ్ళిపోయింది.

నాలుగిళ్ళవతల ఒకరిది ఖాళీగా ఉండటంతో వాళ్ళను అడిగి అది తీసుకున్నారు.అందుకే ఏమి ఇబ్బంది రావటంలేదు. కొందరి ఇండ్లలో కొందరిని ఉంచుకుంటామని స్వచ్ఛందంగా చెప్పి తీసుకు వెళ్ళారు.

ప్రభాకర్ ,గాయత్రి వాళ్ళు అయితే మొత్తం ఇళ్ళంతా వాడుకోమన్నారు.తాము కష్టంలో ఉన్నపుడు వారిచ్చిన ఓదార్పుకు ఏమిచ్చినా రుణం తీరదని వారి అభిప్రాయం.

అలా అందరూ తమకు తోచిన సాయం చేస్తూ పెళ్ళి పనులలో సహకరిస్తున్నారు.మరి ధర్మతేజ ,మధురిమ ఎవరికి ఏ అవసరం వచ్చినా ముందు ఉండేవారుగా. అందుకే అంటారు మంచి చేస్తే మంచే ఎదురవుతుందని.

★ ★ ★ ★ ★ ★

ఆ రోజు రానే వచ్చింది.ఇక పెళ్ళి హడావిడి అంతా ఇంటిముందే కనిపిస్తోంది.తాటాకు పందిరి క్రింద కుర్చీలలో మగవారు అంతా కబుర్లలో మునిగి తేలుతున్నారు. లోపల ఆడవారు పెళ్ళి పెట్టెలో పెట్టాల్సిన సామాన్లు సర్దుతున్నారు. మగవారు వాటిని అందిస్తున్నారు. పెళ్ళిదగ్గర ఇవ్వాల్సిన వస్తువులు ,పెట్టాల్సిన బట్టలు సర్దారు.కొంత సమయానికి ఆ పని ముగించి 'హమ్మయ్య' అనుకున్నారు. అది అయిపోతే పెద్ద పని

అయిపోయినట్లే.
కళ్యాణ మండపంలో 'ఒడుగు' కార్యక్రమం జరుగుతోంది.ఆ సమయానికి ముందే ఆడపెళ్ళివారు అంతా అక్కడ ఉండి ఊరేగుతు వచ్చిన పెళ్ళికొడుకు 'ధృవను ' సకల మర్యాదలతో స్వాగతించారు.ఎక్కడ ఏ లోటు లేకుండా కార్యక్రమాన్ని జరిపించారు మధురిమ,ధర్మతేజ.

ముఖ్యంగా అందంగా , ముచ్చటైన ఉచ్చారణతో మురిపించారు పంతులు 'హనుమచ్ఛాస్త్రి గారు గారు' తన ఛలోక్తులతో రంగరించి మరీ.

సాయంత్రం నాలుగు గంటలకు స్నాతకం కార్యక్రమం.కాశీకి వెళ్ళే దుస్తులలో బాగా నప్పాడు ధృవ.ఆ గొడుగు ,పాదుకలు ఆ వేడుకకే అందాన్నిచ్చాయి.కిరణ్ బావగారిని బ్రతిమాలి బెల్లంపెట్టి ,దుస్తులిచ్చి శాస్త్రోక్తంగా ఆ వేడుకను పండించాడు.బంధువులంతా అటూ ఇటూ నిలబడి ఆ వేడుకను తిలకించారు.ఆ తరువాత పానకాల కావిడి.

పెళ్ళికంతా సరదా తెచ్చే కార్యక్రమం ఇదే కాబట్టి అటువైపు వారూ,ఇటువైపు వారూ ముందుగానే అక్కడ సిద్ధమై మరమరాల దండలు వేసి, పౌడరు పూసి, కిరీటాలు పెట్టి ,సెంటు చల్లి కానుకలు ఇచ్చుకుని కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చారు.

అది అయ్యాక అందరూ ఒక గంట విశ్రాంతి తీసుకున్నారు. ఎనిమిది గంటలకు ముహూర్తం అవ్వటంతో ఆరుగంటల నుంచే కార్యక్రమం ప్రారంబించారు.
పెళ్ళికుమార్తెను గౌరీ పూజకు తీసుకువచ్చారు.
మండపంలో పెళ్ళికొడుకుతో కార్యక్రమాలు జరుగుతున్నాయి. కాస్త చీకట్లు పడటంతో రంగురంగుల విద్యుద్దీపాలతో కళ్యాణమండపం ఆకాశ హార్మ్యంలా మెరిసిపోతుంది.

బంధువులు,స్నేహితులు కొందరు అప్పుడే కార్లలోంచి దిగి మండపంలోకి వెళుతున్నారు.

పెళ్ళికూతుర్ని తీసుకురావాలి అని పంతులుగారు చెప్పటంతో మేనమామలంతా ధృతి ని బుట్టలో తీసుకువచ్చి మండపం దగ్గిర దింపారు.ఆ బుట్టకూడా పెళ్ళికూతురిలా కళకళలాడుతోంది. నేనే కదా ప్రధాన పాత్ర పోసిస్తున్నానని కాస్త గర్వపడింది కూడా.ధృతి, మధురిమ స్వయంగ వెళ్ళి చూసి తెచ్చుకున్నారు.

జీలకర్ర బెల్లం పెట్టేటప్పుడు, మంగళసూత్రం కట్టేటప్పుడు గానీ మరెప్పుడైనా గానీ ఫోటోగ్రాఫర్ హడవిడి చెయ్యకూడదని ,సహజంగా ఫోటోలు తీసుకోమని పోజులు అడగవద్దని ముందుగానే హెచ్చరించటం వలన పెళ్ళి కార్యక్రమానికి ఎక్కడా విఘాతాలు కలగలేదు.చక్కటి సన్నాయితో,పాతపాటలతో ఆ మండపం అంతా చక్కగా శోభిస్తోంది.చివరకు ఆ ఘడియలు రానే వచ్చాయి.
పెళ్ళికూతురు, పెళ్ళికొడుకుతో జీలకర్ర,బెల్లం పెట్టించారు సరిగ్గా ముహూర్త సమయానికే.
అందరూ వచ్చి అక్షింతలు వేసి వెళ్ళారు.
మధురిమ ,ధర్మతేజ మండపంలోనే నిలబడి పెళ్ళికి వచ్చిన వారిని పలకరిస్తున్నారు.వాళ్ళే పెళ్ళికొడుకు ,పెళ్ళికూతురు అన్నట్లు మెరిసిపోతున్నారు సాంప్రదాయ దుస్తులలో.
సభికులందరితో మంగళసూత్రం తాకించి అక్షింతలు ఇచ్చి వచ్చారు.

పంతులుగారు సైగ చేయటంతో"మంగలం తంతు నేనా" అనగానే మంగళవాయిద్యాలు వాయించటం ప్రారంబించారు.ధృవ , ధృతి మెడలో మంగళసూత్రం కట్టి మూడుముళ్ళు వేసాడు.
మాధురి మల్లెపూలు ,కనకంబరాలతో అల్లిన అందమైన జడను అడ్డురాకుండా ఎత్తి పట్టుకుంది. ప్రక్కనే నిలబడి ఎవరికి ఏది అవసరమొచ్చినా అందిస్తోంది.

పెళ్ళికి వచ్చిన వారు అంతా వచ్చి ఆశీర్వదించాక స్నేహితులంతా వచ్చి సందడి చేసారు.
ఆ తర్వాత తలంబ్రాలు. పెళ్ళితంతు లో దేని అందం దానిదే. రంగురంగుల తలంబ్రాల ఎంపికకు ధృతి రెండు గంటలు తీసుకోవటం మధురిమకు గుర్తు వచ్చింది.పెళ్ళి అనేది జీవితంలో ఒకసారే జరిగే ముచ్చట. దానిని ఎంతగా జరుపుకోవాలో అన్నది ఒక సవాలే వధూ వరులకి, వాళ్ళ తల్లితండ్రులకు కూడా.
ఇక్కడ ధృవ స్నేహితులూ ,ధృతి స్నేహితులు పోటీ పడి మరీ ఇద్దరి తో తలం

బ్రాలు పోసుకోవడంలో ఉత్సాహాన్ని రేకెత్తించారు. ఆ వేడుక అయ్యాకా భోజనాలకి వెళ్ళారు.

వరుసగా అన్ని తంతులు ముగిసాయి.అప్పగింతల కార్యక్రమం ప్రారంభమయ్యింది.
చూస్తున్న అందరి కళ్ళు చెమర్చాయి.

ఇంక మధురిమ కళ్ళు రెండు సముద్రాలు లా ఉప్పొంగుతున్నాయి. ఇప్పటి దాకా తమ పిల్ల ,ఇపుడు వారి పిల్ల.

అవతల వారు సొంతం చేసుకోవటం బాగుంటుంది కానీ ఇన్నాళ్ళు అపురూపంగా
పెంచి పెద్ద చేసిన పిల్ల పరాయి అయిపోవటం కన్నా తల్లితండ్రులకు రంపపు కోత
మరేమి ఉండదు.

ధర్మతేజ చూపులతోనే ధృతి ని అప్పచెప్పాడు.

అక్కడ మాటలు కరువయ్యాయి.
ఆడపిల్ల ఈ కష్టాన్ని భరిస్తూనే మరో ఇంటికి వెలుగవ్వాలన్నది సాంప్రదాయం.
పెద్దలు పూర్వులు నిర్ణయించినది.
దీనికి ఏ ఆడపిల్లా అతీతురాలు కాదు.
ఎక్కడో ఒక్కరిద్దరికి తప్ప.
ధృతికి చెంపల మీద కన్నీరు నిరంతరంగా ప్రవహిస్తూనే ఉంది.

అత్తగారిల్లు ఊర్లోనే అయినా తెల్లవారి లేవగానే కనిపించే అమ్మ నాన్న ,అన్నయ్యలు ,వదినలు ,నానమ్మ కనిపించరంటేనే దిగులు మేఘం మనసుని ఆవరిస్తోంది.అదే స్థితిలో కుటుంబం అంతా.ధృవ ఆ బాధను చూడలేకపోతున్నాడు.
అత్తయ్యగారు ,మావయ్యగారు మీ బెంగ తీరేదాకా ప్రతి శని,ఆదివారాలు మీ దగ్గరే ఉంటాం.మీరు ఎప్పుడు కావాలంటే అపుడు రావచ్చు,వెళ్ళవచ్చు.
ఇకనుంచి మా ఇల్లు ,
మీ ఇల్లు అని ఉండదు. రెండూ మన ఇల్లులే అన్నాడు.

ధృతి ధృవను అంత దుఃఖంలోను మెచ్చుకోలుగా చూసింది.

"అవును వదినగారూ" అని దేవకి, అవును బావగారూ అని రవితేజ నొక్కి చెప్పారు.

ఎందరు ఎన్ని చెప్పినా వారి బాధ తీరేది కాదు.

అందరి సజల నయనాల మధ్య పెళ్ళికూతురిని ఎక్కించుకొని కారు వెళ్ళిపోయింది.

అక్కడ ఉన్న వాళ్ళందరికి మూగగానే వీడ్కోలు పలికింది ధృతి
మరో పాత్రకు
పునర్జన్మ ఇచ్చే నేపధ్యంలో
కోడలిగా.

★ ★ ★ ★

కుక్కలు గట్టిగట్టిగా మొరుగుతున్నాయి.కోరి తెచ్చుకొన్న విదేశీ సాంప్రదాయాలను వదిలెయ్యండి. మన సంస్కృతిని కాపాడుకోండి అని చెబుతున్నట్లు.

★ ★ సమాప్తం ★ ★

కథ

# సారీ ఆగమ.....

బివిడి ప్రసాద రావు

పక్షం రోజుల తర్వాత..

ఆగమ ను దార్లో ఆపగలిగాడు సిద్ధ.

తను కూడబలుక్కున్నది.. గబగబా.. "నువ్వంటూ నాకు లేని క్షణాన నేనంటూ లేను." చెప్పాడు.

ఆగమ అతడ్నే చూస్తోంది. ఆగమ ను సిద్ధ చూస్తున్నాడు.

ఆగమ తలదించుకుంటుంది.

"మాట్లాడు." అప్పుడే అన్నాడు సిద్ధ.

చిన్నగా కదిలింది ఆగమ.

"మాట్లాడడానికి ఏం ఉంది." అంది.

"చెప్పాగా. నువ్వు నాకు లేందే నేను లేను." చెప్పాడు సిద్ధ.

"ఛ. ఎన్ని మార్లు చెప్పిందే చెప్తుతావ్. అటు మార్చి ఇటు మార్చి చెప్పడానికి నీకు బోర్ కొట్టక పోయినా.. వినే ఓపిక నాకు లేదు." ఆగమ చిరాకవుతోంది.

"ప్లీజ్. రిప్యూజ్డ్ గా మాట్లాడకు." సిద్ధ నొచ్చుకుంటాడు.

"ఇక చాల్లే." విసురుగా అంది ఆగమ.

సిద్ధ అవస్త పడుతున్నాడు.

"నేను ఆల్రడీ చెప్పి ఉన్నాను. నాకు ఇట్టివి నచ్చవు. దయచేసి నా వెంట పడొద్దు." సాధ్యమైనంత మేరకు సౌమ్యంగానే చెప్తుతోంది ఆగమ.

సిద్ధ గింజుకుంటున్నాడు. ఏదో చెప్పబోయాడు.

అడ్డె.. "నో. నేను చెప్పేదే విను. మనం చదువుకుంటున్నాం. వుయి హేవ్ టు అండర్స్టాండ్ ద పర్పజ్ ఆఫ్ స్టడీ. ఈ స్టేజ్ న.. ఈ టైమ్ న.. మనం మరో వైపుకు పోవద్దు. ఇక తప్పక చెప్తుతున్నాను. నా ఆలోచన మాత్రం ప్రస్తుతం ఇదే. సో.. డోన్ట్ డిస్టర్బ్ మి. ప్లీజ్." చెప్పింది ఆగమ.

సిద్ధ చలించాడు. ఐనా.. "ఆగమ.. నువ్వు నాకు కావాలి." చెప్పాడు.

"హే. పిచ్చా. చెప్పేది అర్థం చేసుకోలేవా." ఆగమ చిరాకయ్యి పోతోంది.

"అది కాదు ఆగమ.." సిద్ధ మాట్లాడబోయాడు.

"ఛుఫ్. నథింగ్. నో మోర్." చెప్పేసింది ఆగమ.

ఆ వెంబడే.. తన సైకిల్ ఎక్కి.. కాలేజీ వైపుకు కదిలిపోయింది.

సిద్ధ నిశ్చేష్టుడై ఉండిపోయాడు. కొద్ది సేపటికి తేరుకున్నాడు. కాలేజీకి వెళ్లక.. ఇంటికి తిరిగి వెళ్లిపోయాడు.

★★★

ఫ్లాష్బేక్..

ఆ ఇద్దరూ ఇంటర్మీడియట్ సెకెండియర్ చదువుతున్నారు.

ఫస్టియర్ లగాయితు సిద్ధ.. ఆగమ వైపు మొగ్గి.. ఆమెకై పరితపిస్తున్నాడు.

తొలుత.. కొత్త కావడం.. ఏదో బెదురు నిలవరించడం.. కారణాలు కావడంతో.. ఆగమ ను చూడ్డమే తప్పా.. సిద్ధ బయలు కాలేకపోయాడు.

తర్వాత.. సెకెండియర్ మిడిల్ కి వచ్చేయడం.. ఎగ్జామ్స్ తర్వాత విడిపోవడం.. కారణాలుగా ఆగుపిస్తుండడంతో.. ఆగమ ను నేరుగా కలవడమే తప్పా.. సిద్ధకు మరో దిక్కు కానరాలేదు.

దాంతో.. ఇక వెంబడించడాలు తొక్కేసి.. ఒక రోజున.. కాలేజీకి వస్తున్న దారిలోనే.. మాటేసినట్టు నిరీక్షించి.. ఎట్టకేలకు ఆగమ ను ఆపగలిగాడు సిద్ధ.

"చూస్తున్నా. రోజూ వెంట వచ్చే వాడివి.. ఈ రోజు ఏంటి.. తెగించేసావా. ఏంటి సంగతి." గమ్మత్తుగా అడుగుతున్న ఆగమ ను చూస్తూ ఉండిపోయాడు సిద్ధ. ఆగమ చిత్రంగా తన కనుబొమల్ని ఎగరేస్తోంది.

"నేను.. నేను.. వెంటపడడం.. నీకు.. నీకు తెలుసా." నంగిగా మాట్లాడగలిగాడు సిద్ధ.

"నేనే కాదు. నీ చేష్టలు ఎందరో ఎరిగుండొచ్చు. సరే కానీ.. ఏం చెప్తావ్." ఆగమ గబగబా మాట్లాడేస్తోంది.

సిద్ధ నిబ్బరం నీరు కారుతోంది.

"చూడు.. ప్రేమ.. ఐ లవ్ యూ.. ల్లాంటివి వద్దు." ఆగింది ఆగమ.

సిద్ధ తమాయించుకోలేక పోతున్నాడు.

"నీ వాలకం చూస్తే అలాగే తోస్తోంది. నో. నాకు అట్టివి గిట్టవు." చెప్పేసింది ఆగమ.

ఆ వెంబడే.. తన సైకిల్ తో కాలేజీ వైపుకు కదిలిపోయింది.

తేరుకోవడానికి సిద్ధకి చాలా సమయం పట్టేసింది.

వారం రోజుల తర్వాత..

అంతగా చెప్పేసిన ఆగమ మీద వెగట పడలేదు సిద్ధ.

ఆమె మీద ఏర్పడిన మోజును విదిలించుకోలేక.. ఆగమ ను మరో మారు కలిసాడు సిద్ధ.

"నేను సూటిగానే చెప్పేసాను. ఇలా దార్లో అడ్డుపడి ఆపకు." ఈ మారు గట్టిగానే చెప్పింది ఆగమ.

"నేను ఎంతగా ప్రయత్నించినా.. నిన్ను కాదనుకోలేకపోతున్నాను." చెప్పాడు సిద్ధ.

"అరె. నీ సొద నీదేనా. నా మాట ఎక్కించుకోవా." మళ్లీ గట్టిగానే అంది ఆగమ.

"ప్లీజ్. అరవొద్దు." సిద్ధ చుట్టూ బెదురు బెదురుగా పరికించాడు.

"అబ్బో. భయమే. అంత భయం ఉన్నోడివి నన్ను ఆపకు. నాకు నచ్చంది నేను ఒప్పుకోను. మైండిట్." అనేసింది ఆగమ. ఆ వెంబడే.. తన సైకిల్ తో కాలేజీ వైపుకు కదిలిపోయింది.

ఆమెనే చూస్తూ ఉండిపోయాడు సిద్ధ. ఆగమ కనుమరుగు కాగా.. తెములుకొని.. తనూ సైకిల్ ఎక్కి.. కాలేజీ వైపు కదల గలిగాడు.

★★★

ప్రస్తుతం..

పది రోజుల తర్వాత..

సిద్ధతో తరచు కనిపించే శీనుని.. కోరి.. కాలేజీ దార్లో ఆపింది ఆగమ.

"మీ ఫ్రెండ్ సిద్ధ ఈ మధ్య కాలేజీకి రావడం లేదేమిటి." అడిగింది.

వెంటనే శీను ఏమీ చెప్పలేదు.

సిద్ధకై మళ్లీ ప్రశ్నించింది ఆగమ.

"వాడు ఆ మధ్య ఏదో తాగేడు. ఇప్పుడు హాస్పిటల్ లో ఉన్నాడు." చెప్పాడు శీను.

ఆగమ కాస్త కంగారయ్యింది. "ఏం తాగాడు." అడిగింది.

"ఏమో.." శీను చెప్పాడు. ఆ వెంబడే.. "ఎందుకు తాగాడో నాకు మాత్రం తెలుసు. నీ మూలంగానే." చెప్పేసాడు.

ఆగమ చలించింది. "ఏ హాస్పిటల్." అడిగింది.

శీను చెప్పాడు.

ఆగమ కాలేజీకి వెళ్లక.. తన సైకిల్ ను తిప్పి.. శీను చెప్పిన హాస్పిటల్ వైపుకు కదిలిపోయింది.

శీను ఎగాదిగా పడి.. కాలేజీ వైపుకు తన సైకిల్ తో కదిలాడు.

ఇరవై నిముషాలు పిదప..

వార్డ్ బెడ్ మీద పడుకొనున్నాడు సిద్ధ. తన చెంతకు వచ్చిన ఆగమ ను చూసి చకితుడయ్యాడు. కూర్చున్నాడు.

"ఏంటిలా." అబ్బురమయ్యాడు. ఆ వెంబడే.. "నేనిక్కడ ఉన్నట్టు ఎలా తెలుసు." అడిగాడు.

"శీను చెప్పాడు." పొడిగా చెప్పింది ఆగమ. తర్వాత తనే.. "నువ్వు కాలేజీకి రాకపోవడంతో.. నేనే శీనుని అడిగాను." చెప్పింది.

ఆగమనే చూస్తున్నాడు సిద్ధ.

ఆగమ చుట్టూ పరిశీలనగా చూస్తోంది. "నీ వాళ్లు లేరా." అడిగింది.

"డాక్టర్ రౌండ్స్ అయ్యేక.. నాన్న ఇంటికి వెళ్లారు." చెప్పాడు సిద్ధ.

"ఏంటీ పని." అడిగింది ఆగమ.

సిద్ధ మాట్లాడలేదు.

"నా వలన నువ్వు హర్ట్ అయ్యావు కదూ." అంది.

సిద్ధ తల తిప్పుకున్నాడు.

"ఇంత పిచ్చిగా బిహేవ్ చేస్తావనుకోలేదు." చెప్పింది ఆగమ.

అప్పటికీ సిద్ధ మాట్లాడక పోయేసరికి.. "మాట్లాడు.. ఇప్పుడు ఎలా ఉంది. ఇన్నాళ్లు హాస్పిటల్ లో ఎందుకు ఉంచారు. ఏం తాగావు." అడుగుతోంది ఆగమ.

అడ్డై.. "తాగిన పురుగుల మందు మూలంగా పొట్ట బాగా ఖరాబు ఐపోయిందట. ఇన్ఫెక్షన్ మూలంగా ఇప్పటి వరకు ఉండిపోవలసి వచ్చింది. ఎల్లుండికి ఇంటికి పంపుతారట. జ్వరం రావడం లేదు." చెప్పుతున్నాడు సిద్ధ.

అడ్డై.. "మీ వాళ్లు ఏమన్నారు." అడిగింది ఆగమ.

"నేను స్పృహ తప్పానట. చొంగలు చూసి నన్ను హాస్పిటల్ కి తెచ్చారట. తెలివి వచ్చేక ఏవో కథలు చెప్పాను. బతికానని మా వాళ్లు సంబరమయ్యారు. అంతే." టూకీగా చెప్పాడు సిద్ధ.

"ఎందుకు తాగేవో చెప్పలేదా." టక్కున అడిగింది ఆగమ.

"లేదు. నీ పేరు బయటికి రావడం నాకు ఇష్టం కాదు." వెంటనే చెప్పాడు సిద్ధ.

"అయ్యో." నుదురు మీద దరువులేసుకుంటుంది ఆగమ.

అంతలోనే సిద్ధ చెప్పుతున్నాడు.. "నువ్వు మిస్ ఐపోతున్నావని నేను.."

అడ్డై.. "షడప్." అంది ఆగమ. కానీ.. కసరుకోలేదు. సిద్ధని చూసింది.

తను తననే చూస్తుండడంతో.. చూపు మార్చుకుంటూ.. "టేక్కేర్. త్వరగా కాలేజీకి రా." చెప్పేసి.. అక్కడి నుండి కదిలిపోయింది ఆగమ.

తర్వాత.. కాలేజీకి వెళ్లక.. ఇంటికి బయలుదేరింది.

మూడు రోజుల తర్వాత..

క్లాస్ లోకి వస్తున్న సిద్ధని

చూసింది ఆగమ.

సిద్ధ ఆమెనే చూస్తూ.. శీను జరగ్గా.. ఆమె వెనుక బెంచీ అంచున కూర్చున్నాడు.

లెక్చరర్ టీచింగ్ కొనసాగుతోంది.

పిరియడ్ బ్రేక్ న.. వెనుక్కు తిరిగి.. "శీను ఇవ్వక పోతే చెప్పు.. గత రోజుల్లోని నోట్స్ లు ఇస్తాను." సిద్ధకి చెప్పింది ఆగమ.

చిన్నగా తలాడించాడు సిద్ధ. శీను మెల్లిగా నవ్వుకుంటాడు.

మర్నాడు..

కాలేజీకి వస్తున్న దార్లో.. ఆగమ ఆగుంది.

అటు వస్తూ.. సిద్ధ తనని చూసి ఆగేక.. "రేపు ఆదివారం. సో.. రేపు సాయంకాలం ఐదింటికి కార్నర్ పార్క్ కి రా. నేను వస్తాను." చెప్పింది. ఆ వెంటనే.. సైకిల్ తో కాలేజీ వైపుకు కదిలింది.

సిద్ధ కూడా ఆమె వెనుకే తన సైకిల్ తో కదిలాడు.

మర్నాడు..

కార్నర్ పార్క్ న.. చెట్టు నీడన ఉన్న బెంచీ మీద.. ఎడమ ఎడమగా నైనా.. ముఖాముఖీకి అనువుగానే.. ఆగమ.. సిద్ధ కూర్చొని ఉన్నారు.

"నీ పొట్ట ఎలా ఉంది. అన్నీ తినగలుగుతున్నావా." అడిగింది ఆగమ.

"మసాలా.. కారం.. ల్లాంటివి అప్పుడే వద్దన్నారు. పెరుగు, మజ్జిగలతో అన్నం తినేయ గలుగుతున్నాను. ప్రస్తుతం అరటి పండు.. దానిమ్మ గింజలు నంజుకుంటున్నాను. పర్వాలేదు. బాగున్నాను." చెప్పాడు సిద్ధ.

ఇద్దరి మధ్య మాటలు ఆగాయి.

"చచ్చి ఏం సాధించగలవు." టక్కున మాట్లాడింది ఆగమ.

వెంటనే మాట్లాడలేక పోయాడు సిద్ధ. తల దించుకొనున్నాడు.

"చెప్పు." ఆగమ రెట్టిస్తోంది.

"నువ్వు.. నాకు కావనుకున్నాను. చచ్చిపోవాలనుకున్నాను." నసుగుతున్నాడు సిద్ధ. ఇంకా తల ఎత్తడం లేదు.

అంతలోనే.. "చాల్లే. నీకు పిచ్చి. ముమ్మాటికీ నువ్వు.. నువ్వు వేస్ట్ ఫెలోవి." అనేసింది ఆగమ. ఆ వెంబడే.. "సారీ. నిన్ను తూలనాడడం లేదు. నిజంగా నువ్వు ఓ తొందరపాటు మనిషివి." అంది.

సిద్ధ తల ఎత్తాడు. ఏదో అనబోతాడు.

"ప్లీజ్. నన్ను మాట్లాడనివ్వు. దయచేసి నేను చెప్పబోయేది పాజటివ్ గా తలకి ఎక్కించుకో." చెప్పింది ఆగమ.

సిద్ధ ఏమీ అనలేదు.

"మళ్లీ చెప్తుతున్నాను అనుకోకు. మనం చదువుకుంటున్నాం. దానిని నిర్లక్ష్యం చేయవద్దు.." చెప్తుతోంది ఆగమ.

సిద్ధ ఆమెనే చూస్తున్నాడు.

"నాకు చదువు అవసరం. నా ఫ్యూచర్ ఆలోచనలు నాకు ఉన్నాయి. అందుకు నేను చదువును విస్మరించ లేను."

చెప్తుతున్న ఆగమకి అడ్డై.. "అందుకు నా వేడికోలు ఏం అడ్డవుతోంది." అడిగాడు సిద్ధ.

"ప్లీజ్. నన్ను పూర్తిగా మాట్లాడనివ్వు." చెప్పింది ఆగమ.

సిద్ధ 'సరే' అన్నట్టు తలూపాడు.

"నీ మీద కూడా.. మనలాంటి స్టేజ్ వాళ్లకి పూనే 'సమ్మోహం' వాలింది. నువ్వు నిగ్రహించుకోలేక పోతున్నావు. సో బేడ్." చెప్పి ఆగింది ఆగమ.

సిద్ధ ఏమీ అనడం లేదు.

"ఎట్ ద మూమెంట్.. నిన్ను సంభాలించలేను. సో నాదో మాట.." మళ్లీ ఆగింది ఆగమ.

'ఏంటి' అన్నట్టు చూస్తాడు సిద్ధ.

"అది చెప్పే ముందు.. కొద్ది పాటి 'చిట్ చాట్'.. ప్లీజ్." అంది ఆగమ.

'సరే' అన్నట్టు తలాడించాడు సిద్ధ. కానీ ఇంకా మాట్లాడడం లేదు.

"నీకు నేను ఎందుకు కావాలి." అడిగింది ఆగమ.

సిద్ధ నిలువుగుడ్లుఏసుడయ్యాడు.

ఆగమ ముభావం ప్రదర్శిస్తోంది.

సిద్ధ తల దించుకున్నాడు.

"చెప్పు." ఆగమ రెట్టిస్తోంది.

అప్పటికీ మాట్లాడలేక పోతున్నాడు సిద్ధ.

"పోనీ.. ఆప్షన్స్ ఇస్తున్నా.. నా స్నేహం కోసం / నా అందం కోసం / నా పొందు కోసం / నా ప్రేమ కోసం." ఆగింది ఆగమ.

సిద్ధ తలెత్తాడు.

"ఈజీ పర్చాగా. చెప్పు." ఇప్పుడు చిన్నగా నవ్వుతోంది ఆగమ.

తడబడుతూనే.. "అవేవీ కావు.. కేవలం నీ కోసం." చెప్పగలిగాడు సిద్ధ.

"అవునా.. నీకు నేను ఎందుకు." అడిగింది ఆగమ.

సిద్ధ మళ్లీ చిందరయ్యాడు. "చిట్ చాట్ వద్దు." అనేసాడు.

ఆగమ ఏమీ అనలేదు. అతడినే చూస్తోంది.

"నేను మాట్లాడతాను.. నేను చెప్తాను." మెల్లి మెల్లిగా అన్నాడు సిద్ధ.

ఆగమ ఏమీ అనలేదు.

"నేను.. నిన్ను చూసేక.. ఒకటే అనుకున్నాను.. నువ్వు నాకే కావాలి.. ఫిక్సైపోయాను. నీ అందం.. నీ పొందు.. నీ స్నేహం.. నీ ప్రేమ.. వగైరాలు.. సెకండ్రీ లబ్బా." ఆగాడు సిద్ధ.

ఆగమ వింటోంది.

"మూవీ అండ్ టివి లలో ఫేమయ్యిన ఆ లవర్స్ జోడీల్లా.. నిన్ను.. నన్ను తలుస్తున్నాను.. వాళ్లకి మించి మనం నిజమవ్వాలని తపిస్తున్నాను." ఆగాడు సిద్ధ.

ఆగమ వింటూనే ఉంది.

"నువ్వు గుర్తించావో లేదో.. నేను కోరి నీ డ్రస్ కలర్స్ ల్లాంటి కలర్స్ డ్రస్ లు వేసుకోవడం జరుగుతోంది. చాలా సార్లు దార్లో నీ డ్రస్ కలర్ ను చూసి.. నేను తిరిగి ఇంటికి పోయి.. అదే కలర్ డ్రస్ వేసుకు వచ్చేవాడ్ని కాలేజీకి.." చెప్పుతున్నాడు సిద్ధ.

అడ్డై.. "బస్ బస్. చాలు. నీ ట్రాక్ అవగతమైంది." అంది ఆగమ.

సిద్ధ మాట్లాపి చలించాడు.

"ఇవన్నీ ఈడు గారడీలు నాయనా." అనేసింది ఆగమ.

సిద్ధ ఏమీ అనలేకపోయాడు.

"ఆఁ. ఇక నువ్వు ఏమీ చెప్పక్కరలేదు. నేను చెప్పేది వినుకో." చెప్పింది ఆగమ.

సిద్ధ 'ఏంటో చెప్పు' అన్నట్టు చూస్తాడు.

"నేను నీకు కావాలి. కదా." సిద్ధనే చూస్తోంది ఆగమ.

'అవును' అన్నట్టు జర్రున తలాడించాడు సిద్ధ.

ఆగమ వెంటనే మాట్లాడ లేదు.

సిద్ధ.. ఆమె వైపు నుండి చూపు తిప్పడం లేదు.

చిన్నపాటి నిశ్వాస తర్వాత.. "నువ్వు మంచిగా చదువుకో. లెక్చరర్ స్థాయి జాబ్ సంపాదించుకో. పిమ్మట రా. అంత వరకు నేను నీ కోసం ఉంటాను." ఆగింది ఆగమ.

సిద్ధ కదిలాడు.

"పిజి వరకు స్టడీకి.. పిమ్మట జాబ్ కి.. సహజంగా సెవెన్ టు ఎయిట్ ఇయర్స్ పడుతోంది. అంత వరకు నేను నీ కోసమే ఉంటాను. అప్పటికి నువ్వు రాకపోతే మాత్రం.. ఇప్పటి నుండి ఆఫ్టర్

ఎయిట్ ఇయర్స్.. నేను ఎవరైనా పెళ్లి చేసుకుంటాను." చెప్పడం ఆపింది ఆగమ.

సిద్ధ ఆమెనే చూస్తున్నాడు.

"నువ్వు.. నీకు నేను కావాలి.. అనుకుంటే.. నేను కోరేది చేయలేవా." గమ్మత్తుగా అడగ్గలిగింది ఆగమ.

సిద్ధ వెంటనే.. "నాకు ఓకే." అనేసాడు.

ఆగమ తేలికయ్యింది.

"ఇక ఈ వెంబడి పడడాలు.. నీ వెంపర్లాడులు.. ఆపేసి. ప్రామిస్ చేసి మరో మారు చెప్తుతున్న. నువ్వు సాధించి పెట్టు.. నన్ను నీతో అట్టి పెట్టుకో." అనేసింది.

"డన్." వెంబడే అనేసాడు సిద్ధ.

"ఆలోచించుకో." రెట్టించింది ఆగమ.

"నో.. నో మోర్. నేను ఫిక్స్." అనేసాడు సిద్ధ.

ఆగమ లేచింది.

సిద్ధ లేవలేదు. "నమ్మనా." అమాయకంగా అడిగాడు సిద్ధ.

"నేను మాట తప్పను. ఛట్సిట్." సూటిగా చెప్పింది ఆగమ. ఆ వెంబడే.. "ఒకటి గుర్తు పెట్టుకో.. నేను నీ కోసం వేచి ఉండేది.. ఇప్పటి నుండి ఎయిట్ ఇయర్స్ వరకు మాత్రమే. ఈ లోగా మనవి ఎవరి సొదలు వాళ్లవే. కోరి కలవడాలు.. మాట్లాడు కోవడాలు.. అప్పటి వరకు బంద్." చెప్పింది ఆగమ.

సిద్ధ లేచాడు. నిటారయ్యాడు. "థాంక్స్." అన్నాడు. ఆ వెంబడే.. "నిన్ను నమ్ముతున్నాను. నన్ను నమ్ము. నేను నిన్ను వదుకోను. ఐ విల్ కమ్ ఫర్ యు బిఫోర్ యువర్ డెడ్లెన్ విత్ ద రిక్వైర్మెంట్స్ దట్ యు విల్ సపోర్ట్." చెప్పాడు.

"ఐ విల్ వైట్. బిలివ్ ఇట్ వెల్. గో ఎహెడ్." చెప్పింది ఆగమ.

ఆ పిమ్మట.. ఆ ఇద్దరూ.. ఎవరి దారిన వారు ఇళ్లకు తమ తమ సైకిల్స్ పై కదిలిపోయారు.

ఆ తర్వాత్తర్వాత.. ఇంటర్మీడియట్ పూర్తయ్యేక..

ఆగమ.. సిద్ధ.. తమ తమ పై చదువులకై కాలేజీలు మారిపోయారు. అందుకు ఊళ్లూ మారిపోయారు.

అప్పుడే తమ తమ ఫోన్ నెంబర్లును ఎక్ఛేంజ్ చేసుకున్నారు. అది కూడా తమ తమ అడ్రస్ ల కోసమే.. మరియు కాల్స్ చేయరాదు ఓన్లీ మేసేజ్ ల వరకే.. అవీ అవసరం మేరకే.. అనుకున్నారు.

అది మొదలు ఇద్దరూ ముఖాముఖీ కలిసిందే లేదు. కానీ.. అప్పుడప్పుడు కొద్దిపాటి మేసేజ్ లు ఇద్దరి మధ్య చోటు చేసుకుంటుండేవి.. అవి చదువుల మేరకే.

'సిద్ధ నిలకడై నిలుస్తాడా.' ఆగమ ఎప్పటికప్పుడు అనుకుంటూ ఉంటుంది.

సిద్ధ తన ప్రయత్నం పట్టు వీడడం లేదు.

ఆ తోవన..

పిజీ అందుకున్న కొలది రోజుల్లోనే ఓ స్టాండర్డ్ ప్రయివేట్ కాలేజీలో లెక్చరర్ జాబ్ పొందేసాడు.

ఆ వెంబడే.. 'నేను సాధించాను. నిన్ను కలుస్తాను.' ఆగమ కు ఆగమేగాలమీద ఫోన్ ద్వారా మేసేజ్ పెట్టాడు.

రమారమీ అరగంట తర్వాత.. 'హాయ్ సిద్ధ.. కన్గ్రాట్స్.. గడువుకు ముందే సాధించేసావు. మై విష్ ఈజ్ ఫుల్ఫిల్డ్. ఐ యాం వెరీ హేప్పీ. నీ పట్టును ఘనంగా అభినందిస్తున్నాను. బట్.. నీ ఎదురుపడుటకు జంకుతున్నాను.' మేసేజ్ పెట్టింది ఆగమ.

ఆ వెంబడే.. 'వై. ఏమైంది. ఎందుకు.' చకచకా మేసేజ్ చేసాడు సిద్ధ.

ఆగమ నుండి పది నిముషాల వరకు మేసేజ్ రాలేదు.

ఆ సేపంతా సిద్ధ తల్లడిల్లిపోయాడు. ఆగమ నుండి మేసేజ్ రాగానే.. దానిని గబగబా బయటికే చదివేసాడు. 'నన్ను చూసాక.. నీ రియాక్షన్ ని

ఊహించుకోలేకపోతున్నాను.'

సిద్ధ ఆగమవుతున్నాడు. 'ఆగమ.. నీ వాలకంతో నేను బెంబేలవుతున్నాను.' వెంటనే మేసేజ్ పెట్టేసాడు.

కొద్ది నిముషాల పిమ్మట.. 'కూల్ సిద్ధ. నీ అవస్త తెలుస్తోంది. కూల్.' అటు నుండి ఆగమ మేసేజ్ పెట్టింది.

'నా ఎదుటపడ్డానికి నీకు జంకు ఎందుకు.' ఇటు సిద్ధ మేసేజ్ పెట్టాడు. ఆ వెంబడే.. 'నేను నిన్ను కలుస్తాను.' మరో మేసేజ్ చేసాడు. ఆగమ మేసేజ్ కై వేచి ఉన్నాడు. అది రావడం లేటవుతున్న కొద్దీ సిద్ధ గందికయ్యి పోతున్నాడు.

సుమారు ఐదు నిముషాల తర్వాత.. 'నా మీది అప్పటి నీ అభిప్రాయం దేనికీ చెక్కు చెదరనదేగా.' ఆగమ నుండి మెసేజ్ వచ్చింది.

'అరె. వాట్ హెప్పన్డ్! వాట్ ఆర్ యు పుషింగ్ న్యూ? నేను ఇంత చేసింది నీ కోసమేగా.' సిద్ధ వెంటనే మెసేజ్ పెట్టాడు.

'అదే. భయంగా ఉంది. అప్పటి ఆగమని ఇప్పుడు కాను.' మెసేజ్ చేసింది ఆగమ.

'నో మోర్ ప్లీజ్. నీ ప్రస్తుత అడ్రస్ పంపు. ప్లీజ్.' గబగబా మెసేజ్ చేసాడు సిద్ధ.

రెండు నిముషాలు గడిచాక.. 'నన్ను కలిసాక.. నాపై నువ్వు నెగటివ్ చూపినా.. నీపై మాత్రం నువ్వు పాజిటివ్ చేపట్టాలి. ఇది నా రిక్వెస్ట్.. కాదు కాదు.. నీ మీద ఒట్టు.' ఆగమ మెసేజ్ పెట్టింది.

'అరె. ఏంటిదంతా. నీ ధోరణి బేజారు పరుస్తోంది.' సిద్ధ మేసేజ్ పంపాడు.

'అదే నాకు భయం. మెసేజ్ టు మెసేజ్ కే నువ్వు నిలకడ తప్పుతున్నావు. ఇక ఫేస్ టు ఫేస్ కి నువ్వు నిలబడ గలవా.' ఆగమ మెసేజ్ చేసింది.

'ఏంటీ స్ట్రెచ్చింగ్.. ప్లీజ్ ఆగమా.. మనం కలుద్దాం.' సిద్ధ మెసేజ్ చేసాడు.

రమారమీ రెండు నిముషాల తర్వాత.. 'ఇంతవరకటి నీ పాజిటివ్ ఆటిట్యూడ్ ఇక మీదట కూడా కొనసాగుతోందని నమ్ముతున్నాను.. దానిని గట్టిగా కోరుకుంటున్నాను. నా అడ్రస్ పంపుతున్నాను. మనం కలుద్దాం.' ఆగమ మెసేజ్ చేసింది. ఆ వెంబడే.. తన 'ప్రజెంట్ అడ్రస్' పెట్టింది.

మర్నాడు.. పది పది ఏయం..

ఆగమ మెసేజ్ ల ద్వారా పంపే సూచనల ప్రకారం.. ఆమె ముందు చేరాడు సిద్ధ.

ఆగమ చీరలో ఉంది. కుర్చీలో కూర్చొని ఉంది. సిద్ధ ను చూసి కూడా లేవలేదు. తను ముభాంగా సిద్ధ ను చూస్తోంది.

అది ఒక ఆఫీస్ రూంగా గుర్తించగలిగాడు సిద్ధ. అప్పటికే ఆ ప్రాంతం ఒక స్కూలుగా గమనించి ఉన్నాడు.

ఆగమ ముందు ఉన్న టేబుల్ మీది 'నేమ్ స్టాండ్'ని చూసాడు. దాని మీది.. 'ఆగమ, యం.ఎ.' చదివాడు.

"ఓ. పిజీ చేసావా. డిగ్రీ తర్వాత కాలేజీకి వెళ్లడం లేదని మేసేజ్ చేసావుగా." అన్నాడు సిద్ధ.

"ప్రయివేట్ గా పిజీ చేసాను." చెప్పింది ఆగమ. ఆ వెంబడే.. తన టేబుల్ ముందు ఉన్న కుర్చీలు చూపుతూ.. "కూర్చో." అంది.

సిద్ధ ఒక కుర్చీలో కూర్చున్నాడు. తననే చూస్తున్న ఆగమతో.. "ఏంటిదంతా." అడిగాడు.

"ఇది.. నేను నిర్వహిస్తున్న స్కూలు." మామూలుగా చెప్పింది ఆగమ.

"వెల్. బట్.. నేనడుగుతోంది.. నీ మెసేజ్ లు గురించి." చిరాకులో ఉన్నాడు సిద్ధ.

"నీకు చెప్పి ఉన్నాను. నాకు చదువు అంటే ఇష్టం. బట్.. అనుకున్నట్టు దానిని కొనసాగించుకోలేక పోయాను." చెప్తూతోంది ఆగమ.

సిద్ధ వింటున్నాడు.

"నీకు తెలియపర్చి..

నిన్ను డిస్టర్బ్ చేయరాదని జరిగిన నా విషయాలు దాచాను. ఇప్పుడు బయలుపర్చక తప్పడం లేదు. ఇది నాకు గొప్ప హైరానే." ఆగింది ఆగమ. సిద్ధ ను చూస్తోంది.

సిద్ధ.. ఆమెనే చూస్తున్నాడు.

చిన్నగా కదిలి.. చూపు మార్చుకుంటూ.. "నేను ఓ యాక్సిడెంట్ కు గురయ్యాను. కదల లేని స్థితిలో పడ్డాను." ఆగింది ఆగమ.

సిద్ధ.. అమెను ఎగాదిగా చూస్తాడు.

"చెప్పగా.. నాకు చదువు అంటే ఇష్టం.. నెమ్మదిగా నేను తేరేక.. అమ్మ.. నాన్నల ఊతంతో.. నేను ఓ కాన్వెంట్ నెలకొల్పుకున్నాను. దానిని మంచి టీచింగ్ స్టాఫ్ తో ఇలా విస్తరించుకుంటున్నాను." నెమ్మది నెమ్మదిగా చెప్పింది ఆగమ.

"వెల్. నైస్ గో అప్. మై వార్మెస్ట్ విసెష్ అండ్ కన్గ్రాట్యులేషన్స్." సాఫీగా చెప్పగలిగాడు సిద్ధ. ఆ వెంబడే.. "బట్.. ఆ మెసేజ్ లేమిటి. నాకు ఏమీ తోచడం లేదు." అన్నాడు.

"కూల్.. నా భయం వేరేది." తలదించుకుంది ఆగమ.

"అరె. వాట్ యా. ఇంకా నన్ను ఇరకాట పర్చకు. ప్లీజ్. సూటిగా చెప్పేసి." చెప్పాడు సిద్ధ. ఆ వెంబడే.. "ఐ విల్ నాట్ రష్ యు. ప్రామిస్. ప్లీజ్ రివిల్ దట్." దీనంగా అడిగాడు.

ఆగమ తలెత్తింది. సిద్ధ ను చూసింది. వెంటనే చూపు మార్చుకుంటుంది.

"ప్లీజ్.. ఆగమ. నాన్చకు. నన్ను సాఫీగా ఊపిరి తీసుకోనివ్వు." చెప్పాడు సిద్ధ.

కొద్ది పాటి సమయం తర్వాత.. ఆగమ ఎడమ వైపు ఒంగింది. నేల మీది 'హ్యాండ్ స్టిక్' ను తీసుకుంది. దాని సాయంతో లేచి నిల్చుంది. కుర్చీని వెనుక్కు నెట్టి.. టేబుల్ వెలుపలికి కదిలి.. నడుస్తోంది.

ఆగమ కుంటుతున్నట్టు పోల్చేసాడు సిద్ధ.

"నా యాక్సిడెంట్ గూర్చి చెప్పాగా.. అప్పుడే నా కుడి కాలు తీసేయ వలసి వచ్చింది. కృత్రిమ కాలుకి కూడా అవకాశం లేకపోయింది." సిద్ధ ను చూస్తూనే చెప్పింది ఆగమ.

ఆ తర్వాత.. ఆ ఇద్దరి మధ్య మాటలు కొద్ది సేపు లేవు.

ముందుగా.. "ఐతే.. ఏమంటావ్." సిద్ధే మాట్లాడేడు. ఆ వెంబడే.. "దీనికేనా నువ్వు జంకేది. ఏమైంది. నన్ను మరీ చిన్న పర్చేసావ్." అనేసాడు.

ఆగమ మాట్లాడబోయింది.

అడ్డె.. "నేనూ చెప్పాను. నీ అందం.. మరోటి కాదు.. నువ్వు నాకు కావాలి.. అని. దానికే నేను కట్టుబడి ఉన్నాను.. ఉంటాను." చెప్పాడు సిద్ధ.

ఆగమ చెప్పబోతోంది.

"తొలుత కూర్చో. ప్రశాంతమవ్వు." చెప్పాడు సిద్ధ.

ఆగమ కూర్చొంది. 'హ్యాండ్ స్టిక్' ని కింద పెట్టింది.

"సూటిగా ఇప్పుడు అడుగుతున్నాను. చెప్పు." చెప్పాడు సిద్ధ.

తలెత్తి సిద్ధనే చూస్తోంది ఆగమ.

"ఏక్సెప్ట్ మి యాజ్ యువర్ హస్బ్యాండ్. ప్లీజ్." సిద్ధ ఆశగా ఆగమ ను చూస్తాడు.

ఆగమ చూపు మార్చుకుంది.

"ప్లీజ్. లెట్ గో ఆఫ్ ఫీయర్స్. స్టే మి విత్ యు. ప్లీజ్." వినయంగా చెప్పాడు సిద్ధ.

ఆగమ చూపుని సిద్ధ వైపు తిప్పింది.

"ఇక.. నా పై.. నీకు మరెట్టి సంశయాలు లేవుగా." అడిగాడు సిద్ధ.

'లేవన్నట్టు' తలాడించింది ఆగమ. ఆ వెంబడే.. "థాంక్స్." అంది.

"నోనో. ఐ యాం గ్రేట్ఫుల్ టు యు ఫర్ ఎవర్." నిండుగా చెప్పాడు సిద్ధ. ఆ తర్వాత..

"నేను నా జాబ్ మానేస్తా. నీతో ఉంటా. నీ స్కూలుకై నీతో పనిచేస్తా." చెప్పాడు.

సిద్ధనే చూస్తూ

ఉండిపోతోంది ఆగమ.

"మీ పేరెంట్స్ నీతోనే ఉంటున్నారా." అడిగాడు సిద్ధ.

"అం. ముగ్గురం స్కూలుకు ఆనుకొని ఉన్న ఇంటిలో ఉంటున్నాం." చెప్పింది ఆగమ.

"గుడ్. నేను బయలు దేర్తాను. రెండ్రోజుల్లో.. నా పేరెంట్స్ తో వస్తాను. మన పెళ్లికి సిద్ధపడు." లేచాడు సిద్ధ.

లేవబోయింది ఆగమ.

"ప్లీజ్. యు జస్ట్ సిట్ ధేర్ ప్లెజన్లీ. రెండ్రోజుల్లో కలుస్తా. బై." సిద్ధ ఆనందంతో అక్కడి నుండి వెళ్లిపోతాడు.

ఆగమ ఉబ్బితబ్బిబ్బగుతోంది.

కొన్ని నిమషాల తర్వాత.. ఆగమ తేరుకుంటూ.. తన తండ్రికి ఫోన్ చేస్తోంది.

అటు ఆమె తండ్రి తన కాల్ కు కనెక్ట్ కాగానే.. "నాన్నా.. సిద్ధ వచ్చాడు. నేను భయ పడినట్టు కాలేదు. తను ఏ మాత్రం మార లేదు. నన్ను పెళ్లి చేసుకోడానికి సమ్మతించాడు. రెండు రోజుల్లో తన తల్లిదండ్రులతో వచ్చి.. మీతో మాట్లాడతాడట." సరదా సరదాగా చెప్పింది ఆగమ.

"శుభమ్." అనేసాడు ఆగమ తండ్రి.

ఒకటిన్నర రోజుల తర్వాత.. మూడు ఏభై ఆరు పియం..

ఆగమ పంపే మెసేజ్ ల సూచనలు ప్రకారం.. ఆగమ ఇంటిని చేరాడు సిద్ధ.. తన తల్లిదండ్రులతో.

డోర్బెల్ మోగుతుండగానే.. ఆగమ తలుపు తీసింది.

చిన్నగా నవ్వుతూ.. వచ్చిన వాళ్లని ఇంట్లోకి ఆహ్వానించింది. హాలు వైపుకు కదిలింది.

ఆగమ ను చూసిన సిద్ధ.. ఆశ్చర్యంలో ఉంటుండగానే.. అతని తల్లిదండ్రులు ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటారు.

అంతలోనే.. ఆగమ తల్లిదండ్రులు ఎదురు వచ్చి.. ఆ ముగ్గురు ను నిండుగా పలకరించి.. సోఫాలో కూర్చో పెట్టారు.

తన తల్లిదండ్రులు సోఫా కుర్చీల్లో కూర్చోగా.. తల్లి దరిన ఆగమ నిల్చొని ఉంది.

ఆమెనే చూస్తున్నాడు సిద్ధ.

సిద్ధ చూపుల్లోంచి తన చూపులను ఆగమ మరల్చుకుంటుంది.

అప్పుడే.. "వాట్ ఈజ్ దిస్ ఆగమ." అంటాడు సిద్ధ.

కొడుకునే చూస్తున్నారు.. సిద్ధ తల్లిదండ్రులు.

సిద్ధనే చూస్తున్నారు.. ఆగమ తల్లిదండ్రులు.

"ఆగమ.. ఐ నీడ్ యు. థట్సిట్. ప్లీజ్ స్టాప్ డౌటింగ్ మి." చెప్పాడు సిద్ధ.

ఆగమ ఏదో చెప్పబోతోంది.

ఆగమ తండ్రి కలగ చేసుకుంటూ.. "అమ్మాయి కదా. పైగా లోకం పోకడ ఎరిగింది. తన భీతి తనది. అర్థం చేసుకోవాలి." సంజాయిషీలా చెప్పాడు.

"నేను వద్దన్న. కూతురు కు వత్తాసు పలికేసారు ఈయన. ఈ తండ్రీ కూతుర్లు తొందరయ్యారు. క్షమించండి." చెప్పింది ఆగమ తల్లి బిక్కుబిక్కుగా.

"అయ్యో.. మీరు ఆందోళన పడవద్దు. మా అబ్బాయి.. మీ అమ్మాయి గురించి చెప్పేడు. వాడి ఇబ్బందిని మేము ఎన్నడూ కోరుకోం. మేము పక్కా సమ్మతితోనే వచ్చాం." చెప్పాడు సిద్ధ తండ్రి.

"మరోలా అనుకోవద్దు. పెళ్లి అయ్యేక.. ఏమైనా యాక్సిడెంట్స్ ఐతే.. మనం విస్మరించడం ధర్మమా." సిద్ధ తల్లి కలగచేసుకుంది అంతలోనే.

"మీవి పెద్ద పెద్ద మనుసులు. మీతో సంబంధం మా అదృష్టం." ఆగమ తల్లి ఆనందం పడుతోంది.

"మీకు థాంక్సండీ." చెప్పాడు ఆగమ తండ్రి.

సిద్ధ తల తిప్పి.. ఆగమ ను చూస్తాడు.

అప్పుడే ఆగమ అంది.. "నా యాక్సిడెంట్ కథ చెప్పి.. నీకు అబద్దం చెప్పను. మరోలా అనుకోవద్దు. ప్లీజ్ సిద్ధ." గిల్టీగా కదులుతోంది.

"ఆగమ.. నన్ను నమ్ము. నువ్వు మాత్రమే నాకు కావాలి. అంతే." చెప్పాడు సిద్ధ.

ఆ వెంబడే.. "నో మోర్ జిమ్మిక్స్ యా. ప్లీజ్." చెప్పి.. చక్కగా నవ్వేడు.

అంతా కుదురవుతున్నారు.

"ఆగమ.. కాఫీలు ఇద్దావు. రా." ఆగమ తల్లి లేచింది. కిచెన్ వైపు కదిలింది.

తల్లి వెనుక తీరుగా నడుస్తూ వెళ్తోంది ఆగమ.

ఆమెనే చూస్తూ ఉండిపోయాడు సిద్ధ.

తర్వాత.. తనకు ఆగమ.. కాఫీ కప్పు అందిస్తున్నప్పుడు.. "ఆగమ.. నీ నటన అద్భుతం.. నీ కుంటితనం ప్రదర్శన నేచురల్ గా ఉంది. బట్.. నేనే పాసయ్యాను. సారీ ఆగమ." చెప్పాడు సిద్ధ.

"అయ్యో,, మీది మామూలు పాసా.. అది డిస్టింక్షన్ పాస్" వెంటనే అన్నాడు ఆగమ తండ్రి.

అంతా నవ్వుకున్నారు.. ఆగమతో పాటుగా.

★★★

# అచ్చర పోరు

తాటి హరీష్ .

అణా పైసనైనా సంపాదించని
గీ అచ్చరాల్ని గుండె నిండారా ఎత్తుకుని
కాగితపు దోసిట్ల ఒడ్సి వట్టి
పసిపిల్లోలే పదాలను ముద్దాడుకుంటా
నీతి పాఠాలు నేర్పే పుస్తకాలతో దోస్తీ జేసుకుంటా
బత్కు ఎతలను కలంతో కైతలుగట్టి
కదిలే కాలపు కచ్రానికి ముడుపుగడ్తున్నా!..
ఏ పేరు కోసమో, ఎవ్వని మెప్పుకోసమో,
ఎవ్వడో యిసిరేసే ఎంగిలి మెతుకులకు ఆశపడో గాదు
ఆకలికై తండ్లాడుతున్న పేగుల అరుపులతో
అచ్చర పోరుబాట బట్టి
పూటపూటకు ఆత్మ సంతృప్తి గంజి వార్చి
కడ్పు ఆఖలి పండుగను ఏళ్ళదీసుకుంటా వత్తాన్నా!....

కథ

# అదేదో సమేత చెప్పినట్లు

అమృత జ్యోత్స్న

సరిత ఓ గృహిణి. "ఇంటికి దీపం ఇల్లాలుఅన్నట్లుగా" ఉండే గడుసు అమ్మాయి. 'ఇద్దరూ ఇద్దరే'అన్నట్లుగానే ఉంటారు ఆమె భర్త, కొడుకు.స్కూల్ కి టైం అవుతున్నా వాళ్ళ అబ్బాయి "బెల్లం కొట్టిన గుండ్రాయి"ల వుంటే, పాపం సరితే అన్ని చూడాలి. సరిత మొగుడు సరేసరి "గంతకు తగ్గ బొంత" మాదిరి పిల్లాడికి ఏమాత్రం తీసిపోరు ఆఫీసుకి త్వరగా తెమలరాయే. హమ్మయ్య ఎలాగో డైనింగ్ టేబుల్ దగ్గరకు చేరారిద్దరూ. "కాలు కాలిన పిల్లి" లాగా డైనింగ్ టేబుల్ వద్దకు కిచెన్ కి తిరుగుతున్న సరితను చూస్తూ, " అమ్మో! ఆఫీస్ కి లేట్ అయ్యింది నేవెళ్ళాలి"అని రఘు అంటుంటే,తినేసి వెళ్ళమన్నాగా లేకపోతే సరిత చేసిన వంట "బూడిదలో పోసిన పన్నీరై"పోదు. అందుకే కాదు లెండి వచ్చే ఆదివారం పెళ్లి రోజు కదా ఇప్పట్నుంచే తన శ్రీవారిని కాకా పట్టే ప్రయత్నంలో ఇదొక్కటి కాబోలు . "వెర్రివేయి విధాలు పైత్యం పదివేల విధాలు" అన్నట్లుగా భర్తను కాక పెట్టడంలో ఇదో విధంమేమోమరి.."ఆడవారినోట్లో ఆవగింజ నానదు అన్నట్లె" రఘు టిఫిన్ తింటుండగా 'ఆలస్యం అమృతం విషం'

అనుకుంటూ మొదలెట్టింది సరిత "ఏమండోయ్!వచ్చే వారం పెళ్లి రోజు కదా! నాకేమి బహుమతి ఇస్తారు? అని ఉత్సాహం ఆపుకోలేక "చెవిలో జోరిగల "నస పెడుతూ "అడగందే అమ్మ అయినా పెట్టదంటారు "కదా అనుకుంటూ "కొంగ జపం చేప కొరకు" అని ఉన్న విషయం బయట పెట్టేసింది సరిత.

ఐనా" ఇండ్లన్నాక కాసుల్దండ లేకపోయినా కాసెండైన ఉండాల" అంటారు కదండీ నాకు ఆ వెండి, బంగారం కూడా వద్దు. 'జిహ్వ కోరుచి పుర్రె కో బుద్ధి'నేనేమో ఓ మంచి పట్టు చీర కొనిస్తారా!అని అడిగాను. కానీ నా పుట్టిన రోజుకు కూడా ఏమి తీసియలేదు. ఏదో ఆ రోజు "గబ్బిలాయి మొఖము నవ్వినా ఏడ్చిన ఒకేలా ఉంటుందంటారు" అలాగా నా ఏడుపు మొఖం చూసి, గుడికి తీసుకెళ్ళి తూతూ మంత్రంలా జరిపించారు .నేను ఏది అడిగినా 'నిమ్మకు నేరెత్తినట్లుగా' ఉంటుంది మీ వ్యవహారం. లేకపోతే "చెవిటోడి ముందు శంఖం ఊదినట్టే. " తిరిగే కాలు తిట్టే నోరు ఊరుకోవు" అన్నట్లుగా నేను అడుగుతూనే ఉంటాను మీకు మాత్రం "దున్నపోతు పైన వాన ఎరిసినట్లే"ఉంటుంది."ముందొచ్చిన చెవులకన్నా వెనుకొచ్చిన కొమ్ములు విలువ" అన్నట్లుగానే మన అబ్బాయి చింటు బర్త్ డే మాత్రం కేకు కోయించి, హోటల్ కి తీసుకెళ్ళి రాత్రికి ఓ సినిమా చూసుకొని భలే హంగామా చేస్తూ ముగించారే. అయినా "నోరున్నవాడిదే రాజ్యం" అన్నట్లుగా, "తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టుగా" వాడు ఆ ముందు రోజు ఏడ్చి ఆగిత్తం చేయబట్టే అలా జరిగిందనుకుంటా బహుశా. "చాదస్తపు మొగుడు చెబితే వినడు గిల్లితే ఏడుస్తాడు "అన్నట్లుగానే వుంది మీ వ్యవహారం. నాపాటికి నేను ఇంతలా "చెవినిల్లు కట్టుకొని పోయిన", ఇలా వాగుతూ ఉంటేవినిపించుకోరే? మంచోళ్ళకు అయితే మాటల్లో చెప్పాలి మొండి వాళ్ళకయితే మొట్టికాయ వేసి చెప్పాలి"అంటారు మరి మొగుడికి ఎలా చెప్పాలో? ఎవరూ చెప్పలేదే?అంటూ వాపోయింది సరిత.

" అసలే కోతి ఆపై కల్లు తాగింది "అన్నట్లుగా ఒకటే వాగుతున్న భార్యని చూస్తూ, టిఫిన్ తిన్నాక ప్లేట్ లో చేతులు కడుగుతూ రఘు సరితతో "సరితా! "చిత్తం శివుని మీద, భక్తి చెప్పుల మీద" అన్న విధంగా? అడగందే అమ్మయినా పెట్టదంటారనే" మాట నిజం చేశావు మరి.నాకు టిఫిన్ పెట్టి,ఇంకా పెట్టేదా? తింటారా?", అని అడగకుండా నీ పాటికి నీవు మాట్లాడుతున్నావే "అమ్మ కడుపు చూస్తుంది భార్య జేబు చూస్తుంది"అని పెద్దలు ఊరికే అనలేదు. క్యారి బాక్స్ రెడీ అయిందా? లేదా? నేను ఆఫీస్ కి వెళ్ళాలా? వద్దా? "చెవిలో జోరీగ" లాగా నీ సోది ఆపి కొంచెం నేను ఆఫీస్ వెళ్లే సంగతి పట్టించుకోవే అని కోపడ్డాడు.

దానికి సరిత వెంటనే "ఆడలేనమ్మ మద్దెలపై పడినట్లు" నాపై కోప్పడితే యెట్లా నేనేమైన నగలడిగానా? నాణ్యాలడిగానా? అయినా "ఉన్నమాటంటే ఉలుకెక్కువలె" పిల్లోడు పుట్టాక నాపైన ప్రేమ తగ్గిందిలే ఐన "ఆడదై పుట్టుటకంటే అడవిలో మ్రానై పుట్టుట మేలు" అని పెద్దలు ఊరకే అనలేదు" అని గొణుగుతూ క్యారీ రఘు చేతిలో పెట్టి" ఊరుకున్నంత ఉత్తమం లేదు, బోడిగుండంత సుఖం లేదు" అయినా అనవసరంగా నిన్ను అడిగా అంటూనే "గతిలేనమ్మకు గంజే పానకం" అనే ఊరికే అన్నారా పెద్దలు" చీర తీసి లేనప్పుడు తీసి లేను అని చెప్పొచ్చుగా "ఒక అబద్ధం కప్పిపుచ్చడానికి 100 అబద్ధాలు చెబుతూ ఉంటే ఎలా? ".అనీ గొనుగుతూ లోనికి వెళ్ళిపోయింది సరిత.

రఘు మనసులో "సముద్రం అయినా ఈదవచ్చు కానీ సంసారం ఈదడం కష్టంరా "బాబు అనుకుంటూనే సరిత వెనకాలే లోపలికి వెళ్లి సరితతో ఓ వెర్రిదానా! నీపై ప్రేమ తగ్గలేదే. నా జీతం అంతంత మాత్రమే. "ఎక్కడవేసిన గొంగళి అక్కడే వుంది "అన్నట్లుగా వస్తుంది "ఎంత చెట్టుకు అంత గాలి అన్నట్లుగానే ఖర్చు పెట్టుకోవాలి కాని, "అప్పు చేసి పప్పు కూడు" అవసరమా?" అలకాపురి రాజైన అమితంగా ఖర్చు పెట్టరాదు" అని తెలియదా? అంటూ "అరటిపండు వలిచి చేతిలో పెట్టినట్లుగా" తన పరిస్థితిని వివరిస్తూనే 'చదివితే ఉన్నమతి పోయినట్లు'గా తయారయ్యావే, నువ్వు అయినా "ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్టు "చిన్న

పిల్లోడితో నీకేంటి పేచి నువ్వు అర్థం చేసుకొంటావని అనుకున్నా "ఊపితే గుప్పెడు – పిసికితే పిడికెడు" అన్న చందంగా చేసేది సర్కారీ ఉద్యోగమైన నెలాఖరికి ఖర్చులు పోను జీతం "ఇసుకలో నూనె పిండినంత"గా మిగిలేదిఅని తెలుసుగా."పిండి కొద్ది రొట్టె "అంటారు పెద్దలు మరిచిపోయావా?"అందని పండ్లకు అర్రులు చాచినట్లు"గా వుంది నీ వ్యవహారం సరిత .ఐనా సరిత నీవు పట్టు చీరే కట్టాలా వందరూపాయలు చీరలోనైన అందంగా ఉంటావు అంటూ "మనసుంటే మార్గమే" లేదా? "క్షేత్రమెరిగి విత్తనం వేయాలి" అన్నారు పెద్దలు మర్చిపోయావా? ఆ సంగతి.

పెళ్లయిన కొత్తలో " అన్ని ఉన్న ఆకు అనే అణిగిమణిగి ఉన్నట్లుగా ఉండే దానివి, ఇప్పుడు ఏమీ లేని ఆకు ఎగిరెగిరి పడుతున్నట్లుగా" 'ఇల్లు పీకి పందిరేసే'లాగా మారిపోతున్నావు అయినా సరితా "నోటికి అదుపు ఇంటికి పొదుపు ఉండాలిగా" అంటూ "చిలక్కు చెప్పినట్లు చెబుతూనే "మోసేవాడికి తెలుస్తుంది కావిడి బరువు"నీకేం తెలుస్తుంది "రెక్కాడితే గాని డొక్కాడని "మన స్థితికదా అంటూ రఘు సర్ది చెప్పాడు.

దానికి సరిత వెంటనే " శతకోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలు" అని ఇలా పొగడ్తలతో అసలు విషయం దాటెయ్యక "పొగడ్త ఒక అగడ్త" అని నాకు తెలియదనుకోకండి.అయినా" అడిగే వాడికి చెప్పేవాడు లోకువ" అని నాకు చీర వద్దు ఏమి వద్దులే,"ఉట్టి కెక్క లేనమ్మ స్వర్గానికి ఎగిరిందంట "అలా వుంది నా కోరిక.ఈ "గతి లేనమ్మకు గంజే పానకము" లెండి . "శ్వాస ఉన్నంతవరకు ఆశ ఉండాలి" అని పెద్దలు చెప్పారు కాబట్టి ఏదో చిన్న ఆశతో అడిగాను తప్పుఅంత చీరల పిచ్చి లేదు సుమీ.

" అంతా మా వాళ్లే కానీ అన్నానికి రమ్మనే వారు లేరు" అన్నట్లుగా ఉంది చోద్యం నేను సంపాదించేదంతా నీకోసమే కదా అంటావు కానీ అడిగింది మాత్రం కొనియ్యవు అంది సరిత . పిల్లోడ్ని బడిలో వదిలి మీరు ఆఫీస్ కి బయలుదేరండి. మళ్ళీ ఆఫిసుకు ఆలస్యం ఐతే "పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం"లా మళ్ళీ నాపైనే అరుస్తారు. ఐనా "ఎముకలేని నాలుక కదా ఎన్నైనా అంటుంది"లే అంటూ నిస్టూరపోయింది.

రఘు దానికి "రెడ్డొచ్చే మొదలెత్తుకో" అన్న మాదిరి మళ్ళీ మొదటికే వస్తున్నావు. ' నిదానమే ప్రధానం'."కాళ్లకేస్తే మెడకు, మెడకేస్తే కాలికేస్తున్నావు. ఏమన్నాఅందామంటే "తిట్టబోతే అక్క బిడ్డ, కొట్టబోతే వేకటి మనిషి" అని ఈ పంచాయితి ఏదో సెలవు రోజు పెట్టుకోక ఇలా ఆఫీస్ కి వెళ్ళేటప్పుడు " తాను పట్టిన కుందేలుకి మూడే కాళ్లు" అన్నంత మొండిగా ఏంటి ఈ నిస్టూరాలు "ఇల్లు కన్నా గుడి పదిలం"అని ఏనాడో పెద్దలు అన్నారు అని మనసులో అనుకుంటూ తెగేదాకా లాగకు' అన్నాడు.

ఆ వెంటనే సరిత అయినా కాని మీరేమో "కడుపే కైలాసం, ఇల్లే వైకుంఠం"మాదిరిగా ఇంట్లో వుంటే టి.వి.,లేకపోతేనిద్ర,కాసేపు పిల్లాడితో కాలక్షేపం నాగురించి ఆలోచించరే?"నిమ్మకు నీరెత్తినట్లు"ఉంటారు అని అడిగితే ఏమో నిష్టూరాలు అంటారు. అయినా నాకేమి తీసియకు వద్దు అన్నాగా! మరి వదిలేయచ్చుగా ఆసంగతి,వదిలేసి మీరు ఎంచక్కా ఆఫీస్ కి వెళ్ళండి. నేరం నాదే లెండి "కాసుకు గతిలేనమ్మకోటికి కన్నేసినట్లు" అయినా మీతో గొడవ పడడం ఎలా ఉంటుందంటే "ఆకు వచ్చి ముళ్ళు మీద పడ్డా,ముళ్ళు వచ్చి ఆకు మీద పడ్డ బొక్క ఆకుకే" అని మీతో ఎంత గొడవపడినా మొత్తానికి మీరు అనుకున్నట్టేగా జరిగేది. 'ఉట్టికి ఎగరలేనమ్మ ఆకాశానికి ఎగిరినట్లు'గా ఆశపడడం నాదే తప్పు లేండి, నేనేదో మొండితనంతో ఆలోచిస్తున్నానే కానీ నేను అడిగిన చీరని పుట్టినరోజు కాకపోయినా పెళ్లి రోజైనా తీసిస్తాడు అని అనుకోవడం నాదే అవివేకం.

" " నేతి బీరకాయలో నెయ్యి ఉంటుందా? ఈయన మాటల్లో నిజం ఉంటుందా?",అని మనసులో గొనుక్కుంటూనే,' అంత్య నిష్టూరం కన్నా ఆది నిష్టూరం' మేలని మొదట్లోనే చెప్పేయొచ్చు కదా మీరు అంటూ "గతిలేనమ్మకు గంజే పానకం' అనే సర్దుకుపోయి ఉంటాను గా,ఉరుము ఉరిమి ఏ మంగళం పైన పడడం ఎందుకో?.

అంది సరిత. "తగువు ఎలా వస్తుంది జంగం దేవర అంటే మొదట బిచ్చం వెయ్యవే వచ్చి బొచ్చు ముందా అన్నాడట "అలాగుంది మన వ్యవహారం నేను ఏదో బహుమతి ఇస్తారు అనుకుంటే మీరే ఏదో మాట్లాడుతూ దీనినిరచ్చబండ వ్యవహారంలా సాగదీస్తున్నారు.

రఘు దానికి ఇంతదాక వచ్చింది కాబట్టి నీకో విషయం చెప్పాలి. అమ్మో! ఎంత పగ వుందే నామీద వెర్రిదాన! అంటూ ముసిముసి నవ్వులు నవ్వుతూ సరితదగ్గరకు తన గడ్డం పై చెయ్యి పెట్టి తల పైకెత్తి సరితా ! నీవు అలకలోను భలే అందంగా ఉన్నావే అమ్మడు. నీకు చీర కాదే బంగారపు ఉంగరమే కొన్నా! పెళ్లి రోజుకు సర్ప్రైజ్ గా ఇద్దామనుకున్నా! నీ పుట్టిన రోజుకే ఇవ్వాలనుకొన్న అప్పటికి డబ్బు సర్దుబాటు కాలేదు అందుకే పెళ్లి రోజుకు ఇస్తున్నా! కానీ నీ అలక ఇలా విషయాన్ని బయట పెట్టేసిందిఅని రఘు చెబుతున్నాడే గాని ఈ సరితకు మాత్రం బంగారపు వుంగరం అన్న మాట దగ్గరే చెవులు పనిచేయడం ఆగినట్లున్నాయేమో?

"మనసుంటే మార్గము" వుంది అని నిరూపించిన తన భర్తను చూస్తూ " క్షేమంగా వెళ్లి లాభంగా రండి" అంటూ చేతులు ఊపుతూ బై బై చెబుతూ,."అనుకున్నదొక్కటి, అయ్యిందొక్కటి లాగా" సరిత ఒకే సారి ఆశ్చర్యం మరియు ఆనందంలో ఉండగా రఘు, చింటూ ని తీసుకొని బయటకు బయలుదేరారు. ఈ సరిత చీర చాలనుకొంటే తన భర్త ఉంగరం ఇస్తాడంటే తన భర్త ప్రేమను గుర్తించ లేకపోయినందుకు బాధపడుతూనే "తంతే బూరెల గంప"లో పడ్డట్లు గా వుంది అనుకొంటూ ఈ ఆనంద విషయం" కల్యాణ మొచ్చినా కక్కొచ్చినా ఆగదు" అన్న తీరులో వెంటనే పక్కింటి పంకజం ఆంటీకి చెప్పేందుకు "లేడికి లేచిందే పరుగు "అన్నట్లుగా పరుగు పరుగున వెళ్ళింది సరిత.

★★★

కథ

# టంకసాల వారి కడగండ్లు

అయ్యల సోమయాజుల సుబ్రమణ్యం

సాహితీ సమరాంగన సార్వభౌములు శ్రీకృష్ణదేవరాయలు అవిచ్ఛంన్నంగా దక్షిణా పథాన్ని యేలుతున్న కాలము.ఆ నాటి మహాకవులలో టంకసాల నృసింహకవి ఒకరు.ఇతడు పాండిత్య,కవిత్వమ ములలోనే కాక , శిల్పవిద్య యందు ను దిట్ట. సంతానవంతుడు.అయిననేమి, నోటి లో నాలక లేని వాడు.నివురుగప్పిన నిప్పు. ఇతరుల నాశ్రయించి పని సాఫల్యము చేసికొను శక్తియుక్తులు లేవు.ఇతడు ' మాంధాతచరిత్ర' యను కావ్యమును రచించెను.వారి తండ్రి అందలి కవిత్వగుణమనను బట్టి కవికర్ణరసాయనము యను పేరు పెట్టినాడు.ఆ నాటి కవులు కూడ ఆ పేరు సార్ధకనామమే యనిమెచ్చుకొనిరి.వారు ఎన్ని ముద్రలు వేసిన యేమి ప్రయోజనము. వారనదికారులు కదా! పదవులలో నున్న కవుల ముద్ర పడిన ప్రభుప్రశంసకు పాత్రులగుదురు.ఏ నాడైనను అధికారముద్ర కా ప్రభావమున్నది.

నృసింహకవి తన కావ్యమును తీసికొని పెద్దనను దర్శించుటకు వెడలెను.ఆ సమ యమున భట్టుమూర్తికి మేఘదూతము పాఠము చెప్పుచుండెను.తన యింటికి వచ్చి న నృసింహకవికి ఆసనము, అర్ఘ్యము నిచ్చి గౌరవించెను.పెద్దనగారి పాఠప్రవచన రీతి నృసింహకవినెంతో తన్మయమెనర్చినది.శ్లోకమును పెద్దనగారి ముందొకసారి చదివెను.ఆ చదువురీతియే వినసొంపుగ నున్నది.పిమ్మట శిష్యునిచే రెండు మారులు చదివించినాడు.లోపములను సరిదిద్ది చదువవలసినరీతిని వివరించి నాడు.భట్టుమూర్తి సంగీతములో నిధి కదా! గురువు చెప్పిన శ్లోకమును అద్భుతముగా చదివినాడు.ఆ నాటి పాఠవిషయము " తన్వీశ్యామా శిఖర్దశనా"అను శ్లోకము.అది మేఘదూతము లోని యక్షపత్నీవర్ణనము.శ్లోకము లోని ఒక్కొక్క పదమునందలి సారస్యమును పెద్దన వివరించిన రీతి నృసింహకవికి ఆనందపూర్వకముగా తోచినది. కొందరు కవులు , పండితులు కాలేరు.పండితులు , ఉత్తమోత్తమ ఉపాధ్యాయులు , ఉపన్యాసకులు కాలేరు.పెద్దనగారిలో ఈ మూడు శక్తులు ఇమిడియున్నందులకు నృసింహకవి అబ్బురపడినాడు.భువనవిజయమున అగ్రపీఠము నధిష్టించు నర్హత పెద్రనకు పూర్తిగా కలదని యెంచినాడు.ఎందు కెంచడు? అతడు గుణగ్రహణపారీణుడు గదా!పాఠము చెప్పిన పిమ్మట వారిరువురు మాట్లాడుకున్నారు.

నృసింహకవి:" మనమున గొన్న నెవ్వగలు మాన్పి ఘంటింతురు కావ్యసమ్మదం,

బనఘకథా ముఖంబున హి తా హితబోధ మొనర్తు రింపుగా

గనుగొనుకంటె నద్భుతము గా నెఱిగింతు రతీంద్రియార్ధముల్ ,

ఘనమతు లెల్లవారికి
నకారణబంధులు గారె సత్కవుల్!

"ఇట్టి మహాకవులను తమ్ము దర్శించి ధన్యుడనయ్యాను.

పెద్దన : ఈ పద్యము నిప్పుడే చెప్పినారా?లేక, తమ కావ్యములో నిదివరకే వ్రాసికొన్నారా.

నృసింహ: ఇది నా కవికర్ణరసాయన కావ్యములోనిది.తమవంటి వారి విషయమున సార్థకమగునని యిప్పుడు చదివినాను.

పెద్దన: కవుల మహిమ నీ పద్యమున నెంత చక్కగా వర్ణించినారు.తమకు కవులపై నెంత విశ్వాసము ! కాని , ఎల్లరికీ నిష్కారణ బంధువులైన కవులు , తమలో పరస్పరము బాంధవ్యము కలుపుకోవలసి వచ్చునప్పటికి వెనకబడుచున్నారు.తమలో తాము కలహించుకుని సమయము వృథా చేయుచున్నారు.

నృసింహ: అది తమ బోంట్ల విషయమున కాదు.

పెద్దన : కృతజ్ఞుడను.తమ కావ్య ఇతి వృత్తాంతము మేమో సెలవిత్తురా!

నృసింహ: ఇక్ష్వాకువంశజుడైన మాంధాతుని చరిత్ర.

పెద్దన: అందలి ప్రధానరసము?

నృసింహ: మొదట శృంగారమును , పిమ్మట శాంతమును.ఆ సంగతి నే యిట్లు సూచించినాము.

" యతి విటుడు గాకపోవు టె ట్ల
స్మదీయ కావ్య శృంగార వర్ణ నాకర్ణ
నమున విటుడు యతి గాక
పోరాదు వెస మదీయ

కావ్య వైరాగ్య వర్ణ నా కర్ణనమున
!"

పెద్దన: గొప్ప ప్రతిజ్ఞ చేసినారే!

నృసింహ : తమ దయవలన .తామొకసారి నా కావ్యమును విని సంతసించినచో,నేను ధన్యుడనగుదును.

పెద్దన: అట్లే, తా మింకొకసారి దయచేసిన విందును. తమ కభ్యంతరము లేని యెడల , కావ్యమును నావద్ద నుంచినను తీరిక యైనపుడెల్ల చదువుదును.

ఈ సంభాషణము వలన పెద్దనమీద సదభిప్రయము కలిగినది.కవులలో ఐక్యత

లేమికి ఎంత చింతించుచున్నారో యని యతనికి తోచినది. పెద్దన యెంత మత్సరము లేని వాడు అనుకుని తన గ్రంథమును పెద్దన వద్దే యుంచి వెడలి పోయెను. పెద్దన బహుకార్యధురందరు డయినందున కవికర్ణరసాయనము నామూలాగ్రముగా చదువునప్పటికి మూడు నాలుగు నెలలు పట్టినది. తాను చేసిన ప్రతిజ్ఞకు దగినట్లుగానే రచించినాడని పెద్దనకు కవికర్ణరసాయనము మీద గౌరవము కలిగి నది.కవి యందు మొదటి నాలుగాశ్వసములలోని మాంధాత పూర్వజీవితమును అనగా గార్హస్థ్యధర్మముల నభివర్ణించినాడు.ఈ సందర్భమున అతడు చేసిన శృంగారవర్ణనము యతిని విటుడుగా మార్చజాలనట్టిదే.ఈ నాలుగాశ్వసము లందును– యుద్ధము , వివాహము , ఋతువులు, వనవిహారము, జలక్రీడలు, పుష్పాపచయము, సూర్యోదయ సూర్యస్తమయములు, అంధకారము, నక్షత్రములు , చంద్రోదయ ము, మధుపానము , వారవనితాదూషణము – మొదలగు నష్టాదశవర్ణనములు చేసినాడు.మిగిలిన రెండాశ్వసములందును పారమార్థికాంశములను వర్ణించినాడు. మాంధాత, వసిష్టాదులవలన తన పూర్వ జన్మవృత్తాంతము తెలి

సికొని యిహముపై విరక్తుడగుట, గురువులవలన కర్మ, ఉపాస్యకోపాసకుల స్వరూప

మును గ్రహించుచ, భగవద్విగ్రహస్వరూప , భగవదవతార రహస్యముల నెఱుంగు

ట, ప్రసన్నభక్తియోగము ల లక్షణములు , సంసారజంజాటములు, పొందదగిన మోక్షమును తెలిసికొని అష్టాక్షరీ మహామంత్రోపదేశము పొంది తపస్సునకేగుట ,

ఇత్యాది విశిష్టద్వైత వేదాంతపరములగు నానా విషయములను వర్ణించినాడు. ఇట్టి అతీంద్రియాంశములను వర్ణించుటంబట్టియే నృసింహకవి " అద్భుతముగా నెరిగింతు రతీంద్రియార్థముల్ " అని చెప్పగలిగినాడని పెద్దన గ్రహించెను.నృసింహకవి , తాను కవిగా లోకమునకేమి చేయదలంచెనో , దానినే కవివర్ణన నెపమున " మనమున గొన్న నెవ్వగలు..." అను పద్యమున చెప్పినాడు.కావ్యము తుదికివచ్చునప్పటికి పెద్దన కీ పద్యము అగుపడినది.--

" కవితావిచక్షణత గల

కవికంఠ విభూషణముగ గైకొనవలయుం

గవివర నృసింహ విరచిత

కవికర్ణరసాయన మను కావ్యము దీనిన్".

ఆహా: తన కావ్యము కవికంఠాభరణము కాగలదనియు నృసింహకవి విశ్వాసము.ఇట్లు తలంచి పెద్దన నృసింహకవిపై సదభిప్రాయము నేర్పరచుకొనెను. ఈ మూడు నాలుగు నెలలును నృసింహకవి పెద్దన యింటికి రాకపోకలు చేయుచునేయున్నాడు. అతడు కొంచెము విసిగినాడు కూడాను.పెద్దన యొకనాడు నృసింహకవి నుద్దేశించి " తమ కావ్యమద్భుతముగా నున్నది .తమ ప్రతిజ్ఞ కనుగుణముగానే కావ్యమును నిర్వహించినారు." అని మెచ్చుకోలు నందించెను.అంతట నృసింహకవి తన కావ్యమును రాయలవారికంకిత మీయవలెనని సంకల్పమున్న దనియు, అందుకు సాయపడవలసినదనియు కోరెను.

" అట్లయిన తాము మరికొంతకాలము వేచియుండవలయును. రాయలవారి దర్శనమునకు తగిన సమయము చూచి నేను తమకు కబురంపుదును." అని పెద్దన యనెను.అంతట నృసింహకవి తన యింటికి వెడలెను.అతడు పోయిన పిమ్మట పెద్దన కొక సందేహము కలిగినది." నృసింహకవి చూచుటకు మెత్తగా కనబడుచున్నాడు. కాని తన కావ్యమును గూర్చి కొంత అహంకారమును ప్రదర్శించుచున్నాడు." యతి విటుడు గాక యుండునే ...."అను పద్యమునుగాని , కవితావిచక్షణతగల....."అను పద్యమునుగాని రాయలవారు చూచిన నేమనకొందురు. అంతటివాడు , కవికులశిరోమణి సంస్తుతులందినవాడు – కాళిదాసే," మందబుద్ధినై కవియశస్సును గోరి అపహాస్యము పాలగుదునేమో" యనియు" విద్వాంసులు మెచ్చువరకు నా ప్రయోగవిజ్ఞానమును శ్రేష్ఠమనుకొన" ననియు వినయమును ప్రదర్శించిరి గదా! అట్లనుకొన్న తాను చేసినదేమి? రాయలవారు గండపెండరమును గొనుమని అలనాడు రాయలవారు గండపెండెరమును పళ్ళెరమున బెట్టి సభలోని కవుల నుద్దేశించి ,"నృస్కృతాంధ్రముల సమముగా కవిత చెప్పగలవా రిద్దానిని స్వీకరింపు" మని కేరిస్తు.ఎవ్వరును ముందుకు రాలేదు.అప్పుడు రాయలవారు –

" ముద్దుగ గండపెండియరమున్ గొను డంచు బహూకరింపగా

నొద్దిక నా కొసంగు డని యొక్కరు గోరగ లేరు, లే రొకో"!

అనినారు.అంతటతాను లేచి--

" పెద్దన బోలు పండితులు పృథ్విని లేరని నీ వెరుంగవే,

పెద్దన కీ దలంచినను పేరిమి నా కిడు కృష్ణరాణ్నృపా !"

అని దానిని స్వీకరించినాడు గదా! అది యహంకారము కాదా! కవులు తమ ప్రతిభ

ను గూర్చి అవసరమైన పట్టున నిట్లు చెప్పుకొనుచుందురు. అది యంతగా దోషము లో లెక్కకాదు.అది యొకవిధమున ఆత్మవిశ్వాసము కాని వేరు కాదు. దానిని సాత్వికా

హంకార మనవచ్చును.ఈ సాత్వికాహంకార మనునది యోగులకు గూడ నుండును.

ఇట్లు తలంచి పెద్దన నృసింహకవికి రాయలదర్శనము చేయింత

మనియే నిశ్చయిం

చుకొనినాడు.

నృసింహకవి పెద్దనయింటికి రాకపోకలు చేయుచునే యున్నాడు. ఒకసారి పెద్దన నృసింహకవి ని గూర్చి యనినాడు.“ తాము తొందరపడవలదు.విశిష్టాద్వైత రహస్యములను తెలుపు తమ కావ్యమును రాయలవారు తప్పక స్వీకరింతురనియే నా నమ్మకము. మనమింక కొంతకాల మోపికబట్టి వేచియుండుము.మిగిలిపోయినదేమి? తమకు దినబత్తెమునకిబ్బందిగా నున్నచో , నేను నా సొమ్ముతో వలసిన యేర్పాటులు చేయింతును. సందేహమువలదు.మనము కవికులము, కవిగోత్రులము గదా! మనలో మనకు నీ, నా అని భేదము లుండకూడదు.”పెద్దన ఔదార్యమునకు నృసింహకవి చలించిపోయి, కరిగిపోయినాడు. ఇంతటిఔదార్యముండుటచేతనే పెద్దనగారింతటి పేరు ప్రతిష్టల నందినారని తలంచి---“ తాము చేయు ధనసహాయ మక్కర లే” దని సవినయముగా చెప్పి వెడలిపోయినాడు.

---

ఈ నాడింట బియ్యము నిండుకున్నాయి(లేవు).పిల్లలు అన్నమునకు అలమటించుచున్నారు. పెద్దవానికి గ్గ, చిన్నవాడు జ్వరపడి నేటి కెనిమిది దినములు.ఈ జ్వరము సన్నిపాతము లోనికి దింపవచ్చునని కూడా అనుకొనుచున్నారు.ఆ వైద్యుడు సాక్షాత్తు అపర ధన్వంతరీగనుక సరిపోయింది.లేకున్న నేమయ్యెడిదో యోచింపుడు. మందులు, మాకులు ఉచితముగా నిచ్చుటయే గాక ఉపరసములకు కావలసిన అల్లము, మిరియాలు, శొంటి , పిప్పళ్ళు మున్నగు దినుసులు కూడ ఆ మహానుభావుడే ఇచ్చుచున్నాడు.ఇదంతయు మీ రేదో కవీశ్వరులని ఆయనగారు గౌరవముతో చేయుచున్నారు.లేకున్న డబ్బు లేకుండ మందులిచ్చు వైద్యులెక్కడుందురు.మన మాయన కెట్లు కృతజ్ఞత చూపగలమో తెలియకున్నదిఇక ఈడేరిన ఆడపిల్లకు సంబంధముల మాట యెట్లున్నను , కనీసము ఒడలు దాచుకొనుటకు సరియైన గుడ్డలు లేవు గదా! ఒంటి నిండా చీరయుండి ఒడలు దాచుకొనవలసిన స్త్రీ , అతుకుల, బొతుకుల గుడ్డలో ఎట్లు వుండగలదో విచారింపుడు.ఈ కుచేలదారిద్ర్యము నెట్లు ప్రోవునో ఆలోచించరా!

“ మీరు మహాకవులు, పండితులు, పౌరాణికులు గదా! ఎవ్వరి నాశ్రయించినను నింతసొమ్ము పుట్టదు! ఏ దేవాలయములో కూర్చుండి పురాణము చెప్పుకున్నచో నాలుగు వరాలు చేతికిరావు. చిన్ననాట నేర్చిన శిల్పవిద్య యున్నది కదా! ఆ టెంకణా చార్యులవారి శిల్పవిద్యాలయమున కేగి , ఏదో యొకపని చేసికొనగూడదా! అదియొక మహాశిల్ప గురుకులము కదా! అచ్చట మిమ్మొక ఆచార్యునిగానైనను నియమింప వచ్చునే! పోనీ, ఏ దేవాలయమందో , కంచువిగ్రహములు చేయుటకో, శిలాప్రతిమల ను తెక్కుటకో పూనుకొనవచ్చును కదా! సారస్వత విద్యలనే గాక , కర్మవిద్యలను గూడ కైవసము చేసికొన్న రెండంచుల కత్తిగదా మీరు!“ రాజదర్శనము చేసికొనవలెను.వారి మన్నలనే పొందవలెను , వారికే కావ్యముఅంకితమీయవలెను అని మీకేల పట్టుదల? రాజాస్థానము లెంత దుష్ప్రవేశములో ఎరుగరా? అందలి కవి, పండితులకు కవితాపాండిత్యము లున్నంతగా హృదయములుండవు గదా! వారు తమ స్వార్థమును విడనాడి , మీవంటివారి కేల ప్రవేశమిప్పింతురు.అలనాడు శ్రీనాథకవిసార్వభౌముడే ప్రౌఢదేవరాయల యాస్థానములో ప్రవేశింప నెన్ని ఇబ్బందులు పడెనో, మీరే చెప్పితిరి గదా! ఆ సహృదయశిఖామణి ముమ్మనార్యుడుండుటవలన ఆయన దయచేత ఆ కవి సార్వభౌమునకు ప్రవేశముచిక్కినదిగానీ , లేకున్న నేమయ్యెడిదో? శ్రీనాథుని కా ముత్యాలశాలలో కనకాభిషేక గౌరవము జరిగెడిదేనా! గుణము గ్రహించువారు గ్రహించినను, మత్సరము వీడి దానినిలోకమునకు జాటువారు లేకున్నను, ఎంతటిగొప్పవారైనను అడవిబూచిన పువ్వులుకాక

తప్పదు.ఇది యంతయు నేను మీకు చెప్పగలదాన నని చెప్పుట లేదు.నేటి మనకుటుంబ స్థితి యట్లున్నది గనుక, ఈ దీర్ఘసంభాషణము చేయవలసి వచ్చినది.క్షమించి ఇట్టి దుర్దశలోనైనను కర్తవ్యమును నిర్ణయించుకొందురనియు ,బిడ్డలను బ్రతికింతురనియు వేడుకొనుచున్నాను.”నృసింహకవి భార్య ఆండాళమ్మ ఈ మాటలనుచుండగనే వైద్యుడు వచ్చి మంచముపైనుణ రోగిపిల్లవానిని పరీక్షించెను.” ఇది సన్నిపాతజ్వరము. ఇకనుండి విషజ్వరలక్షణములు గూడ ప్రవేశించు సూచనలున్నవి.రోగికి సేవలు బాగుగా జరుగుచుండవలెను. ఒకవేళ రాత్రికి పిచ్చిపిచ్చి మాటలవీ ప్రారంభము కావచ్చును.రోగి గుడ్డలు పీకివేసుకుని బయటకు పరుగెత్త యత్నించవచ్చును. మీరు మిక్కిలి మెలుకవతో బిడ్డనుకాపాడుకొనవలయును.ఈ రెండు మందుకుప్పెలను అరగదీసి , జీలకర్ర ధనియాల రసముతో కలిపిపోయుడు.! నాలుగు గడియల కొకసారి ఈ మాత్రలను వాడతూండండి.! ఇవిగో ధనియములు, జీలకర్ర యని రెండు పొట్లముల నామె చేతికిచ్చి ఇంకను ఇట్లనినాడు.” అమ్మా! మీరు అధైర్యపడవలదు. నాకు రాజవైధ్యులే గురువులు.నేను వారితో గూడ సంప్రతించి , ఎంత విలువగల మందులైనను వాడి మీబిడ్డను బ్రతికింపగలను.మీ వంటి విద్యావంతమైన కుటుంబమునకు సేవచేసెడి భాగ్యము కలిగినందుకు ఎంతయో సంతసించుచున్నాను.” అని వెడలిపోయెను.

ఇది యంతయు చూచుచున్న నృసింహకవి గుండెనీరైనది.అతడు కన్నుల నీరుగ్రుక్కుకొనినాడు.ఇట్టి ఘట్టములలో పురుషుల కన్న స్త్రీలే ధీరమంతులుగా నుందురాయేమి? ఏమోగాని, ఆండాళమ్మ మాత్రము గుండె చెదరనీయక , ఆ యాపద నెదుర్కొనుటకు సిద్ధమయినట్లు ఆమె వైఖరియే స్పష్టము చేసినది. రోగి కంటెను చిన్నపిల్లలు “ అమ్మా,అన్న కేమిటంమ్మా! పిచ్చ, పిచ్చేమిటి?”అని వెంటబడుచున్నారు.ఆ యిల్లాలా బిడలను ఒడిలోకి పొదుపుకొని “ ఏమియు లేదు.అన్నయ్యకు ఇకరెండుమూడు రోజులలో తగ్గిపోవును .వాడు మీతో ఆడుకొనును.మీకు పాఠములవీ చెప్పును”.అని యూరడించినది. భార్య పలుకులు, వైద్యుని పలుకులు నృసింహకవి హృదయమును కదలించివైసినది. హరిశ్చంద్రుడాయన హృదిలో మెదలినాడు.ఆండాళమ్మ ఆయనకు మేనమామకూతురే. ఆ మేనమామయే , నృసింహకవిని చేరదీసి విద్యాబుద్ధులు నేర్పి ఇంతవానిని జేసినాడు.మేనల్లుని కవితాచాతురికి మెచ్చుకుని , తన కూతునే యిచ్చి పెండ్లి చేయుటయే గాక , తన ఏకైక పుత్రికతోబాటు తనకున్న ఆస్తిలో భాగము కూడ కుమార్తెకు పంచియిచ్చినాడు. ఆండాళమ్మ కున్న నగలుకూడ అమూల్యమైనవి.అవి యన్నియు ఆ తండ్రి యౌదార్యమువలన నేర్పడినవే.ఆ నగలు కూడ విద్యానగరమునకు వచ్చిన పిమ్మట దినక్రమమున వణిజుల యింటికి నడిచినవి.ఇంకొక్కనగ మిగిలియుండునని నృసింహకవి భావన.దానిని నగయందురో లేదో తెలియదు.అది యామె మాంగళ్యము.అదియును ఆమె పుట్టించివారు చేయించినదే. దానిపైనవరత్నములు గూడ పొదగబడియున్నవి.దాని నమ్మినచో చాలధనము రాగలదు. దరిదాపొక రెండునెలలైనను అ ధనముతో జీవింపవచ్చును. ఇప్పటి కష్టములనుండి యది గట్టెక్కించగలదు.నృసింహకవికి రోగిని చూచినకొలది గుండె చెఱువగుచున్నది. ఆతడిక చేయునదేమియు లేక భార్యతోననినాడు.“ నీ మాంగల్యమున్నది కదా! దాని నమ్మి వెచ్చములు తేగూడదా!దానికి బదులుగాపసుపుకొమ్ము కట్టుకొనవచ్చును గదా ఇట్లనుచున్న నాధౌర్భాగ్యమునకు నేను బాధపడుచునే యున్నాను. అయినను స్థితిగతులిట్లున్నవి.! నేనేమి చేయుదును.! నేటితోఏదో మార్గము త్రొక్కుదును.ఈ ఆపదను దానితో గడుపుము”.భర్త యీమాట లనునప్పటికి ఆండాళమ్మకి దుఃఖము ఆగలేదు.దుఃఖము ముంచుకొనివచ్చినది.అయినను మగని నియమశీలతకును,” కడుపుకూటికి ఒరులను వేడబోవ” నను దీక్షకును ఆమె లోలోన సంతోశమందినది.“ ఆ మాంగల్యమును మూడు నెలలనాడే విక్రయించి డబ్బుతెచ్చుటయైనది. ఇంతకాలమదియే మన ప్రాణములు నిలిపినది.ఆ మాంగళ్యస్థానమున కట్టుకొన్న

పసుపుకొమ్ము ఇదిగో!" అని ఆ యిల్లాలు పయ్యెదలోపలి నుండి మంగళసూత్రమునకు గట్టినపసుపుగొమ్మును వెలికి దీసి చూపినది.ఇక నృసింహకవి యెడద ఎట్లు నీరైనదో చెప్పలేము.ఆ యిల్లాలు కుటుంబనిర్వహణ దీక్ష కాతడెంతగనో సంతసించినాడు. తన మేనమామ, తన బిడ్డ నీయల్లుడెంతగనో సుఖపెట్టగలడని తన కిచ్చి చేసినాడుతాను సుఖపెట్టురీతి ఇట్లున్నది. ఇకనాతడక్కడ ఒక్క క్షణం మైనను నిలువలేకపోయినాడు.భారము నంతయు ఆ శ్రీరంగనాథునిపై వేసి ఆతడీవలకు వచ్చినాడు. నృసింహకవి లౌకికుడే యైనచో , తిమ్మకవీంద్రునో, రుద్రకవినో ఆశ్రయించి కార్యసాఫల్యము చేసికొనెడివాడే!అదికూడ అతనికి చేతకాదు.అయినను, పెద్దన కాదనలేదు గదా! " కొంచెమోపికపట్టిన చూతు" నన్నాడాయెను.కాని , నృసింహకవికి మరల పెద్దనవద్దకు పోవుటకు మనసొప్పలేదు.ఇప్పటి కెన్నిసార్లో ఆయన చుట్టునుతిరుగుట అయినది.ఇంకను వెంటబడుట కాతని కిష్టము లేకపోయినది. అతడు,దూర్జటికవీంద్రులు అంతర్ముఖుడై యేవేవో భక్తసాధనలు చేయుచున్నాడని విన్నాడు.ఆయన కడకు పోయినచో పని కాగలదేమో యని అతనికి తోచినది.నృసింహకవి దూర్జటికారింటి కేగి తన రాకకు గల నిమిత్తమును ఎఱుకపరిచినాడు.

దూర్జటి తా నప్పుడే వ్రాసిన పద్యముగల తాటియాకును నృసింహకవిచేతి కిచ్చినాడు. అందిట్లున్నది."రాజు ల్మత్తులు, వారిసేవ నరక ప్రాయంబు , వారిచ్చు నంభోజాక్షి చతురంతయాన తురగీ భూషాదు లాత్మవ్యథాబీజంబుల్ , తదపేక్ష చాలు , బరితృప్తిం బొందితిన్ , జ్ఞాన లక్ష్మీజాగ్రత్పరిణామ మిమ్ము దయతో శ్రీకాళహస్తీశ్వరా!"

దూర్జటికవి తన సంస్కారములకును ప్రవృత్తికిని దగినట్లు సింహకవినుద్దేశించి-------" శ్రీకృష్ణదేవరాయలవారు, నేను వర్ణించిన రాజకోటిలోనికి రారు.అందుకనియే నేనింకను వారికొలువును వీడలేదు. అసలు రాయలవారు మెచ్చనంత మాత్రాన , ఆయన కంకితమీయనంత మాత్రాన కవుల కావ్యములు గుణహీ నములగునా?"సన్తఃపరీక్షా న్యతర ద్భజన్తే" అను సూక్తిని మరచినారా? సత్పురుషులు గుణమున్నదానిని వీడలేరు. మీ గ్రంథము విశిష్టద్వైత తత్వప్రతిపాదక మఱటిరిగదా! అట్టిదానిని శ్రీరంగనాథునికే అంకితమిచ్చిన మీ జన్మతరించునే! ఇంతటి భక్తశిఖామణివి , మరల నీ యైహిక జంఝాటములోనికి దిగనేల!" అని చెప్పుటయే కాక , కాళహస్తీశ్వర శతకమునుండి కొన్ని వైరాగ్యబోధకములైన కొన్ని పద్యములను గూడచదివినాడు. నృసింహకవి మీద దూర్జటియుపదేశము పనిచేసినది. అసలిదివరకే అతని తండ్రి కవికర్ణరసాయనమును భగవంతున కంకితము చేయుమని చెప్పినాడు. నృసింహకవి పితృవాక్యము నప్పుడు పాటింపజాలక యీ యిబ్బందుల నన్నింటిని కొని తెచ్చుకున్నాడు. అతని కిప్పుడు " పెద్దలవారి మాట , పెరుగన్నపుమూట" అనితెలిసి వచ్చినది.ఏనాడో మరణించిన తండ్రి స్థానములో నుండి దూర్జటికవీంద్రుడీసదుపదేశమును చేసినాడని నృసింహకవికి తోచినది. అతడు దూర్జటికి భక్తితాత్పర్యమున కృతజ్ఞత లర్పించుకొని యింటికి చేరుకొన్నాడు. వైద్యుడు చెప్పినట్లు రాత్రికి పిల్లవానికి సన్నిపాతలక్షణములు ప్రవేశించినవి.అతడు వెర్రిచూపులు చూచును. పిచ్చిపిచ్చిగా మాట్లాడును.గుడ్డలు పీకివేసుకొనును.మంచముపై నిలువక, పరుగెత్తబోవును. వైద్యుడు తన గురువైన రాజవైద్యుని గూడతీసుకునివచ్చి చూపినాడు.ఆతడును తన శక్తికొలది ప్రయత్నించినాడు. ఎంత గొప్ప వైద్యుడయినను ,మందుపోయునే గాని, ఆయువు పోయలేదు గదా! పదునొకండవ రాత్రి గరళముకూడ పోసినారు. ఆయుర్వేదములో గరళము పోయుట తుదివైద్యము.దానితో రోగము కుదిరిన కుదురును! లేకున్న యమదర్శనము తప్పదన్నమాట. గరళము పోసిన పిమ్మట , పిల్లవాడు బాగుగా తేరుకొనినాడు. తల్లిదండ్రులకు,అన్నదమ్ములకు చక్కగా మాటలు చెప్పినాడు.

కవికర్ణరసాయనము లోని పద్యములను పెక్కింటిని చదివినాడు.తండ్రి చెప్పుచుండగా ఆ కావ్యములోని కొంతభాగమును వ్రాసిన దా చిరుపాపడే.! అందుచే వాని కందలి పద్యములనేకములు కంఠస్థమయినవి.ఇక కుమారుడు బ్రదుకునని తల్లిదండ్రులాసపడినారు. కాని ఇది యంతయురోగచర్యయు, గరళము యొక్క ప్రభావము మాత్రమే.రోగము తగ్గుటకాదు. ఆరిపోయెడిదీపము చివరి కెక్కువగా వెలుగులు విరజిమ్మును గదా! కొంత సేపటికి పిల్లవాని కాలుసేతులు చల్లబడినవి. మరుక్షణముననే ఆ యిల్లు రోధన ధ్వనులతో నిండిపోయినది.

ఒకనాడు శ్రీకృష్ణదేవరాయలు , తన కూతురు మోహనాంగితో చదరంగమాడుచుండెను. ఆటలో మోహనాంగి తడబడుచున్నది.ఓటమి తప్పదన్న నిశ్చయంలోనున్నది. ఇట్టిసందర్భములలో చదువుకొన్నవారికి సమయోచిత పద్యములు , పద్యపాదములు జ్ఞప్తికి వచ్చుచుండును.ఆమె చాలసేపాలోచించి తనకు గలిగినసంకటమును గూర్చి -----

"ఉద్ధతుల మధ్యమున బేద కుండ దరమె"

అంతట రాయలా కవితాసౌభాగ్యమునకును, వర్ణనాచాతురికిని ఆశ్చర్యమునొంది" ఈ పద్యము నే సందర్భమున వ్రాసితివమ్మా!" అని అడిగెను.అందుకు మోహనాంగి-" ఈ పద్యము నేను వ్రాసినది గాదు నాన్నగారూ! ఒకనాడు మన నాగిని తెచ్చినా కిచ్చినది.సందర్భమునకు సరిపడగా నేను చదివినాను" అని జవాబిచ్చినది.రాయలు వెంటనే నాగిని ని పిలిపించి " నీ కీ పద్యమెక్కడిది? దీని వృత్తాంతమేమి?అని యడిగెను.

" ప్రభువులు సావదానముగా వినవలయును.ఆయన దే యూరో నాకు తెలియదు.ఆయన పేరు టంకసాల నృసింహకవి యట.మాంధాతచరిత్రమును "కవికర్ణరసాయన" మనుపేర ఆరాశ్వముల కావ్యముగా రచించినాడట.దానిని దేవరవారి కంకిత మీయదలంచి నగరానికి వచ్చినాడట.తమ్ము దర్శింపవీలు చిక్కలేదట. అంతటబహుకుటుంబమును నిర్వహింపజాలక , తన పద్యముల నమ్ముకొని జీవితము చేయనారంభించినాడట.నేనీ వృత్తాంతమును రాజవీదిలో విని,కొన్ని పద్యములనుపరిశీలించి ఆయనకు కొంత ధనమిచ్చి రెండు పద్యములను తెచ్చినాను. అందొకటిఅమ్మగారికి కానుకగా యిచ్చినాను.

" రెండవ పద్యమేది?"

" యతి విటుడుగాక టెట్ల
స్మదీయ

కావ్యశృంగార
వర్ణనాకర్ణనమున!

విటుడు యతి గకపోరాదు వెస
మదీయ

కావ్య వైరాగ్య
వర్ణనాకర్ణనమున!"

ఇది, రెండవ పద్యము."

ఈ పద్యము విన్నపిమ్మట రాయలు ఆట చాలించినాడు.ఆతని హృదయములోనృసింహకవి ప్రవేశించెను.రాయలిట్లు తలపోయసాగెను.

-------

" నృసింహకవి యెంతవాడు కాకున్న ఇట్టి ప్రతిజ్ఞ చేయజాలును.ఈ పద్యమున వర్ణన ఎంత చక్కగా నున్నది.వర్ణనమున ఇంకెంత చాతుర్యమును ప్రదర్శించియుం

డును.వర్ణనమునే ఇంత సొంపుగ చేసిన కవి , కావ్యము నింకెంత రమణీయముగా వ్రాసియుండును. ఇట్టికవి తన పద్యములను అమ్ముకొని బ్రదుకవలసివచ్చినదా!

ఈ పద్యవిక్రయము , తన యేలుబడిలోని విద్యానగరమందే - తాను జీవించి యుండగనే జరిగినదా!"ఇట్లుతలచి చారులను పిలిచి నగరమంతయు వెదికి నృసింహకవిని తనకడకు తీసికొని రావలసినదని యాజ్ఞాపించెను. వారు రెండు మూడు వారములు పట్టణమంతయు గాలించి వచ్చి" ఆ కవి కొంతకాలము

క్రిందట నే విజయనగరమును వీడి శ్రీరంగక్షేత్రమున కేగినాడట" అని చెప్పినారు.ఆ మాట విన్న రాయలు పడిన బాధ యింతింత గాదు." ఒక మహాకవికి తన ఆసరా దొరకక


పోవుట, అది కారణముగా నాతడు పద్యవిక్రయము చేసి జీవించుటయే గాక , కడకునగరపరిత్యాగము కూడ సేయుట – తీరనట్టి సరస్వతీద్రోహముగా రాయలకు తోచినది.రాయలకు అంతర్వాణిలేమి, కవులేమి సాక్షాత్తు సరస్వతీ స్వరూపులే! శిల్పులుఅపర విశ్వకర్మదైవతములే! ఇట్టిస్థితిలో ఒక కవికి కలిగిన నష్టమున కాయన చింతించుటలో నాశ్చర్యమేమి? ఆయన శ్రీరంగమున కేగి నృసింహకవిని దీసికొనిరావలసినదని చారుల కాదేశించెను.

--

ఒకనాడు పెద్దన రాయలను సందర్శింప వచ్చి నృసింహకవిని గూర్చియు ,ఆయన కావ్యమును గూర్చియు చెప్పినాడు. ప్రభుదర్శనమునకు తీసికొని రాదలచి , తాను నృసింహకవికి కబురు పంపగా , ఆతడప్పుడే శిల్పివాడలోని తన బాడుగయింటినివదలి శ్రీరంగక్షేత్రమునకు వెడలిపోయినట్లు భృత్యుడు చెప్పినాడని పెద్దన రాయలకు విన్నవించుకొని విచారపడినాడు.     ఆ సమయమున , అచటనే యున్న రాజవైద్యుడు సంగతిని గ్రహించి నృసింహకవి కుటుంబవిషయములను, ఆయన భార్య యోగ్యతను , వారిపుత్రుడుసన్నిపాతజ్వరముచే మరణించుటయు, కడకు నృసింహకవి దూర్జటికవీంద్రుని బోధచేత విరక్తుడై శ్రీరంగమున కరుగుటయు మొదలగు సంగతులను రాయలకు నివేదించెను.దూర్జటిబోధ నృసింహకవి  కూఅట గల్పించియుండ వచ్చునని రాయలుభావించెను.

  ఇంతలో శ్రీరంగమున కేగిన చారులు వచ్చి" నృసింహకవి శ్రీరంగములో శ్రీరంగేశ్వరుని సేవలో మునిగి తేలుచున్నాడనియు , ఆయన ఆ దేవాలయ శిల్పకార్యములలోతలమునకలై యున్నాడనియు , ఆయనకు ప్రపంచవిషయము లేవియు పట్టనట్లు  లేవనియు , " ప్రభువులు తమ కభ్యంతరము లేనిచో శ్రీరంగధాముని సేవల కొక్కసారిదయచేసి , తానొనర్చు శిల్పకార్యములను దర్శించి తన్ను ధన్యునిజేయ గోరుచున్నాడని కృతజ్ఞతాపూర్వకముగా మనవి చేసికొన్నట్లు నివేదింపు" మని చెప్పారని మనవిచేసిరి. రాయలు , నృసింహకవి యోగ్యమార్గమునే యెన్నుకొన్నాడని సంతసించెను.పెద్దనయు తృప్తిపడెను.

★★★★




"సుమతి సాహితి సుమాలు " అనే నూతన ప్రక్రియను ప్రారంభిస్తున్నాము
ఇందులో 4నుండి 6 వరసలు ఉంటాయి
మొత్తం 12 నుండి 24 పదాలు ఉండాలి
,కవితతో ఒక కథ చెప్పాలి అంటే నిగూఢార్థం కలిగి ఉండాలి. ప్రతి కవిత గుండెల్ని కదిలించాలి

వీచే గాలికేం తెలుసు

ఊగే కొమ్మ వణుకు

కూలే నీడకేం తెలుసు

పేగు ఆకలి కునుకు

– బివిడి ప్రసాద రావు

కొడుకు ఏడుస్తున్నా వినకుండా

చదువులకోసం ఖరీదయిన హాస్టల్లో వుంచి

చదివించాడు తండ్రి ...

కొడుకు ప్రయోజకుడై విమానమెక్కి విదేశాల కెళ్ళాడు.

ఒంటరి తండ్రిని ఖరీదైన ఆశ్రమంలో వుంచి

తీర్చుకున్నాడగా పితృ ఋణం ఆ సుపుత్రుడు...

పారుపల్లి అజయ్ కుమార్

ఖమ్మం

ప్రతి రోజూ వాడని నీరుకు పాచి పడుతుంది.

రోజూ వాడని ఇనుముకు తుప్పు పడుతుంది.

రోజూ మాటలు లేని మనసులకు మమతలు మాయమవుతాయి.

ప్రతిరోజూ పలకరింపులు లేని బంధాలు బలహీనమవుతాయి.

రోజూ వాడని మెదడు సైతం మబ్బుపట్టిపోతుంది.

వాడితేనే వాడిగా మారేవి చాలా ఉన్నాయి.

తెలుసుకుని మసలకపోతే మనిషి మనుగడే బరువై పోతుంది

మృదువిరి–వరంగల్–


నేర్పిన పాఠం నిలుపుతుంది

నేర్చిన పాశం కలుపుతుంది

నేసిన నేత కప్పుతుంది

మేసిన మేత రొప్పుతుంది

– బివిడి ప్రసాద రావు



# సావిత్ర్యుపాఖ్యానం




ఆచార్య ఇరపని మాధవి

అశ్వపతి మద్రదేశానికి రాజు. సంతానం కొరకు అతడు 18 సంవత్సరాలు సావిత్రి దేవిని గురించి తపస్సు చేశాడు. ఆ సావిత్రి దేవి ప్రత్యక్షంకాగా పుత్రుడిని వరంగా కోరుకున్నాడు. ఆమె పుత్రిక కలుగుతుందని అనుగ్రహించింది. ఆ కుమార్తె కారణంగా తరువాత అశ్వపతికి నూరుగురు పుత్రులు పుడతారు అని చెప్పి దేవి అంతర్ధానం చెందింది. ఆ రాజుకు మాళవి అనే భార్యయందు సావిత్రి అనే పుత్రిక జన్మించింది. శుక్లపక్ష చంద్రబింబం వలె పెరిగి యౌవనవతి అయింది. ఆమె సౌందర్యం దేవతా స్త్రీల కంటే మిన్నగా ఉండేది . సాళ్వదేశాధిపతి అయిన ద్యుమత్సేనుడి కొడుకు సత్యవంతుడు తనకు సరిపడే గుణవయోరూప వైభవాలు కలవాడని తెలుసుకొని అతడే తనకు తగిన వరుడని సావిత్రి మనసులో అతడినే భర్తగా నిశ్చయించుకొని సహజమైన సిగ్గుతో ఎవరికి చెప్పకుండా ఉండిపోయింది.

ఒకరోజు నారదుడు అశ్వపతి దగ్గరకు వచ్చాడు. తండ్రి ఒడిలో చిన్నపిల్లలా కూర్చుని ఉన్న సావిత్రిని చూచి ఆమె ఇంక చిన్నపిల్ల కాదని, త్వరలో వివాహం చేయమని సలహా చెప్పాడు. నీకు తగిన వరుడిని నువ్వే ఎంచుకొనమని చెప్పిన తండ్రితో సావిత్రి తాను సత్యవంతుడిని వివాహం చేసుకుంటానని చెప్పింది. ద్యుమత్సేనుడు రాజ్యాన్ని కోల్పోయి, చూపును కోల్పోయి అడవిలో నివసిస్తున్నా అతడి కొడుకైన సత్యవంతుడినే ఆమె ఎన్నుకున్నది.

అశ్వపతి ఆ సత్యవంతుడి గుణశీలాదులను గురించి సర్వజ్ఞుడైన నారద మహర్షిని అడిగాడు. దానికి నారదుడు " ఎల్లప్పుడూ సత్యం పలకడం చేత సత్యవంతుడని సార్థక నాముడయ్యాడు, అతడికి చిత్రాశ్వుడు అనే ఇంకో పేరు కూడా ఉంది. తేజస్సులో సూర్యుడిని, బుద్ధిలో బృహస్పతిని,పరాక్రమంలో ఇంద్రుడిని,ఓర్పులో భూమిని, కాంతిలో చంద్రుడిని,అందంలో అశ్వనీ దేవతలను పోలివుంటాడు. తపస్సు, శమం,దమం,దానం,బ్రాహ్మణ భక్తి అధికంగా కలవాడు. అంతటివాడిలో ఒక దోషం కూడా ఉంది. ఈనాడు మొదలుకొని ఒక సంవత్సరానికి అతను చనిపోతాడు. ఇది చెప్పవలసింది కాబట్టి చెప్తున్నాను "అని చెప్పాడు. అశ్వపతి ఆ అల్పాయుష్కుడైన వరుడిని వదిలి మరొక వరుణ్ణి కోరుకోమని సావిత్రిని అడిగాడు. ఆమె తన నిర్ణయాన్ని ఇట్లా చెప్పింది. "మనోవాక్కాయ కర్మల్లో మనసు ముఖ్యమైనది అట్టి మనసుతో ప్రేమించిన భర్తను మానడం ధర్మమా? సత్యవంతుడు ఎటువంటి వాడైనా కానీ నేను అతన్ని తప్ప మరొకరిని కోరను" ఆమె మాటలు విని అశ్వపతి ఏమీ అనలేక నారదుడివైపు దీనంగా చూచాడు.

ఆ మహర్షి ఇలా అన్నాడు. "నీ కూతురు సుగుణాల కుప్ప. ఆమె మనసు మార్చడం మనకు శఖ్యం కాదు. ఇంకా అనుమానం ఎందుకు? ఆ వరుడికి ఇచ్చి వెంటనే



వివాహం చెయ్యి. ఆమె చేసిన పుణ్యమహిమ వలన ఆమె భర్త పరిపూర్ణ ఆయువు పొందగలడు". నారదుడి మాటలు అశ్వపతి శిరసావహించి సావిత్రి వివాహానికి నిశ్చయించాడు. నారదుడు దేవలోకానికి వెళ్ళాడు.


ఒక మంచి రోజున అశ్వపతి తన కుమార్తెను సర్వవివాహ సంభారాలతో సహా తీసుకొని ద్యుమత్సేనుడి వద్దకు వెళ్ళి, సావిత్రిని సత్యవంతుడికిచ్చి వివాహం చేయటానికి వచ్చానని, ఆమెను కోడలుగా స్వీకరించమని అతడిని కోరాడు. రాజ్యాన్ని కోల్పోయి అడవుల్లో కష్టాలు పడుతున్న తమతో ఆ సుకుమారి ఉండి కష్టాలు ఓర్చు కొనగలదా అని ద్యుమత్సేనుడు అడిగాడు. అతడితో అశ్వపతి "కలిమిలేములు కలకాలం ఉండేవి కావు, కలిమికి పొంగటం, లేమికి కృంగటం ధీరుల లక్షణం కాదు, ఆ సంగతి నాకు తెలుసు. మా అమ్మాయి కూడా వయసుకు చిన్నదైనా తెలివితేటల్లో ధీమంతురాలు. మా కూతురిని గురించి నేను ఇంతకంటే ఎక్కువ చెప్పడం న్యాయం కాదు. మీతో వియ్యమందుదామని మనసు పడి వచ్చాను. నా ప్రార్థన మన్నించకుండా ఉండటం మీకు న్యాయం కాదని" వేడుకున్నాడు. ద్యుమత్సేనుడు అంగీకరించాడు. ఆశ్రమవాసులైన మునిగణాల సమక్షంలో సావిత్రీ సత్యవంతుల వివాహం శాస్త్రోక్తంగా జరిగింది. అశ్వపతి అల్లుడికి, కూతురుకి కానుకలు ఇచ్చి తన రాజ్యానికి తిరిగి వెళ్ళాడు.

సావిత్రి రాణివాస అలంకారాలను తీసివేసి, నార చీరలు కట్టి, భక్తితో భర్తకు సేవలు చేసేది. అత్తమామలను కథలతో,

మాటలతో, సేవలతో సంతోష పెట్టేది. క్రమంగా కాలం గడిచింది. సంవత్సరం ముగియటానికి నాలుగు రోజులు తక్కువగా ఉన్నది. నారదుడు చెప్పినట్లు నాలుగవ రోజు తన భర్త చనిపోతాడు అని తెలిసిన సావిత్రి త్రిరాత్రోపవాస వ్రతం చేపట్టింది. అత్తమామలు వారించగా కష్టమైన ఆ వ్రతాన్ని పరమ శుభాలు కోరి ప్రారంభించాననీ, కారణం కాలాంతరంలో తెలియ వస్తుందని సావిత్రి వారికి నచ్చ చెప్పింది.

నాలుగవ రోజు తెల్లవారుజామున సావిత్రి నిద్రలేచింది. భర్త మరణించే దినమని మనసులో సంతాపం చెందింది. వ్రతవిధులు ఆచరించింది. అత్తమామలకు, ఆశ్రమంలోని మునులకు నమస్కరించి సుమంగళీగా భర్త సాన్నిధ్యాన్ని నిరంతరం పొందే భాగ్యాన్ని పొందేటట్లు నిండు దీవెనలు అందుకున్నది. త్రిరాత్రులు ముగిశాయి కాబట్టి ఆనాడు పారణ చేయమని అత్తమామలు కోరినా ఆనాడు ప్రొద్దుక్రుంకే వరకు ఉపవాస వ్రత దీక్ష పట్టానని చెప్పి వారిని ఒప్పించింది. సమిధలు, ధర్భలు, ఫలాలు తేవడానికి సత్యవంతుడు అడవికి బయలుదేరాడు. అతడి వెంట తాను వెళ్లడానికి సావిత్రి సిద్ధమైంది. సత్యవంతుడు, అత్తమామలు వద్దన్నా తన కోరికను మన్నించండి అని వారిని ప్రార్థించింది. ఎన్నడు ఏమి కోరని సావిత్రి కోరికను వారు కాదనలేకపోయారు.

సత్యవంతుడు తన వెంట వచ్చిన సావిత్రికి అడవిలోని ఎన్నో ప్రకృతి రమణీయ దృశ్యాలను చూపాడు. ఆమె అతడి మాటలు వింటూనే అతడిని గమనిస్తూ ఉంది. ఆ తర్వాత ఎన్నో ఫలాలు కోసి బుట్ట నింపాడు. ఆ తర్వాత గొడ్డలితో సమిధల కోసం కట్టెలు నరుకుతున్నాడు. ఉన్నట్లుండి ఆయాసపడుతూ గొడ్డలి క్రింద పడవేసి, ఎడతెగని



నిట్టూర్పులు విడుస్తూ విషాదం పొంది సావిత్రితో " శరీరం స్వాధీనం తప్పింది, మనస్సు భ్రమ చెందినట్లు తూలుతుంది, తల శూలాలతో పొడుస్తున్నట్లు నొప్పి పుడుతుంది, నేల మీద నిలవలేకపోతున్నాను, కొంతసేపు విశ్రాంతి తీసుకుంటాను" అన్నాడు. సావిత్రి ఒడిలో తల నుంచి పవళించాడు. క్రమంగా అతడు సోలిపోయాడు, చైతన్యం లేనివాడుగా అయిపోయాడు.

అప్పుడు సావిత్రి ఎదుట నీల మేఘం వలె నల్లనైనవాడు, పెద్ద కోరలతో, ఎర్రని చూపులతో, బంగారు బట్టలతో, భయంకర ఆకారంతో ప్రళయాగ్ని వలె ప్రజ్వలిస్తూ పాశధరుడైన ఒక దివ్య పురుషుడు నిలిచాడు. మెల్లగా అతడు సత్యవంతుడిని సమీపించాడు. సావిత్రి భయపడి భర్త శరీరాన్ని పక్కన ఉంచి ఆ దివ్య పురుషుడికి నమస్కరించి " నీవెవ్వరివి, ఇక్కడకు ఏ పని చేయటం కోసం ఇప్పుడు వచ్చావు?" అని అడిగింది. అతడు " సావిత్రీ! నేను యమధర్మరాజును. నీవు గొప్ప పతివ్రతవు కాబట్టి నన్ను చూడగలిగావు. సామాన్య మానవులు నన్ను చూడలేరు. నీ భర్త సత్యవంతుడి ఆయువు తీరింది. అతడు గొప్ప పుణ్యాత్ముడు కాబట్టి ఈ పనిని ఇతరులకు అప్పగించక నేనే స్వయంగా వచ్చాను" అన్నాడు. ఆ యముడు పొడవైన పాశాలను భయంకర రీతిలో ప్రయోగించి సత్యవంతుడి శరీరం నుండి జుత్తిలి కొలత గల జీవుడిని బంధించి బయటకు లాగాడు. యముడు సత్యవంతుడి జీవుడిని తీసుకొని భయంకరమైన దారిలో దక్షిణ దిక్కుగా వెళ్ళసాగాడు. దుఃఖపరితప్తురాలైన సావిత్రి తన భర్త శరీరాన్ని ఒకచోట భద్రంగా దాచిపెట్టి యమధర్మరాజును వెంబడించింది. ఆ భయంకరమైన దారిలో సుకుమారమైన ఆమె పాదాలు మాటిమాటికీ తడబడుతున్నా ఆమె నడక ఆపలేదు.

(ఇంకా ఉంది )

# మార్పు అనివార్యం

నామాని సుజనాదేవి

అతడు అవని అంతరాలలోని ఖనిజాల అంతులు చూసాడు

నీలాల నింగి దాటి చంద్రమండలంపై కాలు మోపాడు

అంబరాన్నంటే ఆకాశాసౌధాలు / ఆకాశా హార్మ్యాలు నిర్మించాడు

పట్టుదలతో పట్టులేని పర్వత శిఖరాలనెక్కి కొలిచాడు

సాగర /సముద్ర గర్భాలలో రత్నరాశుల గెలిచాడు

నేలను, నింగిని మేధస్సుతో జయించి విజేతయ్యాడు!

కానీ, ప్రపంచమంతా మారినా పడతి పరుగు /వెతలు మారలేదు

కానల కేగి కష్టాలు పడిన సీతల గీత మారలేదు

వలువల కోసం వగచిన ద్రౌపదుల బతుకులు మారలేదు!

ఎందరు నిర్భయలు నిలువెల్లా దహించబడినా

ఎందరు దిశల మానప్రాణాలు మట్టిలో కలిసినా

ఎందరు అభయలు ఆరళ్ళకు ఆహుతయినా

ఎందరు ధరణీ బిడ్డలు దగా పడినా, బలవంతంగా బలయినా

అనాది నుండి ఆధునిక కాలం వరకు అతివ స్థానం మారలేదు!

సాంకేతిక నేపథ్యంలో సమస్త ప్రపంచం కుగ్రామమై

వార్తలు వాయువులా అనంతమై అంతటా వ్యాపిస్తున్న తరుణంలో

అరవై దినాలు దాటినా వెలుగు చూడని మణిపూర్

అత్యంతఅమానవీయ అరాచక ఘటన సవాలై

మారాల్సిన చట్టాల గురించే కాదు,మానవత్వం లేని దానవత్వాన్నీ ప్రశ్నిస్తుంది!

మరణాలెన్ని రకాల ఉన్నా పుట్టుక మాత్రం

మహిళ గర్భ దేవాలయమే అని మరిచిన మగతనాన్ని ,

ఆచారవ్యవహారాల్లో అగ్రస్థానంలోని వేదభూమి ఆచరణలేమిని వేలెత్తిచూపిస్తుంది!

# సప్తపదులు




విన్నంత
కన్నంత
ప్రజాసేవతో ఆర్జించు కీర్తిని మంచిపనులు
చేసుకున్నంత
శాంతమూర్తి
హైదరాబాద్

రాకడ
పోకడ
మారకపు విలువలో రూపాయికిఉండాలి నిలకడ!
యన్.కే. నాగేశ్వరరావు,
పెనుగొండ.

రసము
సరసము
పొరుగింటి పోకడలకు పతిని వేధిస్తే విరసము

కృష్ణ తేజ
హైదరాబాద్

. జననము
ఖననము
ప్రకృతి ఒడిలో సాగును జీవన గమనము...

త్రిలోచన్ బిసాయి
కుసుంపురం...

వైద్యుడు
బాధ్యుడు
పునర్జన్మ ప్రసాదిస్తూ మానవరూపంలో
దైవంలా ఆరాధ్యుడు.

నాగరాజు.చుండూరిలండన్

దూరము
భారము
అడుగులు ముందుకు పడితేనే చేరగలవు తీరము

రావెల పురుషోత్తమరావు
అమెరికా

ఆలన
లాలన
క్రమశిక్షణ ఉన్నవాళ్లు ఖచ్చితంగా పాటిస్తారు
సమయపాలన

నేమాన సుభాష్ చంద్ర బోస్, విశాఖపట్నం

జాతకము
సూతకము
నడిమధ్య బ్రతికే బ్రతుకే ఒక నాటకము!

జ్యోతి ముప్వల
బెంగళూరు

# జీవితసత్యాల ఆవిష్కరణం -సామాజిక బ్రతుకు ఘటనల వ్యాఖ్యానం: సప్తపదులు

ఋణం
రణం
కోరి తెచ్చుకోకుండా ఉండటమే
ఉత్తమమైన గుణం.

సాధన.తేరాల,ఖమ్మం.

నిత్యం
భత్యం
జనుల జీవనోపాధికి ఉపాధి కల్పన అగత్యం!

ఆచంటి శ్రీనివాసరావు
తెనాలి.

ధైర్యవంతుడు
సాహసవంతుడు
చెప్పే మాటలు ఆచరణలో కనబరిస్తే
ఆదర్శవంతుడు....!!
జి.కె.నారాయణ(లక్ష్మిశ్రీ)
జోగులాంబ గద్వాల్ జిల్లా

వ్యక్తిగతం
వృత్తిగతం
జీవితంలో ముఖ్యమైన విషయాలను చేసుకోవాలి
అవగతం
గడ్డం దేవీప్రసాద్
బెంగళూరు

కష్టం
నష్టం
కలిసి పంచుకునే తోడు దొరకడం అదృష్టం!

సిహెచ్.వి. బృందావన రావు
నెల్లూరు

పుట్టింటికి
మెట్టింటికి
ఏ ఇంటికయినా మహాలక్ష్మి ఆడపిల్లే నట్టింటికి

ఆలేటి పరంజ్యోతి
ఖమ్మం

పంతం
అంతం
మనసు నిర్మలం అయ్యేందుకు
-కావాలి ఆసాంతం
ద్విభాష్యం నాగలక్ష్మి
అనకాపల్లి

భారతము
భాగవతము
అధ్యయనం చేసి ఆత్మజ్ఞానాన్ని పొందడం సముచితము!

-డా. మామిడాల శైలజ
సహాయ ఆచార్యులు హనుమకొండ.



కవి/కవయిత్రి మిత్రులారా!
మీరూ సప్తపదులు రాయవచ్చు
అందుకోసం
సప్తపదులు వాట్సప్ గ్రూప్ లో
చేరేందుకు గ్రూప్ అడ్మిన్
శ్రీ జి.వి.నరసింహమూర్తి(శాంతమూర్తి)
97048 67867
నెంబర్ ను సంప్రదించండి



సీరియల్

# పన్నీటి జల్లు

యశోదా కైలాష్

మురారి కి ముప్పై రెండు సంవత్సరాలు. అందగాడు, పైగా సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా జాబ్ చేస్తున్నాడు. అతని కాలేజ్ మేట్స్ అందరికీ పెళ్లిళ్లు అయిపోయి వారికి పిల్లలు కూడా పుట్టేసారు.

మురారి అక్కా చెల్లెలికి పెళ్లిళ్లు అయిపోయాయి. తమ్ముడు కూడా సంవత్సరం క్రితమే పెళ్లి చేసుకుని ఒక ఇంటివాడైనాడు. మురారి తల్లి లీలావతి కి కొడుక్కి పెళ్లికావడంలేదన్నదే దిగులు. ఎన్ని సంబంధాలను చూపించినా విముఖతగా ఉంటున్నాడు.

మొదటినుండీ తన చదువు, కెరీర్ తప్ప పెద్దగా దేని గురించి ఆలోచించేవాడు కాదు.

అటువంటి మురారికి 'ప్రేమ' అనే పదానికి అర్థం తెలియదా అనుకుంటే పొరపాటే.

తనకు నచ్చిన అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకోవాలని అనుకునేవాడు.

ప్రేమంటే ఇద్దరి వ్యక్తుల మధ్య ఉండే అందమైన బంధమనీ, ఆ బంధాన్ని జీవితాంతం వరకూ కాపాడుకోవాలని భావించేవాడు.

దాదాపు పది సంవత్సరాల నాటి గతంలో 'ప్రేమ' అనే రెండక్షరాలు అతనికి ఎంతో ప్రీతిపాత్రమైనవి.

ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నపుడు క్లాస్ మేట్ చైత్రను ఇష్టపడ్డాడు.

చైత్ర అందమైన అమ్మాయే కాకుండా చాలా చురుగ్గా కలివిడిగా అందరితో చాలా సరదాగా మాట్లాడుతూ ఉండేది. ఆమెను మనసులో నింపుకుని ఆరాధించడం మొదలు పెట్టాడు. తన 'ప్రేమ' ను డైరక్ట్ గా ప్రపోజ్ చేస్తే, ఒక వేళ చైత్ర 'నో' అంటే అని ఊహించుకుంటూ భయపడేవాడు.

ఫైనల్ ఇయర్ లో కేంపస్ ఇంటర్వ్యూలు జరిగి తను సెలక్ట్ అయ్యాడు. మంచి కంపెనీ, హేండ్సమ్ పేకేజ్. అందరూ తనని అభినందించారు. ఉద్యోగంలో బాగా సెటిల్ అయ్యాక చైత్రతో తన లవ్ ప్రపోజ్ చేయాలనుకుంటూ కలలు కనేవాడు.

ఒకరోజు కాలేజ్ కేంటిన్ లో కాఫీ తాగుతున్నాడు.

"హాయ్ అన్న పిలుపుకు తలెత్తి చూసాడు".

"ఎదురుగా చైత్ర".

"కంగ్రాట్స్ మిస్టర్ మురారీ, కేంపస్ సెలక్షన్ లో లక్కీ ఛాన్స్ కొట్టేసారుగా".

"ఓ థాంక్యూ"

అంతకు మించి సంభాషణ ఏమీ జరగలేదు. సంభాషణ అనేది ఒక కళ. పదాలు భావాలను వ్యక్తం చేస్తాయి. తనకా చాకచక్యం లేదు. కొంచెం సేపు తనేమైనా మాట్లాడతానేమోనని ఎదురుచూసిన చైత్ర 'ఆల్ ది బెస్ట్ మురారీ అని చెప్పి వెళ్లిపోయింది.

రోజూ క్లాస్ లో చైత్రను చూస్తున్నా చొరవగా పలకరించ లేకపోయేవాడు. చిన్నప్పటి నుండీ అలవాటైన స్వభావం ఎలా మారుతుంది? తనకు అందరూ ఉన్నా ఎందుకో ఇంట్రావర్ట్ గా పెరిగాడు.

ఒక నెల రోజుల్లో తన చదువు పూర్తి అయిపోతుంది.

ఒకరోజు చైత్ర చాలా స్పెషల్ గా తయారై వచ్చింది కాలేజ్ కు. అందరూ ఆమెకు అభినందనలు చెపుతున్నారు. హేండ్ బేగ్ లోనుండి బయటకు ఏవో కవర్లు తీస్తోంది.

తన దగ్గరకు కూడా వచ్చింది. చిరునవ్వుతో "హాయ్ మురారీ ఎక్జామ్స్ కి ఎలా ప్రిపేర్ అవుతున్నారంటూనే" పెళ్లి శుభలేఖ అందించింది.

"అనుకోకుండా నా పెళ్లి కుదిరింది మురారిగారూ. పరీక్షలు అయిపోయిన వెంటనే నా పెళ్లి".

"అందరూ ఎక్జామ్స్ ప్రిపరేషన్ లో హడావుడిగా ఉంటారేమోననుకుంటూ కాస్త ముందుగానే శుభలేఖలు పంచేస్తున్నాను. ఒక పెద్ద పని అయిపోతుంది కదా, తరువాత హాయిగా చదువుకోవచ్చని".

"మీరు తప్పకుండా రావాలి, వస్తారుకదూ"?

వస్తానన్నట్లు తలూపాడు.

" చదువు పూర్తైన వెంటనే పెళ్లేమిటంటూ సవా లక్ష ప్రశ్నలు అడుగుతున్నారు మన వాళ్లు".

"కానీ మీరొక్కరే నన్ను ఏమీ అడగడం లేదు కాస్తంత కినుకగానే అంది".

"అవి మీ వ్యక్తిగత విషయాలు కదండీ, అందుకనే అంటూ బిడియంగా సమాధానమిచ్చాడు".

"ఏమిటో మా పేరెంట్స్ నేనెంత చెప్పినా వినలేదు. ఒక్క రెండు సంవత్సరాలు ఆగమన్నాను".

"ఊహూ వింటేకదా"?

"మంచి సంబంధం అంటూ నా నోరు నొక్కేసారు మురారిగారూ. నా ఫియాన్సీ యూ.ఎస్ లో వర్క్ చేస్తున్నాడు. చదువు అవగానే అమెరికా వెళ్లిపోతాను".

తాను కొంచెం తేరుకుంటూ కంగ్రాట్స్ చెప్పాడు.

# కొత్త సీరియల్

ఆ తరువాత
కొన్నిరోజులు ఎందుకో డల్ అయిపోయాడు. మనసంతా శూన్య మావరించినట్లుగా అయిపోయింది.

చైత్ర ఎంత మంది స్నేహితుల మధ్య ఉన్నా తనను చూస్తూనే ఆ కళ్లు తళుక్కుమన్నట్లుగా అనిపించేవి. బహుశా తనకు ఆమె పట్ల గల ఇష్టం మూలాన తనే భ్రమపడుతున్నాడేమో అనుకునేవాడు.

తను చైత్ర పెళ్లికి వెళ్లలేదు.

తనకి పోస్టింగ్ హైద్రాబాద్ లో ఇచ్చారు.

చైత్రను తను ఇంకా మరచిలేకపోతున్నాడు. అందుకనే ఏ అమ్మాయినీ ఇష్టపడలేకపోతున్నాడు. ఏ అమ్మాయిని చూసినా చైత్ర లా లేదనుకునేవాడు.

నాలుగు సంవత్సరాల క్రితం నాన్నగారు పోయారు. అమ్మను తన దగ్గరకు వచ్చేయమంటే "నీవు పెళ్లి చేసుకుంటేగానీ నీ ఇంటికి రానంటూ ఖరాఖండీగా చెప్పేసింది.

రెండు సంవత్సరాల క్రితం తను కొత్త కంపెనీకి మారాడు. మంచి ఏరియాలో త్రీ బెడ్ రూమ్స్ అపార్ట్ మెంట్ కూడా కొనుక్కున్నాడు.

గత సంవత్సరం కంపెనీ ప్రాజక్ట్ పనిమీద ఒక సంవత్సరం కాలం యూ.ఎస్ పంపించింది. ఇంకా పొడిగిస్తామన్నా ఇష్టం లేక వచ్చేసాడు.

ప్రమోషన్ వచ్చి మేనేజర్ స్తాయికి ఎదిగాడు.

జీవితం యాంత్రికంగా గడచిపోతోంది.

ఆరోజు ఆఫీస్ కు తయావుతున్న మురారి సెల్ ఫోన్ రింగైంది.

నెంబర్ చూసి ముఖం చిట్లించాడు. అది నందిని ఫోన్.

'ఈ నందినికి ఎంత చెప్పినా అర్థంకాదా? ఒకటే ఫోనులు చేస్తుంది'?

''అమ్మా తల్లీ, నిన్ను పెళ్లి చేసుకోలేనని కఠినంగా చెప్పేసినా నవ్వుతూ తేలికగా తీసుకుని తన వెంటపడుతోంది''.

అసలు దీనికంతటికీ కారణం విరజ అక్కే కదా!

ఆరునెలల క్రితం తన ప్రమేయం లేకుండా తన ప్రొఫైల్ ను షాదీ డాట్ కామ్ లో పెట్టేసింది, తన సెల్ నంబర్ తో సహా.

నెల రోజుల క్రితం అనుకుంటా, ఈ నందిని తన ఆఫీస్ అడ్రస్ తెలుసుకుని డైరక్ట్ గా ఆఫీస్ కు వచ్చేసి రిసెప్షన్ నుండి కాల్ చేయించింది.

ఎవరో అనుకుని వస్తే అప్పుడు చెప్పింది. ''షాదీ డాట్ కామ్ లోని మీ ప్రొఫైల్ చూసాను. నాకు మీరు నచ్చారు. మిమ్మలని చూసేసి మాట్లాడేసుకుంటే బాగుంటుంది కదా అని వచ్చానంది.

తను తెల్లబోయాడో క్షణం.

గడ గడా తన గురించి చెప్పేసింది తనని మాట్లాడనీయకుండా ....

"ఫరవాలేదు మురారిగారూ, మీకు ప్రస్తుతం ముప్పై రెండు నిండాయి కదా. మీకూ నాకూ మధ్య ఎనిమిది తొమ్మిదేళ్ల వయస్సు వ్యత్యాసం ఉన్నానష్టం ఏముందండీ"? " మన అమ్మమ్మల బామ్మల కాలంలో వయస్సు తేడా చాలా ఉండేదిట. వాళ్లు చక్కగా కాపురాలు చేసుకోలేదా, పిల్లలను కనలేదా అంటూ".

'అన్నీ ఈమే నిర్ణయించేస్తోందే తనకు ఇష్టమో కాదో తెలుసుకోకుండా అని చిరాకు పడ్డాడు మనసులో''.

'చూడడానికి బాగానే ఉందనిపించే నందిని ఎమ్.బి.ఏ ఫైనాన్స్ చేసి శ్రీరామ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లో పని చేస్తున్నానని చెప్పింది. పెళ్లి అయ్యాక హోమ్ మేకర్ ని అవుతానంటూ చెప్పింది'.

'నీవు ఏమి మేకర్ వి అయితే నాకెందుకనుకున్నాడు మనసులో'.

అసలు పెళ్లి చేసుకోడానికే సుముఖంగా లేనపుడు నందిని గురించి ఆలోచించే పరిస్తితిలో లేడు.

అందుకనే ఆమె ఫోన్ కాల్స్ కి జవాబివ్వకుండా స్విచ్ ఆఫ్ చేసేస్తున్నాడు.

ఆఫీస్ లో పని ఎక్కువగా ఉంటోంది. టీమ్ అంతా రాత్రీ

పగలూ
పనిచేయాల్సి వస్తోంది. ఇంతవరకూ వర్క్ ఫ్రమ్ హోమ్ చేసినా విధిగా అందరూ కంపెనీకి వెళ్లాల్సి వస్తోంది.

అమ్మ ఉగాది పండుక్కి తప్పని సరిగా రావాలంది. అక్కా, చెల్లీ, తమ్ముడూ వస్తున్నారుట. అందరూ వస్తున్నారంటే భలే సందడిగా ఉంటుందనుకున్నాడు.

ఇంక షరా మామూలే, అందరూ పెళ్లి ఎప్పుడు చేసుకుంటావంటూ వదిలిపెట్టరు.

ఉగాది షాపింగ్ చేయాలి. అమ్మకు, అక్కకూ, చెల్లెలికీ, తమ్ముడి భార్యకూ చీరలు, పిల్లలకు డ్రెస్ లు కొనాలి. బావగార్లకు, తమ్ముడికీ అక్కడే కొనేయచ్చనుకున్నాడు.

ఆ ఆదివారం కళామందిర్ స్టోర్స్ కి వెళ్లాడు. తన చీరల సెలక్షన్ బాగుంటుందని అక్క, చెల్లీ అంటారు. బావగార్లైతే తనని ఆటపట్టిస్తూ "మీ సిస్టర్స్ కే ఇంత మంచి చీరలు కొంటే నీ కాబోయే భార్యకు ఇంకెంత చక్కటివి కొంటావో అంటూ" ఎందుకింకా పెళ్లిచేసుకోవు మురారీ? అంటూ చనువుగా అడుగుతాడు".

'తను చైత్రను ఇంకా మరచిలేకపోతున్నాడా'? పెళ్లి అయిపోయి అమెరికా వెళ్లిపోయిన చైత్ర అంటే ఇంకా ఆశ ఎందుకు?

దీనికి సమాధానం తన మనస్సుకి మాత్రమే తెలుసు.

'అది తన తొలి ప్రేమ. ప్రతి వ్యక్తి జీవితంలో ఎప్పుడూ వెంటాడే ఓ అద్భుతమైన ఫీలింగ్. ఆ ప్రేమ జ్ఞాపకాలు మంచి వైనా చెడ్డవైనా గుర్తొచ్చిన ప్రతిసారి గమ్మత్తుగానే ఉంటాయి. ఆ మధురమైన భావన తను ఎంత మంది అమ్మాయిలను చూసినా కలగడం లేదు'.

తను షాపింగ్ పూర్తి చేసుకుని బయటకు వస్తున్న సమయంలో......

"హాయ్ మురారిగారూ అన్న పిలుపుకు ఉలిక్కిపడుతూ తలెత్తేసరికి తనకు ఎదురుగా నందిని, ఆమె పక్కనే ఒక యువకుడు".

"ఏమిటీ, మొత్తం షాప్ నే కొనేసారా ఏమిటీ"?

"అబ్బ మళ్లీ తారసపడింది" అని గొణుక్కున్నాడు.

"ఇతను మా బావ ఫణీంద్ర మురారిగారూ", "బావా ఈయన మురారిగారు" అని పరిచయంచేయగానే ఇద్దరూ హాలో చెప్పుకున్నారు.

"బావా నీకు చెప్పానుకదా నాకు కిందటి నెలలో పెళ్లి చూపులయ్యాయని. ఈ మురారిగారితోనే".

నందిని మాటలకు విస్తుపోతూ చూస్తున్నాడు మురారి.

"నాకు మురారిగారు బాగా నచ్చేసారు. ఆయన ఇంకా ఓకే చెప్పలేదనుకో, కాస్త సమయం కావాలన్నారు".

"నాకైతే ఆలోచించుకోడాని ఏమీలేదు. నాకు నచ్చితే అమ్మా నాన్నాకూ నచ్చినట్లే".

"ఎందుకో ఫణీంద్ర ముఖం వెలతెలబోయింది".

"అదేమిటీ ఈ అమ్మాయి ఇంత చొరవతీసుకుని తన తరపున కూడా వకాల్తా తీసుకుని మాట్లాడేస్తోంది"? నాకు సమయం కావాలని ఎప్పుడన్నాను? ఆశ్చర్యపోతున్నాడు మురారి.

తన అభిప్రాయాన్ని సూటిగా ఎప్పుడో చెప్పేసాడు. అయినా తన వెంట పడ్తూ అదే పనిగా ఇబ్బంది పెడ్తుంటే కొంచెం కాఠిన్యాన్ని తెచ్చి పెట్టుకుంటూ మరీ చెప్పాడు ఇలా అదేపనిగా తన వెంటపడద్దని.

మరోసారి స్ట్రాంగ్ డోస్ ఇవ్వాలనుకుంటూ మౌనంగా కార్ పార్కింగ్ వైపుకి నడిచాడు.

మురారిని చూసి ఇంటిల్లిపాదీ ఆనందపడ్డారు. తల్లి నీరసంగా ఉండడం గమనించిన మురారి "అమ్మా డాక్టర్ కి చూపించుకున్నావా ఈ మధ్య" అంటూ ఆత్రంగా అడిగాడు.

"ఏదో కాస్తంత నీరసంగా అంటోంది తప్ప బాగానే ఉన్నాను మురారీ అంటూ ఆవిడ సమాధానిచ్చింది.

ఉగాది పండుగ చాలా సరదాగా గడిచింది. మురారి కొన్న చీరలు చూసుకుని ఇంట్లో అందరూ

మురిసిపోయారు. పిల్లలు కొత్త బట్టలు తొడుక్కుని గంతులేసారు.

ఆరోజు రాత్రి లీలావతి మురారి పెళ్లి విషయం ఎత్తింది. " చేసుకుంటానమ్మా, మంచి సంబంధం చూడనగానే ఆవిడ కళ్లల్లో ఆనందం తొణికిసలాడింది". ఎప్పుడు పెళ్లి మాటెత్తినా చిరాకు పడే మురారి పెళ్లి చేసుకుంటానంటున్నాడు. ఈ సంవత్సరంలో ఎలాగైనా పెళ్లి చేసేయాలనుకుంది ఆవిడ.

మర్నాడు సాయంత్రమే మురారి తిరుగు ప్రయాణం. ఆఫీస్ లో పూర్తి చేయాల్సిన పనులెన్నో ఉన్నాయనుకుంటూ నిద్రపోయాడు.

మర్నాడు ఉదయం ఎంతకూ నిద్రలేవని తల్లి గదిలోకి లేపాలని వెళ్లారు మురారి అక్కా, చెల్లెలూ.

"ఉన్నట్టుండి ఒరేయ్ మురారీ అంటూ గావుకేక పెట్టింది మురారి అక్క విరజ".

గబ గబా వెళ్లాడు. తల్లి ని కుదుపుతూ లేపుతున్నారు అక్కా,చెల్లీ.

ఆవిడ కదలకుండా ప్రశాంతంగా ఆదమరచి నిద్రపోతోంది.

డాక్టర్ వచ్చి చూసాడు. రాత్రి నిద్రలో కార్డియాక్ అరెస్ట్ అయిందని చెప్పాడు.

మురారి దుఖం చెప్పనలవికాదు. అందరూ తల్లి చుట్టూ చేరి దుఖిస్తున్నారు.

"నీ పెళ్లి పెళ్లి అంటూ కలవరించేదిరా అమ్మ. ఆ శుభకార్యం అయ్యేవరకైనా అమ్మ ఉండాల్సింది అంటూ విరజక్క ఒకటే ఏడుపు". చెల్లెలు వినతి దుఖాన్ని ఆపలేకపోతున్నారు ఎవరూ కూడా.

అమ్మకు తన పెళ్లి మీదే బెంగ. తను అమ్మ కిచ్చిన మాట నిలపెట్టాలని దృఢంగా నిశ్చయించుకున్నాడు.

తల్లికి జరపాల్సిన కార్య క్రమాలన్నీ పూర్తిచేసి హైద్రాబాద్ వచ్చేసాడు.

తన సెల్ ఫోన్ చూసుకుంటే నందిని నుండి ఎన్నో మిస్డ్ కాల్స్,మెసేజస్.

"ఏమిటో ఈ జీవితం? ఇష్టపడిన వాళ్లు దూరమైతే, వద్దనుకునేవారు వెంటపడడం ఆశ్చర్యమే కదూ"!

పదిహేను రోజులు శెలవు తీసుకోవడంతో చాలా పని పెండింగ్ ఉండిపోయింది. ప్రాజక్ట్స్ డెడ్ లైన్స్ సమీపిస్తున్నాయి. మధ్య మధ్యలో అమ్మ గుర్తుకొచ్చినప్పుడల్లా మనసు భారమై పోతోంది. "షాదీ డాట్ కామ్" నుండి చాలా మెయిల్స్ వచ్చాయి. "మీ ఫ్రీ సమయం చెపితే మాటలాడతామంటూ".

నందిని మనస్సులో మెదిలింది. ఆ అమ్మాయి తనని ఇష్టపడుతోంది. ఇరువురి మధ్యా ఎనిమిదేళ్ల వయస్సు వ్యత్యాసం. మరీ చిన్నపిల్లేమో? పెళ్లైనాకా తమ కాపురం సజావుగా నడిస్తే ఫరవాలేదు. అభిప్రాయబేధాలు వచ్చి జరగరానిది ఏమైనా జరిగితే?

"కానీ వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోవడం లేదు కదా"!

తను సరైన నిర్ణయం తీసుకోలేక పోవడం వలన విభిన్నరకాల సంఘర్షణల కు లోనౌతున్నాడు. ఏది కావాలో ఏది వద్దో తెలియని డోలాయమానం.

ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు నందిని నుండి ఫోన్.

"నేను మీ ఆఫీస్ విజిటర్స్ రూమ్ లో ఉన్నాను మురారిగారూ, మిమ్మలని అర్జంట్ గా కలవాలంటూ".

వచ్చాడు కిందకు.

"ఏమిటి మురారిగారూ ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు, పైగా మెసేజస్ కూడా చేసాను".

"బిజీ గా ఉండి నా సెల్ ఫోన్ చూసుకోలేదు. సారీ, చెప్పండి ఎందుకు వచ్చారు"?

"మీ రిసెప్షన్ కి ఫోన్ చేస్తే చెప్పారు. మీ అమ్మగారు పోయారని మీరు రాజమండ్రీలో ఉన్నారని . సారీ ఫర్ యువర్ లాస్ మురారిగారూ".

"ఇట్స్ ఓకే నందినీ"!

"బై ది బై నా పెళ్లి మా బావతో ఫిక్స్ అయిందండీ. మీకు జరిగిందంతా చెప్పాలి విత్ యువర్ కైండ్ పర్మిషన్. మిమ్మలని బోర్ కొడుతున్నానని తెలుసు. కానీ చెప్పకపోతే నా అంతరాత్మ నన్ను

క్షమించదు మురారి గారూ"!

ఒక్క క్షణం ఏమి చెపుతోందో అర్థం కాలేదు. వెంటనే తేరుకుంటూ, "చెప్పండి ఫరవాలేదన్నాడు".

"నేను మా బావను మొదటి నుండీ ప్రేమిస్తున్నానండీ. ఫణీంద్రకి కూడా నేనంటే ఇష్టమే. కానీ వాళ్ల నాన్నకు అంటే మా మామయ్యకు నన్ను వారి కోడలుగా చేసుకోవడం ససేమిరా ఇష్టంలేదు. మా మామయ్యకు నాన్నంటే పడదు. బావేమో నాన్నకు ఇష్టం లేని పని చేయను, నిన్ను పెళ్లి చేసుకోలేనని చెప్పేసరికి నాకు చాలా కోపం వచ్చింది. "మామయ్య వద్దన్న మాత్రాన మనం పెళ్లి చేసుకోకపోవడమేమిటీ, ఏం ఫరవాలేదు పెళ్లి చేసేసుకుందాం, ఆ తరువాత మీ వాళ్లే నెమ్మదిగా కన్విన్స్ అవుతారన్నానండీ".

"పెళ్లి కాకుండానే ఇలాంటి సలహాలిస్తూ నన్ను మా పేరెంట్స్ కు దూరంచేస్తావా అంటూ ఖస్సు మన్నాడండీ. నేను నిన్నుపెళ్లి చేసుకోను ఫో అంటూ వెళ్లిపోయాడు".

"ప్రేమంటే అర్థం అదేనా మురారిగారూ? ఆ రోజు బావ ప్రవర్తనకు నేను ఎంతటి సంఘర్షణకు లోనైనానో ఆ భగవంతుడికే తెలుసు"!

"నాకు చాలా రోషం వచ్చి ఫణితో ఛాలెంజ్ చేసాను. నీవు తప్ప నాకు ఎవరూ దొరకరనుకోకు. నీకంటే అందగాడిని మంచి హోదాగలవాడిని చేసుకుంటానని".

అందుకే వెంటనే షాదీ డాట్ కామ్ లో సంబంధాలు వెతుకుతుంటుంటే మీ ప్రొఫైల్ తారసపడింది. వయస్సు ఎక్కువైనా మీరు స్మార్ట్ గా ఉన్నారు మా బావకంటే. పైగా మంచి ఉద్యోగం, పేకేజ్ కూడాను.

"మిమ్మలని చూపించి బావను ఉడికించాలనుకున్నాను. నేను మిమ్మలని ట్రాప్ చేసానని నన్ను తిట్టినా భరిస్తాను.

"నిజానికి మిమ్మలని పెళ్లి చేసుకునే ఉద్దేశం నాకు లేదండీ".

''ఆ రోజు మీరు కళామందిర్ లో షాపింగ్ ముగించుకుని వస్తూండగా మాకు ఎదురుపడ్డారు. "హమ్మయ్య వెతకబోయిన తీగ కాలికే తగిలినట్లు" హుషారు వచ్చేసింది నాకు. బావను ఏడిపించే ఒక మంచి అవకాశం అనుకుంటూ మనిద్దరకూ పెళ్లి చూపులైనాయని నాకు మీరు నచ్చారని చెప్పేసరికి మా బావ ముఖం ఎలా మాడిపోయిందో గమనించారా మురారిగారూ''?

ఎలా వాళ్ల నాన్నను ఒప్పించాడోగానీ మా పెళ్లికి పచ్చ జండా ఊపాడు మా మామయ్య. అందుకనే ఈ రోజు మీకు జరిగింది వివరంగా చెపుదామనే ఇలా వచ్చాను.

"మిమ్మలని ఒక్క విషయం అడగచ్చా"?

"ఏ విషయం నందినీ"?

"ఇంతకాలం మీరు పెళ్లెందుకు చేసుకోలేదు"?

'జవాబు చెప్పలేక మౌనం వహించాడు'.

"నేను చెప్పనా? మీరు ఒక అమ్మాయిని ప్రేమించి ఉండచ్చని ఊహిస్తున్నాను".

'నందిని మాటలకు తృళ్లిపడ్డాడు'.

" మీరు మీ ప్రేమను ఆ అమ్మాయితో చెప్పలేకపోయారు. ఆ అమ్మాయిని మరచిపోలేక పెళ్లి చేసుకోకుండా ఉండిపోయారు.

(ఇంకా ఉంది )

కథ

# “నాన్నా నన్నెందుకు ....... ............చదివించావు? “

ఈదర శ్రీనివాస రెడ్డి

“నీ జీతం డబ్బు అంతా ఏం చేశావమ్మ “పెళ్ళైన నెల రోజుల్లోనే మామగారి నుంచి ఎదురైంది ఈ ప్రశ్న అఖిలకి

అఖిలకి ఒక్క నిమిషం ఏం జవాబు చెప్పాలో అర్థం కాలేదు

కని పెంచిన కన్నతండ్రి అఖిలను ఏనాడు. ఆ ప్రశ్న అడగలేదు. ఒక్క రూపాయి కుడా అయన ఏనాడు అడిగింది కాని ఆశించింది కాని లేదు అది ఆయన సంస్కారం

ఎవరో పరాయి ఆడపిల్ల ఇంట్లో అడుగు పెట్టి నంత మాత్రాన అన్ని హక్కులు తనకే ఉన్నట్టు అడిగిన మామగారి బుద్ధి ఎటువంటిదో అర్ధమయ్యింది అఖిలకు

‘గుళ్ళో హుండిలో వేసానండి , ఉద్యోగం వస్తే వేస్తానని మొక్కుకున్నాను ’ నిబ్బరంగా జవాబు చెప్పింది అఖిల

ఆ జవాబు విన్న అఖిల అత్తమామలిద్దరికి నోట మాట రాలేదు .అక్కడి తో ఆ సంభాషణ మూగిసినా రాత్రి ) మళ్ళీ పడుకునేటప్పుడు భర్త సందీప్ అదే విషయాన్ని లేవనెత్తాడు

'ఏంటి నాన్న ఏదో అడిగితే పెడసరంగా జవాబు చెప్పవట ' అసహనంగా అడిగాడు సందీప్

"ఏం చెప్పాను. జరిగింది చెప్పాను ... "ప్రసాంతంగా'జవాబిచ్చింది అఖిల

"నిజంగా రెండేళ్లు సంపాదించినాదంతా గుడిలో హుండి లో వేసావా?' నమ్మకం కుదరక మళ్ళీ అడిగాడు సందీప్

"అవునంటున్నాగా , సరే నావిషయం పక్కన పెట్టు , నీ జీతం మొత్తం ఏమి చేసావు పెళ్ళికాక ముందు ".అడగ కూడదు అనుకుంటూనే అడిగింది అఖిల .

బహుసా అహం దేబ్బతిన్నదో ఏమో కొద్దిగా స్వరం పెంచి, "ఏం చేస్తాం. కర్చ్చు పెట్టుకుంటాము , మిగిలితే దాచమని తల్లి దండ్రులకు ఇస్తాము

మగవాళ్ళతో వచ్చిన చిక్కే ఇది. భర్త భార్యను ఎన్ని ప్రశ్నలైనా అడగచ్చు. భార్య భర్తను ఒక్క ప్రస్నఽఅ అఽదిగిథె మాత్రం ఓర్చుకోలేరు .

"మరి నేను కుడా చేసింది అదేకదా , తెలిసి అడగటం దేనికి. అయినా నన్ను అడగటానికి ఆయనకు ఏమి హక్కు ఉంది . కావాలంటే నువ్వు అడుగు .నీకు ఆ హక్కు ఉంది నా మీద " తను కాస్త గొంతు పెంచి అడిగింది అడవీటాకి సాయం వంది కావాలంటే ముద్వు వడగు నీరు సాహోకు

"" సరే నేనే అడుగుతున్నాను చెప్పు ..."కోపంగా అడిగాడు సందీప్

'నువ్వు పెళ్ళి చూపుల్లో నాకిచ్చిన మాట మర్చి పోయావా? గతాన్ని గుర్తు చేసింది అఖిల

'ఏమి మాట ఇచ్చాను. 'తెలియనట్లు అడిగాడు

'నీ జీతం నీ ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెట్టుకో పెట్టుకో, నాకేమి లెక్కలు చెప్పనక్కరలేదు , నీకు పూర్తి స్వేచ్ఛ నిస్తున్నాను అన్నావు కదా ?''

అఖిల అడిగిన ప్రశ్న కు సందీప్ దగ్గర జవాబు లేదు, అందుకే మౌనంగా మిగిలి పోయాడు .దుప్పటి ముసుగుతన్ని అటు తిరిగి పడుకున్నాడు .

అఖిల కుడా మౌనంగా లైట్ ఆర్పేసి కళ్ళు మూసుకుంది .

★★★★★

"ఇప్పుడు మనకి అంత ఖరీదైన విల్లా అవసరమా?" భర్తను ప్రశ్నించింది అఖిల

"ఇద్దరం సంపాదిస్తున్నాము. ఒకరి జీతం ఖర్చుపెట్టుకున్నా, మరొకరి జీతం దాచుకోవచ్చుగా అని అమ్మ నాన్న అంటున్నారు. రేపు పిల్లలు పుడితే ఎటూ కుదరదు ఈ లోపే ఏదన్నా ప్రాపర్టి కొనేస్తే రేపు వాళ్ళకుంటుంది కదా అని "జవాబిచ్చాడు. సందీప్

"ఓ'ఇది కూడా మీ అమ్మ నాన్నల ఆలోచనే నన్నమాట .ఎలాగైనా నా జీతాన్ని లాక్కోవాలని చూస్తున్నారు " అని మనసులో అనుకుంటూ

"సరే సందీప్. ఒక పని చేయి నీ జీతంతో విల్లా కోనేసెయ్, ఇంటి ఖర్చులకు నా జీతం వాడదాము, ఏమంటావు" తన ఆలోచన భర్త ముందు వుంచింది.

"అంటే ఏంటి నీ ఉద్దేశ్యం, నా జీతం మొత్తం విల్లాకి ఇ ఎం ఐ ఉ కట్టేసి, పదికి పరకకి నీదగ్గర చేతులు చాచాలా? అసలు నీకు జీతం ఎంత వస్తుందో చెప్పవు , ఏం చేస్తున్నావో చెప్పవు. మరీ మెతగ్గా వుంటున్నా కదా అని వేషాలు వేయకు""

నువ్వు చెప్పే వన్నీ నాకు వర్తిస్తయి కదా? నేను కూడా ప్రతి దానికి నీదగ్గర చెయ్యి చాచాల ?? "

"ఏం, భర్త దగ్గర చెయ్యి చాస్తే నీకేమన్నా నామోషినా? ★

"ఏం, నీకు భార్య దగ్గర చెయ్యి చాచటానికి సిగ్గా?"

మాటకు మాటా నేర్చావు, అసలు నీకేమి ఖర్చులుంటాయి. రేపటి నుండి నీ జీతం మొత్తం నాకే ఇవ్వాలి.". అహంకారం తారాస్థాయికి వెళ్ళటంతో హు ఒకరించాడు

గొడవ పెద్దదయేటట్టు వుందని. అఖిల మౌనంగా వుండి పోయింది.

పక్క రోజు జరిగిన దంతా తల్లికి ఫోన్ చేసి చెప్పింది

"పోనిలే తల్లి, గొడవలు ఎందుకు

. అయినా పెళ్ళైన తరువాత నీ డబ్బు , అతని డబ్బు ఏమిటి . ఆడది అత్యంత విలువైనా మాననన్నే మొగుడు అనే మగాడికి సమర్పిస్తుంది .ఇంకా డబ్బు దేముంది తల్లి .అయినా అతనేమి దుబారా చేస్తాను అనటంలేదు కదా ? పిల్లలకు పనికొస్తుంఉన్నది ఆస్తి కొంటాను అంటున్నాడు, ఇందులో తప్పేముంది . ఒక మెట్టు నువ్వే తగ్గితే పోయేదేముంది " సర్దుకు పోమ్మన్నట్టు నచ్చ చెప్పింది

అఖిల కూడా తల్లి మాటలతో కాస్త సమాధాన పడింది. ఎవరిడబ్బైతే ఏమిలే, ఎవరి దగ్గరుంటే ఏమౌతుందిలే అని సరిపెట్టుకుంది . అదే అఖిల చేసిన పెద్ద పొరపాటు.

అఖిల ఒక్కతే కాదు. అందరు ఆడవాళ్ళు అంతే . దారాన్ని భర్త చేతిలో పెట్టి ఆకాశంలోకి గాలిపటంలా స్వేచ్ఛగా ఎగరాలని చూస్తారు. అతను ఆడించనంత వరకె ఆ స్వేచ్ఛ అని తెలుసుకోరు. తెగేదాకా లాగితే దారం తెగి పోతుందని రాజీపడి పోతారు. ఇప్పుడు అఖిల కూడా అంతే రాజీపడి పోయింది.

ఎగిరే గాలిపటాన్ని మెల్లగా కిందకి దించుతున్నా డని అర్థం చేసుకోలేక పోయింది

విల్లా కొన్న తరువాత తెలిసింది, వీళ్ళని సందీప్ తన పేర రిజిస్ట్రేషన్ చెయించుకున్నాడని. అదే మాట దిగితే

'ఏం. నామీద నమ్మకం లేదా? నిన్ను వదిలేస్తానని అనుమానమా?"

అంటూ వెకిలిగా నవ్వాడు

ఆ నవ్వు అఖిల గుండెల్లో ఎక్కడో నిప్పు రాజేసింది.. అది పెరిగి పెద్దయి జ్వాలగా మారటానికి ఎక్కువ సమయం పట్టలేదు:

★★★

ఆఫీసులో బాగా పని వత్తిడిలో వున్న సమయంలో సెల్ ఫోను అదేపనిగా మోగుతోంది.

ఇంకొకల్ల ఇంకొకళ్ళు ఫోన్ కాల్ అయితే తీసేది కాదు. కాని కాల్ చేస్తోంది అఖిల తల్లి కావటంలో ఫోన్ ఎత్తింది. అప్పటికీ మనసులో ఏదో కీడు శంకిస్తూ వుంది, భయం భయంగా "హలో "అంది అటు వైపు నుంచి అఖిల తల్లి పెద్దగా ఏడుస్తూ " అమ్మా, నాన్న గారికి హార్ట్ ఎటాక్ వచ్చింది " అంటూ పిడుగులాంటి వార్త చెప్పింది.

ఆ మాటలు వినగానే అఖిల కాళ్ళ కింద భూమి బద్దలై నట్లు అనిపించింది. తనకు ఊహ తెలిసిన దగ్గర నుండి తన వెనుక వుండి ధైర్యం చెబుతూ వేన్ను తట్టి నడిపించిన నాన్నకు హార్ట్ ఎటాకా. తలుచు.కుంటునే కళ్ళ లో నుండి జలజలా కన్నీళ్ళు రాలుతున్నాయి.

ఫోన్లో తల్లికి ధైర్యం చెప్పి, వెంటనే సందీప్కి ఫోనా చేసింది, తనతో పాటు హాస్పిటల్కి వస్తాడేమోనని ఆశపడుతూ ,కాని తన ఆశ నిరాశే అయ్యింది.

ఆఫీసుల్ పనుంది రాలేనని మొఖం మీదే చెప్పేసాడు . ఇంకోసారి ఇంకోసారైతే సందీప్ తో గొడవ పెట్టుకునేది, కాని ఇప్పుడు సమయం కాదు కాబట్టి వెంటనే తమ ఊరు బయలు దేరుదామ ను కుని, ఏదో గుర్తుకొచ్చిన దానిలో ఆటోలో ఇంటికి బయలు దేరింది.

ఇంటికి చేరుకోగానే ,ఆటో అతన్ని బయటే వుండమని చెప్పి ఇంట్లోకి పరిగెత్తింది. దబదబా, బీరువా తెరిచి నాలుగు చీరలు, జాకెట్లు, తన నగలు బ్యాగులో సర్దుకుని, మళ్ళీ అంతే వేగంగా ఇంట్లో నుండి బయట పడింది.

అఖిల ఇంట్లోకి వచ్చిన దగ్గర నుండి గమనిస్తున్న అఖిల అత్తగారికి ఏమి అర్థంకాక, అఖిల బయట వెళ్ళుతూ వుండగా, 'ఎక్కడికి వెళుతున్నావు అఖిల? "అంటూ వెంట పడింది

కాని అప్పటికే అఖిల ఆటో ఎక్కటం, ఆటో బయలుదేరటం జరిగిపోయాయి. ఆటో మోతలో అఖిలకు అత్తగారి మాటలు వినపడ లేదు.

తను అడిగిన ప్రశ్నతు జావాబు దొరకక పోవడంతో అఖిల అత్తగారికి ఏదోఅనుమానం వచ్చి అఖిలగదిలోకి వెళ్ళి చూసింది.

అఖిల బయటకు వెళ్ళే తొందరలో బీరువా తలుపులు వేయటం మరిచిపోవటం వల్ల బట్టలన్నీ జారి కింద పడి చూసే వాళ్లకు అక్కడేదో దొంగతనం జరిగి నట్టు కనపడుతోంది .

దాంతో గాభరాపడిన అఖిల అత్త గారు కొడుక్కి ఫోను చెయ్యటానికి అక్కడి నుంచి కదిలింది.

★★★★

అఖిల ఊరు చేరేలోపే సందీప్ చాలా సార్లు ఫోన్ చేశాడు. సందీప్ ఎందుకు చేస్తున్నాడో ఆ మాత్రం ఊహించ లేనిది కాదు అఖిల. అప్పటికే మనసు బాగా అలసిపోయింది, మళ్ళీ సందీప్ ఫాక్స్ కాల్స్ ని ఎత్తి ఇంకా మనసు పాడు చేసుకో దలుచుకోలేదు. అందుకనే అతని ఫోన్ కాల్స్ ఎత్తటం మానుకుంది.

ఊళ్ళో దిగగానే సరాసరి తండ్రిని చేర్చిన హాస్పటలకి వెళ్ళింది. అఖిల ముందే ఊహించినట్టు, తండ్రి ఆపరేషనుకు ఆరులక్షల దాకా ఖర్చయ్యింది. తన నగలు మొత్తం అమ్మేసి ఆ డబ్బుతో అసుపత్రి .. ఖర్చులన్నీ తనే భరించి తండ్రిని ఇంటికి తీసుకొచ్చింది.

తండ్రిని ఇంటికి తీసుకొచ్చిన మర్నాడే సందీప్ అఖిల వాళ్ళ ఇంటికి వచ్చాడు.

తండ్రిని చూడటానికి వచ్చాడనుకుని అఖిల ఎంతో సంతోషించింది.

కాని అతనెందుకు వచ్చింది తెలుసుకున్న తరువాత నోట మాట రాక స్థాణువులా నిలబడి పోయింది.

"ఏం మాట్లాడవు. ఇంట్లో వున్న డబ్బు, నగలు ఎందుకు దొంగతనంగా తీసుకొచ్చావు. నెపం మోపాడు సందీప్.

ఆ మాటలు వింటు వుంటే నే నరాలు చిట్లి పోతున్నాయి అఖిలకి

నేనా దొంగతనమా ?నా డబ్బు ,నా నగలు నేను తెచ్చుకుంటే అది దొంగతనం ఎలా అవుతుంది?" అరిచినంత పనిచేసింది

"నాకు చెప్పకుండా తీసుకోస్తే దొంగతనమే అవుతుంది. నేను ఇంటి యజమానిని " గొంతు పెంచి అంతే పెద్దగా అరిచాడు సందీప్

సందీప్ మాటలకు ఏం జవాబు చెప్పాలో అర్థం కాలేదు.

ఇంకోసారి ఇంకసారైతే గట్టిగానే సమాధానం, చెప్పేది. కాని తమ గొడవ వింటే , తండ్రి కోలు కోలేడని ఒక్క క్షణం గుర్తుకొచ్చి, చేతులు రెండూ జోడించి "దయ చేసి వెళ్ళిపోండి 'అంటూ నమస్కరించింది.

జరుగుతున్నదంతా ఎవరైతే వినకూడదనుకుందో , వాళ్ళే విన్నారు.

తమ ఇద్దరి మధ్య జురుగుతున్న సంభాషణంతా విని అఖిలా తండ్రి కుప్పకూలి పోయాడు.

వెంటనే హాస్పిటల్కు తీసుకెళ్లినా ఫలితం దక్క లేదు, అక్కడే తుది శ్వాస విడిచాడు.

అంత బాధలో వున్న అఖిలకు అండగా నిలవాల్సిన సందీప్ తనకేమి పట్టనట్టు తనదారిన తాను వెళ్ళి పోయాడు.

ఏఆడదానికైనా తండ్రి కొండంత అండ, తండ్రి తరువాత భర్త ఆ స్థానాన్ని భర్తీ చేయాలి. కాని ఇద్దరూ ఇప్పుడు అఖిలను వదిలేసి వెళ్లి పోయారు

★★★

" నన్నెందుకు పెద్ద పెద్ద చదువులు చదివించావు నాన్నా" ఆ రోజు మనసులో ఎన్ని సార్లు అనుకుందో, ఆమె కళ్ళ నుండి జాలు వారుతున్న కన్నీటి బొట్లను లెక్క కడితే తెలుస్తుంది.

పెళ్ళైన దగ్గర నుండి ఈ ప్రశ్న తండ్రిని అడగాలని అనుకోని రోజు లేదు. కాని అడిగితే తండ్రి బాధపడతాడు అని ఆయన ఫొటోను ఎదురుగా పెట్టుకుని అడిగేది అఖిల. ఒక వేళ నిజంగా అడిగు దామనుకున్నా , ఈ రోజు ఆ తండ్రి బతికి లేడు సమాధానం చెప్పటానికి

బతిన్న రోజుల్లో , ఆడపిల్లలు ఎంత ఎక్కువ చదువుకుంటే అంత మంచి ఉద్యోగం వస్తుంది, భవిష్యత్తు లో పెళ్లైనా ఏ ఇబ్బందులు తలెత్త కుండా జీవితం సుఖంగా సాగిపోతుంది" అనేవాడు అఖిల తండ్రి

తన తండ్రి అనుకున్నట్టు మంచి ఉద్యోగం అయితే వచ్చింది అఖిలకు .కాని ఆ ఉద్యోగం వాలే జీవితంలో సుఖం లేకుండా పోయింది అఖిలకు . కాళ్ళకి చేతులకి సంకెళ్ళు వేసి స్వేచ్ఛగా ఎగర మంటోంది . బంగారపు పంజరం లో చిలకలా అయ్యింది తన బతుకిప్పుడు .

అస్సలు ఏ చదువు చదవక పోయినా బాగుండేది, ఏ ఉద్యోగం, సద్యోగం లేకుండా, తన ఇంట్లోనే జీతం బెత్తం లేని కట్టు బానిసగా మిగిలిపోయేది. తన ఖర్మ ఇంతేలే అని సరిపెట్టు కునేది.

కాని ఇప్పుడు అలా సరిపెట్టుకోటానికి మనసు ససేమీరా అంటోంది, తిరగబడ మంటోంది. అది అహంకారమో, ఆత్మ గౌరవమో అర్థం కావట్లేదు. అంతరాత్మ, ఆత్మగౌరవం అని పదే పదే గుర్తుచేస్తుంది, అహంకారం అని అయిన వాళ్ళు గుచ్చి గుచ్చి దెప్పిపొడుస్తున్నారు.

అలా ఎంతసేపు ఆలోచిస్తూ కూర్చుందో తనకే తెలియదు. చికటి పట తుండటంతో

"అమ్మగారు వెళ్దామా .... " అని వాచ్ మెన్ వచ్చి అడగటం తో

చిన్నగా లేచి ఆఫీసులో నుండి బయట పడి అడుగులో అడుగు వేసుకుంటూ బస్టాపు వైపు నడిచింది, ఇంటికి వెళ్ళటానికి అలవాటు పడ్డ కాళ్ళు కాబట్టి అప్రయత్నంగా అడుగులు పడుతున్నాయి, మనసు మాత్రం ఇంటికెళ్లటానికి ఇష్టపడటం లేదు. బస్టాపులో ఎవ్వరూలేరు. ఒక రిద్దరు " ఆటో మేడమ్ " అని అడిగినా, నేనేమి సమాధానం చెప్పుక పోయే సరికి, ఏమనుకున్నారో ఏమో నావంక అదోలా చూసి ముందుకు వెళ్ళి పోయారు.

ఇది "అఖిలకు మాములే .అఖిల ఆఫీసులో అందరికి చిన్నదో . పెద్దదో వాహనాలున్నాయి .ఒక్క అఖిలకే ఏది లేదు . అఖిల ఆఫీసరు హోదాకు , తనకొచ్చే జీతానికి ఓ కారు కొనటం పెద్ద విషయం కాదు. కాని కారుకే కాదు ,కనీసం స్కూటీ కొనుక్కునే స్వేచ్ఛ కూడా లెదని పెళ్ళైన తరువాతే తెలిసింది .అంతదాకా ఎందుకు, ఆటో ఎక్కటానికిడబ్బుల్లేక బస్సు స్టాపులో గంటల తరబడి నిలబడిన రోజులు ఎన్నో ఉన్నాయి . అలవాటు పడిన ప్రాణం కాబట్టి ఆ నిరీక్షణ పెద్దగా అఖిలను ఏనాడు బాధించ లేదు

ఇంత జరిగిన తరువాత ఇంటికెల్లటానికి అఖిలకి మనస్కరించ లేదు. బస్టాపు నుండి నేరుగా తమ ఉరు వెళ్ళటానికి బస్టాండుకు బయల్దేరింది. అక్కడ వంటరిగా వున్న తన తల్లిని తీసుకొచ్చుకుని విడిగా కొత్త జీవితం ప్రారంభించాలని నిశ్చయించుకున్నది.

ఒక ఆడపిల్ల తనని కనిపెంచి, పెద్ద చదువులు చెప్పించి, మంచి ఉద్యోగం వచ్చేంత వరకూ అండగా నిలబడ్డ తండ్రి ) ఆసుపతి) ఖర్చులకు ఖర్చు పెడితే దొంగ అని అంటున్నారు. అటు వంటి సంస్కారం లేని మనుషూల మధ్య బతకటంలో ఎటువంటి అర్థం లేదు. తన జీతం మీద ,జీవితం మీద సర్వ హక్కులు తనకే ఉండాలని నిశ్చయించుకుంది. గాలిపటం దారం కుడా తన చేతులోనే ఉండాలని గట్టిగ మనసులో అనుకుని , ఆ నిమిషాన సందీప్ కి విడాకులు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది.

సమాప్తం

అయ్యలసోమయాజుల

సుబ్రహ్మణ్యము



## పసి పిల్లల కోసం .....

మానవుడు స్వతహాగా సంఘజీవి. తన తోటి వారికి చేతనైనంత సహాయం చేస్తూ ఉండాలి.నలుగురితో కలిసి వున్నప్పుడే సంఘజీవి కాగలడు. కానీ నానాటికీ అవి మృగ్యమైపోతున్నాయి. పక్కింటి వాడెవడో కూడా తెలియని స్థితిలో ఉంటున్నాము.

నేడు పసిపిల్లల మరణాలు ఎక్కువై పోతు న్నాయి. దానికి కారణం వారిని కన్నవాళ్ళు వాళ్ళని పెంటకుప్పల మీదనో, చెత్తకుప్పల మీదనో పడవేసి చేతులు దులుపుకుంటున్నారు.

అటువంటి పసుగాయలను అక్కున జేర్చుకుని కన్నవాళ్ళ కంటే మిన్నగా వారి ఆలనా పాలనా చూస్తూ, వారికి విధ్యాబుద్ధులు నేర్పుతూ, వారికి సంఘంలో స్థానం కనిపిస్తున్నారు. ఆ save children సొసైటీకి మేము నెలకు ఎనిమిది వందల రూపాయలు నెలకు 2014 నుంచి పంపు చున్నాము. మా పెన్షన్ డబ్బుల నుంచి డైరక్ట్ గా బ్యాంక్ నుంచి వెళ్ళిపోతుంది. నా శ్రీమతి పేరున కడుతున్నాము. ఇది మేము చేస్తున్న ఉడుత సహాయం. సుమాలన్నీ కూర్చుతే దేవునికి మాల అయినట్టు .

ధన్యవాదములు.

అయ్యలసోమయాజుల సుబ్రహ్మణ్యము

ఉదయసుందరి.

# ధర్మ సందేహాలు

సహస్ర వ్యాస కవి

## దేవాలయాలపై బూతు బొమ్మలెందుకు?





పరమపవిత్రంగా భావింపబడే ఆలయాలపై బూతుబొమ్మలెందుకు ఉంటాయి అనే సందేహంకలుగక మానదు హిందువులైన వాళ్ళకు ఎవ్వరికైనా . మసీదులపై గాని, చర్చిలపై గాని, గురుద్వారా లపైగాని ఎక్కడా ఇవి లేవు, మనఆలయాలపైనే ఎందుకున్నట్లు? ఆపైన ఆ సేతుహిమాచలంలో ఉన్న అన్ని ఆలయాలలోను లేవు. కొన్నింటిపైనే ఉన్నాయి. కారణం పూర్తిగా తెలియకపోయినా కొందరి అభిప్రాయాలను మీ ముందుంచుతున్నా.

శిల్పులు తమ శిల్పసౌందర్యానికి దిష్టిదోషం తగుల కుండా ఈ బూతుబొమ్మలను ప్రధానంగా ఒరిస్సా ఆలయాలలో చెక్కి నట్లు ఒక అభిప్రాయం కాని ఈ జవాబు ఇది అంత తృప్తికరంగా లేదు. పోని ఒక బొమ్మను చెక్కా రనుకుందాం. కొన్ని ఆలయాలలో చాలా ఉన్నాయికదా!

ఇది మామూలు జనాన్ని ఆకర్షిస్తుంది. ఈ మిషతో ఏదో ఒకవిధంగా భక్తులను మందిరానికి రావడానికి వీలు కలిగిస్తుంది. ఇదీ సరైన జవాబు అనిపించటం లేదుకదా ?

ఇది సాధకుని లేదా భక్తుని పరీక్ష చేస్తాయని మరొక వాదం, టిబెట్టులో లామాలకు కొన్ని పరీక్షలను పెడతారట, వివిధ భంగిమల్లో ఉన్న బూతు బొమ్మలను చూపించి మనస్సు చలిం చిందో లేదో అని పరీక్ష చేస్తారట. ఆపైన నగ్నంగా స్త్రీలన చూస్తరట , కొంతకాలం ఈ పరీక్ష కొనసాగుతుందట. మనస్సు ఏ వికారలాకు లొంగకుండా దీవిస్తారట . స్త్రీ పురుషులు కలుసుకున్నట్లు చూసినా మనస్సు చలించకుండా ఉండగలందులకు. ఇది సన్న్యాసులకు పరీక్ష వంటిది. గృహస్థులేకాకుండా సాధువులు, సన్యాసులుకూడా ఆలయదర్శనం చేసికొంటారుకదా!

ఇది కామశాస్త్రాన్ని బోధిస్తోందని మరొకవాదం. దేవాలయం సర్వవిద్యలకు, సర్వకళలకు కేంద్రం. స్త్రీపట్ల కామం బలీయమైనది. కామం లేకపోతే సృష్టిలేదు. ఇది అన్ని ప్రాణులకు సాధారణమైన ధర్మం. కామశాస్త్రమని ప్రత్యేకంగా వాత్స్యాయన మహర్షి వ్రాశాడు. అందులో స్త్రీ పురుషులు కలుసుకొనేటప్పుడు రకరకాల భంగిమలు, ముద్రలు అనేకం ఉన్నాయి. ఇతరస్త్రీలను ఎట్లా వశపరచుకోవాలో కూడా అందులో చెప్పబడింది. ఋషి ఇట్లా వ్రాస్తాడా? ఇట్లా వ్రాయవచ్చాయని సందేహం కలుగుతుంది. దీని ప్రయోజనమేమిటి? వైద్యంలో అన్ని జంతువుల మాంసాల గుణ గణాలు వర్ణింపబడతాయి. అందులో



కుక్కమాంసం గురించికూడా ఉంటుంది, అంతమాత్రంచేత కుక్కమాంసం తినండని చెప్పడం లక్ష్యంకాదు. ఇతరస్త్రీలు పురుషుని ఎట్లా లోబరుచుకుంటారో, లేదా పురుషుడు ఇతరస్త్రీలను తనవలలో ఎట్లా వేసుకుంటాడోనని చెప్పడంకోసం, భ్రమప్రమాదాలనుండి రక్షించడంకోసం శాస్త్రం ఉంటుందికాని అట్లా చేయండని చెప్పడంకోసం కాదు. ఆ పైన ఇంద్రియవిషయాలపట్ల వైరాగ్యమే ప్రయోజనంగా కలది ఇదంతా (కామం) దుఃఖంలోకే దారితీస్తుందిసుమా అని హెచ్చరిస్తోంది.


ఈబొమ్మలు కామశాస్త్రానికి ఉదాహరణలుగా ఉన్నాయని, కామాన్ని సేవించినతర్వాత దైవదర్శనానికి లోపలికిరండని హెచ్చ రించడంకోసం, సంపూర్ణ కామశాస్త్రాన్ని జనులకు బోధించడం కోసం ఉన్నాయని వాదసారాంశం.

మానవు దనుభవించేది పశువులు అనుభవించేది ఆనం దమే సుమా అని గుర్తు చేస్తున్నాయి ఈ ప్రతిమలని మరొక వాదం. స్త్రీ పురుషులు కలిసినపుడు చూస్తూఉన్నా, లేదా జంతువులు క్రీడిస్తూ ఉన్నపుడు చూచినా అసహ్యకరమైనభావం కలుగుతుంది. కాని ఉద్రేకాన్ని ఎవ్వడూ పొందడుకదా? ఇట్టి అసహ్యభావం కలి గించి వైరాగ్యభావాన్ని మనసులో బాగా నాటడంకోసం ఈ ప్రతిమ లున్నాయని వాద సారాంశం.

కాని నా ఆలోచన ప్రకారం , దేవాలయం లోకి ప్రవేశిస్తున్నప్పుడు ఈ బూతు బొమ్మలు మనం అనుభవించే ఐహిక సుఖాలను గుర్తు చేస్తున్నాయి . వాటిని దాటుకుని ఆలయ ప్రాంగణం లోకి  అడుగు పెట్టినప్పుడు , వీటిపైన ఆలోచనలు చిన్నగా వదులుకోవాలి , అక్కడ నిర్మలమైన ఆకాశం తప్ప ఏమి ఉండదు, అలాగే మన ఆలోచనాలు కుడా ఉండాలి .చివరకు గర్భ గుడిలోకి ప్రవేశించగానే మన ద్యాసంత భగవంతునిపై నిలపాలి అక్కడ శూన్యం తప్ప ఏమి ఉండదు . ఒక రకంగా మానసిక పరిపక్వత ఎలా సాధించాలి అనే దానికి ఇది ఉదాహరణ గా చెప్పుకోవచ్చు


ఏది ఏమైనా మన సంస్కృతి నుండి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు .

# బొమ్మలు చేద్దాం రండి






దారి కనిపెట్టటానికి సహాయం చెయ్యండి




బొమ్మకు రంగులు వెయ్యండి



తేడాలు కనిపెట్టండి



# ఈ నెల మీ అదృష్టం....



కొలుకుల చంద్ర శేఖర్




రావలసిన డబ్బు చేతికి అందుతుంది. కుటుంబంలో అందరి సహ కారం లభిస్తుంది. ఉత్సాహంతో పనులు చేస్తారు. అప్పుల బాధ తప్పుతుంది. బాధ్యతలను చాకచక్యంగా నిర్వహిస్తారు. కొత్తగా పరిచయమైన వ్యక్తులతో పనులు నెరవేరుతాయి.




వ్యాపారులు కొత్త లావాదేవీలకు దూరంగా ఉండటం మంచిది. కుటుంబ సభ్యులతో సంతోషంగా కాలం గడుపుతారు. ఉద్యోగంలో అనుకూల వాతావరణం ఉంటుంది. రావలసిన డబ్బు వస్తుంది.




అనవసరమైన ఖర్చులు ముందుకు రావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావచ్చు. వాహన మరమ్మతులు ముందుకురావచ్చు. బంధుమిత్రులతో పనులు నెరవేరుతాయి. ఖర్చుల నియంత్రణతోపాటు ఆదాయ మార్గాలపై మనసు నిలపడం అవసరం.




పనులు సకాలంలో పూర్తవుతాయి. ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగులు అధికారులతో స్నేహంగా మసులుకుంటారు. పెద్దల సహకారం లభిస్తుంది. కొత్తగా పరి చయమైన వ్యక్తులతో పనులు నెరవేరుతాయి.





ఈ నెల గ్రహస్థితి ఓ మోస్తరుగా ఉంది. వృథా ఆలోచనల కారణంగా పనుల్లో జాప్యం జరగవచ్చు. ప్రయాణాలు కలిసి వస్తాయి. అయితే, ఖర్చులు పెరు గుతాయి. అలసటకు గురవుతారు.





ఈ నెలలో గ్రహస్థితి సామాన్యంగా ఉంది. స్నేహితులతో వివాదాలకు దూరంగా ఉండండి. పనులపై మనసు నిలపండి. డబ్బు విషయంలో జాగ్రత్త అవ సరం. సహనంతో పనులు చేస్తారు. ప్రారంభించిన పనులు ఆలస్యంగా పూర్తవుతాయి.

# రాశి ఫలాలు

## ఈ నెల మీ అదృష్టం....






ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటారు. నలుగురిలో గుర్తింపు లభి స్తుంది. భూ లావాదేవీల్లో సత్ఫలితాలు సాధిస్తారు. గృహ నిర్మాణాది పనులు చేప డతారు. కొత్త వ్యక్తులతో పనులు నెరవేరుతాయి.




ఈ నెలలో గ్రహస్థితి అనుకూలంగా ఉంది. భూములు, వాహనాల మూలంగా పనులు నెరవేరుతాయి. ఆస్తుల ద్వారా ఆదాయం వస్తుంది. కుటుం బంతో సంతోషంగా ఉంటారు. నెలాఖరులో అభీష్ట సిద్ధి.




బంధుమిత్రుల రాకతో ఇల్లు సందడిగా ఉంటుంది. సమాజంలో గుర్తింపు లభిస్తుంది. అన్ని పనులు దగ్గర ఉండి పూర్తి చేసుకోవడం మంచిది. ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నవారికి అనుకూలం.




ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. కొత్త ఉద్యోగంలో చేరతారు. కుటుంబంతో సంతోషంగా గడుపుతారు. అనవసరమైన ప్రయాణాల వల్ల అలసట, వృథా ఖర్చులు ఉండ వచ్చు. కళాకారులకు కొత్త అవకాశాలు వస్తాయి.




రాబడి పెరుగుతుంది. అవసరాలు తీరుతాయి. కుటుంబంతో సంతో షంగా కాలం గడుపుతారు. ఉద్యోగులకు అనుకూల వాతావరణం ఉంటుంది. అధికా రుల అంచనాలకు తగ్గట్టుగా వ్యవహరిస్తారు.




కుటుంబ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. ప్రయాణాలు కలిసి వస్తాయి. నలుగురిలో కీర్తి ప్రతిష్ఠలు, గుర్తింపు లభిస్తుంది. ఉద్యోగులకు అధికారుల ఆదరణ లభిస్తుంది. రావలసిన డబ్బు ఆలస్యంగా చేతికి అందు తుంది. విద్యార్థులకు అనుకూల సమయం.

# సుమతి
అంతర్జాల సమగ్ర కుటుంబ మాసపత్రిక

## సుమతి ఇప్పుడు ఆన్లైన్లో

**సుమతి** అంతర్జాల కుటుంబ మాసపత్రిక ఇప్పుడు ఆన్లైన్ లో వెలువడుతోంది . మీ మొబైల్ నుండి కాని లేదా మీ కంప్యూటర్ నుండి ఆన్లైన్ లో హాయిగా చదువుకోండి .
www.sumathimasapathrika.com

**సుమతి** మాసపత్రిక అంతర్జాల పత్రిక విడి ప్రతి వెల.

**రూ. 25 /-** రూపాయలు


సంవత్సర చందా కి కేవలం **రూ. 250/-**


ఐదు సంవత్సరాల చందా కేవలం **రూ. 1,200/-**

ఐదు సంవత్సరాలు చందా కట్టిన వారిక

రూ.200 విలువచేసే పుస్తకాలను

ఉచితంగా పంపబడును




చందా కట్టదలచిన వారు కింది

నెంబరుకు గూగుల్ పే లేదా ఫోన్ పే

చెయ్యండి

7 8 9 3 1 1 1 9 8 5

చందా కట్టిన వారికి ప్రతి నెల

flip బుక్ పాస్ వర్డ్ తో

పంపబడును

సుమతి
అంతర్జాల సకుటుంబ మాస పత్రిక

# సుమతి 'సాహితీ సామ్రాట్ ' పోటీలు
# జూలై - 2024 ఫలితాలు

## ఈ నెల ఉత్తమ కథలు :

### మొదటి బహుమతి రూ1000 /-

1.అందరి ఇల్లు ఎం .సుగుణారావు
2.మారని లోకం కృష్ణమాచార్యులు
(బహుమతి ఇద్దరికీ సమానంగా పంచబడును

### రెండవ బహుమతి రూ500/-

1.ఎవరు నాన్న ఆవిడ పి .వసంత
2.జీవన్ భద్రాణి పశ్యతి శ్రీపతి లలిత
(బహుమతి ఇద్దరికీ సమంగా పంచబడును )

### కన్సొలేషన్ బహుమతి పొందిన కథలు :

1. కుర్చీ ఎస్ .శ్రీనివాసరావు
2. దత్త స్వీకారం కోటమర్తి రాధా హిమబిందు
3. టంకసాల వారి కడగండ్లు
అయ్యల సోమయాజులసు బ్రహ్మణ్యం
(బహుమతి లేకపోయినా పోటీకి పరిగణించబడును )

### సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథలు :

1.అదేదో సామెత చెప్పినట్లు అమృత జ్యోత్స్న
2. సంకల్పం యశోద కైలాష్
3. సారి ఆగమ బి .వి .డి.ప్రసాద రావు
4. పత్తి నవ్వింది మూలా వీరేశ్వర రావు

## ఈ నెల ఉత్తమ కవితలు:

### మొదటి బహుమతి రూ500 /-

1. నీ జాడకై అన్వేషిస్తున్నా కొత్త ప్రియాంక
2. .తెలుసుకో ఓనవయుగ రుషి
ఎం .కారుణ్య కుమార్
(బహుమతి ఇద్దరికీ సమంగా పంచబడును )

### రెండవ బహుమతి రూ250/-

1.అచ్చర పోరు టి .హరీష్
2. ఓ నాన్న వీలునామా ఎన్ .లహరి
(బహుమతి ఇద్దరికీ సమంగా పంచబడును)

### కన్సొలేషన్ బహుమతి

1. కడలి తీరం ఎస్ శ్రీనివాసరావు
2.మార్పు అనివార్యం..నామాను సుజనాదేవి
(బహుమతి లేకపోయినా పోటీకి పరిగణించబడును)

### సాధారణ ప్రచురణకు ఎన్నికైనవి :

1. భావిభారతం ఏమౌతుంది
జి .సూర్యనారాయణ
2.భుమాతను రక్షిద్దాం కె వి సుర్యనారయణ

సుమతి

అంతర్జాల సకుటుంబ మాస పత్రిక

సుమతి" సాహితి సామ్రాట్ " పోటీలు

## సుమతి సాహితి సామ్రాట్ పోటీలు

జనవరి 2024 నుండి డిసెంబర్ 2024 వరకు
ప్రతి నెల కథలు కవితల పోటి నిర్వహించబడుతుంది .
ఉత్తమ కథకు మొదటి బహుమతి రూ1000/-,
రెండవ బహుమతి రూ500 /-
ఉత్తమ కవితకు మొదటి బహుమతి రూ250/- ,
రెండవ బహుమతి రూ116 /-

ఇవ్వబడుతుంది
ఎక్కువ బహుమతులు పొందిన కథా/కవితా రచయతలకు

"సుమతి సాహితి సామ్రాట్ "

బిరుదుతో సత్కరించబడతారు
ప్రతి నెల 25 వ తారీఖు లోపల వచ్చిన వాటిని అ నెలలో పోటికి తీసుకోవటం జరుగుతుంది
మీ రచనలను పంపవలసిన చిరునామా
sumathi.potilu@gmail.com

